



# యం.వి.యస్.కపర్దీ

## శత జయంతి విశేష సంచిక

## ఆదర్శ కమ్యూనిస్టు.. అరుదైన కార్మిక నేత


One of the Biggest Cooperative Urban Banks in India with 108 Years of Service
THE VISAKHAPATNAM COOPERATIVE BANK LIMITED
(MSCS/CR/1101/2014)
(MULTI STATE COOPERATIVE URBAN BANK)
Dwarakanagar, Visakhapatnam-530016, Ph: 0891-2788461, 62, 63, 66, 71
BOARD OF DIRECTORS
Sri Ch.Raghavendra Rao
Chairman
Sri G.Bhaskara Rao
Sr.Vice Chairman
Sri M.Raghava Rao
Vice Chairman
Sri M. Anjaneyulu
Sri Naga Bhusana Chowdary
Sri A J Stalin
Sri N.Kamaraju
Smt K Bhavani
Sri V.Chandra Sekhar
Sri G.Janardhana Rao
Sri Ch.Adinarayana Sastry
Sri S.J. Ramachandra Raju
Sri P.V.Ramana Rao
Sri K.Prasada Rao
Smt U.Parvathi Devi
Sri J.V. Satyanarayana Murthy
Sri Ch. Koteswara Rao
Sri P. Narayana Swamy
Sri C. Krishnamohan Rao
Sri A. Ramakrishna Rao
Sri D.Babu Rao
Sri R.Vaidyanadhan
Sri P.V.Narasimha Murthy
CEO
Salient Features
• Higher Rate of Interest on Deposits.
• Additional rate of Interest on deposits of Senior Citizens.
• All Deposits are insured upto Rupees 5,00,000/- for each individual
• DDs/Bankers Cheques on all important places in India and RTGS, NEFT
• All Branches works on Sunday Extended Working hours for Customer's convenience.
• Safe Deposit Locker facility
• Corporate Agency with United India Insurance Company Ltd, Life Insurance corporation of India, IFFCO TOKIO General Insurance Company Ltd
Members Welfare Schemes
• All members covered under Personal Accident Policy upto Rs.50,000/- Members with share capital of Rs.5000/- and above covered under "Arogya Visakha Bima" for medical expenses upto Rs.50,000/- per year.
• In case of unfortunate death of member, legal heirs are entitled to received Death Benefit Fund equal to Share Capital with a minimum of Rs.5000/- and a maximum of Rs.1,00,000/-
• Yearly Cash Awards for Meritorious children of our members
THE BIGGEST COOPERATIVE BANK IN SOUTH INDIA



కార్మిక నేత
యం.వి.యస్. కపర్ధి
శతజయంతి శుభాకాంక్షలు
AITUC
స్వాతంత్ర్య సమరయోధులు,
కార్మికోద్యమ నిర్మాత, ఆదర్శ కమ్యూనిష్టు,
నాలుగు దశాబ్దాల పాటు తాడేపల్లిగూడెం
ప్రజా జీవితంలో తనదైన చెరగని ముద్రవేసిన
అమరజీవి ఎం.వి.ఎస్. కపర్ధి
శతజయంతి ఉత్సవాల సందర్భముగా వారికి నివాళులు
R. RAVINDRANATH
President
+ 94403 20260
G. OBULESU
General Secretary
+ 94909 52505
S.VENKATA SUBBAIAH
Dy. General Secretary
+ 99492 07506
AITUC AP STATE COUNCIL
Office Ph: 0866 3550927
AITUC
Email: apnituce@gmail.com
Josyabhatla Stayanarayana Bhavan, GOLLAPUDI, Vijayawada - 521225



బ్యాంకుఉద్యోగుల ఉద్యమ స్ఫూర్తిప్రదాత..
అమరజీవి కామ్రేడ్ ఎం.వి.ఎస్.కపర్ది
శతజయంతి సందర్భముగా రెడ్ సెల్యూట్!

## కార్మికోద్యమ నిర్మాత, ఆదర్శ కమ్యూనిష్టు, ప్రజాజీవితంలో ఉత్తమ విలువలకు ప్రాతినిధ్యం వహించిన కామ్రేడ్ ఎం.వి.ఎస్.కపర్ది (1923-2023 శత జయంతి ఉత్సవాలు ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయి!

కామ్రేడ్ ఎం.వి.ఎస్. కపర్ది తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో ఏ.ఐ.టి.యు.సి నేతగా
నాలుగుదశాబ్దాల పాటు ఎన్నో కార్మికసంఘాలను, మరెన్నో ఉద్యమాలను నిర్మించారు!
వారి చేతుల మీదుగా ఆవిర్భవించిన ఉద్యమసంస్థలలో తాడేపల్లిగూడెం బ్యాంకు ఎంప్లాయీస్ కో- ఆర్డినేషన్ కమిటీ కూడా ఒకటి!
1960-70 దశకాలలో రాష్ట్రంలో బ్యాంకుఉద్యోగుల ఉద్యమానికి కామ్రేడ్ కపర్ది నిర్మాణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించారు !
ల్యాండ్ మార్ట్ గేజ్ బ్యాంకుఉద్యోగులు, సహకార సంఘాల సిబ్బంది సర్వీసులను ఏకీకృతం చేయడం అందులో ఒక మహోజ్వల ఘట్టం!
1973 లో ఏ.పి బ్యాంకుఉద్యోగుల సమాఖ్య రాష్ట్రమహాసభలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో తాడేపల్లిగూడెంలో జరిగాయి!
ఏ.ఐ.బి.ఈ.ఏ వ్యవస్థాపక నేతలు కామ్రేడ్ పర్వానా, కామ్రేడ్ డి.పి.చడ్డా, తెలంగాణా సాయుధ పోరాట
యోధులు కామ్రేడ్ రాజ్ బహదూర్ గౌర్ వంటి జాతీయస్థాయి నాయకులు నాటి మహాసభలలో పాల్గొన్న విషయం
తాడేపల్లిగూడెం కో- ఆర్డినేషన్ కమిటీ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టం అని చెప్పాలి!
వ్యవసాయ అభివృద్ధి బ్యాంకుఉద్యోగుల యూనియన్ రాష్ట్ర మహాసభలు కూడా తాడేపల్లిగూడెంలో అత్యద్భుతంగా జరిగాయి!
బ్యాంకుఉద్యోగుల జాతీయస్థాయి పోరాటాల్లో తాడేపల్లిగూడెం కో-ఆర్డినేషన్ కమిటీ
నాటి నుండి నేటి వరకూ ఉత్తేజపూరితమైన సమరశీలపాత్ర పోషిస్తూ వచ్చింది!
అమరజీవి కామ్రేడ్ కపర్ది శతజయంతి సందర్భముగా తాడేపల్లిగూడెం
బ్యాంకుఉద్యోగుల కో - ఆర్డినేషన్ కమిటీ తరపున విప్లవ జోహార్లు అర్పిస్తున్నాం.
వారి ఆశయాల సాధనకు పునరంకితం అవుతామని ప్రతిన బూనుతున్నాం!

**ది తాడేపల్లిగూడెం బ్యాంకు ఎంప్లాయీస్ కో- ఆర్డినేషన్ కమిటీ, c/o బ్యాంక్ ఆఫ్ ఇండియా**
తాడేపల్లిగూడెం - 534101, ప॥గో॥జిల్లా. ఆంధ్రప్రదేశ్



# ఆదర్శ కమ్యూనిస్టు - అరుదైన కార్మిక నేత

కపర్ది పేరే ప్రత్యేకమైనది. అది సాధారణ వినియోగంలో వున్న పేరు కాదు. పేరుకు తగ్గట్టే ఆయన ఒక అసాధారణ వ్యక్తి. విశిష్టమైన వ్యక్తిత్వం – విలక్షణ నేతృత్వం ఆయన సొంతం. పుట్టింది సంపన్న భూస్వామ్య కుటుంబంలో. ఆ కుటుంబానికి స్వాతంత్ర్యోద్యమ నేపథ్యం వుంది. గుంటూరు ఏసీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. పైగా ఇంగ్లీషు, తెలుగులో మంచి వక్త. ఆ భాషా సాహిత్యాల మీద మక్కువే కాదు. మంచి పట్టు కూడా వుంది. సంస్కృతంలోనూ తగినంత ప్రవేశం వుంది. ఈ ప్రజ్ఞను ఆయన తన స్వంతానికి సంపాదనకు వినియోగించలేదు. కార్మిక వర్గ కల్యాణానికి, శ్రామిక వర్గ రాజ్యాన్ని సాధించే లక్ష్యానికి వినియోగం చేశారు. 1942లో తాడేపల్లిగూడెంలో అత్యంత నికృష్ట జీవితం గడుపుతున్న పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘాన్ని స్థాపించడంతో కార్మికోద్యమ నిర్మాణ ప్రస్థానం ప్రారంభమైంది. 1981లో తుది శ్వాస విడిచే వరకు సమరశీల కార్మికోద్యమ కార్యకలాపాలలోనే జీవితం గడిపారు.

కపర్ది గారిది గంపెడు సంసారం. భార్య శేషమ్మ గారు, తల్లి, అత్తగారు, ఎనిమిది మంది సంతానం. వీరికితోడు పెంచుకున్న బుజ్జమ్మ, రోజూ వచ్చిపోయే కామ్రేడ్స్. కమ్యూనిస్టు పరిభాషలో ఆ ఇల్లు ఒక కమ్యూన్. మన మాటల్లో ఒక ధర్మసత్రం. నేను కమ్యూనిస్టు పార్టీలో పనిచేయాలన్న ఉత్సాహంతో ఇల్లు వదిలి వచ్చేస్తే కపర్ది గారు నన్ను ఆ ఇంటిలోనే కొన్ని నెలలపాటు పెట్టుకున్నారు. గూడెంలో కపర్ది గారికి అపారమైన పలుకుబడి వుంది. హేమా హేమీలైన స్నేహితులు ఉన్నారు. ఆ పరిచయాలను స్వంతానికి వాడుకోలేదు. ఆస్తిపాస్తులు పెంచుకోవడానికి వాడుకోలేదు. ఆ తరానికి చెందిన కమ్యూనిస్టులు కొందరు వచ్చిన అవకాశాలను స్వంతానికి వాడుకున్నారు. సంపన్నులయ్యారు. కపర్ది గారు అలాంటి దారి తొక్కలేదు. అందుకే ఆదర్శ కమ్యూనిస్టు అయ్యా రు. కుటుంబంలో పిల్లలందరూ ఒకరిద్దరు మినహాయిస్తే మిగిలిన వారంతా కులాంతర వివాహాలు చేసుకున్నారు. సాదా సీదా జీవనం గడుపుతున్నారు. ఆ కుటుంబంలో ఎవరిని కదిలించినా మా తల్లిదండ్రులు మాకు ఏమీ సంపాదించి పెట్ట లేదు అన్నమాట వినిపించదు. పైగా తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛ, పంచిన ప్రేమా నురాగాలాపన చేస్తారు. అందరూ కమ్యూనిస్టులుగా అభిమా నులుగా కొనసాగుతున్నారు. రచ్చ గెలవడమే కాదు ఇంట కూడా గెలిచిన దంపతులు వారు. కార్మికోద్యమంలో ఒక విల క్షణ నేత కపర్ది. గూడెంలో ఒక చిన్న సంఘాన్ని స్థాపిస్తే దానిని రాష్ట్రవ్యాపిత సంఘం చేసి అనేక రాష్ట్రస్థాయి సంఘటిత ఉద్యమాలకు ఆయన నేత అయ్యా రు. సమస్యల మీద కార్మికుల్ని సమీకరిం చడం అందరూ చేసేపనే. కార్మికులను సమీకరించడం వేరు. వారి మనసులను గెలుచుకోవడం వేరు. కార్మికుల కుటుం బ సమస్యలు, పిల్లల చదువు, ఆరోగ్య సమస్యలు అన్నీ కపర్ది గారికి యూనియన్ సమస్యలే. వందల సంఖ్యలో కార్మికుల్ని పేరు పెట్టి పిలవగలిగేవారు. కార్మికుల జీవితాలతో పెనవేసుకుని ఉద్యమాలు నడిపిన విలక్షణ నేత కపర్ది.

కపర్ది గారు మూర్తీభవించిన ప్రజాస్వామ్యవాది. కమ్యూనిస్టు నాయకుల మీద అపప్రద వుంది. కమ్యూనిస్టు పార్టీ సాధారణ సభ్యుడు కూడా ప్రధానిని ప్రశ్నిస్తాడు, ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తాడు, భూస్వామినీ ప్రశ్నిస్తాడు. కాని ఏ స్థాయిలోనూ పార్టీ కార్యదర్శిని ప్రశ్నించడానికి ధైర్యం చేయడన్న అపవాదు వుంది. కాని, కమ్యూనిజం ప్రశ్నించడాన్ని నేర్పుతుందని అదే చర్చకు, సరైన నిర్ణయాలకు దారి తీస్తుందని మనసా, వాచా, కర్మణా నమ్మిన వారు కపర్ది. ఆయన పార్టీ సమావేశాల్లో ప్రశ్నను స్వీకరించడమే కాదు. దానిని చర్చించడాన్ని ఆహ్వానించేవారు. ప్రశ్నలో ఔచిత్యం వుంటే దానిని భేషరతుగా ఆమోదించేవారు. కమ్యూనిస్టు నాయకులలో పరిపూర్ణ ప్రజాస్వామ్య వాది కపర్ది గారు. కపర్ది శత జయంతి విశేష సంచికను రూపొందించి ప్రచురించే అవకాశం దారి దీపం పత్రిక సంపాదకవర్గానికి కలగడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాం. ఆదర్శ కమ్యూనిస్టు, అరుదైన కార్మిక నేతకు అరుణాంజలి ఘటిస్తున్నాం.

- డీవీవీఎస్ వర్మ

సంపాదకులు, 85006 78977

## లోపలి పేజీల్లో..


1) ఆదర్శ కమ్యూనిస్టు - అరుదైన కార్మిక నేత
- సంపాదకీయం : డీవీవీయస్ వర్మ **5**

### అ) జీవన రేఖలు

1) కపర్దీ జీవితం 8
2) కొమ్మలు - రెమ్మలు 9
2) కపర్దీ ఆకస్మిక మరణం 12
3) కామ్రేడ్ కపర్దీకి జోహార్లు..
- **విశాలాంధ్ర సంపాదకీయం సి.రాఘవాచారి 14**
4) జ్ఞాపికలు 15
5) కపర్దీ నామధేయులు 16

### ఆ) స్వీయ రచనలు

1) కంట్రోళ్ళ రద్దుతో ఆహార పరిస్థితి 17
2) భారత కార్మికోద్యమ సమరశీల చరిత్ర 19
3) ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ చరిత్ర 22
4) రథ్ కమిటీ నివేదిక తిరస్కారం వెనుక 23
5) జనతా ప్రభుత్వ దాడిని తిప్పికొట్టడానికి
కార్యాచరణకు పిలుపు 24
6) విదేశీ పర్యటనల్లో కపర్దీ చిత్రాలు 27

### ఇ) సహచర కార్మిక నేతల నివాళి

1) AN IDEAL COMMUNIST COUPLE
- **కె.ఎల్.మహేంద్ర 28**
2) సహనశీలి.. స్థితప్రజ్ఞుడు - **వై.విజయకుమార్ 30**
3) విశిష్టమైన వ్యక్తిత్వం -**మారెళ్ల నరసింహారావు 31**
4) సూదంటురాయి - **డి.వి.వి.యస్.వర్మ 32**
5) స్నేహశీలి.. మార్గదర్శి -**మానం ఆంజనేయులు 33**
6) నాయకుడు, సన్నిహితుడు - **బి.రామారావు 35**
7) పెద్ద బాలశిక్ష - **కలిదిండి భీమరాజు 36**
8) మా గురువు గారు - **ఆర్.ఎస్.వేణుగోపాల్ 36**
9) విలక్షణ కార్మికనేత కామ్రేడ్ కపర్దీ
- **డి.సోమసుందర్ 37**
10) ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ కపర్దీ
చిరస్మరణీయులు -**వెలుగూరి రాధాకృష్ణమూర్తి 40**

### ఈ) కమ్యూనిస్టు నాయకుల నివాళి

1) శ్రమ జీవుల కోసం జీవితాన్ని అంకితం చేసిన
కమ్యూనిస్టు - **సురవరం సుధాకరరెడ్డి 43**
2) కార్యశీలి కపర్దీ - **వంక సత్యనారాయణ 44**
3) నవచైతన్య రూపశిల్పి
- **పరకాల పట్టాభి రామారావు 45**
4) వెలుగు పంచిన వైతాళికుడు
-**భూపతిరాజు సుబ్బరాజు, సూర్యకాంతం 47**
5) మంచి మనసు - **డి.ఎస్.రామచంద్రరావు 48**

### ఉ) స్మారకోపన్యాసాలు

1) భారతీయ బహుళత్వ చరిత్ర :
సమకాలీన ప్రాధాన్యం -**డాక్టర్ రామ్ పునియానీ 51**

### ఊ) శత జయంతి సభలు

1) తొలి తాంబూలం తెనాలిది! 56
2) కార్మిక వర్గ ఐక్యతతోనే ఫాసిజం ఓటమి 58
3) ప్రజా చైతన్యంతోనే ప్రజాస్వామ్య మనుగడ **60**
4) వర్గ రాజకీయాల ప్రాతిపదికన భారతదేశ
భావన రూపొందాలి **61**
5) ఆదర్శ కార్మికోద్యమ నిర్మాత కపర్దీ **63**
6) సమరశీల పోరాటాలు సాగించాలి! **65**
7) కార్మికోద్యమాన్ని బలోపేతం చేయాలి! **66**
8) రాష్ట్ర యువజన రాజకీయ పాఠశాల
- **డి.సోమసుందర్ 68**

### ఋ) సన్నిహితుల ఆప్తవాక్యాలు

1) చిరస్మరణీయులు
-**చెరకువాడ శ్రీ రంగనాథరాజు 71**
2) కపర్దస్య జటాజూటం - **ఆర్వియార్ 72**
3) కార్మిక నేతలో మరో పార్శ్వం
- **ఏటుకూరి ప్రసాద్ 73**
4) మూస నుంచి పక్కకు - **డి.సోమసుందర్ 74**

5) పరిచయ నా అదృష్టం - కె.వి.రమణారావు 75
6) మా ఇంటి పేరు కపర్దీ భవన్ - పాబోలు పాపారావు 76
7) స్నేహానికి మారుపేరు -డా॥ బి.రమేష్ చంద్రబాబు 77
8) తీరని కోరిక - కీ.శే. ఎం.జీ.రామారావు 78
9) మహా పురుషులు - డాక్టర్ వంక రాందాస్ 78
10) స్ఫూర్తినిచ్చే కుటుంబం - సంకు మనోరమ 79

## ఋ) కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు

1) ఛాయాచిత్రాలు 80
2) My personal experiences with our father - Mandalapatrhy Baburao 82
3) తీపి గుర్తులు - మందలపర్తి జగన్‌మోహన్ 86
4) ప్రేమించిన మనుషులు! - మందలపర్తి కిషోర్ 88
5) అమ్మ ప్రేమ అక్షయ పాత్ర! - అమ్మాజీ 92
6) అనురాగమే భూషణం.. - వై.బాబూరావు 95
7) నాన్నే నా బెస్ట్ ఫ్రెండ్ -వాణి(డా॥విమలాదేవి) 96
8) అక్కే నాకు అమ్మ! - బుజ్జమ్మ 99
9) అత్త మామలు కాదు, తల్లిదండ్రులే - సంధ్య 100
10) కోడళ్లం కాదు, కూతుళ్లమే! -అరుణ(నిర్మల) 101
11) ఆ జ్ఞాపకాలే తీపి గుర్తులు - కనకం(దుర్గ) 102
12) మా అమ్మ - మా పెద నాన్నగారు -తమ్మి 103
13) శేషమ్మ అత్తయ్య గారు - సుశీలకుమారి 104
14) దయామయి - యాళ్ళబండి పుణ్యవతి 105
15) అన్నా వదినా అంటే ప్రాణం - కమలాంబ 106
16) Down the memory line - Nitish 107
17) నాన్న గారి నాన్న గారు! - స్మితా కపర్దిని 109
18) ఓ ఫ్లాష్ బ్యాక్ - మందలపర్తి సతీష్ 110
19) అపర లక్ష్మణుడే - సుబ్రహ్మణ్యశర్మ 111
20) కపర్దీ మావయ్య గారు -బొమ్మకంటి నాగరాజు 112
21) అనుభూతి నుండి అనంతానికి - భాగవతుల కుటుంబరావు 113
22) విన్నవీ, కన్నవీను! -బీఎస్‌ఏ సత్యనారాయణ 116

## కృతజ్ఞతలు

కపర్దీ శత జయంతి సంచికకు సమాచారాన్ని సేకరించి పెట్టిన మిత్రులకు, సంచిక ప్రచురణకు తమ సహాయ సహకారాలు అందించిన ప్రకటన కర్తలకు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

# యం.వి.యన్ కపర్దీ

## ఆదర్శ కమ్యూనిస్టు - అరుదైన కార్మిక నేత

ఈ శతజయంతి సంచిక Directగా కావలసినవారు DAARI DEEPAM 93971 14495 @Unionbankకు 100/- phone-pay చేసి మీ రశీదును, పూర్తి పోస్టల్ అడ్రసును డా బి.రమేష్ చంద్రబాబు **9397114495** నంబరుకు WhatsAppలో తప్పని సరిగా పెట్టండి. మీకు Registered Postలో సంచిక పంపుతారు.

ఈ సంచిక సంపాదక వర్గం

**డీవీవీఎస్ వర్మ**
- సంపాదకులు

కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

**వెల రూ.100**

ఉచిత **Pdf** కాపీ కోసం : **DVVSVARMA.COM**

విశాలాంధ్ర, నవచేతన, ప్రజాశక్తి, నవ తెలంగాణ పుస్తకాల షాపులలో కూడా లభించును.

**ప్రతులు : 1000, ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ 4 - పబ్లిషర్ : బి.రమేష్ చంద్రబాబు, తణుకు**

# కపర్ది జీవితం

(1923-1981)

## జీవన రేఖలు

మండలపర్తి వెంకటనారాయణ కపర్దీ 1923 – ఆగస్టు 30న, పశ్చిమ గోదావరి జిల్లా – కొల్లేరు ప్రాంతంలోని పెద నింద్రకొలనులో జన్మించారు. ఆయన తండ్రి రామచంద్రరావు (1885–1942) 1919లో సహాయ నిరాకరణ ఉద్యమం సందర్భంగా గ్రామ కరణం పదవికి రాజీనామా చేసి చరిత్ర సృష్టించారు. కపర్దీ తల్లి శేషమ్మ (–1982) వెయ్యి పున్నములకు పైగా దర్శించిన పరిపూర్ణాయుష్కురాలు. కపర్దీ కుటుంబానికి శ్రీమతి శేషమ్మ ఆది నుంచీ అండదండగా ఉన్నారు. సాంప్రదాయిక కుటుంబంలో పుట్టిన కపర్దీ బాల్యం నుంచీ మత ధార్మిక గ్రంథాలను మథించారు. తండ్రి రామ చంద్రరావు ద్వారా లోక మాన్య బాలగంగాధరతిలక్ రచనలు చిన్నతనంలోనే కపర్దీకి పరిచయ మయ్యాయి. ముఖ్యంగా తిలక్ రాసిన 'గీతా రహస్యం' కపర్దీని తొలినాళ్లలో ఎంతో ప్రభావితం చేసింది. ప్రాచీన సంస్కృత సాహిత్యంలో కపర్దీకి గాఢమైన అభినివేశం ఉండేది. సత్యశోధన పట్ల ఆయనకున్న నిష్ఠే మత విశ్వాసాలను ప్రశ్నించేలా చేసింది.



విద్యార్థిగా కపర్దీ అనేక సందర్భాల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారు. స్కూల్ ఫైనల్, ఇంటర్మీడియెట్ దశల్లో ఆయన బంగారు పతకాలు గెలుచుకున్నారు. గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాల (ఏసీ కాలేజ్)లో బీఎస్సీ చదివే రోజుల్లో కపర్దీ వామపక్ష విద్యార్థి ఉద్యమంలోకి ప్రవేశించారు. మాకినేని బసవపున్నయ్య తదితరుల మార్గదర్శకత్వంలో కపర్దీ మార్క్సిస్ట్ సిద్ధాంతం అధ్యయనం చేశారు. క్రమంగా ఆయన నిబద్ధుడైన గతితార్కిక భౌతికవాదిగా మారారు. కపర్దీ అనేక రంగాల్లో బలమైన

### జీవితంలో ముఖ్య ఘట్టాలు

- 1941లో కపర్దీ, మేనమామ బొమ్మకంటి సూర్యనారాయణమూర్తి కుమార్తె శేషమ్మను పెళ్లి చేసుకున్నారు. వారికి ఆరుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు.
- 1942లో ఆయన సీపీఐ సభ్యత్వం తీసుకున్నారు. దూసనపూడి విరాటరాజు, ఇందుకూరి సుబ్బరాజు తదితరులతో కలిసి 1946లో కొల్లేరు అన్-సర్వే రైతుల పోరాటంలో కపర్దీ చురుగ్గా పాల్గొన్నారు.
- 1948లో ప్రకాశం ఆర్డినెన్స్ ఫలితంగా అరెస్ట్ అయ్యేనాటికే కపర్దీ మోటార్ కార్మిక సంఘం నిర్మాణ కృషి మొదలు పెట్టారు. ఏక కాలంలోనే కార్మిక, కర్షక సంఘాల్లో పనిచేసిన అతి కొద్ది మంది కమ్యూనిస్టు నేతల్లో కపర్దీ ఒకరు.
  - •1948 ఫిబ్రవరిలో రహస్య జీవితం ప్రారంభించిన కపర్ది, సెప్టెంబరులో ప్రకాశరావు పాలెంలో అరెస్టయ్యారు.
  - •1951 వరకూ ఆయన డిటెన్యూగా నాటి సంయుక్త మద్రాసు రాష్ట్రంలోని అనేక జైళ్లలో నిర్బంధంలో ఉన్నారు.
- 1957లో కపర్దీ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు.
- 1961లో కపర్ది సోవియెట్ యూనియన్‌కు వెళ్లి ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లో మెలకువలు నేర్చుకొచ్చారు.
- 1964లో సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గం సభ్యులుగా ఎన్నికయ్యారు.
- 1968లో సీపీఐ జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికై 1975 నుంచి చివరి వరకు సీపీఐ రాష్ట్రసమితి కార్యదర్శివర్గ సభ్యుడిగా ఉన్నారు.
- దాదాపు నాలుగు దశాబ్దాలపాటు కమ్యూనిస్టుపార్టీ కార్యకలా పాల్లో పూర్తిస్థాయి కార్యకర్తగా పనిచేసిన కపర్ది, రాష్ట్రంలో సీపీఐ నిర్మాణంలో కీలక పాత్ర వహించారు.
- 1981 మే 25న కపర్దీ హైదరాబాద్లో కన్నుమూశారు.

కార్మిక ఉద్యమం నిర్మాణానికి విశేషమైన కృషి చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి సభ్యులుగా, సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి వర్గ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా, ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన ఉపాధ్యక్షులుగా ముఖ్యమైన బాధ్యతలెన్నో నిర్వహించారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై భారతీయ కార్మికోద్యమ గళం వినిపించారు కపర్దీ.

### మందలపర్తి శేషమ్మ (1926-82)

మందలపర్తి శేషమ్మ పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలో, 1926లో జన్మించారు. తండ్రి బొమ్మకంటి సూర్యనారాయణ మూర్తి ఆ ఊరికి కరణం. పదహారేళ్ల వయసులో, 1941లో శేషమ్మ, ఎం.వి.ఎన్.కపర్దీని పెళ్లి చేసుకుని అత్తవారింటికి పెద నింద్రకొలను గ్రామానికి వచ్చేశారు. పెళ్లయిన కొద్దిరోజులకే, కపర్దీ కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలు పూర్తిస్థాయిలో మొదలు పెట్టారు. ఆయన నాలుగు దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో తలమునకలుగా కొనసాగగలిగారంటే, అందులో శేషమ్మ పాత్ర ఎంతో ఉంది. దాదాపు ప్రతి రోజూ డజను మందికిపైగా వచ్చి వెళ్లే అతిథులను ఆదరించడంలో శేషమ్మకు పోలిక లేదని చెప్తారు. ఎందరో ఉద్యోగార్థులూ, విద్యార్థులూ ఆ ఇంట్లో ఉండి చదువుకోగలిగారంటే అది శేషమ్మ వల్లనే.

1948లో కపర్దీ అరెస్టయి, దాదాపు నాలుగేళ్లపాటు జైల్లో ఉన్నారు. ముగ్గురు కొడుకులతో శేషమ్మ ధైర్యంగానూ, స్థైర్యం తోనూ కుటుంబాన్ని నెగ్గుకొచ్చారు. 1952లో శేషమ్మ, తాడేపల్లి గూడెం పంచాయతీ బోర్డు సభ్యురాలిగా – సీపీఐ తరఫున పోటీ చేసి గెలిచారు. అటు తర్వాత, దాదాపు పాతికేళ్లపాటు జరిగిన ప్రతి ఎన్నికలోనూ ఆమె స్థానిక స్వపరిపాలన సంస్థలో ప్రతి నిధిగా గెలుస్తూనే వచ్చారు. సీపీఐ కార్యకలాపాలతోపాటు మహిళా సమాఖ్య నిర్మాణంలో శేషమ్మ చురుగ్గా పాల్గొన్నారు. కపర్దీ, శేషమ్మలకు ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పిల్లలంతా వామపక్ష ఉద్యమాల్లో పాల్గొనడాన్ని శేషమ్మ ప్రోత్సహించేవారు. తమ చేతుల మీదుగా ఇద్దరు కొడుకులకు వర్ణాంతర వివాహం చేసి, కుటుంబ సభ్యులందరికీ స్ఫూర్తినిచ్చారు శేషమ్మ, కపర్దీ. 1982 నవంబర్ 25న శేషమ్మ హైదరాబాద్‌లో కన్నుమూశారు.

# కొమ్మలు - రెమ్మలు

### మందలపర్తి రామచంద్రరావు (1944-2005)



మందలపర్తి వెంకటనారాయణ కపర్దీ, శేషమ్మలకు ఆరుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. మందలపర్తి రామచంద్రరావు, 1944 – సెప్టెంబర్ 5న, పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలో – మాతామహుల ఇంట్లో జన్మించారు. ఆయన తండ్రి ఎంవీఎన్ కపర్దీ (1923–1981), తల్లి శేషమ్మ (1926–1982) కమ్యూనిస్టు ఆదర్శాలకు అంకితమైనవారు. 1973 అక్టోబరు 6న రామచంద్రరావు, భాగవతుల ఇందిరాదేవి (1951–1982)ని పెళ్లి చేసుకున్నారు. ఇందిరాదేవి ప్రముఖ నాట్యాచార్యులు భాగవతుల రామకోటయ్య గారి రెండో కుమార్తె. స్వయంగా ఆమె కూడా మంచి నర్తకి. తాడేపల్లిగూడెంలో హైస్కూలు చదువు పూర్తి చేసుకున్న రామచంద్రరావు, వనపర్తి, హైదరాబాద్, తణుకు పట్టణాల్లో పాలిటెక్నిక్ విద్యను అభ్యసించారు. ఈసీఐఎల్ కర్మాగారంలో దాదాపు మూడు దశాబ్దాలు పనిచేసి 2001లో రామచంద్రరావు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈసీఐఎల్‌లోనే కాకుండా హైదరాబాద్ నగరంలోని అనేక పరిశ్రమల్లో కార్మిక సంఘాల కార్యకలాపాల్లో రామచంద్రరావు పాలు పంచుకునేవారు. ఏఐటీయూసీ కార్యకర్తగా రామచంద్రరావు కార్మికవర్గ చైతన్యానికి కృషి చేశారు. కపర్దీ సంతానంలో రామచంద్రరావు పెద్దవారు. ఆయనకు ఐదుగురు తమ్ముళ్లూ, ఇద్దరు చెల్లెళ్లూను. 1981లో తండ్రీ, మరుసటి సంవత్సరమే తల్లీ చనిపోగా రామచంద్రరావే రెక్కలు రాని తమ్ముళ్లకూ, చెల్లెళ్లకూ అండగా నిలబడి వాళ్ల జీవితాలను చక్కదిద్దారు. పెళ్లయిన తొమ్మిదేళ్లకే భార్య ఇందిరాదేవి కన్నుమూయగా, ఒంటి చేతి మీద ఇద్దరు కుమారులను కంటికి రెప్పలా కాచుకొచ్చారు. రామచంద్రరావు, తమ్ముళ్లకూ చెల్లెళ్లకే కాక బంధుమిత్రులందరికీ తలలో నాలుకలా వ్యవహరించి, పెద్ద దిక్కుగా నిలిచారు. రామచంద్రరావుకు ఇద్దరు కొడుకులు. ఐ.టీ.రంగంలో అధికారులుగా ఉన్న పెద్దకొడుకు నితీష్–కోడలు కిరణ్మయిలకు ఓ కూతురు–ఓ కొడుకు. పెయింటర్‌గా ఉన్న చిన్నకొడుకు సతీష్–లామకాన్ మేనేజర్‌గా వున్న కోడలు క్రాంతిలకు ఓ కొడుకు. జీవితమంతా ఆటుపోట్లు ఎదురవుతూనే ఉన్నా ఆయన చెక్కు చెదరని ఆత్మ విశ్వాసంతో నిలబడ్డారు. వ్యక్తిగత జీవితంలో ఎన్ని విషాదాలు అనుభవించవలసి వచ్చినా, రామచంద్రరావు తన సామాజిక బాధ్యతలను ఏనాడూ నిర్లక్ష్యం చెయ్యలేదు. 61వ ఏట, 2005 అక్టోబరు 10న రామచంద్రరావు హైదరాబాద్‌లో కన్నుమూశారు.

## మందలపర్తి శ్రీపతి (1945-2004)



మందలపర్తి శ్రీపతి 1945లో అత్తిలిలోని – మాతామహుల ఇంట జన్మించారు. తండ్రి ఎంవీఎన్ కపర్దీ, తల్లి శేషమ్మ. కమ్యూనిస్టు విలువలకు అంకితమై జీవించారు. తాడేపల్లిగూడెంలో హైస్కూల్ విద్య పూర్తి చేసిన శ్రీపతి భీమవరం డి.ఎన్.ఆర్ కళాశాలలోనూ, పెంటపాడు డి.ఆర్.గోయెంకా గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలోనూ చదివారు. విద్యార్థిగా ఉన్నప్పుడే, 1960 దశకంలో, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధనోద్యమంతో శ్రీపతి రాజకీయ కార్యకలాపాలు మొదలుపెట్టారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా రాణించిన శ్రీపతి అటు తర్వాత తాడేపల్లిగూడెం కేంద్రంగా కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాణంలోనూ, ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. 1974 జనవరి ఎనిమిదో తేదీన శ్రీపతి, మద్దుకూరి సంధ్యారాణి(1952–2021)ని పెళ్లి చేసుకున్నారు. కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చిన సంధ్యారాణి విద్యార్థి దశలో వామపక్ష ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆమె తండ్రి మద్దుకూరి సత్యనారాయణ కొవ్వూరు డివిజన్‌లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. 1974లో శ్రీపతి ఏడాదిపాటు మాస్కోలో ట్రేడ్ యూనియన్ శిక్షణ తీసుకున్నారు. కొంతకాలం ఏపీఎస్ఆర్టీసీ కార్మిక సంఘం (ఎంప్లాయీస్ యూనియన్) నాయకుడిగా పనిచేసిన శ్రీపతి, సీపీఐ జిల్లా సమితి సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తర్వాత, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగానూ, ఏఐటీయూసీ రాష్ట్ర శాఖ కార్యదర్శిగా కృషిచేశారు. అనారోగ్యం కారణంగా రాజకీయాలకు దూరమైనా చివరిక్షణం వరకూ సమాజ సేవా రంగంలో కొనసాగారు. పశ్చిమ గోదావరి జిల్లా మెట్ట ప్రాంత రైతుల సమస్యలను రాష్ట్ర ప్రజల దృష్టికి తీసుకురావడానికి, పార్టీ రాజకీయాలకు అతీతంగా, పాటుపడ్డారు. ముఖ్యంగా చిక్కాల గ్రామానికి హైస్కూలునూ, మంచి రోడ్డునూ సాధించే దిశగా అందరినీ కూడగట్టిన నేతగా శ్రీపతిని అక్కడి ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. శ్రీపతి, సంధ్యారాణులకు ముగ్గురు పిల్లలు. కుమారుడు హరీష్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. ప్రజా జీవనంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పెద్దకూతురు లావణ్య–అల్లుడు సుధీర్ హైదరాబాద్‌లో ఉంటారు. వారికి ఓ కూతురు–తన్విశ్రీ. చిన్నకూతురు సుకన్య మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఎం.టెక్ చేసి–భర్త శ్రీనాథ్, కుమారుడు శ్రీమిహిర్నాథ్–కుమార్తె గోపాణిలతో కలిసి ఆస్ట్రేలియాలో ఉంటున్నారు. 2004 డిసెంబర్ 24న శ్రీపతి చిక్కాలలో కన్నుమూయగా, సంధ్యారాణి 2021, జూన్ 21న క్యాన్సర్‌తో కన్నుమూశారు

## మందలపర్తి నారాయణమూర్తి (1948-2001)



మందలపర్తి నారాయణమూర్తి (చిట్టిపాప) 1948 సెప్టెంబర్ తొమ్మిదో తేదీన, పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలో – మాతామహుల ఇంట – జన్మించారు. ఆయన తండ్రి ఎంవీఎన్ కపర్దీ (1923–81), తల్లి శేషమ్మ(1926–1982) జీవితాంతం కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి కృషిచేశారు. నారాయణమూర్తి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోను, పెంటపాడు డి.ఆర్.గోయెంకా గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లోనూ బి.కామ్ వరకూ చదివారు. 1967లో నారాయణమూర్తి హైదరాబాద్ వచ్చి, సుల్తాన్‌బజార్‌లోని విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో పని చేశారు. అటు తర్వాత కొంత కాలం, న్యూఢిల్లీలోని నవభారత్ ఎంటర్‌ప్రైజస్‌లో పనిచేసిన నారాయణమూర్తి, ఆంధ్రా బ్యాంక్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ బ్యాంక్‌లో కడదాకా పనిచేశారు. కో ఆపరేటివ్ క్రెడిట్ బ్యాంక్ ఉద్యోగ సంఘాల సమాఖ్యలో నారాయణమూర్తి చురుగ్గా పనిచేశారు. 1975 సెప్టెంబర్ 28న నారాయణమూర్తి, బి.ఎస్.కె. దుర్గ (కనకం)ను పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. కుమార్తె స్మితా కపర్దిని, అల్లుడు మత్తే వినోద్‌బాబు అమెరికాలో ఉంటున్నారు. వారికి కూతురు దివిత–కొడుకు దోనిత్. నారాయణమూర్తి కుమారుడు భూపేష్, కోడలు గాయత్రి, మనవడు ఆద్విక్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. 2001 సెప్టెంబర్ 3న నారాయణమూర్తి హైదరాబాద్‌లో కన్నుమూశారు.

## మందలపర్తి బాబూరావు



కపర్దీ నాలుగో కుమారుడు మందలపర్తి బాబూరావు 1952

సెప్టెంబర్ తొమ్మిదో తేదీన తాడేపల్లిగూడెంలో జన్మించారు. ఆయన మాస్కోలోని పాట్రిస్ లుముంబా పీపుల్స్ ఫ్రెండ్ అప్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎం. ఎస్. చేశారు. దాదాపు పాతికేళ్లు హైదరాబాద్‌లోని హిందూస్థాన్ కేబుల్స్ లిమిటెడ్ ఆర్అండ్‌డీ విభాగంలో పనిచేసి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. తర్వాత ఓ ఇంజనీరింగ్ కాలేజ్‌కి ప్రిన్సిపల్‌గా చేస్తూ, 2011 డిసెంబరు 10న రోడ్ ప్రమాదంలో కన్నుమూశారు. బాబూరావు భార్య నిర్మల సెంట్రల్ బ్యాంక్‌లో ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. అమ్మాయి హిమబిందు 2019 ఆగస్టు నాలుగో తేదీన అనారోగ్యంతో కన్నుమూశారు. అబ్బాయి సునీల్ ఐటీ రంగంలో ఉన్నాడు.

## మందలపర్తి జగన్మోహన్



కపర్దీ ఐదో కుమారుడు మందలపర్తి జగన్మోహన్ 1955 సెప్టెంబర్ 23న తాడేపల్లిగూడెంలో జన్మించారు. జగన్మోహన్ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎం.ఏ పట్టా పుచ్చుకున్నారు. ఆయన 1983 జూలై ఏడోతేదీన సుశీలాకుమారి(బేబీ)ని పెళ్లి చేసుకున్నారు. సుశీల సాంఘిక సంక్షేమ శాఖలో అధికారిణిగా పనిచేసి రిటైరయ్యారు. ఆమె తండ్రి కీ.శే. యాళ్లబండి రంగనాయకులు స్వాతంత్ర్య సమర యోధులు, కమ్యూనిస్టు నేత. జగన్-సుశీల కూతురు ఇందుతో కలిసి ధవళేశ్వరంలో ఉంటున్నారు

## మందలపర్తి కిషోర్



కపర్దీ ఆరో కుమారుడు మందలపర్తి కిషోర్. 1958 జనవరి తొమ్మిదో తేదీన తాడేపల్లిగూడెంలో జన్మించారు. తెలుగు సాహిత్యంలో ఎం.ఏ., ఎంఫిల్ చేసిన కిషోర్ దాదాపు మూడున్నర దశాబ్దాలుగా పత్రికా రచయితగా ఉన్నారు. ప్రస్తుతం సాహిత్య అకాడమీ సభ్యులుగా ఉన్నారు. 'బాల ద కిడ్' అనే పిల్లల పత్రిక నడిపారు. ఆయన 1983 జూలై ఏడో తేదీన వాణీ దేవిని పెళ్లి చేసుకున్నారు. వాణీదేవి తండ్రి దూసనపూడి విరాటరాజు, స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు నేత. వాణీకిషోర్‌లకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి మనీష మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎం.టెక్ చేశారు. భర్త చైతన్య-కుమార్తె గిరిజలతో కలిసి చెన్నైలో ఉంటున్నారు. అబ్బాయి విజిగీష్ సినిమాటోగ్రాఫర్.

## మందలపర్తి మహాలక్ష్మి



కపర్దీ పెద్ద కూతురు మందలపర్తి మహాలక్ష్మి(అమ్మాజీ), 1961 అక్టోబర్ 30న నిడదవోలులో జన్మించారు. దాదాపు రెండు దశాబ్దాల కాలం అమ్మాజీ విశాలాంధ్ర దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేశారు. 1984 మే 22న అమ్మాజీ, యెలిశల బాబూరావు వివాహం జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా పనిచేసిన బాబూరావు, కనకదుర్గ దేవస్థానంలో పనిచేసి రిటైరయ్యారు. వారికి ఇద్దరు అబ్బాయిలు. పెద్దబ్బాయి తపన్, చిన్నబ్బాయి అమన్ ఇద్దరూ కూడా విజయవాడలో ఉద్యోగాలు చేస్తున్నారు.

## మందలపర్తి విమలాదేవి (వాణి),



కపర్దీ చిన్న కూతురు డాక్టర్ మందలపర్తి విమలాదేవి(వాణి), 1964 సెప్టెంబర్ 19న నిడదవోలులో జన్మించారు. ఆమె వైద్య విద్యను అభ్యసించి, ప్రస్తుతం హైదరాబాద్‌లో గవర్నమెంట్ డాక్టరుగా ఉద్యోగం చేస్తున్నారు. 1991 అక్టోబర్ 14న వాణి - ధనుంజయ్ వివాహం జరిగింది. పత్రికా రచయితగా కొంత కాలం పనిచేసిన ధనుంజయ్ మంచి చిత్రకారులు కూడా. ప్రస్తుతం ఆయన ఎం.వి.ఫౌండేషన్‌లో పనిచేశారు. వారి కుమారుడు మౌగ్లీ నార్వేలో పీహెచ్‌డీ చేశారు. ❑

# కామ్రేడ్ కపర్దీ ఆకస్మిక మరణం

## ఉత్తమ కమ్యూనిస్టు, ఆదర్శజీవి : సి.పి.ఐ.రాష్ట్ర కార్యదర్శివర్గం తీర్మానం

దాదాపు నాలుగు దశాబ్దాల కాలం ఆంధ్రప్రదేశ్ కార్మిక-కర్షక శ్రామిక ప్రజా శ్రేణులకు అవిశ్రాంత సేవ చేసిన ఎం.వి.ఎన్.(మందలపర్తి వెంకటనారాయణ) కపర్దీ, 1981 మే 25 మధ్యాహ్నం కన్ను మూశారు. హైదరాబాద్‌లోని నిజామ్స్ ఆసుపత్రిలో కపర్దీకి కొంత కాలంగా గుండె జబ్బుకు చికిత్స జరుగుతోంది. కన్ను మూసే నాటికి ఆయన వయసు 58 సంవత్సరాలు. కపర్దీకి 95 సంవత్సరాల కురు వృద్ధురాలైన తల్లీ, భార్య, ఆరుగురు కుమారులూ-ఇద్దరు కుమార్తెలూ ఉన్నారు.




- 1923 ఆగస్టు 30న పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలో జన్మించిన కపర్దీ స్వగ్రా మం పెదనింద్రకొలను అనే కొల్లేటి గ్రామం. ఉన్నత విద్యావంతుల కుటుం బ నేపథ్యం నుంచి వచ్చిన కపర్దీ పందొమ్మిదేళ్ళ ప్రాయంలోనే కమ్యూ నిస్టు పార్టీలో పూర్తికాలం పనిచేసే కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించారు. అచిరకాలంలోనే కార్మిక కర్షక నేతగానూ, కమ్యూనిస్టు మేధావిగానూ గుర్తింపు పొందారు.
- 1948-51 మధ్యకాలంలో జైలు జీవితం అనుభవించారు.
- 1952-64 మధ్యకాలంలో పశ్చిమ గోదావరి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ జిల్లా నేతగా రాణించారు. 1962లో కపర్దీ సోవియట్ యూనియన్ సందర్శించారు.
- 1960 దశకం చివరిలో ఆయన సి.పి.ఐ. జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. అదే సమయంలో ఆయన ఎ.పి.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు.
- దాదాపు అదే రోజుల్లో ఆయన సి.పి.ఐ. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. 1980లో ఏలూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేశారు. 1981 మే 25న హైదరాబాద్‌లో కన్నుమూశారు. 1981 మే 26 ఉదయం హైదరాబాద్-అంబర్‌పేటలోని విద్యుత్ శ్మశానవాటికలో కపర్దీ మృత దేహానికి అంత్యక్రియలు జరిగాయి.

సంచిక 347 | విజయవాడ | బుధవారం | 27-5-81 | 6 పేజీలు 35 పైసలు

# కామ్రేడ్ కపర్ది భౌతికకాయానికి కన్నీటి వీడ్కోలు

## కార్మిక నాయకునికి శోకతప్త హృదయాలతో వేలాది అభిమానుల, మిత్రుల, సహచరుల శ్రద్ధాంజలి

### అంబర్‌పేట విద్యుత్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాదు, మే 26

"కామ్రేడ్ కపర్ది అమర్‌హై, కామ్రేడ్ కపర్ది లాల్ సలామ్" నినాదాలతో కార్మికవర్గ ప్రియతమ నాయకుడు కామ్రేడ్ ఎం.వి.ఎస్. కపర్ది భౌతికకాయానికి, వేలాదిమంది కడపటి కన్నీటి వీడ్కోలు యిచ్చారు.

[మిగతా 5 వ పేజీలో]



మఖ్దూం భవన్‌లో కపర్ది భౌతిక కాయానికి పుష్పాంజలి

"భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి సభ్యులు, ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సభ్యులు, ఎ.పి.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ యం.వి.యన్. కపర్ది ఆకస్మిక మృతి మాకెంతో దిగ్భ్రాంతి కలిగించింది. 58 సంవత్సరాల కామ్రేడ్ కపర్ది మృతితో సాహసవంతుడైన స్వాతంత్ర్యయోధుడిని, ఉత్తమ కమ్యూనిస్టును, అందరిచేత గౌరవింపబడే ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకుడిని కోల్పోయాం. ప్రస్తుతయుగంలో అత్యంత విప్లవకర వర్గమైన కార్మికవర్గాన్ని సంఘటిత పరిచేందుకు, అదే సమయంలో కార్మిక వర్గంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మింపచేసే అత్యంత కీలకమైన కర్తవ్యాన్ని ఆయన తమ 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో స్వీకరించారు. కార్మిక వర్గానికి, పీడిత ప్రజలకు సేవ చెయ్యటమనే లక్ష్యానికే అంకితమైంది కామ్రేడ్ కపర్ది జీవితం. ఆయన మృతికి ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గం ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నది."

**సంతాప ప్రకటనలు**


శ్రీ కపర్ది మృతి పట్ల పలువురు ట్రేడ్ యూనియన్ల, రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు, వందలాదిమంది కార్యకర్తలు నేటి (మే 25) సాయంత్రం మఖ్దూం భవన్‌కు చేరుకున్నారు. ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎన్. గిరిప్రసాద్, ఎ.పి.టి.యు.సి. కార్యదర్శి శ్రీ కె.ఎల్.మహేంద్ర, ఎ.ఐ.టి.యు.సి. కార్యదర్శి డా. రాజ్ బహదూర్ గౌర్, భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యవర్గ సభ్యులు శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ, తదితరులు శ్రీ కపర్ది మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కామ్రేడ్ కపర్ది మృతదేహాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించిన వారిలో, సి.పి.ఎం. నాయకులు శ్రీ పి.సుందరయ్య, ఎ.పి.టి.యు.సి. నాయకులు శ్రీ జోస్యభట్ల సత్యనారాయణ, నగర ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నాయకులు శ్రీ అమోలక్ రాం, శ్రీ సలం షాహిదీ, జనతా పార్టీ నాయకులు-ఎం.ఎల్.ఏ. శ్రీ నాయని నరసింహారెడ్డి, లోక్‌దళ్ నాయకులు శ్రీ తుర్లపాటి సత్య నారాయణ, కాంగ్రెస్(ఐ) నాయకులు శ్రీ ఎన్.ఆర్.వెంకటేశం, నగర కమ్యూనిస్ట్ సమితి నాయకులు శ్రీ పి.నాగేశ్వరరావు, శ్రీ అజీజ్ పాషా, శ్రీ పుల్లారెడ్డి, మార్క్సిస్టు పార్టీ నాయకులు శ్రీ ఎన్.భాస్కర రావు, శ్రీ రఘు సార్, ఐ.ఎన్.టి.యు.సి. నాయకులు శ్రీ నవాజ్ ఖాన్, కె.ఎం.ఖాన్, సి.ఐ.టి.యు. నాయకులు శ్రీ పూర్ణచంద్ర రావు, శ్రీ లక్ష్మీదాస్ తదితరులు ఉన్నారు.

"ఆంధ్రప్రదేశ్ కార్మిక ఉద్యమానికి కపర్ది మృతి తీరని లో"టని ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఏ.సుందరరావు ఒక ప్రకటనలో శ్రద్ధాంజలి ఘటించారు. 1975లో, తాడేపల్లిగూడెంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మహాసభ ఆహ్వాన సంఘ అధ్యక్షునిగా శ్రీ కపర్ది అందించిన సేవలు మరువరానివని శ్రీ సుందరరావు తన ప్రకటనలో పేర్కొన్నారు. ఎ.పి.ఎస్.ఆర్.టి.సి., తంతి తపాలా, ఎల్.ఐ.సి., బ్యాంక్, హోటల్, మునిసిపల్, మెడికల్, రాష్ట్ర - కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన పలువురు ఉద్యోగులు, నాయకులు శ్రీ కపర్ది భౌతిక దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ❑


# కామ్రేడ్ కపర్దికి జోహార్లు

## విశాలాంధ్ర సంపాదకీయం

సి.రాఘవాచారి



జాతీయోద్యమంలో త్యాగాలు చేసిన దేశభక్తుల కుటుంబంలో పుట్టి, విద్యార్థి దశలోనే దేశ స్వాతంత్ర్య పోరాటంలోకురికి, అటు పిమ్మట కమ్యూనిస్టు ఉద్యమంలోను, కార్మికోద్యమంలోను ప్రవేశించి, తన 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో చివరి నిముషం వరకు పీడిత ప్రజల విముక్తి కోసం అవిరామంగా కృషి చేసిన కామ్రేడ్ మందలపర్తి వెంకట నారాయణ కపర్ది ఇక లేరు. తన 58వ ఏట కామ్రేడ్ కపర్ది గుండెజబ్బుతో హైదరాబాద్‌లో ఈ నెల 25వ తేదీన ఆకస్మికంగా కన్నుమూశారన్న విషాద వార్త ఆంధ్రప్రదేశ్‌లోని అశేష కార్మిక వర్గాన్ని, కమ్యూనిస్టు ఉద్యమాన్ని వివిధ రాజకీయ పార్టీల వారిని, దేశ భక్తులను విచార సాగరంలో ముంచింది.


విశాలాంధ్ర

1981 మే 27 బుధవారం

కామ్రేడ్ కపర్దికి జోహార్లు

పశ్చిమ గోదావరి జిల్లాలో తన రాజకీయ జీవితం ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలతో ప్రారంభించినప్పటికీ కామ్రేడ్ కపర్ది రాష్ట్రంలోని సంఘటిత కార్మికోద్యమంలో అగ్రభాగాన ఉన్న ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన నాయకులలో, రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులలో అచిరకాలంలోనే వివిధ బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. ముఖ్యంగా రాష్ట్రమంతటా రోడ్డు రవాణా కార్మికోద్యమాన్ని నిర్మించారు. ఈ రంగంలో కార్మికులను చైతన్యవంతులను చేసి, వారి జీవితాలను క్రమబద్ధం చేసి గర్వించదగిన విధంగా వారికొక సంఘటిత ఉద్యమాన్ని నిర్మించారు. ఎ.పి.ఎస్. ఆర్.టి.సి. సాధించిన అనేక విజయాలలో అందుకై జరిగిన అనేక పోరాటాలలో, సంప్రదింపుల యంత్రాంగంలో కామ్రేడ్ కపర్ది ప్రముఖపాత్ర నిర్వహించారు.

ట్రేడ్ యూనియన్ సమరశీల పోరాటాలలో స్వాతంత్ర్యం రాక ముందూ ఆ తరువాత కూడా అనేకసార్లు ఆయన నిర్బంధాలకు గురయ్యారు. అనేక సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. కార్మికవర్గ పోరాటాల సందర్భాలలో ఎంతో నేర్పు, దీక్ష దక్షతలు చూపేవారో, యజమానులతో, మేనేజిమెంట్లతో, ప్రభుత్వంతో సంప్రదింపులలో పట్టు విడుపులు చూపిస్తూనే కార్మికవర్గ ప్రయోజనాలను సాధించడంలో చాకచక్యం ప్రదర్శించగలిగిన ట్రేడ్ యూనియన్ నాయకులలో కామ్రేడ్ కపర్ది ఒకరు. ఆ విధంగా అన్ని పక్షాలవారి మన్ననలను ఆయన చూరగొనగల్గే వారు. తను యావజ్జీవితాన్ని పీడిత ప్రజల విముక్తికై ధార పోసిన కామ్రేడ్ కపర్ది తన ఆస్తిపాస్తులను కూడా తన రాజకీయ జీవితంలో కరిగించుకొని, అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతూ కూడా మొక్కవోని విప్లవ దీక్షను ప్రదర్శించిన ధీరోదాత్తుడు. నిస్వార్థ త్యాగశీలి. తన కుటుంబ సభ్యులందరినీ దేశ భక్తియుత భావాల వైపు, సాంఘిక సంస్కరణలవైపు మళ్ళించిన దేశభక్తునిగా, ఉత్తమ కమ్యూనిస్టుగా, ఆదర్శ ప్రజా సేవకునిగా వాక్చాతుర్యం, నిర్మోహమాటం గల వ్యక్తిగా వివిధ వర్గాల ప్రజల ఆదరాభిమానాలను ఆయన చూరగొన్నారు. అన్ని రాజకీయ పక్షాల వారిచే – అన్ని ట్రేడ్ యూనియన్ సంస్థల వారిచే గౌరవింపబడుతూ వుండేవారు. గత కొద్ది సంవత్సరాలుగా అనారోగ్యంగా ఉంటూ కూడా ఆయన తన పూర్తి కాలాన్ని కార్మికోద్యమ నిర్వహణలో, రాజకీయ బాధ్యతలను నెరవేర్చడంలో వెచ్చిస్తూ నిర్విరామంగా కృషి చేస్తూనే వచ్చారు. కామ్రేడ్ కపర్ది చూపిన విప్లవ దీక్షకు, ఆదర్శాలకు ఇవే మా జోహార్లు. ఆయన కుటుంబానికి మా హృదయపూర్వక సానుతాపాన్ని తెలియజేస్తున్నాం. ఆయన విప్లవ కర్తవ్యాలను ముందుకు తీసుకొనిపోవడమే అందరి పవిత్ర కర్తవ్యం. అదే ఆయనకు మనం అర్పించగల శ్రద్ధాంజలి. ❑

(27 మే 1981)



కామ్రేడ్ కపర్దీ భవనం.. సీపీఐ ఆఫీసు, తాడేపల్లిగూడెం



తాడేపల్లిగూడెంలోని కపర్దీ విగ్రహం





ఏలూరు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీసు..








శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలు




## జ్ఞాపికలు



పేరు

వయస్సు 45

వృత్తి

పార్టీలో చేరిన సంవత్సరం 1948

యూనిట్ :

జిల్లా

తాలూకా/ఫిర్కా

శాఖ

పార్టీలో హోదా

సభ్యుని సంతకం

నెం. 440

పార్టీ సభ్యత్వ రుసుం

రిమార్కులు

కార్యదర్శి,
ప్రదేశ్ సమితి

కార్యదర్శి,
జిల్లా సమితి

జిల్లా కార్యదర్శిగా కపర్దీ సంతకంతో కూడిన పార్టీ సభ్యత్వ కార్డు

# కపర్ది నామధేయులు



## ఎస్.కపర్ది

ఏలూరులో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ క్రియాశీల నాయకుడు ఎస్.సంజీవరావు గారు తన కుమారునికి కపర్దీ పేరు పెట్టారు. ఈయన 16 ఏళ్లుగా ఎన్‌జీవో సెక్టార్‌లో పనిచేస్తున్నారు.



## బోగా కపర్ది

సీపీఐ ఏలూరు ఏరియా కమిటీ సభ్యులు బోగా ఉమామహేశ్వర రావు పెద్ద కుమారుడు కపర్ది. ఈయన గోపన్నపాలెంలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.



## స్మితా కపర్దిని

మందలపర్తి నారాయణమూర్తి, కనకం గార్లు తమ కుమార్తెకు కపర్దీ పేరు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈమె బెంగళూరులోని ఒక మేనేజ్‌మెంట్ కంపెనీలో పనిచేస్తున్నారు.




కపర్దీపై అభిమానంతో.. పాబోలు పాపారావు తాడేపల్లిగూడెంలోని తన స్వగృహానికి కపర్దీ భవన్‌గా నామకరణం చేశారు.




కపర్దీ-శేషమ్మల గురించిన జ్ఞాపకాల సంచిక - 2006

# కంట్రోళ్ళ రద్దుతో విషమించిన ఆహార పరిస్థితి

## స్వీయ రచనలు

- యం.వి.యన్. కపర్ది



కంట్రోల్స్ అవకతవకగా అమలు జరపటం వలన, లంచగొండితనం విపరీతం కావటం వలన, కంట్రోల్స్ పట్ల ప్రజల్లో ఒక విధమైన వ్యతిరేకత ప్రబలింది. అసలు లోపాన్ని సరిదిద్దలేక మొత్తంగా కంట్రోల్స్‌నే ఎత్తివేసింది రాజాజీ మంత్రి వర్గం. కంట్రోల్స్ రద్దు కావటంతో ఆహార పదార్థాలు విరివిగా దొరుకుతాయని, ధరలు తగ్గుతాయనీ, ప్రజలలో భ్రమలు కలుగ చేయపూనుకున్నారు. కానీ, ఆచరణలో కంట్రోల్స్ రద్దు కావటంతో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనిపై ప్రజాభిప్రాయం ప్రభుత్వానికి వ్యతిరేకమైంది. ఒక వంక రాయలసీమ లోనూ, ఇతర తరుగు జిల్లాలలోనూ క్షామం తాండవిస్తోంది. మరోవంక ఆహార పదార్థాలపై కంట్రోల్స్ రద్దు చేయడంతో, అధిక లాభాపేక్షతో మిల్లు యజమానులు ధరలు విపరీతంగా పెంచేయడంతో ప్రభుత్వం అభాసుపాలైంది.

### అధిక లాభాపేక్షాపరుల కుట్ర

కంట్రోల్స్ తొలగించక పూర్వం ప్రభుత్వం సేకరించిన ధాన్యం, మద్రాసు రాష్ట్రంలోనే 4,50,000 టన్నుల వరకూ వుందనీ, అవసరమైన చోట్లకు ఈ స్టాకును తరలించి కొరత తీర్చగలననీ, తద్వారా డీ-కంట్రోల్ విధానాన్ని జయప్రదం చెయ్యగలననీ, రాజాజీ నమ్మకమైన కబుర్లు చెప్పారు. ఈ స్టాకులన్నీ మిల్లు యజమానుల వశంలో వున్నాయి. తామే ఈ స్టాకులను భద్రపరచగలమనీ, వాటికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్త తీసుకుంటామనీ, ప్రభుత్వ అనుమతి లేకుండా వాటిని వినియోగించబోమని లిఖితపూర్వకమైన హామీనిస్తామనీ మిల్లు యజమానులు వాగ్దానం చేశారు. అందుకు ప్రతిఫలంగా, ప్రస్తుతం ప్రభుత్వం వద్దనున్న స్టాకుల్లో 25% తమ స్వేచ్ఛా వ్యాపారానికి విడుదల చెయ్యమని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విధంగా మార్కెట్‌లోకి స్టాకును విడుదల చెయ్యగానే ధరలు వెంటనే తగ్గిపోతాయని మిల్లు యజమానులు వాదించారు. మార్కెట్‌లోకి స్టాకును విడుదల చెయ్యకపోవడం వల్లనే ధరలు పెరిగిపోయాయని వాళ్ళు ప్రచారం చేశారు.

ఈ మధ్యన పశ్చిమ గోదావరి జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ తరపున ఒక ప్రతినిధివర్గం రాజాజీని కలిసింది. ప్రభుత్వ స్టాకుల నుండి కొంతభాగం విడుదల చెయ్యడానికి తాను సుముఖంగా వున్నట్లు ముఖ్యమంత్రి సదరు ప్రతినిధులతో చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే కనుక జరిగితే, ఇక ప్రజల బాధలు చెప్పనలవి కాదు! ఉదాహరణకు ధాన్యం ఎగుమతిలో మన రాష్ట్రానికి ముఖ్య కేంద్రమైన తాడేపల్లిగూడెంలో, డీ-కంట్రోల్ తదనంతర పరిణామాలు చూస్తే పై విషయం రుజువవుతుంది.



నీ కేమీ భయంలేదు అవన్నీ సాధువులు! కంట్రోళ్లు రద్దుచేసి క్షుధితులను దొంగ వర్తకుల దయాదాక్షిణ్యాలకు వదలిన రాజాజీ అభయం

ఈ వ్యాసానికి రాంభట్ల కృష్ణమూర్తి కార్టూన్

### ధరలు పెరిగిన విధం

కంట్రోల్స్ రద్దు కాక పూర్వం మిల్లర్లు - బస్తా ఒక్కంటికీ 5 రూపాయల 12 అణాలు సర్చార్జ్ చెల్లిస్తూ కూడా - రెండవ రకం బియ్యం బస్తా ఒక్కంటికీ 31 రూపాయలకు మిల్లు వద్ద విడుదల చేసేవారు. కంట్రోల్స్ రద్దయిన దరిమిలా, సర్చార్జ్ చెల్లించే అగత్యం లేకపోయింది. అలాంటి పరిస్థితుల్లోనే, రెండవ రకం బియ్యం బస్తా ధర ఒక్కంటికీ 38 రూపాయల వరకు పెరిగిపోయింది. ప్రభుత్వం

ఏర్పరిచిన జోనల్ పద్ధతి ప్రకారం మద్రాసుకు తాడేపల్లిగూడెం మార్కెట్ నుండి ధాన్యం కానీ బియ్యం కానీ ఎగుమతి చేసే అవకాశం ఏర్పడింది. వెంటనే ధాన్యం వర్తకులు తాడేపల్లిగూడెం మార్కెట్‌పై విరుచుకు పడ్డారు. ధరలు విపరీతంగా పెంచేశారు. గతంలో, స్థానికంగా వున్న మిల్లర్లు గరిక సన్న బియ్యం బస్తా ఒక్కంటికి 24 రూపాయల 8 అణాలు పెట్టి కొంటున్న సమయంలో మద్రాసు వర్తకులు బస్తా ఒక్కంటికి 23 రూ 8 అణాలు పెట్టి కొనేవారు. ఇప్పుడు ఇదే రకం బస్తా ఒక్కంటికి 30 రూపాయల వరకూ ధర పెంచేశారు. వీరంతా ఆ ధాన్యం కొని తమ ప్రాంతాలకు తీసుకుపోయి అక్కడి ప్రజలకు అమ్మేవారేనా అంటే కాదు. స్థానికంగా మిల్లర్లు ధాన్యం దాచి ధరలు పెంచితే, ఈ మద్రాసు వర్తకులు కూడా ధరలు పెంచి కొల్లగొట్టడానికే ఈ ఆత్రుత అంతా! అందుచేత మిల్లర్ల చేతిలో 25% స్టాకు పెట్టడం ద్వారా ధరలు పెరుగుతాయనే మాట వట్టి కల్ల మాత్రమే!!

## స్టాక్స్ మిల్లర్లకు ఇస్తే

బోనసు ఎరతో సామాన్య రైతాంగం అందరూ మే 31వ తేదీ లోపు ఎంత తక్కువకైనా సరే తమ ధాన్యాన్ని అమ్మివేశారు. ఆ కాలంలో అదును చూసి తమకు ధాన్యం అక్కరలేదని బిగించారు. దానితో అమ్మక తప్పనిసరి కనుక రైతు అయినకాడికి అమ్మివేశాడు. రెండవ పంట ధాన్యం బస్తా ఒక్కంటికీ ధర 14 రూపాయలకి, ఒక్కోచోట 13 రూపాయలకి పడిపోయింది. ఇక ఎటొచ్చి ధాన్యం నిల్వ చేసుకోగల భూస్వాముల దగ్గిర మాత్రం స్టాకులు నిలబడి వున్నాయి. ఇంతలో కంట్రోల్స్ రద్దు కావడం పర్యవసానంగా విపరీతంగా పెరిగిపోయిన ధరలకు తమ స్టాకులను విడుదల చేసి లాభపడ్డారు. అంటే కంట్రోల్స్ రద్దు భూస్వాములకూ, మిల్లు యజమానులకూ కనకవర్షం కురిపించింది. కష్టజీవులకు కాటకం తెచ్చిపెట్టింది. ఈ పరిస్థితుల్లో, ప్రభుత్వం చేతుల్లో ఉన్న ధాన్యం రాశులను, మిల్లు యజమానుల స్వేచ్ఛా వ్యాపారానికి విడుదల చేయటమంటే రూ.30 వరకూ పెరిగిన బియ్యం బస్తా ధర రూ.50 వరకూ పెరగడానికి తోడ్పడమే అవుతుంది. అవసరమైన చోట్ల చౌక డిపోలను పెట్టి ఆహారానికి కటకట ఏర్పడకుండా చూస్తామన్న ప్రభుత్వం చేతుల్లో గుప్పెడు గింజలైనా లేకుండా చేసుకోవడమే అవుతుంది. పరిస్థితి విషమించాక చుక్కలు లెక్క పెట్టాల్సి వస్తుంది. కనుక, ప్రభుత్వం తన వద్ద వున్న స్టాకుల్లో ఏ మాత్రం కూడా మిల్లర్లకు ఇవ్వకూడదు. ఇప్పటికే విపరీతంగా పెరిగిపోయిన ధరలను అదుపులోకి తేవడానికి ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి. ఇంతకు పూర్వం ఇంఫార్మల్ రేషనింగు అమలులో వున్న ప్రాంతాల్లో ప్రభుత్వమే చౌక డిపోల ద్వారా బియ్యం అమ్మించాలి. అందుకు స్టాకులను పూర్వపు కంట్రోలు రేట్లకే చౌక డిపోల ద్వారా విడుదల చెయ్యాలి. అలా చేసిన రోజునే సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండేలా బియ్యం సరఫరా అవుతాయి. అంటే కనీసం ఇప్పుడున్న ధరలకైనా (ఉదాహరణకి రెండవ రకం బియ్యం బస్తా ఒక్కంటికి రూ.31కే) లభ్యమవుతాయి. లభ్యమవుతాయి. ఇలా చేస్తూ ప్రభుత్వం వద్దనున్న స్టాకు సరిపోయేలా మనిషి ఒక్కరికీ కనీసం 8 ఔన్సులు చౌక డిపోల ద్వారానూ, అదనంగా కావలసి వస్తే స్వేచ్ఛా వ్యాపారుల ద్వారాను దొరికేలా చెయ్యాలి. అప్పుడు మాత్రమే స్వేచ్ఛా వ్యాపారులు అమ్మే రేట్లు – కొద్ది తేడాతో – ఈ రేట్లకు సరితూగుతుంది.

## చౌక డిపోలు తెరవాలి!

వర్షాలు సకాలంలో కురవని కారణంగా, ఈ సంవత్సరం సాగులు ఆలస్యంగా జరిగాయి. వ్యవసాయపు వత్తిడి లేనందున వ్యవసాయ కూలీలకు చాలా తక్కువకూలి గిట్టింది. ఇప్పటి హెచ్చురేట్లకు బియ్యం కొనుక్కోలేక వ్యవసాయ కూలీలు నానా అవస్థలూ పడుతున్నారు. రానున్న గడ్డు మాసాల్లో వీరి కడగండ్లు దేవుడికెరుక! కార్మికుల సంగతి అసలే చెప్పనక్కర్లేదు. గతంలో దినవెచ్చాలకు చాలని జీతాలతో బాధపడేవాళ్ళు ప్రస్తుతం అర్ధాక లితో మాడవలసి వస్తోంది. బియ్యం కొనుక్కునే మధ్యతరగతి ఉద్యోగస్తుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది.

## ప్రజాభిప్రాయం గమనిస్తారా?

ప్రజల్లో వస్తున్న అసంతృప్తిని ఇప్పటికైనా గుర్తించి రాజగోపాలాచారి గారు మిల్లు యజమానులకు తమ స్టాకులను విడుదల చేయాలనే అభిప్రాయాన్ని మార్చుకుని, ఆ స్టాకుల నుండి చౌక డిపోలకు బియ్యం సరఫరా చేయించపూనుకోవాలి. పిల్లి కళ్ళమూసుకొని పాలు తాగినట్లు తమ డీ కంట్రోలు వల్ల వచ్చిన దుష్ఫలితాలను చూడ నిరాకరించే ధోరణికి స్వస్తి చెప్పాలి. పరిస్థితులు విషమించకుండా వెంటనే తగు జాగ్రత్త వహించాలి. ఈ విషయమై అసెంబ్లీలో సభ్యులందరూ ఆందోళన జరపాలి. ప్రభుత్వం చౌక డిపోలను తెరచి సరసమైన రేట్లకు బియ్యం అమ్మాలని ప్రజలు ఆందోళన చెయ్యాలి. మహజర్లపై సంతకాలు చేసి, బహిరంగ సభలు జరిపి తీర్మానాలు చేసి, ప్రభుత్వ అధికారుల వద్దకు రాయబారాలు వెళ్ళి, చౌక డిపోల కోసం అందోళన చెయ్యాలి. జిల్లా కలెక్టర్లు అవసరమని తలిస్తే ప్రభుత్వ స్టాకులను విడుదల చేయవచ్చునని ఒక ఆర్డరు పంపినట్లు తెలుస్తోంది. ప్రజానీకం వెంటనే ఆందోళన చేసి చౌక డిపోల ద్వారా బియ్యం సప్లై చేసే పద్ధతిని సాధించాలి. ❑

**(ఈ వ్యాసాన్ని కపర్దీ 27.7.1952లో రాశారు)**

# భారత కార్మికోద్యమ సముజ్జ్వల సమరశీల చరిత్ర

**విశాఖలో ఎఐటియుసి మహాసభలు-కర్తవ్యాలు**

## స్వీయ రచనలు

- యం.వి.యస్. కపర్ధీ



దేశ స్వాతంత్ర్యానికై బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పెద్ద జాతీయ వెల్లువ సాగుతున్న కాలమది. 1917 అక్టోబర్ విప్లవం ద్వారా సోవియట్ రష్యాలో కార్మికవర్గ పరిపాలన నెలకొన్నది అదే కాలంలో దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు రైతులు తది తర వర్గాలు అసంఖ్యాకంగా పోరాటాలు జరుపుతున్న సమయమది. అది 1920 ప్రాంతం. ఆ పూర్వ రంగంలో జాతీయ స్థాయిలో భారత కార్మికోద్యమానికి ఏకైక వేదికగా, 1920 అక్టోబర్ 31న, ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎ.ఐ.టి.యు.సి) బొంబాయిలో స్థాపించబడినది. ఈ ప్రథమ మహాసభకు అధ్యక్షత వహించినది ఆ నాటి ప్రముఖ జాతీయ నాయకులలో ఒకరైన లాలా లజపతిరాయ్. ఈ ప్రథమ సమావేశంలోనే భారత కార్మికవర్గ ప్రధాన లక్ష్యాలు, పోరాట దిశలను ఆయన తన అధ్యక్షోపన్యాసంలో ఆయన ఇలా నిర్దేశించారు.

" ప్రపంచవ్యాపితంగా కార్మికవర్గ అవసరాలు ఒకేరకంగా ఉన్నాయన్నది వాస్తవం. అన్ని దేశాలలోనూ కార్మికవర్గం యొక్క అధికారం, శక్తి ఒకే స్థాయిలో లేవన్నది కూడా వాస్తవమే.. భారతదేశంలో మనమింకా మొదటి దశకే చేరుకోలేదు. ప్రస్తుత దశలో వారు (పాలకులు) మనలను అడుగడుగునా వ్యతిరేకిస్తారు. మనలను విభజించటానికి, మన ఐక్య కార్యాచరణ యత్నాలను విచ్ఛిన్నం చేయటానికి తమ సాధన సంపత్తినంతా వినియోగిస్తారు. లాహెరీర్ రైల్వే సమ్మె - సిమ్లా, కలకత్తాలలో గవర్నమెంట్ ప్రెస్ సమ్మె - బొంబాయిలో పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ సమ్మెల సందర్భంగా వారి చర్యలు ఈ వాస్తవాన్ని నిరూపిస్తాయి. ప్రస్తుతానికి మన ప్రధాన కర్తవ్యం సంఘటితమవడం, ఆందోళనలు జరపడం, కార్మికులను చైతన్యపరచడం. మనం కార్మికులను సంఘటిత పరచి వారు వర్గ చైతన్యాన్ని పొందేలా కృషి జరిపి సామాజిక శ్రేయస్సుకై వారిని విజ్ఞానవంతులను చెయ్యాలి."

" పెట్టుబడిదారీ వర్గం ప్రపంచస్థాయిలో సంఘటితమయింది. అది ఊహాకందనంతటి ఆర్థిక, రాజకీయ బలాన్ని తనకు బాసటగా కలిగి వుంది. దాని ఆయుధాలు కార్మికవర్గం వినియోగించే ఆయుధాల కన్నా శక్తిమంతమయినవి. అది ప్రపంచవ్యాపితంగా ఎదుర్కొనవలసిన ప్రమాదాన్ని సృష్టిస్తుంది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకుగాను భారత కార్మికవర్గం భారతదేశం వెలుపల వున్న కార్మికవర్గంతో కూడా చేతులు కలపాలి. కాని, ముందుగా స్వదేశంలోనే అది సంఘటితంగా రూపొందాలి. కార్మికుల అవసరాలు ప్రపంచ వ్యాపితంగా ఒకేలా వున్నాయి."

" కార్మికవర్గం అర్ధాకలితో, చాలీచాలని బట్టలతో, కొంపాగోడూ లేకుండా, చదువు సంధ్యలు లేని దశలో పడివుండవలసి వస్తే, సహజంగానే భారతీయ కార్మిక వర్గానికి మన పరిశ్రమల అభివృద్ధిపై ఆసక్తి వుండజాలదు. దేశాభిమానం పేరుతో చేసే విజ్ఞప్తులన్నీ విఫలమవుతాయి. దేశాభిమానంతో చేసే విజ్ఞప్తులూ ధర్మపన్నాలన్నీ అటు ధనాఢ్యవర్గాలకీ, ఇటు పేద కార్మిక వర్గానికీ ఒకేవిధంగా వర్తించాలి. వాస్తవానికి, ధనాఢ్యవర్గాలకే యివి ఎక్కువగా వర్తించాలి!" పంజాబ్ కేసరిగా ప్రసిద్ధులైన లాలా లజపతిరాయ్ -బ్రిటిష్ పాలన కాలంలో- గంభీరమైన పైభావాలను వ్యక్తీకరించారు.

### మిగిలిపోయిన అనేక కర్తవ్యాలు!

స్వాతంత్ర్యం చేకూరిన మూడు దశాబ్దాల తర్వాత కూడా, ఈ నాటికీ, భారత కార్మికవర్గం ఆ నాటి పరిస్థితులనే ఎదుర్కొంటూ వున్నదన్న వాస్తవం అత్యంత శోచనీయం. నాటికీ నేటికీ కూడా ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యాలు కొన్ని చెక్కు చెదరకుండా ఉన్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేకత, ఏ దేశంలోనైనా సరే జాతీయ విముక్తి పోరాటాలకు సంఘీభావం, ప్రపంచశాంతికై కృషి, కార్మికవర్గం యొక్క ఆర్థిక-సామాజిక-రాజకీయ హక్కులకై పోరాటాలు, దేశ సమగ్రత, స్వాతంత్ర్యాల పరిరక్షణకై పోరాటాలు చెయ్యడానికి సంసిద్ధత, నాటికీ నేటికీ కూడా ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతూనే వున్నాయి. ఈ లక్ష్యాల సాధనకై బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎ.ఐ.టి.యు.సి. ఆధ్వర్యాన కార్మికవర్గం అనేక పోరాటాలు జరిపింది. అనేక వేల మంది ఈ పోరాటాలలో ప్రాణత్యాగం చేశారు. లక్షల మంది జైళ్ళ పాలయ్యారు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం అనేక మంది నాయకులపై కుట్ర కేసులు బనాయించింది. ఒక్క మాటలో చెప్పాలంటే,

కార్మికోద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి తన సర్వస్వం ఒట్టింది. లాలా లజపతిరాయ్, సుభాష్‌చంద్రబోస్, జవహర్ లాల్ నెహ్రూ, వి.వి.గిరి లాంటి జాతీయోద్యమ నాయకులు కార్మికవర్గ ఉద్యమ నిర్వాహకులుగా, ఈ సంస్థ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వ్యక్తిగత హింసావాదాన్ని విడనాడి, సోషలిస్టు ధ్యేయంతో ప్రజా ఉద్యమాలకు అంకితమైన విప్లవవీరులు అనేక మందికి ఎ.ఐ.టి.యు.సి. ప్రధాన కార్యరంగమైంది. ఆధునిక సమాజంలో కార్మికవర్గం ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆ వర్గం తనను తాను విముక్తం చేసుకోవడంతోపాటుగా తదితర వర్గాలన్నిటినీ దోపిడీ నుంచి విముక్తి చేసే చారిత్రక పాత్ర నిర్వహించవలసి వుందని గుర్తించిన మేధావులు మన దేశంలో అనేక మంది వున్నారు. అలా, శాస్త్రీయ దృక్పథంతో కార్మికవర్గాన్ని సమీక రించేందుకు నడుంకట్టిన మేధావులకు కూడా ఎ.ఐ.టి.యు.సి. యే ప్రధాన కార్యరంగమైంది.

స్వాతంత్ర్య పోరాట కాలంలో భారత కార్మికవర్గానికి ఏకైక వేదికగా వున్న ఎ.ఐ.టి.యు.సి.లో తమతమ గ్రూపుల ప్రయోజ నాలకై, వ్యక్తిగత ప్రాబల్యానికై కొందరు చీలికలు సృష్టించారు. పాలకవర్గాలు నిరంతరం దాడులు జరుపుతూ వచ్చాయి. అయి నప్పటికీ, ఎ.ఐ.టి.యు.సి. నాటికీ నేటికీ కార్మికవర్గ ప్రయోజనా లను సాధించే నిమిత్తం ఎడతెగని పోరాటం జరుపుతూనే వుంది. అరవయ్యేళ్ళుగా కార్మికవర్గ ఐక్యతకు ఏకైక ప్రతినిధి సంస్థగా ఎ.ఐ.టి.యు.సి. అచంచలంగా నిలిచే వుంది! స్వాతంత్ర్యానం తరం సామ్రాజ్యవాదానికీ, అంతర్జాతీయ గుత్తాధిపతులకూ వ్యతిరేకంగా ఎ.ఐ.టి.యు.సి. నిరంతరం పోరాటాలు సాగిస్తూనే వుంది. ప్రపంచ కార్మికసంఘాల సమాఖ్యగా వర్క్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టియు.) 1945లో ఏర్పడిన నాటి నుంచీ ఎ.ఐ.టి.యు.సి.కి అందులో విశిష్ట స్థానం కలిగి వుంది. ఎ.ఐ.టి.యు.సి. అధ్యక్షులు కామ్రేడ్ డాంగే డబ్ల్యు. ఎఫ్.టి.యు. ఉపాధ్యక్షులలో ఒకరు.

## జాతీయ విముక్తి ఉద్యమాల మిత్రుడు!

కొరియా, వియత్నాం, చిలీ, జింబాబ్వే తదితరదేశాలపై సామ్రాజ్యవాదుల దాడులకు వ్యతిరేకంగా, ఆయాజాతీయ విముక్తి పోరాటాలకు మద్దతుగా ఎ.ఐ.టి.యు.సి. తన సంఘీభావాన్ని, సహాయ సహకారాలనూ అందిస్తూ వచ్చింది. కంపూచియా, బాంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్ దేశాల జాతీయ విముక్తి పోరాటాలకు ఎ.ఐ.టి.యు.సి. అండదండలను అందించింది. హిందూ మహాసముద్రంలోని డిగోగార్సియాలో సామ్రాజ్యవాదు లు సైనిక స్థావరాన్ని ఏర్పాటు చెయ్యడానికి ఎ.ఐ.టి.యు.సి. తన వ్యతిరేకతను ప్రకటించింది. హిందూ మహాసముద్రాన్ని శాంతి మండలంగా రూపొందించాలని నిరంతరం ఆందోళన సాగిస్తూనేవుంది. అలా అంతర్జాతీయ కార్మిక వర్గ పోరాటాలకు ఎ.ఐ.టి.యు.సి. సంఘీభావాన్ని ఎల్లవేళలా అందిస్తూనే వుంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచీ, ఇక్కడి పాలక వర్గం పెట్టుబడిదారీ విధానాన్ని పెంచి పోషించింది. ఆ విధానా నికి గల సహజసిద్ధమైన రుగ్మతలన్నీ మన సమాజాన్ని ఆ నాటిన ఎంచీ పీడిస్తూనేవున్నాయి. కొద్దిమంది గుత్త కుటుంబాల చేతుల్లో సంపద కేంద్రీకృతంకావడం, అత్యధికులు ఆకలిబాధలతో అల మటిస్తూ ఉండడం సామాన్య క్రమమైంది. ఒక వంక పారిశ్రామి కాధిపతులకు అన్ని రాయితీలు కల్పించడం-మరొక వంక ఆహార దినుసుల్లాంటి ముడిపదార్థాలను పండించే వ్యవసాయ దారులకు గిట్టుబాటు ధరలను నిరాకరించడం, కార్మికుల వేతనా లను స్తంభింపచేయడం, అదే సమయంలో ధరలను విపరీతంగా పెంచి ప్రజలను దోపిడీకి ఆహుతి చెయ్యడం, ప్రభుత్వ విధానం గా వుంది. రుణభారంతో, పన్నుల భారంతో నడుం విరిగివున్న రైతాంగం ధరల పెరుగుదలతో సతమతమవుతూ, సమరశీల పోరాటాలకు పూనుకుంటోంది.

## అభివృద్ధిలో అసమానత - ఫలితంగా అసహనం!

కేంద్రంలో ఇందిరాగాంధీ తిరిగి అధికారంలోకి వచ్చేనాటికి సుమారు 330 పాయింట్లుగా వున్న జీవన వ్యయసూచిక నేటికి 386 పాయింట్లకు పెరిగింది. దీనిని అరికట్టే శక్తిగానీ, ఉద్దేశం కానీ ఈ ప్రభుత్వానికి ఏకోశానా లేదు. ఈ విధానం ఫలితంగా ఓ పక్క నిరక్షరాస్యత రూపుమాపకపోయినా, మరో పక్క విద్యా వంతులైన యువతకు తగిన ఉపాధి కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగ సమస్య ఈనాడు దేశంలోని యువతను నిరాశా నిస్పృహల వైపూ, అరాచకత్వం వైపూ నెడుతోంది. వారి ఉత్సాకశక్తిని దేశం ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. పర్యవసానంగా దేశంలో సగంపైగా జనాభా దారిద్ర్య రేఖకు అట్టడుగునే వున్నారు. వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయ డం దేశ సమగ్రతను కాపాడడానికి అత్యవసరం. కానీ, పెట్టుబ డిదారీ విధానం అటువంటి అభివృద్ధిని చాలా నిర్లక్ష్యం చేసింది. అసమానాభివృద్ధి ఫలితంగా దుర్భర దారిద్ర్యం, నిరుద్యోగం తలెత్తాయి. పర్యవసానంగా, ప్రజల్లో ప్రాం తీయ అసమానత లూ, పరస్పర విద్వేషాలూ పెచ్చరిల్లిపోయాయి. దాంతో మన దేశ ఈశాన్య ప్రాంతాలు విదేశీ స్వదేశీ విచ్ఛిన్నకారుల ఆగడా లకు ఆలవాలమైపోయాయి. ఈ ప్రాంతీయ అసహనాల పర్యవ సానంగా కార్మిక వర్గ ఐక్యతకే ముప్పుతెచ్చే కొన్ని అవలక్షణాలు ఏర్పడుతున్నాయి. ప్రాంతీయ అసమానతలను తొలగించగల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు చేపట్టాలని పాలకవర్గంపై వత్తిడి తేవ డానికి బదులుగా, కొన్ని శక్తులు వింత విధానాలు తీసు కుంటున్నాయి. "స్థానికులకే స్థానిక ఉద్యోగాలు" వంటి నినాదా లతో - సంఘటిత కార్మిక ఉద్యమం ఏనాడో అధిగమించిన - ప్రాంతీయ, కుల, మత విద్వేషాలను తిరిగి రెచ్చగొడుతున్నాయి

ఈ శక్తులు. ఈ భావాల పర్యవసానంగా కొన్ని ప్రాంతాలపైనా, కులాలపైనా, మతాలపైనా ఇతర వర్గాల ప్రజల్లో శత్రుత్వ భావాలు రెచ్చగొట్టడం ద్వారా, కార్మికవర్గం యొక్క పోరాట పటిమను నిర్వీర్యం చెయ్యడమనేదే ఈ శక్తుల కుట్ర. దీనికితోడు, మన దేశ ప్రాదేశిక సమగ్రతకే ముప్పు తెచ్చిపెట్టగల అమెరికన్ సామ్రాజ్యవాదుల, చైనా విస్తరణవాదుల కుట్రలకు వెనకబడిన ప్రాంతాలు గురిఅవుతున్నాయి.

ఇప్పటికైనా ప్రభుత్వం తన ఘోర వైఫల్యాలను గుర్తించి, సవరించుకోవడానికి బదులు, ఆయా ప్రాంతాల్లో తలెత్తిన విచ్ఛిన్నకర ఉద్యమాలను నిర్బంధ విధానాల ద్వారా అణచివేయాలని ప్రయత్నించడం చాలా గర్హనీయం. ఇప్పటికైనా వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజలలో –ముఖ్యంగా గిరిజనులలో చైతన్యం పెంపొందింపచేసే దిశగా ప్రభుత్వం కృషిచెయ్యాలి. గతంలో ఇలాంటి కుట్రపూరిత నిర్బంధవిధానాలు అమలు చెయ్యడానికి ప్రయత్నించిన అనేక సందర్భాల్లో పాలకవర్గాన్ని, పెట్టుబడిదారుల్ని కార్మికవర్గం వెనుకకు తిప్పికొట్టగలిగింది. భూతలింగం కమిషను సిఫారసులను బుట్టదాఖలు చెయ్యాలని జరిగిన పోరాటాలు, పారిశ్రామిక సంబంధాల బిల్లును పూడ్చి పెట్టేందుకు జరిగిన కుట్రలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు, వేతనాభివృద్ధిని డిమాండ్ చేస్తూ, జనపనార–జౌళి–పబ్లిక్ రంగ పరిశ్రమలలో చేసిన పోరాటాలు ఇందుకు తార్కాణం. ఈ అన్ని సందర్భాల్లోనూ, అన్ని పోరాటాల్లోనూ లక్షల సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. వాటిల్లో కొన్ని పోరాటాలు వారాల తరబడి, కొన్ని నెలల తరబడి జరిగాయి. కార్మికవర్గ ఐక్యత కోసం ఎ.ఐ.టి.యు.సి. గొప్ప చొరవనూ తెగువనూ చూపించింది!!

## పొరబాట్లు - దిద్దుబాట్లు!

అరవయ్యేళ్ళ ఉద్యమ క్రమంలో ఎ.ఐ.టి.యు.సి. కొన్ని సందర్భాల్లో పొరబాటు అవగాహనలకు లోనైన సందర్భాలు లేకపోలేదు! కానీ, స్వానుభవంతో వాటిని సరిదిద్దుకుని కార్మికవర్గ ఆశయసిద్ధిపట్ల అచంచల విశ్వాసంతో అకుంఠితసేవ చేస్తూ వచ్చింది. అలాచేస్తూ వచ్చినందువల్లనే ఎ.ఐ.టి.యు.సి. ఇంతటి సుదీర్ఘ చరిత్ర కలిగిన అగ్రగామి సంస్థగా కార్మికుల మధ్య మనగలుగుతూ వస్తోంది. మన రాష్ట్రంలో (అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో) ఎ.పి.టి.యు.సి. అనుబంధ సంస్థలు పోరాట పటిమకు మారుపేరుగా నిలిచి సమరశీలత ను ప్రదర్శిస్తూ వచ్చాయి. కనీస వేతన రంగంలో పోరాడి సాధించిన వేతనాభివృద్ధి సందర్భంగానూ, వర్క్ ఛార్జ్‌డ్ ఎంప్లాయీస్ హక్కుల సాధనకు జరిగిన పోరాటం సందర్భంగానూ, జూట్ కార్మికుల వేతనాభివృద్ధికి సాగిన అనేక పోరాటాల సందర్భంగానూ, తీవ్ర నిర బంధకాండను కూడా లెక్క చేయకుండా ఆర్టీసీ కార్మికులు చేసిన సమ్మె పోరాటం సందర్భంగానూ, పొగాకు కార్మికుల పోరాటాలలో ఐక్యతా సాధనకు, పోరాట పటిమకు ఎ.పి.టి.యు.సి. అనుబంధ సంఘాలు మారుపేరుగా నిలిచాయి. ఈ నేపథ్యంలో, ఎ.ఐ.టి.యు.సి. వజ్రోత్సవ సంవత్సరంలో, జాతీయ మహాసభలు విశాఖపట్నంలో జరుగుతున్నాయి. ఈ సభలో జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల గురించి ప్రతినిధులు క్షుణ్ణంగా చర్చించనున్నారు. దేశ సమగ్రతను కాపాడడానికి, సామాజిక పురోభివృద్ధి సాధించడానికి, వ్యవసాయ కార్మికులు–రైతాంగం–చేతి వృత్తులవారి జీవన పరిస్థితులను మెరుగు పర్చుకునేందుకు చేసే పోరాటాలతో ఈ సభ సంఘీభావం ప్రకటించనున్నది. ఆయా పోరాటాలకు సంపూర్ణ సహాయ సహకారాలను అందించేందుకు అ వసరమైన కార్యక్రమాన్ని ఈ సభ రూపొందిస్తుంది.

## ఆతిథ్యం-ఆదరణ మన విధి!

ఎ.ఐ.టి.యు.సి. జాతీయ మహాసభలో, దేశం నలుమూలల నుంచి వచ్చిన నాలుగు వేల మంది ప్రతినిధులు పాల్గొనబోతున్నారు. సోషలిస్టు దేశాల నుండి, ఇతర దేశాల్లోని కార్మిక సంఘాల నుంచి దాదాపు 50 మంది సౌహార్ద ప్రతినిధులుగా ఈ సభలో పాల్గొనబోతున్నారు. వీరందరికీ సముచితరీతిన ఆతిథ్యమిచ్చి ఆదరించడం మన విధి. అత్యంత శ్లాఘనీయమైన చరిత్ర కలిగిన ఎ.ఐ.టి.యు.సి. 31వ జాతీయ మహాసభ ఈ వజ్రోత్సవ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోనే జరగడం ఆంధ్ర ప్రజానీకానికి, ముఖ్యంగా కార్మిక వర్గానికి ఎంతో గర్వకారణం. ఎ.ఐ.టి.యు.సి. అనుబంధ సంస్థల్లో ఎ.పి.టి.యు.సి.ది ఓ గౌరవప్రదమైన స్థానం! ఎ.ఐ.టి.యు.సి. అనుబంధ సంఘాల్లో 325 యూనియన్లు ఎ.పి.టి.యు.సి.కి చెందినవే! కార్మికవర్గ బలాధిక్యతరీత్యా కూడా ఎ.పి.టి.యు.సి.అగ్రస్థానంలో ఉంది– ఈ సంస్థకు చెందిన రెండున్నర లక్షల మంది కార్మికులు ఎ.ఐ.టి.యు.సి.లో సభ్యులుగా వున్నారు. ఆ గౌరవప్రదమైన స్థానానికి అర్హమైన రీతిలో ఎ.ఐ.టి.యు.సి. వజ్రోత్సవాలను జయప్రదం చెయ్యడానికి అన్నివిధాల సహాయ సహకారాలను సమీకరించవలసి వుంటుంది.

జాతీయ విముక్తి పోరాటం నుండి, భాషాప్రయుక్త రాష్ట్రాల సాధనతోపాటు తెలుగుజాతి సమైక్యత సాధన వరకూ, తెలుగు ప్రజలతోపాటు నిలబడి ఎట్టి త్యాగానికైనా వెనుదీయని ఆంధ్ర కార్మికవర్గానికి రాష్ట్రప్రజల పరిపూర్ణ సహకారం లభిస్తుందనే ప్రగాఢ విశ్వాసం మాకున్నది. ఆ విశ్వాసం ఊతంగానే ఈ మహాసభ నిర్వహణకు నడుంకట్టాం. దీనిని తప్పక విజయవంతం చేయటానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

**(ఈ వ్యాసాన్ని కపర్ది 2.9.1980లో రాశారు : సంపాదకుడు)**

# ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్ర సంపుటీకరణకు సహకరించాలి!

## స్వీయ రచనలు

- యం.వి.యన్. కపర్ధీ



1980 అక్టోబరు 26 నుండి 31 వరకూ విశాఖపట్నంలో జరిగేది ఎ.ఐ.టి.యు.సి. మహాసభ మాత్రమే కాదు - ఇది, ఎ.ఐ.టి.యు.సి వజ్రోత్సవం సందర్భంగా జరిగే మహాసభ అనేది కూడా మనం దృష్టిలో వుంచుకోవలసిన ముఖ్యాంశం. 60 సంవత్సరాల ఎ.ఐ.టి.యు.సి. ఉజ్జ్వల చరిత్రలో ఇటు మద్రాసు ఉమ్మడి రాష్ట్రం కాలం నాటి ఎ.పి.టి.యు.సి. గానీ, అటు పాత నైజాం సంస్థానానికి చెందిన ఆల్ హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ గానీ విశిష్ట స్థానాన్ని ఆక్రమించి వున్నాయి. ఈ విశిష్ట స్థానం దానంతటదే ఊడిపడలేదు!

భారతదేశంలో కార్మికవర్గ ఉద్యమానికి పురిటిగడ్డ అయిన ఎ.పి.టి.యు.సి.కి తలమానికంగా వున్న అనేక కార్మిక సంఘాలు సాగించిన వీరోచిత పోరాటాల వల్లనే ఆ విశిష్ట స్థానం మనకి దక్కింది. సుదీర్ఘమైన ఆ సంఘాల జాబితాలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఎ.పి.ఎస్.ఆర్.టి.సి ఎంప్లాయీస్ యూనియన్, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్ వర్కర్స్ యూనియన్, రాజమండ్రి జట్ల లేబర్ యూనియన్, చిట్టివలస(జూట్) లేబర్ యూనియన్, ఏలూరు(జూట్) లేబర్ యూనియన్, విజయవాడ ముఠా కార్మిక సంఘం, ఎన్.ఎస్.ఆర్ అండ్ ఎమ్.ఎస్.ఎమ్ (నిజామ్ స్టేట్-మద్రాస్-సదర్న్ మహరట్టా) రైల్వే కార్మిక సంఘాలు, గుంటూరు హేమలతా టెక్స్‌టైల్స్ - ఆదోని జౌళి కార్మిక సంఘాలు, బజ్రంగ్ జూట్‌మిల్ వర్కర్స్ యూనియన్, గుంటూరు లాగుడు బళ్ల కార్మిక సంఘం, ఆంధ్రరాష్ట్ర ప్రెస్ వర్కర్స్ యూనియన్, ఆంధ్రరాష్ట్ర మునిసిపల్ అండ్ పంచాయతీరాజ్ వర్కర్స్ యూనియన్, ఆంధ్రరాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొనివున్న పొగాకు కార్మిక సంఘాలు -ముఖ్యంగా, చీరాల ఐ.ఎల్.టీ.డీ. వర్కర్స్ యూనియన్ - కొన్ని మాత్రమే ! పశ్చిమగోదావరి జిల్లా మోటర్ వర్కర్స్ యూనియన్ వంటివి నడిపిన సముజ్జ్వల పోరాటాల వల్లనే ఆ విశిష్ట స్థానం ఎ.పి.టి.యు.సి.కి దక్కింది.

బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలన కాలంలో చిట్టివలసలోనూ, చీరాలలోనూ విదేశీ కంపెనీలకు వ్యతిరేకంగా నడచిన కార్మికపోరాటాలపై తుపాకులతో కాల్చారు. ప్రభుత్వ నిర్బంధాలకు, జైళ్ళకు, లాఠీచార్జీలకు, నిషేధాలకు, గురైన యూనియన్ల కథలు లెక్కకు మిక్కుటంగా వుంటాయి. అయితే, దురదృష్టవశాత్తూ మన మొత్తం చరిత్ర ఇంత వరకూ గ్రంథస్థం కాలేదు! యూనియన్ల వ్యవస్థాపకులు, వీరోచిత పోరాటాలు నడిపినవారు, చిత్రహింసలకు గురైనవారు, అనేకమంది త్యాగమూర్తులు!! వారిలో కొందరు ఇప్పటికే మృతి చెందారు. ఉద్యోగ విరమణ చేసి, జీవిత చరమ దశలో కొందరున్నారు. అయినప్పటికీ, అనేక విషయాలూ వివరాలూ తెలుపగలవారు తగినంత మంది ఇంకా వున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరగనున్న ఎ.ఐ.టి.యు.సి. మహాసభ సందర్భంగా ఇట్టి ట్రేడ్ యూనియన్ల చరిత్రను సంపుటీకరించడం, వీలైతే అక్టోబరు 31న, ఎ.ఐ.టి.యు.సి. వజ్రోత్సవ దినాన, దానిని ఆవిష్కరించడం ఎంతైనా ఉచితంగా వుంటుందని భావిస్తున్నాం. ఇప్పటి నుండి మన ట్రేడ్ యూనియన్ ఉద్యమ పితామహులు, ఇంకా ఇతర ఉద్యమాలలో భాగస్వాములుగా వుండి పనిచేస్తున్న అనుభవజ్ఞులు, మన ఉద్యమ అభిమానులు, ఈ లక్ష్యం దిశగా మనసు పెట్టి కృషి చేయాలి. తమ జ్ఞాపకాలను రాత పూర్వకంగా నమోదు చేయాలి. వాటిని సేకరించి భద్రపరచినట్లయితే అవి ఎ.పి.టి.యు.సి. సమగ్ర చరిత్ర సంపుటీకరణకు ఎంతో తోడ్పడతాయి. అట్టి కృషికి పూనుకోవాలని వారికందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను! ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిగిన కార్మికవర్గ పోరాటాలు కొన్ని, అఖిల భారత స్థాయిలో పేరొందినవి కూడా వున్నాయి. వాటి గురించి ఇంగ్లిష్ రాసి పంపితే, మహాసభ సందర్భంగా ప్రచురించే సావనియర్లో వేయాలనుకుంటున్నాం.

పైన కొన్ని వీరోచిత పోరాటాల గురించి ప్రస్తావించాం. వాటికి సమకాలీనమైన ఉద్యమాలు మరికొన్ని వుండవచ్చు. సమయానికి గుర్తురాక వాటిని ప్రస్తావించి వుండకపోవచ్చు- అందుకు క్షంతవ్యులం! అదే సమయంలో అలాంటి ఉద్యమాల గురించి తెలిసిన వారు దయచేసి వాటి గురించి కూడా తెలియచేయవలసిందిగా కోరుతున్నాం. ఈ మహాసభ సందర్భంగానైనా, ఈ ఎ.పి.టి.యు.సి సమగ్ర చరిత్ర గ్రంథస్థం కాని లోటును పూడ్చేందుకు అవసరమైన తోడ్పాటును కామ్రేడ్స్ అందిస్తారని ఆశిస్తున్నాను. ఈ సందర్భంగా మీరు పంపదలచిన వివరాలను ఎ.పి.టి.యు.సి. ఆఫీసుకు పంపించవలసిందిగా కోరుతున్నాను. ❑

# రథ్ కమిటీ నివేదిక తిరస్కారం వెనుక 'హస్త'మెవరిది?

స్వీయ రచనలు



- యం.వి.యస్. కపర్దీ

నోట్ల ముమ్మరం (ద్రవ్యోల్బణం) ఫలితంగా అస్తవ్యస్తం అవుతున్న తమ జీవన పరిస్థితులను మెరుగు పరుచుకోవడానికి, కార్మికులకు కరువుభత్యం పెంపుదల ఒక కన్నీటి తుడుపువంటి ది. ఆ కరువు భత్యం పెంపుదలను జీవన వ్యయ సూచికతో ముడివేయాలని కార్మిక వర్గం తీవ్ర పోరాటాలు జరిపింది. ఐనా, ఇప్పటికీ అన్ని పరిశ్రమలలోనూ కరువుభత్యం పెంపుదలను జీవన వ్యయసూచికతో జతచేసే పరిస్థితి మన దేశంలో ఏర్పడ లేదు. ఒకవైపు పరిస్థితులు ఇంత నికృష్టంగా వుండగా, మరోవైపు జీవన వ్యయ సూచికను లెక్కగట్టే పద్ధతి మరింత ద్రోహపూరితంగా వుంది. ఈ లెక్కలను ఆర్థిక గణాంక కేంద్రం (బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) రూపొందిస్తుంది. అది నిరంకుశోద్యోగుల పుట్ట! పరిశ్రమాధిపతులకు సానుకూలంగానూ, కార్మికులకు నష్టకరంగానూ ఈ లెక్కల్ని ఆర్థిక గణాంక కేంద్రం రూపొందిస్తున్నదని చిరకాలంగా కార్మికవర్గం ఆందోళన చేస్తూ వచ్చింది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వమే నీలకంఠ రథ్ అనే ఆర్థిక నిపుణుడి ఆధ్వర్యంలో ఓ కమిటీని నియమించింది. ఆర్థిక గణాంక కేంద్రం ఈ లెక్కల్ని రూపొందిస్తున్న పద్ధతిపై ఆ కమిటీ కూలంకషంగా విచారణ జరిపింది. జీవన వ్యయ సూచిక లెక్క కట్టడంలో లోపాలు జరుగుతున్నాయని రథ్ కమిటీ తన నివేదికలో నిర్ద్వంద్వంగా పేర్కొంది. పేదల పెన్నిధినని గద్దె నెక్కిన ఇందిరమ్మ ప్రభుత్వం ఈ రథ్ కమిటీ నివేదికను నిరాకరించింది. ఏ పారిశ్రామికాధిపతుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి, ఎవరి ఉప్పు-పులుసు తిని, బతకదల్చుకుందో ఆ బూర్జువావర్గ పక్షపాతినేనని కేంద్రం మరోసారి రుజువు చేసింది. కార్మికుల జేబులను కొసకంటా కత్తిరించి కోటీశ్వరుల వద్ద సంపద కేంద్రీకరణకు తోడ్పడే ఈ తప్పుడు విధానాన్ని ప్రోత్సహించడం గర్హనీయం. ఈ విధానానికి వ్యతి రేకంగా కార్మికవర్గం తీవ్ర పోరాటాలకు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

**ఏ పారిశ్రామికాధిపతుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి, ఎవరి ఉప్పు-పులుసు తిని, బతకదల్చుకుందో ఆ బూర్జువా వర్గ పక్షపాతినేనని కేంద్రం మరోసారి రుజువు చేసుకుంది. కార్మికుల జేబులను కొసకంటా కత్తిరించి కోటీశ్వరుల వద్ద సంపద కేంద్రీకరణకు తోడ్పడే ఈ తప్పుడు విధానాన్ని ప్రోత్సహించడం గర్హనీయం. ఈ విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గం తీవ్ర పోరాటాలకు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాను.**

సెప్టెంబరు నెలాఖరున వివిధ ట్రేడ్ యూనియన్ల తరఫున నిర్వహించదల్చిన సమష్టి పోరాటంలో మన డిమాండ్లు ఇవి :

- రథ్ కమిటీ రిపోర్ట్‌ను ఆమోదించి, తగిన మార్పులు చెయ్యాలి.
- కనీస వేతన రంగంలో జీవన వ్యయభత్యం ఇవ్వాలి.
- కనీస వేతనాలను బ్యాంకుల ద్వారా చెల్లించే ఏర్పాటు చెయ్యాలి. కార్మికులు కోరితేనే అలాంటి ఏర్పాట్లు చేస్తామని షరతు విధించకూడదు.
- కనీస వేతనాల చెల్లింపుల విషయంలో జాప్యం జరగకుండా చూడాలి. కనీస వేతనాల అమలు నిమిత్తం బలమైన యంత్రాంగం నిర్మించాలి!
- కనీస వేతనాల సలహా బోర్డు సిఫార్సులను ప్రకటించడంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యం క్షమించరానిది! సలహాబోర్డు సిఫారసులు ప్రకటించిన రెండు నెల ల్లోపు వాటిని ప్రభుత్వం ఆమోదించాలి. ప్రభుత్వ ప్రకటన ఆలస్యం అయ్యే పక్షంలో, బోర్డు సిఫారసులు వాటంతటఅవే అమల్లోకి వచ్చేలా ప్రభుత్వం అంగీకరించాలి.
- కాంట్రాక్టు లేబరు అబాలిషన్ అండ్ రెగ్యులేషన్ కమిటీ గతంలో కొన్ని సిఫారసులు చేసింది. వాటిని అమల్లోకి తెస్తానని ప్రస్తుత కార్మిక మంత్రి లేబర్ అడ్వైజరీ బోర్డు ముందు వాగ్దానం చేశారు. కానీ, వాటిని ప్రకటించి అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారు. ఈ దగా ఇంకా కొనసాగడానికి వీల్లేదు!
- ప్రభుత్వం నియమించే చట్టబద్ధ కమిటీలు, వాటి అధ్యక్ష స్థానాలు పాలకపక్షాల వారికి పదవులు కట్టబెట్టే నిమిత్తం ఉద్దే శించినవి కావని ప్రభుత్వం గ్రహించాలి. పాలకపక్షానికి చెందక పోయినా, అర్హులైన వారికి ఆ బాధ్యతలు అప్పగించాలి. అర్హతానర్హతలతో నిమిత్తం లేకుండా స్వజనులకు పదవులు కట్టబెట్టే పద్ధతిని కట్టిపెట్టాలి.
- వర్క్‌చార్జ్ కార్మికుల సమస్యలకు తుది పరిష్కారం ప్రకటించాలి. ❑

# జనతా ప్రభుత్వ దాడిని తిప్పికొట్టడానికి సమరశీల పోరాటాలు, సమైక్య కార్యాచరణకు పిలుపు!

## స్వీయ రచనలు

- యం.వి.యన్. కపర్ధీ



కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులు నెలకొని వున్న తరుణంలో, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మహాసభ జరుపుకుంటున్నాం. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ తన వాగ్దానాలన్నింటికీ తిలోదకాలిచ్చింది. భూతలింగం కమిటీ రిపోర్టుతోనూ, పారిశ్రామిక సంబంధాల బిల్లుతోనూ వేతన స్తంభనకూ, ట్రేడ్ యూనియన్ హక్కులపై దాడికి పూను కుంది. తమ జీవన స్థితిగతుల మెరుగుదలకూ, హక్కుల పరి రక్షణకూ పోరాడే కార్మిక వర్గంపై తుపాకీ కాల్పులు నిత్యకృత్యం గా చేసింది. మన రాష్ట్రంలోని ఇందిరా కాంగ్రెస్ ప్రభుత్వమూ, ఇక్కడి కార్మిక వర్గం చేసే పోరాటాల పట్ల దాని అడుగు జాడల్లోనే వ్యవహరిస్తోంది.

ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గ ఐక్య ఉద్యమాలూ, సమరశీల పోరాటాలూ నిత్యం పెల్లుబుకుతున్న కాలం ఇది. ఇటీవలి కాలంలో, అలాంటి పోరాటాలలో ముందు నిలబడి పోరాడి, అనేక విజయాలను సాధించిన మన ఉద్యమాన్ని పరిస్థితులకు తగిన రీతిలో మరింత సంఘటిత, సమరశీల కార్మికోద్యమంగా మలిచి, మరిన్ని పోరాటాలకు రూపకల్పన చేయడానికి వచ్చిన మీ అందరికీ అభినందనలు తెలియ చేస్తున్నాను. 1978 అక్టోబరు నాలుగు నుంచి ఏడో తేదీ వరకూ, గోదావరి ఖనిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మహాసభలో, గత ఐదు సంవత్సరాల కార్యకలాపాలపై, ఎ.పి.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి శ్రీ యం.వి.యన్.కపర్ధీ ప్రవేశపెట్టిన నివేదికలోని కొన్ని ముఖ్యమైన భాగాలను ఇక్కడ ఇస్తున్నాం.

### అస్తవ్యస్తం కార్మికుల జీవనం!

మన గత మహాసభ 1973 మే 12 నుంచి 14 వరకూ హైదరాబాద్‌లో జరిగింది. 256 అనుబంధ సంఘాలకు చెందిన 1,80,000 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహించిన 572 మంది ప్రతినిధులు, 109 మంది పరిశీలకులు ఆ సభకు హాజరయ్యారు. అంతకు ముందు జరిగిన రెండు వేర్పాటు ఉద్యమాల దుష్ఫలితాల వల్ల సతమతమవుతున్న ఆర్థిక పరిస్థితి పూర్వ రంగంలో ఆ మహాసభ జరిగింది. 1974-75 సంవత్సరాల్లో రాష్ట్రవ్యాపితంగా అనేక సమ్మెలు జరిగాయి. కార్మికుల హక్కులను హరించే దురుద్దేశంతో పెట్టుబడిదారీ వర్గం లాకౌట్లకు కూడా పెద్దసంఖ్యలో పాల్పడింది. 1974లో 42 సమ్మెలూ, 13 లాకౌట్లు జరిగాయి. సమ్మెలలో 28,600 మంది కార్మికులు పాల్గొన్నారు. లాకౌట్ల మూలంగా 9,000 మంది కార్మికుల ఉపాధికి నష్టం వాటిల్లింది. సమ్మెల మూలంగా 88,800 పనిదినాలు నష్టమైతే, లాకౌట్ల కారణంగా 3,08,000 పనిదినాలు నష్టమయ్యాయి. అంటే, కార్మికులపై పెట్టుబడిదారీ వర్గం తీవ్రమైన దాడి చేసిందని స్పష్టమవుతోంది! 1975లో 44 సమ్మెలూ 4 లాకౌట్లు జరిగాయి. సమ్మెల్లో 21,700 మంది పాల్గొనగా లాకౌట్ల వలన ఉపాధి కోల్పోయిన వారి సంఖ్య 700 మాత్రమే. సమ్మెల వలన 2,85,400 పనిరోజులు నష్టం కాగా, లాకౌట్ల వలన 60,600 పనిదినాలు నష్టమయ్యాయి. పై వివరాలను బట్టి, పారిశ్రామిక రంగ కార్మికుల పరిస్థితులు ఎంతో అస్తవ్యస్తంగా ఉన్నాయని అర్థమవుతుంది! 1973-74 నుండి 75-76 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలంలో రాష్ట్రంలో ఫ్యాక్టరీల సంఖ్య 4863 నుండి 5798కి పెరగగా, అదే కాలం లో కార్మికుల సంఖ్య 3,50,630 నుండి 3,87,090కి పెరిగిం ది. మొత్తం ఉద్యోగుల సంఖ్య 4,16,012 నుండి 4,72,490కి పెరిగింది. అదే కాలంలో పరిశ్రమల్లో ఉత్పత్తి మూలంగా చేరిన అదనపు విలువ 5,925 లక్షల రూపాయలు కాగా కార్మికుల వేతనాల రూపంలో అందిన మొత్తం మాత్రం 2,682 లక్షలు మాత్రమే! ఒక్క మాటలో చెప్పాలంటే, ఇది కార్మికుల కష్టానికి రావలసిన ప్రతిఫలంలో సగం కంటే తక్కువ. సుమారు 45 శాతం మాత్రమే! మిగిలిన సగంకంటే ఎక్కువ భాగం యజమానుల ఖజానాలకు చేర్చుకున్నారంటే, దోపిడి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది.

### కార్మిక పోరాటాలపై ఉక్కు హస్తం

ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామిక, పారిశ్రామిక సంబంధాలను విచ్ఛిన్నం చేసి కార్మిక పోరాటాలను ఉక్కుహస్తంతో అణచివేసే దారుణానికి ప్రభుత్వం ఒడిగట్టింది. దానిలో ఒక భాగమే 1974 మే 3 నుండి 20 రోజులపాటు జరిగిన రైల్వే సమ్మెపై సాగించిన దారుణ అణచివేత చర్యలు. మన రాష్ట్రానికి సంబంధించి, సౌత్ సెంట్రల్ రైల్వేలో మనకు అనుబంధ సంఘం వుంది. అలాగే, ఆగ్నేయ రైల్వేలో భాగమైన వాల్తేరు డివిజన్‌లో ఉన్న ఎ.ఐ.టి.యు.సి. అనుబంధ సంఘం అక్కడ బలంగా వుంది. దక్షిణ రైల్వేకు చెందిన గుంతకల్ కూడా మన రాష్ట్రంలోనే

వుంది. ఇది ఒక బలమైన కేంద్రమే! ఈ మూడు రైల్వేలలోనూ ఎ.ఐ.టి.యు.సి. కార్యకర్తలు చివరి వరకూ సమ్మెలో పాల్గొన్నారు. రాష్ట్రం మొత్తం మీద సుమారు 1100 మంది కార్యకర్తలు అరెస్టయ్యారు. వారందరూ ఉద్యోగాల నుండి సస్పెండయ్యారు. 300 మంది డిస్మిస్ చేయబడ్డారు!

ఈ దారుణ నిర్బంధ విధానానికి వ్యతిరేకంగా కేంద్ర ట్రేడ్ యూనియన్ల పిలుపును అనుసరించి, 1974 మే 15న రాష్ట్ర వ్యాపితంగా సార్వత్రిక నిరసన సమ్మె జరిగింది. ఈ సమ్మెలో దాదాపు మూడు లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు. ఎ.పి.ఎస్.ఆర్.సి. ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులందరూ సమ్మెలో చురుకుగా పాల్గొన్నారు. 10,000 మంది బొగ్గు గని కార్మికులు, 10,000 మంది పోర్ట్ అండ్ హార్బర్ వర్కర్లు, జూట్ కార్మికులు, జౌళి కార్మికులు, పొగాకు కార్మికులు, అనేక చిన్న పరిశ్రమల్లోని కార్మికులు, మునిసిపల్ కార్మికులు మన నాయకత్వంలో ఈ సమ్మెలో పాల్గొన్నారు. హైదరాబాద్ గవర్నమెంట్ ప్రెస్ కార్మికులు కూడా ఈ సమ్మెలో పాల్గొన్నారు. మన నాయకత్వాన లేని కేంద్ర ప్రభుత్వ రంగంలోని పెద్ద పరిశ్రమల్లో సమ్మె జరగలేదు. ఉదాహరణకు సి.ఐ.టి.యు. నాయకత్వంలోని హెచ్.ఎం.టిలోనూ, హెచ్.ఎమ్.ఎస్. నాయకత్వంలోని హెచ్.ఏ.ఎల్.లోనూ సమ్మె జరగలేదు. ఇటువంటివే మరి కొన్ని పరిశ్రమల్లో కూడా సమ్మె జరగలేదు. ఈ సంఘీ భావ సమ్మెలో ఎ.పి.టి.యు.సి. మన రాష్ట్రంలో ప్రధాన పాత్ర వహించింది.

## లేబర్ డిపార్ట్‌మెంట్ వైఫల్యం!

ఈ కాలంలోనే, నెల్లూరు జిల్లా గోకినేనిపురం, రావూస్ ఇన్సులేటింగ్ కంపెనీ, నెల్లూరు మోడరన్ రైస్ మిల్, కాకినాడ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్, విజయవాడ ఇంజనీరింగ్ ఫౌండ్రీల్లో యూనియన్లు స్థాపించినందుకు ముఖ్య కార్యకర్తలపై యజమానులు పగ సాధింపు చర్యలకు దిగారు. లేబర్ డిపార్ట్‌మెంట్ ఈ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైంది. కొత్తగూడెం థర్మల్ పాజెక్ట్ 13 మందిని సస్పెన్షన్ వుంచిన కేసు, నెలల తరబడి పరిష్కారం కాకుండా వుండిపోయింది. మునిసిపల్ కార్మికులకు డి.డి.మెర్జ్ స్కేల్స్ ఇచ్చేందుకు అంగీకరించడంలోనూ, వారిని నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించడంలోనూ జాప్యం జరిగింది. పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ పన్ను ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ పరిధుల నుండి తొలగించడంలో కూడా విపరీతమైన జాప్యం జరిగింది. అగ్ని గుండాల రాగి గనులలో జరిగిన వెరిఫికేషన్‌లో ఎ.ఐ.టి.యు.సి. యూనియన్‌కు మెజారిటీ లభించింది. కానీ, అందుకు ఐ.ఎన్.టి.యు.సి. కుంటిసాకులతో అభ్యంతరం పెట్టినందు వల్ల ఆ గుర్తింపును ఆమోదించలేదు. పొగాకు పరిశ్రమలో హెచ్చు జీతాలివ్వాల్సిన కంపెనీల్లో పని రోజులు తగ్గించి, చిన్న-బినామీ కంపెనీల్లో తక్కువ వేతనాలిచ్చి పనిచేయించుకున్నారు. బహుళ జాతి గుత్త సంస్థ అయిన ఐ.ఎల్.టి.డి., పెద్ద కంపెనీలయిన గోల్డెన్, ఎ.ఐ.టి., నవభారత్ వంటి కంపెనీల్లో జీవన వ్యయసూచిక మేరకు పెరిగిన కరువు భత్యాన్ని చెల్లించడానికి నిరాకరించి, వేతనాల కోతకు తెగబడ్డారు. రాష్ట్రంలోని వివిధ కేంద్రాల నుండి వచ్చిన 2,000 మంది మునిసిపల్ కార్మికులు, హమాలీలు శాసనసభ వద్ద చేరి బ్రహ్మాండమైన ప్రదర్శన జరిపారు. ఈస్టిండియా పొగాకు కంపెనీ గోదాములను ఎఫ్.సి.ఐ. గోడౌన్స్ అద్దెకు ఇచ్చినప్పుడు, ఆ కంపెనీ కార్మికులు ఘెరావ్ చేసి కంపెనీని తెరిపించుకున్నారు. 18 నెలలుగా మూతబడిన రాయల్ ల్యాబొరేటరీస్ మన ఆందోళన పర్యవసానంగా తిరిగి తెరవబడింది. ఆదోని జౌళి మిల్లులో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను - పర్మనెన్సీ, వేతన పెంపుదల, పనిభారం ప్రమాణాలు నిర్ణయించడం లాంటివి - పరిష్కరించడం జరిగింది. ఈ అన్ని సందర్భాల్లోనూ పాక్షిక విజయాలు చేకూరినా, వాటిని పోరాడి సాధించుకున్నామన్న భావన కార్మికుల్లో కలగలేదు! సఫ్దరింగ్ హాస్పిటల్ కేసులో సుప్రీంకోర్టు యిచ్చిన తీర్పును పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపు రద్దు చేశారు. దానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో ఐ.ఎన్.టి.యు.సి. కలిసి వచ్చింది. 15-3-76 సంయుక్తంగా ఒక సదస్సు జరిపాం.

## ధరల పెరుగుదలకు వ్యతిరేకాందోళన

పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడపాలని గత మహాసభ నిర్ణయించింది. దీనికి మొదటి దశగా, 1973 మే 28న రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించమని మహాసభ పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కూడా అటువంటి పిలుపునే ఇవ్వడంతో, రాష్ట్రం మొత్తం మీద 28 కేంద్రాల్లో ఈ ప్రదర్శనలు జరిగాయి. ఈ ఆందోళనలో రెండో దశగా జూన్ 18, 19, 20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు నిర్వహించమని పిలుపునిచ్చాం. 15 కేంద్రాల్లో మూడు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు జరగగా, 24 కేంద్రాల్లో ఒకటి లేదా రెండు రోజులపాటు నిరాహార దీక్షలు జరిగాయి. ఈ కేంద్రాలతో పాటుగా మరికొన్ని కేంద్రాల్లో ప్రదర్శనలూ బహిరంగ సభలూ కూడా జరిగాయి. సుమారు 2000 మంది నిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగానే హైదరాబాద్ సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సి.ఐ.టి.యు., హెచ్చెమ్మెస్ పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ యూనియన్, ఎ.పి. బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఎ.పి.ఎన్. జీ.వో అసోసియేషన్ ప్రతినిధులతో ఈ సమస్యపై సంప్రదింపులు జరపడం గమనార్హమైన విషయం.

ఈ సంప్రదింపుల ఫలితంగా 1973 జులై 6న హైదరాబాద్‌లో ఓ సదస్సు జరిగింది. 93 యూనియన్లు ఈ సదస్సులో పాల్గొన్నాయి. ఒక ఐక్య కార్యాచరణను రూపొందించడం జరిగింది. హైదరాబాద్‌లో సదస్సు జరిగిన మరునాడే, 1973 జులై 7న, గుంటూరులో వివిధ ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మరో సదస్సు జరిగింది. ఈ సదస్సు వలన కూడా పట్టణ ప్రజానీకాన్ని సమీకరించడానికి ఎంతో తోడ్పడింది. ఇదే సమయంలో విజయవాడలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, ఎ.పి.టి.యు.సి. అనుబంధ సంఘాల కార్యకర్తలు, విద్యార్థి యువజన సమాఖ్యల కార్యకర్తలు "రూపాయికి కిలో బియ్యం" ఉద్యమాన్ని జయప్రదంగా నిర్వహించారు.

ఎ.పి.టి.యు.సి., సి.ఐ.టి.యు., హెచ్చెమ్మెస్, ఎ.పి. బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్తంగా 1973 అగస్ట్ 24న సాధారణ సమ్మె చేయాలని పిలుపిచ్చాయి. ఈ సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా జయంగా నిర్వహించబడింది. ఇందులో ప్రధాన పాత్ర ఎ.పి.టి.యు.సి. యూనియన్లది. అందునా ముఖ్యంగా ఆర్.టి.సి., బొగ్గు గనులు, పోర్ట్ అండ్ హార్బర్ వర్కర్స్ (విశాఖ పట్నం), మునిసిపల్ కార్మికులు ఈ సమ్మెలో ప్రముఖ పాత్ర పోషించారు. సహజంగానే ఎ.పి.టి.యు.సి. అనుబంధ సంఘాలన్నీ ఈ సమ్మె పిలుపునకు పరిపూర్ణమైన దోహదాన్నిచ్చాయి.

ధరల పెరుగుల వ్యతిరేక ఉద్యమం గురించిన ఈ వివరాలను గమనిస్తే, ఎ.పి.టి.యు.సి. సరైన నినాదాన్ని సరైన సందర్భంలో ఇచ్చి, దానిని ఐక్య ఉద్యమంగా నడపడంలో చొరవను ప్రదర్శించిందని అర్థమవుతుంది. వివిధ ట్రేడ్ యూనియన్ కేంద్రాలనూ, ఏ అనుబంధమూ లేని ఫెడరేషన్లనూ, ఒక వేదిక మీద సమీకృతమయ్యేలా చేసి, సంఘటిత పోరాటాన్ని నడిపించడంలో ఎ.పి.టి.యు.సి. విజయవంతంగా కృషి చేసిందని కూడా అర్థమవుతుంది. ఎ.పి. బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఈ ఉద్యమం సందర్భంగా ప్రశంసనీయమైన కృషి చేసింది.

అటుతర్వాత కూడా ధరలు అడ్డూ ఆపూ లేకుండా పెరిగిపోతూ ఉండడంతో ఎ.పి.టి.యు.సి. చొరవ తీసుకుని 1974 ఏప్రిల్ 14న వివిధ కార్మిక సంఘాల సదస్సును పెద్ద ఎత్తున నిర్వహించింది. ఈ సదస్సులో ఐ.ఎన్.టి.యు.సి.లోని ఒక భాగం కూడా పాలు పంచుకుంది కానీ, గత సాధారణ సమ్మెలో పాల్గొన్న సి.ఐ.టి.యు., హెచ్చెమ్మెస్ వారు మాత్రం ఈ సదస్సులో పాల్గొనలేదు. అయినప్పటి కార్మికవర్గాన్ని కార్యరంగంలో దించడానికి ఈ సదస్సు పెద్ద ఊతాన్నిచ్చింది. ఎ.పి.టి.యు.సి. తీసుకున్న ఈ చొరవ అనేక చర్యలకు దారి తీసింది. కార్మికవర్గం అనేక ప్రాంతాల్లో కరువు భత్యం పెంపుదలకు, ఎక్కువ ప్రాంతాల్లో చౌక డిపోలు నెలకొల్పడానికి, 300 మంది కార్మికులు పనిచేసే ప్రతి చోటా చౌక డిపోల ద్వారా ఆహార పదార్థాలు సరఫరా చేసే ఏర్పాట్లు జరగడానికి ఈ చొరవే కారణమైంది. ఈ సౌకర్యాలు చేకూరడానికి కారణమైన ఐక్య ఉద్యమాన్ని రూపొందించడంలో ఎ.పి.టి.యు.సి. పోషించిన పాత్ర గణనీయమైనది.

## కనీస వేతనాల రంగం

మన రాష్ట్రంలో కనీస వేతనాల రంగంలో సుమారు 80 లక్షలకు మించి కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 60 లక్షల మంది వరకూ వ్యవసాయ కార్మికులు వున్నారు. వీరు నికృష్టమైన వేతనాలతో కుమిలిపోతున్నారు. వీరి వేతనాలను పునర్వ్యవస్థీకరించాలనీ, కనీస వేతన వ్యవస్థను అమలు జరపడానికి సరైన యంత్రాంగాన్ని ప్రభుత్వం రూపొందించాలని మనం చిరకాలంగా ఆందోళన చేస్తున్నాం. ఏళ్ళ తరబడి వాళ్ళ వేతనాల పునర్వ్యవస్థీకరణ జరగని ఉదాహరణలెన్నో వున్నాయి. ఎ.పి.టి.యు.సి, ఆల్ షాప్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్లు సంయుక్తంగా తీసుకున్న చొరవతో 1974 మార్చి పదో తేదీన విజయవాడలో ఓ సదస్సు జరిగింది. ఈ సదస్సు ఇచ్చిన పిలుపు మేరకు మార్చి 25 నుండి 27 వరకూ అనేక కేంద్రాల్లో మూడు రోజుల నిరాహార దీక్షలు జరిగాయి. ఈ రంగంలోని కార్మికుల ఇబ్బందులను తొలగించడానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆనాటి కార్మిక శాఖ మంత్రి ఎ.పి.టి.యు.సి. ఆల్ షాప్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ల ప్రతినిధి వర్గానికి వాగ్దానం చేశారు. తదనంతరం ఈ రంగంలోని కార్మికుల కనీస వేతనాల పునర్ వ్యవస్థీకరణ విషయంలో కొంత కదలిక వచ్చింది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు చెందిన సుమారు లక్ష మంది బీడీ కార్మికులు అపూర్వమైన సమ్మె చేశారు. ఎ.పి.టి.యు.సి. ప్రతినిధులు కనీస వేతనాల బోర్డులో సభ్యులుగా వుండి కనీస వేతనాల పునర్వ్యవస్థీకరణ విషయంలో ప్రముఖ పాత్ర వహించారు. 1975లో ఈ రంగంలోని సుమారు 16 పరిశ్రమలలో వేతనాల పెంపుదల సాధ్యమైంది.

### గత సభ నుండి ప్రస్తుత సభ వరకూ కార్మిక ఉద్యమాల సమీక్షలోని ప్రధానాంశాలు

- స్థాయి నుంచి పరిశ్రమ స్థాయికి పోరాటాల విస్తరణ
- ఆర్.టి.సి.లో 1977నాటి వేతన సవరణ ఒప్పందం
- మునిసిపల్ కార్మికుల విజయాలు
- బోనస్ సాధన నిమిత్తం సదస్సు

## నేటి కర్తవ్యాలు

- కార్మికుల మధ్య ఐక్య పోరాట భావం పెంపుదల
- గ్రామీణ-పట్టణ ప్రాంతాల కార్మికుల మధ్య ఐక్యతా సాధన
- రైతాంగానికీ కార్మికులకూ మధ్య ఐక్యతా సాధన
- జనతా పార్టీ కార్మికవర్గ వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు ❑



## విదేశీ పర్యటనల్లో కపర్ది









# AN IDEAL COMMUNIST COUPLE

సహచర కార్మిక నేతల నివాళి

- K.L. MAHENDRA



Comrade M.V.N. Kaparde and Com. Seshamma was an ideal Communist couple. Both of them devoted their life to the welfare of the people and the Communist Party. They brought up a large family in which all the children are either active in the Party or strong sympathizers. Theirs is a truly "Red Family". In the West Godavari district, Kaparde centrated on Trade Unions and especially unions of road transport workers. The road transport industry was held in the private sector in the beginning.

His wife concentrated on people's problems in general and women's problems in particular. As a result, she was elected as a municipal councilor several times. Kaparde was the secretary of the West Godavari district committee of C.P.I. apart from being a prominent Trade Union leader. He became equally popular as secretary of the Party in a short time. After the formation of Andhra Pradesh, there was a movement to extend the R.T.C. to the Andhra districts.

Com. Kaparde was one of its important leaders. He stood for the nationalization of road transport and also for the absorption of the staff of private transport in the R.T.C. irrespective of their qualifications. This was considered, but the pay scales in that region were fixed lower on par with staff of the



State government. By the time of the next pay revision the A.P.S.R.T.C. Employees, Union took up their cause and demanded that they should be given the same pay and allowances on par with the Corporation employees. Due to the success of this demand, the Andhra region employees of R.T.C. got a big jump. But, due to the financial burden, the Telangana region staff got an incremental rate of Rs.5 at the minimum.

This created some discontent among the staff of Telangana region and P. Ramamohanrao utilised this discontent to break away from the Employees Union and form NMU. By this time Com. Kaparde had grown as an important leader of the A.P.S.R.T.C. Employees Union and in this background he was elected as the general secretary of the State A.I.T.U.C. I was the secretary. Both of us worked together as a perfect team. Although

he was the general secretary, unlike some others, he appreciated and encouraged initiative by his colleagues even at the Union leadership level.

When my first term as a member of the Legislative Council came to an end, I suggested in the Party Executive Committee that Com. Kaparde be elected to the Legislative Council. However, the Executive was in favor of my continuing for the second term, and the decision was taken accordingly.

During the Emergency, Indira Gandhi government amended the Bonus Act. Com. Kaparde, myself, my wife and some others offered Satyagraha and we were kept in Jail for three days. During that period the negotiations for payment of Bonus to the RTC employees were in progress. The management and the then Labour Minister Shree G. Venkataswamy insisted that workers can be paid the bonus of 4% but, if the act is amended the remaining 4.33% can be paid. For fear of scuttling the issue, the negotiators were in favor of accepting the proposal. Kaparde, with all his shrewdness privately asked me to speak to the minister in my capacity as MLC, and change the proposal to pay 8.33% of which 4.33% can be treated as recoverable advance and can be recovered if the Act is not amended. The minister accepted the proposal. Both the leaders and the employees were extremely happy with this decision. This shows the close coordination between both of us. Another example is in Chagallu sugar factory where the employees were on strike and Kaparde included me in the negotiating team. We reached a settlement and the M.D. (who was a lady) invited us separately and told if any problem arose in the future she would hold me responsible probably because I was also an MLC apart from being a Trade union leader. I resisted saying that Kaparde was our General Secretary and he would be responsible. The MD said "No", and Kaparde said that there would be no problem in making any one of us responsible. That was the authority shown by Com. Kaparde in all matters.

Once, Com. Chandra Rajeswara Rao directed us to prepare a draft on some policy matters. Kaparde readily said, "Mahendra is like a computer and the draft would be prepared immediately". That is the level of confidence Com. Kaparde reposed in his colleagues. Whenever a question of policy was involved Kaparde used to be very firm though he was pragmatically liberal in organisational adjustments. As general Secretary of State AITUC he lived in the back rooms of the TUC office, a small two-and-a-half-room portion, with his entire family of about ten members. At that time some of his children were still studying. That was the austere way in which he lived.

In the last days of his illness, he was suffering from some stomach ailments while the entire treatment was given for heart disease. A wrong diagnosis led to his demise which was a great loss to the Trade Union movement and the Party as well in the state. He was a member of the Executive and Secretariat of the State Party and National Council at the time of his death. ❑

(Former President, World Federation of Trade Unions)

# సహనశీలి.. స్థితప్రజ్ఞుడు

**సహచర కార్మిక నేతల నివాళి**

- కీ.శే. వై.విజయకుమార్



కపర్దీ నాకు ప్రియతమ మిత్రుడు. అనేక సంవత్సరాల పాటు సహచరుడు, సహవాసి కూడా. అందువలన, కపర్దీ గురించి ఏం రాయాలి, ఎంత రాయాలి, ఎలా రాయాలి అన్నవి క్లిష్ట సమస్యలుగా పరిణమించాయి. అసలు కపర్దిని తలచు కుంటూనే నాకు ఎందుకో అంతులేని ఎమోషన్! గొంతు రుగ్ధమైపోతుంది. కళ్లు చెమరుస్తాయి. ఎన్నో స్మృతులూ, మరెన్నో జ్ఞాపకాలూ మదిలో మెదులుతాయి.

కపర్దీ రాజకీయ జీవితం గురించి చాలా మంది రాస్తారు. ఆయన కమ్యూనిస్టు జీవితం గురించి కూడా ఎందరో ముచ్చటిస్తారు. ఆయన అవిరళ ప్రజాసేవ గురించి మరెందరో ప్రశంసిస్తారు. ఆయన త్యాగ నిరతిని చాలా మందే పొగుడు తారు. అవన్నీ వారికే వదిలేస్తున్నా.

నేను రాయదల్చుకున్న విషయం వేరు. నాకు కపర్దీతో ఉన్న సన్నిహిత, స్నేహ సంబంధాలను దృష్టిలో పెట్టుకుని కపర్దీలోని కొన్ని ప్రత్యేక లక్షణాలను బహుశా చాలా మందికి తెలియని కొన్ని విశిష్ట లక్షణాలను - గురించి ఇక్కడ రాయదల్చుకున్నాను.

కపర్దీకి జబ్బు చేసిందని తెలిసింది. వెంటనే, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఆయన ఉంటున్న ఇంటికి వెళ్లా.

'ఏమైంది కామ్రేడ్?' అని పలకరించా.

"అబ్బే, ఏమీ లేదు - కొంచెం కళ్లు తిరిగాయి. ఇప్పుడు బాగానే ఉందన్నాడు.

తనకు వచ్చిన జబ్బును లెక్క చెయ్యకుండా, దాన్ని జయించగలననుకునే ఆశాజీవి. మరుసటి రోజు ఆస్పత్రికి తరలించారు. అక్కడికి కూడా వెళ్లి చూసొచ్చా. అక్కడా అదే మాట! మృత్యువు సమీపించినా, దాన్ని లెక్క చెయ్యని మహా ధైర్యశాలి కపర్ది. అయినా మృత్యువు కఠోరమైనది. ఆయన ధైర్యాన్ని అధిగమించి, కపర్దిని దిగమింగి, మనల్నందరినీ దుఃఖసాగరంలో ముంచేసింది.

కపర్ది భౌతికంగా నేడు మన కళ్ల ముందు లేడు. కానీ, ఆయన స్మృతులు నాలాంటివాళ్ల మెదళ్లలో నిరంతరం మెదులుతూనే ఉంటాయి. అవి ఎప్పటికీ చెరిగిపోవు.

కపర్దీ, నేనూ చాలా కాలం రాష్ట్ర కమ్యూనిస్టు సమితి బాధ్యులు గా, రాష్ట్ర సమితి గెస్ట్‌రూమ్‌లో ఉన్నాం. పగలంతా ఏవేవో పనులు చూసుకుని, అలసిపోయి గదికి చేరుకునేవాళ్లం. అల సటతో, నిజంగానే చాలా చిరాకుగా ఉండేది. భోంచేసి, పక్కల మీద నడుం వాల్చి కబుర్లకు దిగేవాళ్లం. గత అనుభవాలు, అనుభూతులూ, ఆవేదనల గురించి కపర్దీ చిలవలు పలవలుగా, సోదాహరణంగా అప్పుడప్పుడు కడుపుబ్బ నవ్వించే పద్ధతిలో– వివరించేవాడు. అన్నీ మర్చిపోయి నిద్రపోయేవాళ్లం. ఎప్పుడైనా కపర్దీ లేకపోతే, ఏదో కోల్పోయినట్లు అనిపించేది.

ఒక్కోసారి సాహిత్యచర్చలు చేసేవాళ్లం. ఒకసారి నేనూ, రాంభట్ల, మల్లారెడ్డి కూర్చుని ఉన్నాం. రాంభట్ల, మల్లారెడ్డి పేరు మోసిన కవులూ సాహిత్యవేత్తలూ కదా! తెలుగు, సంస్కృత సాహిత్యాలపై చర్చ సాగుతోంది. రసాస్వాదన ప్రారంభించాం. ఆ రెండు భాషల్లో కపర్దీకి ఉన్న పరిచయాన్నీ, పరిజ్ఞానాన్నీ, లోతైన సాహిత్య అవగాహననూ చూసి మేం ఆశ్చర్యపోయాం. సంస్కృతాంధ్ర మహాకావ్యాల నుంచి ఆయన కొటేషన్లతో మమ్మల్ని ముగ్ధులను గావించారు.

కపర్దీది పెద్ద కుటుంబం. భార్యా, భర్తా, ఎనిమిది మంది పిల్లలు! వారి ఇంటికి పోతే, కమ్యూనిస్టు ప్రపంచంలోకి అడుగు పెట్టినట్టుండేది. కమ్యూనిస్టు సిద్ధాంతాలను గురించీ, రాజకీయాలను గురించీ పిల్లలందరూ ప్రశ్నించేవారు. నాకు ఆశ్చర్యం - అందరూ కమ్యూనిస్టులుగా ఎలా తయారయ్యారా అని ! కపర్దీ ఓపికగా, చిన్నతనం నుండీ వారికి కమ్యూనిస్టు సిద్ధాంతాలు నూరిపోయడంతోపాటు వారు అడిగే ప్రశ్నలకూ, వారి కుశంకలకూ ఓపికగా సమాధానమిచ్చేవాడు. పుస్తకాలిచ్చి చదివించేవాడు. కొన్ని అనుమానాలను నన్ను అడిగి తెలుసు కోమనేవాడు. ఆ విధంగా తన కుటుంబాన్ని మొత్తం కమ్యూనిస్టు కుటుంబంగా చేశాడు. కమ్యూనిస్టులు సిద్ధాంతరీత్యా, ఆచరణలో కూడా కుల, మత, ప్రాంతీయతత్వాలకు దూరంగా ఉండాలి. ఆలోచనతోపాటు ఆచరణ కూడా అవసరం. ఎట్టి అరమరికలూ సంకోచాలూ లేకుండా తన బిడ్డలు కులాంతర వివాహాలు చేసు కుంటూంటే ప్రోత్సహించాడు.

నమ్మిన ఆదర్శాన్ని మనోవాక్కాయ కర్మలా ఆచరించిన కర్మ యోగి మా కపర్ది అని చెప్పేందుకు గర్విస్తున్నా. కపర్దీ పట్టుదల అమోఘం. లక్ష్యం అచంచలం. మేమిద్దరం జూట్ వేజ్ బోర్డులో సభ్యులుగా ఉండేవాళ్లం. మేమిద్దరం

**(మిగతా 34వ పేజీలో)**

# విశిష్టమైన వ్యక్తిత్వం

## సహచర కార్మిక నేతల నివాళి

- మారెళ్ల నరసింహారావు

దరిదాపు నాలుగు దశాబ్దాలపాటు కపర్దీతో కలిసి పంచుకున్న అనుభవాలను కాగితం మీదికెక్కించడం చాలా కష్టం! పైగా ఈ పుస్తకంలో అనేక మంది ఆయన జీవిత విశేషాలు వగైరా వివరాలు ఎలాగూ రాస్తారు. అంచేత, నాకు కపర్ది సాహచర్యంలో తారసపడిన విశిష్టమైన అనుభవాల గురించి మాత్రమే ఈ వ్యాసంలో క్లుప్తంగా ప్రస్తావిస్తాను.

కపర్ది తండ్రి మందలపర్తి రామచంద్రరావుగారు మా మేనమామకు స్నేహితులు. నా బాల్యంలో ఆయన మా మామయ్య గారింటికి అప్పుడప్పుడు వచ్చిపోతుండేవారు. ఆయన గురించి ఇతరులు చెప్పుకునే చాలా విషయాలు కూడా అనేక సందర్భాల్లో నా చెవినపడ్డాయి. వాటి ఆధారంగా రామచంద్రరావు గారి వ్యక్తిత్వం గురించి నాకో అవగాహన ఏర్పడింది. రామచంద్రరావు గారు చతుర సంభాషణ శీలి. అంతేకాక, ధార్మిక గ్రంథాల గురించి లోతైన పరిజ్ఞానం కలిగిన వ్యక్తి కూడా. ప్రాచీన సాహిత్యంతో, ప్రత్యేకించి కాళిదాసాది కవుల సంస్కృత రచనలతో, ఆయనకు ఘనిష్టమైన పరిచయం ఉంది. సహజంగానే, అలాంటి తండ్రి పెంపకంలో పెరిగిన కపర్దీకి కూడా అలవోకగా హాస్యోక్తులు విసరడం, సంస్కృత కావ్యాల నుంచీ, నాటకాల నుంచీ సందర్భోచితమైన కొటేషన్లు ఇవ్వడం అలవడింది. అతని వ్యక్తిత్వంలో అది ఓ ముఖ్యాంగంగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు.

రామచంద్రరావుగారు లోకమాన్య బాలగంగాధరతిలక్ అభిమాని. జాతీయోద్యమం పట్ల గాఢమైన సానుభూతి కలిగిన వారు. కొల్లేరు ప్రాంతంలో భూస్వాములకు వ్యతిరేకంగా రైతులు తిరగబడిన అనేక సందర్భాల్లో వాళ్ల పట్ల పక్షపాతం ప్రదర్శించిన వ్యక్తి ఆయన. రామచంద్రరావుగారిలోని ఈ లక్షణాలు కపర్ది పీడిత జన పక్షపాతిగా పరిణమించడంలో ఎంతో ప్రభావం చూపించాయి. విద్యార్జన కోసం, 1930 దశకం చివరిలో, గుంటూరు వెళ్లే నాటికి కపర్దీకి హిందూమతం పట్ల గాఢమైన అనురక్తి – ధార్మికాచారాలూ, క్రతువుల పట్ల గట్టి విశ్వాసమూ ఉండేవి. అయితే, అక్కడ వుండే రోజుల్లోనే అతను వీటిని గురించి విమర్శనాత్మకంగా ఆలోచించడం ప్రారంభించాడు. శాస్త్రీయ దృక్పథం కలిగి ఉన్న వారి సహజ గమ్యమైన మార్క్సిజం వైపు ఆ రోజుల్లోనే కపర్ది ఆకర్షితుడయ్యాడు. సిద్ధాంత రంగంలో కృషి చేసి, విశాలమైన అవగాహన ఏర్పరుచుకున్నాడు. సాంప్రదాయిక విశ్వాసాల గురించీ, వాటి భాష్యాల గురించీ బాగా తెలిసి వున్న వ్యక్తి శాస్త్రీయ అవగాహనతో మాట్లాడితే అది ఎంత విశిష్టంగా ఉంటుందో తెలుసుకోదానికి కపర్ది ప్రసంగాలు చక్కని ఉదాహరణలు. 1943లో, తాడేపల్లి గూడెం మోటార్ కార్మికుల సంఘం నిర్మాణంతో కపర్ది ట్రేడ్ యూనియనిస్టుగా కొత్త జీవితం ప్రారంభించాడు.

**అప్పట్లో ప్రైవేటు బస్సు యజమానులు నాటు భూస్వాముల మాదిరే ప్రవర్తించేవారు. వాళ్లకు ఏదీ వినబడదు– కనడబదు–అర్థం కాదు! అలాంటి వాళ్లతో వ్యవహరించడం కత్తి మీద సాము మాత్రమే! దానికి ఎంతో గుండె ధైర్యంతోపాటు, నిశితమైన ఆలోచన కూడా కావాలి. అవి రెండూ కపర్దీలో పుష్కలంగా ఉండేవి. అందువల్లనే, అతను మోటార్ కార్మికులకు తిరుగులేని నాయకుడు కాగలిగాడు.**

కపర్దీలో మరో ప్రత్యేకత ఉండేది. కార్మిక నేతగానే కాక, రైతు ఉద్యమ నాయకుడిగా కూడా ఏక కాలంలోనే రాణించిన విశిష్టత అతనిది. రైతులనూ, కార్మికులనూ కలిపి నడిపించాడాయన. కపర్దీతో జైలులో గడిపిన మూడున్నర సంవత్సరాల కాలాన్ని ఎన్నటికీ మర్చిపోలేను. కపర్ది, నేనూ, వంకా కలిసి తిరుగుతుంటే, చూసేవాళ్లు మమ్మల్ని "ఇన్సెపరబుల్స్" అనేవారు.

**అప్పట్లో కామ్రేడ్ మద్దుకూరి చంద్రంగారు జైల్లో ఉన్న కామ్రేడ్స్‌కు మార్క్సిస్టు సిద్ధాంతంపై అధ్యయన తరగతులు నిర్వహించేవారు. అలాగే, తెలుగు తప్ప మరే భాషా రాని కామ్రేడ్స్ కోసం అనేక పుస్తకాలు అనువాదం చేసేవారు. కపర్ది ఈ కృషిలో చంద్రం గారికి కుడిభుజంగా వ్యవహరించేవాడు. కపర్ది మృతితో నాకు వ్యక్తిగతంగా వాటిల్లిన నష్టం ఎంతటిదో మాటల్లో చెప్పలేను. అలాగే, ఆయన కన్నుమూతతో, కార్మిక వర్గ ఉద్యమం ఎంతగా నష్టపోయిందో చెప్పడం కూడా అసాధ్యం.** ❑

## సహచర కార్మిక నేతల నివాళి

# సూదంటురాయి !

- డి.వి.వి.యస్.వర్మ



కపర్దీ గారు మరణించి 25 సంవత్సరాలైందని కిషోర్ చెప్పేదాకా కాలం ఇంత దూరం సాగిపోయిందన్న స్ఫురణ నాకు కలగలేదు. కాలం మాత్రమే ఇంత కఠోరంగా సమయపాలన పాటిస్తుంది. కాలానికి తెలిసింది ఒకే నడక, ముందు నడక. కాలం కంటే జ్ఞాపకాలు గొప్పవి. ఎందుకంటే కాలాన్ని వెనక్కి నడిపించే శక్తి జ్ఞాపకాలకి వుంది. మన హితుల్ని, సన్నిహితుల్ని కాలం తనలో కలిపేసుకున్నా జ్ఞాపకాలు మాత్రం ఆ తీపి గుర్తుల్ని నెమరువేస్తూనే వుంటాయి. జ్ఞాపకాన్ని అనుభవించినంతగా అనువదించలేం. కపర్దీ గారు ఒక్కసారి మనసులో మెదిలితే చాలు సూదంటు రాయిలా ఆకర్షించే ఆయన రూపు సాక్షాత్కరిస్తుంది. ఆయన కంచుకంఠం చెవులలో గింగురుమంటుంది. మిత్రులపై ఆయన సాధికారికంగా చేసే ఆజ్ఞాపనలు, గద్దింపులు తలపుకొస్తాయి. ఒళ్లంతా నోరు చేసుకుని కల్లా కపటం లేని నవ్వు ఆయనే నవ్వగలరు. తప్పు చేస్తే స్వపర భేదం లేకుండా ఆయనే చివాట్లు పెట్టగలరు. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం మూడు భాషలూ తెలిసిన మనిషి. మంచి సాహిత్యాభిలాషీ. ఆయన ప్రసంగం చేస్తే ఆగి, వినాల్సిందే. విని, ఆలోచించాల్సిందే. జీవితానుభవం రంగరించి ఔపోసనపట్టిన వాడు. శ్రామికుల జీవితాలను అంత దగ్గరగా, అంత లోతుగా తెలిసిన నాయకుణ్ణి, అంతగా వారి జీవితాలతో పెనవేసుకోగల నాయకుణ్ణి నేను మరెక్కడా, మరెప్పుడూ చూడలేదు. శ్రమజీవుల జీవితాల నుండి పుట్టుకొచ్చిన నాయకుడు. వారి మీద ఆయన పొందిన అధికారం, వారినుండి ఆయన పొందిన విధేయత, గౌరవాలు యూనియన్ పదవుల వల్ల వచ్చినవి కావు. వారి హృదయాలను గెల్చుకున్న నాయకుడు. కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన ఒక అపురూపమైన వ్యక్తి. అనితరసాధ్యమైనది ఆ వ్యక్తిత్వం.

కపర్దీ గారి కుటుంబం అంటే ఆయన భార్యాబిడ్డలు మాత్రమే కాదు. అదొక వలయాల కుటుంబం. బంధువులు, మిత్రులు, కార్యకర్తలు, పాలేర్లు, జీతగాళ్లు అంతా కలగలిసిన కుటుంబం. ఈ వలయాలకి కేంద్ర బిందువులు కపర్దీగారు, శేషమ్మగారు. ఒకరిని మించిన ప్రేమాస్పదులు మరొకరు. నేను ఇల్లు వదిలి కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలలోకి వచ్చాను. మొదట కొద్ది కాలం విమలా దేవి గారింట్లో, కొంత కాలం కపర్దీ గారింట్లో, ఎక్కువ కాలం కృష్ణంరాజు గారింట్లో వున్నాను. కపర్దీగారి కుటుంబంతో అనుబంధం జీవితాంతం శాశ్వతబంధం చేసింది. ఇక పిల్లలు చిన్నప్పటి నుండీ స్వతంత్రులే. వాళ్ల మధ్య చిన్నా, పెద్దా తేడా లేదు. అంతరం లేదు. జీవితంలోనూ అలాగే స్థిరపడ్డారు. కాని ఏకత్వాన్ని ఎప్పుడూ వదిలి పెట్టలేదు. ఈ వలయ కుటుంబతత్వాన్ని విడిచి పెట్టలేదు. అదొక సహజ కుటుంబ వారసత్వ లక్షణం అయ్యింది. కుర్రాళ్లుగా వున్నప్పుడు ఎలా మాట్లాడేవారో ఇప్పటికీ అలాగే మాట్లాడతారు. మధ్యలో వచ్చిన హోదాలు, బోల్తాల పట్టింపులు, అరమరికలు మచ్చుకైనా వుండవు. కపర్దీ గారు ఉత్తమ కమ్యూనిస్టు, మంచి ప్రజాస్వామ్యవాది, అన్నిటికీమించి మానవీయమూర్తి. ఈ మూడు కలగలిసి వుండడం అరుదు. అందుకే రాజకీయాలలో ఆయన అజాత శత్రువుగా వెలుగొందగలిగారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఏ అభివృద్ధి సమస్య మీదనైనా అందరినీ కూడగట్టే సూత్రధారి పాత్ర ఆయనే పోషించారు. జిల్లా రాజకీయాలలో ఎన్ని విభేదాలున్నా అందరి మన్ననలను ఆయన పొందగలిగారు. నేను విద్యార్థి ఉద్యమంలో వుండగా ఆయన జిల్లా పార్టీ కార్యదర్శి. నేను జిల్లా కార్యవర్గంలో ఉన్నప్పుడు ఆయన రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు. రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి. ఆయనకు హోదాలు, ప్రొటోకాల్స్ వంటి కృత్రిమ సంబంధాలు అంటలేదు. ఆయనతో మాట్లాడడానికి, పోట్లాడడానికి ఎలాంటి జంకూ వుండేది కాదు. అందుకే స్థాయీ భేదం లేని స్నేహం ఆయనతో మేమంతా చేసేవాళ్ళం. నాకు రాజకీయాలలో గురువుల మీద నమ్మకం లేదు. కాని ఆయనను గురువుగా భావించాను. ఎందుకంటే ఆయన మాకు ప్రతిపనీ నేర్పారు. చిన్న బాధ్యత ఇచ్చి నేర్పేవారు. ఆయన పనిగట్టుకుని మా చేత తీర్మానాలు రాయించేవారు. వాటిని మా చేత ప్రవేశ పెట్టించేవారు. రిపోర్టులు, నివేదికలు రాయించేవారు. సమావేశాలలో వాటిని ప్రవేశపెట్టడం, సమాధానాలు చెప్పించడం చేయించేవారు. బహిరంగ వేదికల మీద పని గట్టుకుని మాట్లాడించే వారు. కార్మికుల సమ్మెలలో తనతోపాటు చర్చలకు తీసుకువెళ్లేవారు. ఇలా ఆయన నేర్పనిదంటూ లేదు. తప్పులు చేస్తే మందలించేవారు. మళ్లీ ప్రేమగా దగ్గరకు చేర్చుకునేవారు.

రాజకీయాలలో గురు వుల మాట నాకు నచ్చనిదైనా, ఆయన మాత్రం నాకు గురువు (నాలోని లోటుపాట్లకి గురువు కారణం కాదన్న సవరణతో). కపర్దీ గారిని తల్చుకుంటే జ్ఞాపకాల పురాణాలు తెరుచుకుంటాయి. కపర్దీ గారితో పరిచయమే నా జీవితానికి మెరుపు. ❑

# స్నేహశీలి.. మార్గదర్శి

## సహచర కార్మిక నేతల నివాళి

- మానం ఆంజనేయులు



కామ్రేడ్ కపర్ది గారిని గుర్తు చేసుకోవడం అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థి ఉద్యమం మొదలుకొని కార్మిక ఉద్యమం వరకూ అనేక సంఘటనల్ని గుర్తు చేసుకోవడమే అవుతుంది. ఆయన వ్యక్తిగత జీవితం అనేది కనిపించని మంచి కమ్యునిస్టు. తాను నమ్మిన ఆశయాల దిశగా తన కుటుంబాన్ని మొత్తం సంస్కరణ, అభ్యుదయవాదం వైపు నడిపించిన ఆదర్శవాది అనాలి. నన్ను కార్మిక ఉద్యమాలవైపు నడిపిన మార్గదర్శి. పార్టీ నిర్మాణంలో అత్యంత కీలకమైన కేంద్రీకృత ప్రజాస్వామ్యం అని చెప్పబడే నియమాన్ని నిబద్ధతతో పాటించడంలో, ప్రజాస్వామ్య విలువలను కాపాడిన అరుదైన కమ్యునిస్టుగా గుర్తించదగిన వ్యక్తిత్వం కపర్ధి గారిది.

హేతువాదం, నిత్యం సంభాషణలతో నన్ను బలవంతంగానే కార్మిక ఉద్యమం వైపు నెట్టిన మార్గదర్శి. ఆయనతో నా అనుబంధం, అనుభవాలు అన్నీ ఆంతరంగిక మిత్రుత్వంతో కూడినవే. నాపై చూపిన ప్రేమ, మెలిగిన సన్నిహిత్యం, నాపై చూపిన ప్రభావం గణనీయమైనవి. నాలాగా, నాకన్నా మించి చాలా మంది ఆయనను తమ ఆంతరంగిక మిత్రులుగా భావించేవారు. ఖచ్చితంగా వందలు, వేల సంఖ్యలోనే ఉంటారనిపిస్తుంది. కమ్యూనిస్టుల్లోనూ అరుదైన కమ్యునిస్టుగా గుర్తించదగిన కపర్ది గారితో గడిపిన రోజులు జరిపిన చర్చలు, వాద ప్రతివాదాలు అన్ని ఒక దశాబ్ద కాలంలోనివే. నేను విశాలాంధ్ర దినపత్రికలో పని చేసే రోజుల్లో (1964-1968), ప్రత్యేకించి పార్టీ అధికారయుతంగా చీలిన అనంతరం జరిగిన సారస్వత ఎన్నికల సందర్భంగా రాష్ట్ర పార్టీ అగ్రనేతలతో సంభాషిస్తూ సమాచారాన్ని సేకరిస్తూ, పార్టీ పోటీ చేసే స్థానాల్లో సీపీఐ అభ్యర్థులే గెలిచే అవకాశాలు ఉన్నట్టుగా చూపాల్సిన అవసరాల రీత్యా నేను చేసే పనికి కపర్ది గారు పనికి వచ్చేవారు కారు. అందుకని అడపాదడపా కపర్ది గారితో గౌరవంతో కూడిన సంభాషణలు మినహా అప్పు దగ్గరి సంబంధాలు లేవు. అనంతరం నేను విశాలాంధ్ర విలేకరిగా, ఏజెంటుగా విశాఖపట్నం వచ్చి పని ప్రారంభించాను. మూడు పదుల వయస్సు అయినా ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులతో సంబంధాలు పెట్టుకుని అనంతరం అదే వర్సిటీలో విద్యార్థినయ్యాను. స్థానిక, జిల్లా పార్టీ నాయకుల కోరిక మేరకు పార్టీ పూర్తికాలం కార్యకర్త అయ్యాను. అయితే నాటి పరిస్థితుల కారణంగా విశాలాంధ్ర పనితోపాటు విద్యార్థి ఉద్యమానికి సహాయకుడిగానే పరిమితమైయ్యాను. స్థానిక పార్టీ కార్యకర్తను కావడంతో 1971లో నాటి విశాఖ తాలూకా మహాసభలకు హాజరయ్యాను. ఆ మహాసభలకు నాటి రాష్ట్ర పార్టీ కార్యదర్శి నీలం రాజశేఖరరెడ్డి హాజరయ్యారు. ఆ మహాసభల్లో నేను తాలూకా పార్టీ సహాయ కార్యదర్శి అయ్యాను. అంతకుముందు తాలూకా పార్టీ కార్యదర్శిగా ఉన్న భద్రమూర్తి శర్మ గారు కన్ను మూయడంతో కామ్రేడ్ గురుమూర్తి గారు కార్యదర్శి అయ్యారు. నగరంలో అప్పటికే ప్రముఖ నాయకులుగా ఉన్న విజయ్ కుమార్, భద్రం గార్ల వద్దకు రాకపోకలు ఉన్నా వారితో అంత సాన్నిహిత్యం లేదు. విజయవాడలో ఉన్నప్పుడే కామ్రేడ్ దాసరి నాగభూషణరావు గారితో సాన్నిహిత్యం ఉన్నందున ఆయన ద్వారా కపర్ది గారికి దగ్గరయ్యాను. కపర్ది గారు రాష్ట్ర స్థాయి కార్మిక నాయకుడు కావడంతో విశాఖ నగరానికి రాకపోకలు ఎక్కువయ్యాయి. ఆయన విశాఖ వచ్చినప్పుడల్లా సయమం ఇవ్వగలిగిన వాడిని నేనే కావడంతో ఆయనకు కూడా నాతో బాగానే కుదిరిపోయింది. పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ నిర్మాణంలో నాకు అత్యంత సన్నిహితులైన మన్యం (భూపతిరాజు సుబ్బరాజు), డీవీఎస్ వర్మలు కూడా అప్పుడప్పుడు విశాఖ రావడం కూడా మా మధ్య ఆత్మీయత పెరగడానికి తోడ్పడింది. విశాఖ నగరంలో ఉద్యమాల కారణంగా ప్రైవేటు బస్సులను తొలగించి ఆర్టీసీ బస్సులను ప్రవేశ పెట్టినపుడు ప్రైవేటు బస్సుల సిబ్బందిని ఆర్టీసీలో నియమింపచేసే కృషిలో భాగంగా కపర్ది గారు కొన్ని రోజులు విశాఖలోనే గడపాల్సి వచ్చేది. హైదరాబాద్ తోపాటు విశాఖ నగరం అత్యంత ముఖ్యమైనది కావడం, ఆర్టీసీని క్రమంగా విస్తరించడంతో ఉత్తరాంధ్ర మొత్తం పర్యటించాల్సి రావడంతో కపర్ది గారు విశాఖ నగరంలో ఎక్కువ కాలం గడిపేవారు. నేను తాలూకా కార్యదర్శిగా పార్టీ నిర్మాణంతోపాటు కార్మిక రంగంలోకి అడుగు పెట్టిన క్రమంలో ఆయన గైడెన్స్ నిత్యం అవసరమైయ్యేది. అయితే రాజకీయ విధానం విషయంలో మొదటి నుంచి చివరి వరకూ కపర్ది గారితోపాటు నాకు అత్యంత సన్నిహితంగా ఉండే మన్యం, వర్మ, వంకా సత్యనారాయణ వంటి వారితోనూ పూర్తిగా విభేదిస్తుండే వాడిని. ప్రధానంగా ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ విషయం,

అనంతరం ఇందిర ప్రభుత్వం ప్రతిపాదించిన 20 సూత్రాల పథకం అమలు తదితర అంశాలపై మా మధ్య విరుద్ధమైన అభిప్రాయాలు ఉండేవి.

ఎమర్జెన్సీ సమర్థిస్తూ కేంద్ర పార్టీ తీర్మానం వెలువడిన తక్షణం దాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ తాలూకా పార్టీ కార్యదర్శిగా మా కార్యవర్గంలో ఒక తీర్మానం చేయించి జిల్లా, రాష్ట్ర నాయకత్వాలకు పంపించాము. ఈ విషయంలో భద్రం గారు, నాటి రాష్ట్ర కార్యదర్శి తమ్మారెడ్డి, సహాయ కార్యదర్శి గిరిప్రసాద్ తదితరులు నన్ను పిలిచి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీ కేంద్ర పార్టీ చేసిన ఆ తీర్మానాన్నే విశాఖ నగరంలోని టర్నోల్ చౌక్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో కపర్ది గారు వెల్లడించాల్సి ఉంది. అయితే ఆయన చాలా తెలివిగా తప్పుకుని ఆ తీర్మానాన్ని నా చేత మాట్లాడించారు. ఆ తీర్మానం పట్ల నీకు వ్యక్తిగత వ్యతిరేకత ఉన్నా చాలా సానుకూలంగా తీర్మానాన్ని బలపరిచే వారికన్నా బాగానే చెప్పావన్నారు. మరో సందర్భంగా పార్టీ నిర్మాణంపై కపర్ది గారు విజయనగరంలో పార్టీ శిక్షణా తరగతుల్లో బోధించాల్సి ఉంది. కారణాంతరాల వల్ల ఆయనకు కుదరక నన్ను వెళ్లమని పురమాయించారు. నా క్లాసును రికార్డు చేయమని రవి ట్యుటోరియల్ కాలేజీ నరసింహారావుకు చెప్పారు. ఆ రికార్డును తెప్పించుకుని విని చాలా బాగా చెప్పావంటూనే, క్లాసును ఉపన్యాస ధోరణిలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సలహాలు, సూచనలిచ్చారు.

మరో సందర్భంలో అనారోగ్య కారణంగా రామచంద్రపురంలో ఉన్న నేను స్థానిక పార్టీ నేతల కోరిక అక్కడ జరుగుతున్న క్లాసుల్లో పార్టీ నిర్మాణంపై క్లాసు చెప్పడాన్ని తప్పుబడుతూ ఫిర్యాదుచేసిన ఆ జిల్లా పార్టీ కార్యదర్శి ముళ్లపూడి సూర్య నారాయణ గారిని రామచంద్రాపురం పిలిపించుకుని ఆ ఫిర్యాదుపై చాలా హాస్యపూరితంగా విచారణ చేపట్టారు. ఇకపై నువ్వు ఎక్కడికి సూర్యనారాయణ గారికి చెప్పకుండా వెళ్లవద్దంటూ నాతో మాట్లాడుతూ సూర్యనారాయణ గారికి చురకలు వేసి విచారణ ముగించారు. పార్టీ నిర్మాణానికి, మినిట్స్, తీర్మానాలు, రిపోర్టింగ్ అనే విషయాల్లో సలహాలు సూచనలు ఇచ్చేవారు. కార్మిక రంగంలోని బలహీనతల గురించి వివరించేవారు.

విశాఖ జిల్లా పార్టీ మహాసభలు విజయనగరం (అప్పటికి విజయనగరం విశాఖలో అంతర్భాగం) పట్టణంలో నిర్వహించిన సందర్భంలో రాష్ట్ర పార్టీ తరపున కపర్ది గారు హాజరయ్యారు. ఆ మహాసభలో జిల్లా కార్యదర్శి మార్పు అనివార్యం అయింది. కార్యవర్గం అంతా రాష్ట్ర పార్టీ తరపున నూతన కార్యదర్శిని ఎంపిక చేయాలని కోరింది. కపర్ది గారు తాను కార్యదర్శిని ఎంపిక చేయనన్నారు. అది జిల్లా సమితి, కార్యవర్గం చేయాల్సిన పని అని తేల్చి చెప్పారు. పార్టీ నిర్మాణ సూత్రాలకు విరుద్ధమని చెప్పారు. ఎంత ఒత్తిడి చేసినా తాను అందుకు భిన్నంగా వ్యవహరించలేనని స్పష్టంగా చెప్పారు. విశాఖ నగరంలో కార్మిక ఉద్యమంలో పనిచేయకుండా పార్టీలో నాయకత్వం వహించలేవు అని నన్ను ఒప్పించి పార్టీలో ఆ మేరకు తీర్మానం చేయించి పారిశ్రామిక ప్రాంతానికి నివాసం ఉండేలా పంపించడం వెనుక కపర్ది గారి హస్తం ఉంది. కాల్టెక్సు కేసు తరుణంలో కన్నాభిరాన్ దగ్గరకు తీసుకువెళ్లారు. కోరమాండల్‌లో కార్మికులను పర్మినెంటు చేయించడం వెనుక నిలబడ్డారు. కార్యదర్శిగా మహాసభకు సమర్పించే నివేదికలు ఎలా ఉండాలో సహా అనేక విషయాలను నేర్పారు. రాజకీయ విధానం విషయంలో మా మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నా ఏనాడూ నన్ను నా విధానాలు మార్చుకోమని ఒత్తిడి తేలేదు. విశాఖలో 1980లో జరిగిన ఏఐటీయూసీ జాతీయ మహాసభలు జరిగాయి. నాటికి విశాఖ పట్నం చిన్న నగరమే అయినా కపర్ది గారు ఆహ్వాన సంఘం తరపున కీలక బాధ్యతలను తీసుకుని మహాసభల విజయవం తానికి అవిరామ కృషి చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారం రోజులపాటు కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అనంతరం హైదరాబాదు వెళ్లి కోలుకుని తిరిగి వచ్చి మహా సభల్లో పాల్గొన్నారు. ఆ మహాసభల అనంతరం నేను కూడా అనారోగ్యానికి గురయ్యానన్న విషయం తెలుసుకుని ఒక డాక్టరును పిలిపించి వైద్య పరీక్షలు చేయించారు. పార్టీ కార్యకర్తల పట్ల ఆయన చూపే ప్రేమాభిమానాలు ఎంతో విలువైనవి ఎదుటి వారి అభిప్రాయాలను గౌరవించడం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేలా చూడడం వంటివి ఆయనలోని సుగుణాలు. 57 ఏళ్ల వయసులోనే (1981) కన్నుమూసిన కపర్ది గారు మా లాంటి వారికెందరికో స్ఫూర్తి. ❑

# సహనశీలి.. స్థితప్రజ్ఞుడు

(30వ పేజీ తరువాయి)

అక్కడ కృష్ణార్జునుల్లా వ్యవహరించేవాళ్లం. కార్మికుల డిమాండ్లలో అత్యధికభాగం – అది ప్రాథమిక వేతనాల సమస్య గానీ, కరువు భత్యం సమస్య గానీ, పనిభారం సమస్యగానీ – ఎంతో ఓపికతోనూ, శాస్త్రీయ అవగాహనతోనూ, అంకెల గారడీతోనూ యాజమాన్యాల ప్రతినిధులతో వాదించి, ఒప్పించి, పట్టు విడవకుండా లక్ష్యం సాధించే వరకూ విశ్రమించేవాడు కాదు కపర్ది. ఇంకా బోలెడన్ని విషయాలున్నాయి. కానీ అవన్నీ రాయాలంటే కపర్ది జీవిత చరిత్ర రాయాలి. అందుకే ఇంతటితో ముగిస్తున్నా. ఆఖరున ఒక్కమాట. కపర్ది విప్లవ పోరాటయోధుడు – త్యాగధనుడు – సహనశీలి స్థితప్రజ్ఞుడు – అమరవీరుడు!! ❑

# నాయకుడు, సన్నిహితుడు

## సహచర కార్మిక నేతల నివాళి



– బి.రామారావు

కామ్రేడ్ కపర్ది గారితో నాకు పరిచయం 1965 గుంటూరులో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభ అనంతరం జరిగింది. ఆ మహాసభకు నేను హాజరు కాలేదు. అయితే అక్కడ జరిగిన రాష్ట్ర ఆఫీసు బేరర్ల ఎన్నికల్లో కా॥ కపర్ది గారు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులలో ఒకరుగా, నేను ఆఫీసు కార్యదర్శిగా ఎన్నికయ్యాం. అప్పటికే కపర్ది గారు పశ్చిమ గోదావరి జిల్లాలో, కోస్తా ప్రాంతాలలో మంచి గుర్తింపు వున్న భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు. ట్రేడ్ యూనియన్ నాయకులు. ముఖ్యంగా 1960 జాతీయకరణకు ముందు నుంచే పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రైవేటు మోటారు బస్సు కార్మికుల ఉద్యమానికి పెద్ద నాయకులు. రాష్ట్ర మోటారు రవాణా కార్మికుల సమాఖ్య నాయకులు. మోటారు రవాణా జాతీయకరణ సందర్భంగా ప్రైవేటు యజమానుల వద్ద పనిచేసిన అసలైన కార్మికులందరినీ ఆర్టీసీలోకి తీసుకొనేలా కామ్రేడ్ మారెళ్ళ నరసింహారావు, కామ్రేడ్ కృష్ణంరాజు, కామ్రేడ్ జాన లక్ష్మణరావు తదితర నాయకుల సహాయంతో విశేష కృషి జరిపారు. 1960–65 సంవత్సరాల మధ్య ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌లో ముఠా తత్వానికి తెరలేపిన పి.రామ్మోహనరావు ప్రభావం కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పడకుండా కామ్రేడ్ టి.వి, కామ్రేడ్ మల్లయ్యలింగం, కామ్రేడ్ కపర్ది గార్లు జరిపిన కృషి కారణంగానే ఈ ప్రాంతాలు అప్పటికీ, ఇప్పటికీ ఎంప్లాయీస్ యూనియన్ బలమైన ప్రాంతాలుగా కొనసాగుతున్నాయి.

కామ్రేడ్ కపర్ది గారితో నా వ్యక్తిగత సాన్నిహిత్యం, ఒక ప్రధాన నేత వద్ద కార్యకర్తగా మొదలై గురుశిష్యుల సంబంధంగా కొన సాగి, ఆత్మీయులుగా పరిణతి చెందా. చివరకు బంధుత్వంగా మారింది. ఆయన తన తోటి తరం వారితో ఎంత కలగలుపుగా వ్యవహరించేవారో, మాలాంటి వయస్సులోనూ, అనుభవంలో నూ ఎంతో చిన్న వారితో అంతే కలగలుపుగా ఉండేవారు. యూనియన్ రాష్ట్ర నాయకత్వంలో అనేక మంది సీనియర్లతో చనువుగా మెలగడానికి బెరుకు చెందే కార్యకర్తలం కపర్ది గారి దగ్గర ఎటువంటి తడబాటు లేకుండా స్వేచ్ఛగా మా భావాలు వెలిబుచ్చేవారం. ఆయన మా ఆలోచనా విధానంలోని లోటు పాట్లను సున్నితంగా మాకు వివరిస్తూనే, మా వాదనలలోని ముఖ్యాంశాలను రాష్ట్ర నాయకత్వం ముందుకు తీసుకువెళ్ళే వారు. 1968 అనంతరం కామ్రేడ్ కపర్ది ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన ఉపాధ్యక్షులుగా యూనియన్‌కు సారథ్యం వహించారు.

ట్రేడ్ యూనియన్ కార్యకర్తగా, ఉపన్యాస సరళి, విషయ విశ్లేషణ, కొత్త అంశాల అధ్యయనం కార్యకర్తలతో సమస్యలపై చర్చించటం వంటి అంశాలలో నా సరళికి మార్గ దర్శకత్వం ప్రత్యక్షంగా పరోక్షంగా కామ్రేడ్ కపర్ది గారిదే. ఆయన మనల్ని విడిచి పెట్టి 25 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ, 'ఏమోయ్ ! రామారావు, ఏమిటి విశేషాలు' అన్న పలకరింపు ఇంకా చెవుల లో వినబడుతూనే వుంది. నేను కళ్ళు మూసే వరకూ వినబడు తూనే వుంటుంది. ❑

## అదే అదే పతాక




అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా
పదే పదే రణానికై నగార మోగుతోందిరా
॥ అదే అదే ॥
ధగద్ధగద్ధగ ప్రభన్ పతాక సాగుతోందిరా
ధిమిద్ధిమిద్ధిమి ధ్వనిన్ నగార మోగుతోందిరా ॥ అదే అదే ॥
యువప్రవాళ పంక్తిలా, నవప్రభాత కాంతిలా
మహోరుణ స్రవంతిలా పతాక సాగుతోందిరా ॥ అదే అదే ॥
తటిత్తరంగ ఘోషలా నటత్తురంగ హేషలా
మహాకవీంద్రు భాషలా నగార మోగుతోందిరా ॥ అదే అదే ॥
సనాతనాల బూజుపై, కులం మతం రివాజుపై
పురాణ నమ్మకాలపై తుపాను రేగుతోందిరా ॥ అదే అదే ॥
పరాన్నభుక్కు దేవిడీ, దురాగతాల చావిడీ
తరాలదోపిడీ గడీ పునాది ఊగుతోందిరా ॥ అదే అదే ॥
అహర్నిశల్ వనాలలో, పొలాలు ఫ్యాక్టరీలలో
శ్రమించు కూలి రైతులార రండిరా పదండిరా
అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా
పదేపదే రణానికై నగర మోగుతోందిరా ❑

– రాంభట్ల కృష్ణమూర్తి

## సహచర కార్మిక నేతల నివాళి

# పెద్ద బాలశిక్ష

- కలిదిండి భీమరాజు



కపర్ది గారు చనిపోయి 25 సంవత్సరాలు అయిందంటే నిజంగా నమ్మలేని విషయంగానే ఉంది. భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న శ్రీ రామచంద్ర రావు గారి అబ్బాయే శ్రీ యం.వి.ఎన్.కపర్ది. గుంటూరులో ఆయన చదువు పూర్తిచేసిన నాటి నుండి చనిపోయేదాకా ఆదర్శ కమ్యూనిస్టుగా ఆయన నిర్వహించిన పాత్ర రాజకీయ నాయకులలో ఎందరికో ఉదాహరణ. పార్టీ కార్యక్రమాలను గానీ, కార్మిక సంఘ కార్యక్రమాలను గానీ ఎంతో సమర్థవంతంగా సత్యనిష్ఠతో కొనసాగించేవారు శ్రీ కపర్ది. జిల్లా కమిటీ సమావేశాలలో ఒక్కొక్కసారి తీవ్రమైన చర్చలు జరుగుతుండేవి. అలాంటి ఒక సందర్భంలో అప్పుడే పార్టీలో ఎదుగుతున్న ఒక చిన్న నాయకుడు మీద ఇంకా పైస్థాయిలో ఉన్న నాయకుడు అన్యాయంగా చేసిన ఆరోపణను తీవ్రంగా ఖండించి ఆ చిన్న నాయకుణ్ణి సమర్థించి అతనిలో ఉద్యమం పట్ల మరింత ఎక్కువగా కమిట్మెంట్‌తో పని చేసేలా చేశారు. ఆ పెద్ద నాయకుడు చేసిన ఆరోపణలు ఆధార రహితమని చాలా న్యాయబద్ధంగా ఆలోచించి, ధర్మానికి కట్టుబడి కామ్రేడ్ కపర్ది తన నిర్ణయాలను తీసుకున్నారు. ఇంకో సందర్భంలో కపర్ది గారి మీద నేనేదో ఆరోపణ చేశానని ఎవరో చెప్తే, ఆయన నాకొక సుదీర్ఘమైన లేఖ రాసి తన హృదయాన్ని నా ముందు పరిచారు. ఆ ఉత్తరం రాసే నాటికి ఆయన అనారోగ్యంతో వైజాగ్ కె.జి.హెచ్.లో ఉన్నారు. ఆయన రాసిన ఉత్తరాన్ని చదివిన నాకు ఆయన మీద ఉన్న గౌరవం మరింత పెరిగింది. ఎందుకంటే ఆయన గానీ నేను గానీ ఎన్నడూ అబద్ధం ఆడి ఎరుగము. అలాంటి నమ్మకాన్ని నేను ఆయనకు కలిగించినందుకు నేనెంతో గర్వపడుతున్నాను. అలాంటి నాయకుల సాన్నిహిత్యంలో పనిచేసినందుకు ఇప్పటికీ నేను గర్వపడుతున్నాను. తనకున్న ఆస్తిపాస్తులన్నీ ఉద్యమ నిర్వహణలోనే ఖర్చుపెట్టేసిన స్వార్థత్యాగి శ్రీ కపర్ది. గంపెడు సంసారంతో తాడేపల్లిగూడెంలో ఒక తాటాకు ఇంట్లో కపర్ది గారు శేషమ్మ గారు వారి జీవితాన్ని వెళ్ళదీయడం నేను కళ్ళారా చూశాను. ఎన్ని కష్టాలు ఉన్నా, ఎన్ని బాధలు ఉన్నా, ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించిన వారందరినీ ఆప్యాయంగా పలకరించే వారు శేషమ్మ గారు. వారి నిరాడంబర జీవన విధానమే ప్రజలలో వారికి ఎంతో గౌరవాన్ని కలిగించింది. అందుకే శేషమ్మ గారు ఎన్నోసార్లు మున్సిపల్ ఎన్నికలలో మంచి మెజారిటీతో గెలుస్తూ పేదలకు సేవ చేస్తుండేవారు. నేటి రాజకీయ నాయకు లకు పెద్దబాలశిక్ష లాంటిది కామ్రేడ్ కపర్ది శేషమ్మ గార్ల జీవనశైలి. ❑

# మా గురువు గారు



- ఆర్.ఎస్.వేణుగోపాల్

చతురోక్తులతో, జనరంజక వాగ్ధాటి గల మహా వక్తే కాదు. ఆంగ్ల, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం గల పండితుడు మా గురువు గారు శ్రీ ఎం.వి.ఎన్.కపర్ది. ప్రచారాడంబరాలు ఏ మాత్రం ఇష్టపడని నిస్వార్థ మేధావి, జ్ఞాన సంపన్నుడు, ప్రముఖ కార్మిక నాయకుడు కీ॥శే॥ శ్రీ ఎం.వి.ఎన్.కపర్ది గారు భౌతికంగా దూరమై అప్పుడే పాతికేళ్లు గడిచిపోయాయి. 1968 నుంచి నాకు కపర్ది గారితో పరిచయం వుంది. నన్ను, నా మిత్రుడు కీ॥శే॥ శ్రీ జె.వి.సత్య నారాయణ (తాడేపల్లిగూడెం ల్యాండ్ మార్టిగేజ్ బ్యాంక్)ను, వెన్నుతట్టి ప్రోత్సహించి బ్యాంకు కార్యదక్షత రంగ యూనియన్‌లో గుర్తింపు కల్గిన రాష్ట్ర నాయకులుగా తీర్చిదిద్దింది కపర్ది గారే. నిజాయితీ, ఆయన నుంచి మేము నేర్చుకున్న విశిష్ట గుణాలు. కార్మిక శ్రేయస్సుకై యుక్తివంతంగా విజయపథంలో ఆయన నడిపించిన పోరాటాలు చిరస్మరణీయాలు. ఏపీబీఈఎఫ్ రాష్ట్ర సమావేశాలు తాడేపల్లిగూడెంలో నిర్వహించినప్పుడు ఆయన చూపిన వినూత్న శైలి ఇప్పటికీ మార్గదర్శకపు మైలురాయే !

తాను నమ్మిన రాజకీయ సిద్ధాంతాలతో రాజీ లేకుండా చివరి వరకు కార్మిక పక్షపాతిగా నిలిచిన కర్మనిష్ఠుడు శ్రీ కపర్ది. ఆయన పోవడానికి ఓ నెల ముందు నన్ను, జె.వి.ని పిలిపించుకొని మాతో ఓ రెండు గంటలు ప్రత్యేకంగా చెప్పిన అమూల్యమైన విషయాలు నాకు ఎన్నటికీ గుర్తుంటాయి. తన కొడుకు శ్రీపతితో సమంగా మమ్మల్ని ఆదరించి, ప్రోత్సహించి సిద్ధాంత నిబద్ధతలు నేర్పిన మా గురువు కీ॥శే॥ కపర్ది గారిని ఎన్నటికీ మా జ్ఞాపకాలలో పదిలపరచుకుంటాం. ❑

సహచర కార్మిక నేతల నివాళి

# విలక్షణ కార్మికనేత కామ్రేడ్ కపర్ధీ

- డి.సోమసుందర్



రాష్ట్ర కమ్యూనిస్టు కార్మికోద్యమంలో విలక్షణ నేతలుగా పేరు పొందిన తొలితరం ప్రముఖుల్లో కామ్రేడ్ కపర్ధీ ఒకరు. జీవించి ఉన్నంత కాలం కమ్యూనిస్టు విలువలకు, ఆదర్శాలకు కట్టుబడి, శ్రమజీవుల ప్రేమాభిమానాలను అపారంగా పొందిన గొప్ప మార్క్సిస్టు మేధావి కామ్రేడ్ కపర్ధీ. కార్మికుల ఆర్థిక జీవితాన్ని మాత్రమే కాకుండా వారి ఆత్మిక, సామాజిక, జీవనాన్ని, సాంస్కృతిక స్థాయిని పెంచడానికి నిరంతరం తపించిన సామాజిక విప్లవకారుడు కామ్రేడ్ కపర్ధీ. కామ్రేడ్ కపర్ధీ తండ్రి మందలపర్తి రామచంద్రరావు గారు గాంధీజీ పిలుపుపై 1920 సహాయ నిరాకరణ ఉద్యమం సందర్భంగా గ్రామకరణం ఉద్యోగానికి రాజీనామా చేసిన గొప్ప జాతీయవాది. దేశభక్తులు ! బాల్యంలోనే తండ్రి ప్రభావం కపర్ధీపై పడింది. గుంటూరు ఏ.సి. కళాశాల విద్యార్థిగా ఉన్న కాలంలోనే విద్యార్థి ఉద్యమంలో కపర్ధీ క్రియాశీలంగా పాల్గొన్నారు.

మార్క్సిస్టు సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేశారు. కమ్యూనిస్టు ఆదర్శాలతో ఉత్తేజితులయ్యారు. చదువు పూర్తి చేసి స్వగ్రామానికి తిరిగి వచ్చిన వెంటనే కపర్ధీ కొల్లేరు అన్ సర్వే రైతుల హక్కుల కోసం పోరాటాల్లో పాల్గొన్నారు. కపర్ధీ ప్రత్యక్ష రాజకీయ పోరాటం రైతు సంఘంలో ప్రారంభం కావడం ఒక విశేషం. అప్పటికే రైతు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఇందుకూరి సుబ్బరాజు, దూసనపూడి విరాటరాజు వంటి సీనియర్లతో కపర్ధీ జత కలిశారు. వారు ముగ్గురినీ కొల్లేరు గ్రామాల్లో ప్రవేశించడాన్ని నిషేధిస్తూ నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఎక్స్‌టర్న్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చింది. ఒకపక్క బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధకాండనూ, మరోపక్క జమీందారీ, భూస్వామ్యవర్గ దౌర్జన్యాలను ఎదుర్కుంటూ కపర్ధీ రైతు ఉద్యమంలో రాటు తేలారు. పార్టీ పిలుపు మేరకు 1943లో తాడేపల్లిగూడెం కాపురం వచ్చిన కపర్ధీ నాలుగు దశాబ్దాలపాటు కార్మికోద్యమంలో, కమ్యూనిస్టు ఉద్యమంలో తలమునకలయ్యారు. అనేక పోరాటాలలో కాకలు తీరారు. 1943లో పట్టణంలో కార్మిక సంఘాల స్థాపనతో కపర్ధీ కార్మికోద్యమ జీవితం ప్రారంభమైంది. సమాజంలో అంటరాని వారిగా తీవ్ర అవమానాలకు గురవుతున్న రెల్లి కులానికి చెందిన పారిశుధ్య కార్మికుల కోసం ఆయన తొలుత సంఘం స్థాపించారు. అందుకు స్థానిక అగ్రకుల పెత్తందార్లు కపర్ధీ గారిని "పాకీ పంతులు" అని హేళన చేశారు. అయినా కపర్ధీ లెక్క చేయలేదు. పారిశుధ్య కార్మికుల జీతభత్యాల కోసమే కాకుండా వారి శ్రమ గుర్తింపు కోసం, సామాజిక గౌరవం కోసం గట్టిగా నిలబడ్డారు. సామాజిక నిచ్చెనమెట్ల వ్యవస్థలో అట్టడుగున పడి ఉన్న రెల్లి కులస్తులను సంఘటితం చేసి వారి సామాజిక స్థితిని ఉద్ధరించడానికి కపర్ధీ సాగించిన పోరాటం అలనాటి సామాజిక పరిస్థితుల్లో సామాన్య మైనది కాదు. కుల వివక్షను, కులాన్ని వ్యతిరేకిస్తూ కపర్ధీ తీసుకున్న గట్టి వైఖరి ఆయన వ్యక్తిత్వంలో ఒక ముఖ్యమైన పార్శ్వంగా మారింది. అనంతర కాలంలో తన చుట్టూ సమీకృతులైన కార్యకర్తల్లో కుల అహంకార ధోరణులు కనిపిస్తే కపర్ధీ వాటిని ఖండించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టేవారు. కపర్ధీ గారితో పాటు ఆయన మొత్తం కుటుంబం కులాన్ని అధిగమిం చడం వెనుక ఆయన తొలి నుండి అనుసరించిన కులవివక్ష వ్యతిరేఖ వైఖరి ఒక కారణం అని చెప్పాలి. కపర్ధీలోని ఇలాంటి వైఖరి ఆయనను తోటి వారిలో ఒక విలక్షణ నేతగా నిలిపింది. ఆ తర్వాత కపర్ధీ ప్రైవేట్ బస్ వర్కర్స్ యూనియన్, ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్, తాపీ పనివారల సంఘం, గూడ్స్ షెడ్, సి.డబ్ల్యూ.సి. ఎఫ్.సి.ఐ., రైస్ మిల్ వర్కర్స్ వంటి పలు కార్మిక సంఘాలను స్థాపించారు. వారి హక్కుల కోసం ఎన్నో పోరాటాలు సాగించారు. ఈ క్రమంలో ఎన్నో దాడులను, కేసులను ఎదుర్కొన్నారు. 1948-52 మధ్య కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురైన సమయంలో అరెస్టయిన కపర్ధీ నాలుగేళ్లపాటు జైలు జీవితాన్ని గడిపారు. 1953లో ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు గారి బలిదానం సందర్భంగా తాడేపల్లిగూడెంలో ఉవ్వెత్తున ఎగసిన పోరాటంపై పోలీసు కాల్పులు జరిగాయి. ఆ పోరాటంలో ఆయన మరోసారి జైలుకి వెళ్ళారు.

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ప్రైవేట్ బస్ కార్మికులను సంఘటితం చేసిన కపర్ధీ అనంతరకాలంలో సంఘాన్ని జిల్లాస్థాయికి, రాష్ట్రస్థాయికీ విస్తరింప చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్ మోటారు వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పాటుచేశారు. దాని మహాసభలను 1946లో తాడేపల్లిగూడెంలో నిర్వహించారు. ఫెడరేషన్‌కు జోస్యభట్ల సత్యనారాయణ అధ్యక్షునిగా, కపర్ధీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రైవేటు బస్సు రూట్లను జాతీయం చేసి ప్రజా రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న నినాదాన్ని తొలిసారిగా

రూపొందించింది ఆ మహాసభలోనే ! ప్రైవేట్ బస్ కార్మికులకు వృత్తి భద్రత, వేతన భద్రత కల్పించాలని ఆ మహాసభ డిమాండ్ చేసింది. దానిపై రాష్ట్రస్థాయిలో సుదీర్ఘంగా సాగించిన దశల వారీ పోరాటం ఫలించడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. బస్ రూట్లు జాతీయం అయ్యాయి. ప్రైవేట్ బస్ కార్మికులు ఆర్టీసీ కార్మికులయ్యారు. అప్పటి వరకూ యజమానుల తాబేదారులుగానూ, చదువూ సంధ్యా లేని మొరటు మనుషులుగానూ, కొన్ని ప్రాంతాల్లో సామాజిక గౌరవం లేని అసాంఘిక మూకగానూ ప్రైవేటు బస్సు కార్మికులు పేరు పొందారు. అప్పట్లో ఇతర సామాజిక వర్గాలపై దాడులు చేయడానికి, మోటారు కార్మికులనే రౌడీలుగా పెత్తందార్లయిన యజమానులు వినియోగించుకునే పరిస్థితి ఉండేది. ఇతర కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు సమ్మెలు, బందులు చేసే రోజుల్లో వారిపై మోటారు కార్మికులే దాడులు చేసేటంత అరాచకంగా ఉండే రోజులవి. వారికి సంఘాలు పెట్టడమే కష్టం. పెట్టినా నిలబెట్టడం చాలా కష్టం. తాడేపల్లిగూడెంలో 200కు పైగా ప్రైవేటు బస్సులు ఉండేవి. వాటిలో పనిచేసే కార్మికులను కపర్ది సంఘటితం చేశారు. అసంఘటిత, అసాంఘిక కార్మికులుగా పేరుపడ్డ కార్మికులను ఆయన ఓపికగా సమీకరించారు. పోరాటాలలోకి దించారు. విజయాల బాటలో నడిపించారు.

కపర్ది వంటి విద్యాధిక కార్మికనేతల దూరదృష్టి ఫలితంగానే ప్రైవేటు బస్సు కార్మికవర్గం ఆధునిక సంఘటిత కార్మికవర్గంగా రూపొందింది. ఒకప్పటి నిరక్షరాస్యులైన మొర టు ప్రైవేట్ బస్ కార్మికుల స్థితిగతులకూ నేటి విద్యాధిక ఆర్టీసీ కార్మికుల జీవనస్థాయికీ ఏమీ పోలిక లేదు. ఆర్టీసీ కార్మికులు గతంతో పోలిస్తే ఒక మెరుగైన, గౌరవప్రదమైన జీవితాన్ని సాగించగలుగుతున్నారు. సామాజిక గౌరవాన్ని పొందగలుగుతు న్నారు. వారి జీవితాల్లో ఇదో గొప్ప మార్పు ! ఈ నిశ్శబ్ద విప్లవం వెనుక కపర్ది వంటి నేతలు దశాబ్దాలపాటు చేసిన కృషి దాగి ఉందని చెప్పాలి. పశ్చిమ గోదావరిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు బస్సు కార్మికులందరినీ ఆర్టీసీలో చేర్పించడంలో అలనాటి నేతలు సాగించిన కృషి అపారమైనది.

ఆర్టీసీ యాజమాన్యంతో, ప్రభుత్వంతో, కార్మిక శాఖతో, ప్రైవేటు బస్సు యజమానులతో సమన్వయం చేసి వేలాది మందికి ఉద్యోగాలు దక్కేటట్లు చేయడంలో ఏ.ఐ.టి.యు.సి. సాగించి పోరాటం కార్మికోద్యమ చరిత్రలోనే ఒక మహోజ్వల ఘట్టం. దానికి కీలక పాత్రధారి కామ్రేడ్ కపర్ది. అప్పట్లో స్థానిక సంస్థల కార్మికులుగా కొనసాగుతున్న పారిశుధ్య, ప్రజారోగ్య సిబ్బంది సర్వీసులను రాష్ట్రీయకరణ చేయడం కోసం జరిగిన పోరాటంలో కపర్ది పాత్ర కీలకమైనది. భూమి తనఖా బ్యాంకుల సిబ్బంది, ప్రాథమిక సహకార సంఘాల సిబ్బంది సర్వీసులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం వంటివి కపర్ది వంటి నేతల దూరదృష్టి వల్లనే సాధ్యమైంది. చెల్లాచెదురుగా, అసంఘటితంగా ఉన్న కార్మికులను సంఘటిత కార్మికవర్గంగా రూపొందించడంలోనే కపర్ది విలక్షణత మనకు గోచరిస్తుంది. తాడేపల్లిగూడెంలో మూడు దశాబ్దాలు నివసించిన కామ్రేడ్ కపర్ది పట్టణ ప్రజా జీవితంపై గాఢమైన ముద్ర వేశారు. ఎక్కడెక్కడి నుండో బతుకు తెరువు కోసం తాడేపల్లిగూడెం పట్టణానికి వచ్చి స్థిరపడిన కూలీ నాలీ జనాల్ని సంఘాల్లోకి సమీకరించారు. వారి జీతభత్యాల పెంపుదలకు కృషి చేసేవారు. పని ప్రదేశంలోనే కాకుండా నివాస ప్రాంతాల్లో వారికి అండగా ఉండేవారు. అయితే అంతటితో కార్మిక సంఘాల బాధ్యత తీరిపోయినట్లు కాదని కపర్ది నమ్మేవారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యాలు, పిల్లల చదువులు, ఉద్యోగాలు, ఆస్తులు అప్పులు అన్ని పట్టించుకునేవారు. పార్టీ కుటుంబాల అంతర్గత సమస్యలు తీర్చేవారు. నిరంతరం వారి ఆలోచనా స్థాయిని, జీవనస్థాయిని పెంచడానికి సహనంతో ప్రయత్నించే వారు. కార్మికుల కష్టసుఖాల్లో పాలు పంచుకోవడంతోపాటు వారికి నిలువ నీడ ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. రెండో ప్రపంచ యుద్ధ అవసరాల కోసం బ్రిటిష్ వారు నిర్మించిన ఒక విమానాశ్రయం తాడేపల్లిగూడెంలో ఉండేది. దానికి 600 ఎకరాల భూమి ఉండేది. విమానాశ్రయాన్ని తర్వాతి కాలంలో రద్దు చేసేశారు. దాంతో ఖాళీగా పడి ఉన్న విమానాశ్రయ భూముల ఆక్రమణకు కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. అప్పటి ఏలూరు సీపీఐ ఎంపీ కామ్రేడ్ వీరమాచనేని విమలాదేవి ప్రత్యక్ష నాయకత్వంలో కామ్రేడ్ కపర్ది వందలాది మంది పేదలతో ఇళ్లు వేయించారు. మిలటరీ ఎస్టేట్ అధికారులు ఆక్రమణలను తొలగించడానికి చేసిన ప్రయత్నాలన్నిటినీ కామ్రేడ్ కపర్ది ఏళ్ళ తరబడి ప్రతిఘటించారు.

ఎమర్జన్సీ రోజుల్లో ఇళ్ళను కూల్చడానికి అప్పటి మిలిటరీ ఎస్టేట్స్ అధికారులు ప్రయత్నం చేశారు. అప్పటి కేంద్ర రక్షణ శాఖ మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్, నాటి రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్ తదితరులను కలిసి ఆక్రమణదారుల ఇళ్ళను తొలగించనీయకుండా స్టే ఉత్తర్వులు తెచ్చి పేదవారి గూడుకు రక్షణ కల్పించారు. సిపిఐ పార్లమెంట్ సభ్యుల సహకారంతో కపర్ది సాగించిన కృషి ఫలితంగానే తాడేపల్లిగూడెంలో దాదాపు ఏడు మునిసిపల్ వార్డులలో విస్తరించి నివసిస్తున్న సుమారు మూడు వేల కుటుంబాలకు సొంత ఇల్లు దక్కింది. విమానాశ్రయ భూములను ఆక్రమించి పేదలు వేసుకున్న ఇళ్ళను కాపాడటానికి కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటంలో కామ్రేడ్ కపర్ది ముఖ్య భూమిక పోషించారు. తాడేపల్లిగూడెం గ్రామ పంచాయతీగా ఏర్పడ్డ కాలం నుండి, మునిసిపాలిటీ అయ్యాక కూడా కపర్ది గారి నేతృత్వంలో కమ్యూనిస్టు సభ్యులు స్థానిక ఎన్నికల్లో గెలుస్తూ ఉండేవారు.

పంచాయతీ సర్పంచ్, మునిసిపల్ చైర్మన్ ఎన్నికల్లో ఎవరు గెలవాలన్నా కమ్యూనిస్టు పార్టీ సభ్యుల తోడ్పాటు కీలకంగా ఉండేది. సోషలిస్టు నాయకుడు, న్యాయవాది మెండు నరసింహారావు పంచాయతీ అధ్యక్షుడు కావడంలో, ప్రజా వైద్యులు డాక్టర్ కోడే వెంకటరావు, ప్రముఖ వ్యాపారి, అనంతర కాలంలో ప్రముఖ రాజకీయ నేతగా ఎదిగిన ఈలి ఆంజనేయులు మునిసిపల్ చైర్మన్లుగా ఎన్నిక కావడం వెనుక కామ్రేడ్ కపర్ధి కృషి కీలకమైనది .

కామ్రేడ్ కపర్ధి సతీమణి శేషమ్మ గారు సుమారు పాతికేళ్ళు మునిసిపల్ కౌన్సిలర్‌గా గెలుపొంది పట్టణాభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించారు. తాడేపల్లిగూడెంలో ఉద్యోగులకు కార్మికులకు చవక ధరలకు వినిమయ వస్తువులు అందుబాటులోకి తెచ్చేందుకు సహకార రంగంలో ప్రియదర్శిని సూపర్ ఏర్పాటు చేయడం వెనుక కామ్రేడ్ కపర్ధి ఆలోచన కీలకంగా పనిచేసింది. పట్టణంలోని సోషలిస్టు ప్రముఖులు డి.ఎస్. మాస్టారు, మెండు నరసింహారావుగారు ప్రియదర్శిని సూపర్‌బజార్‌కు ప్రత్యక్ష సారథ్యం వహించారు. కపర్ధి ప్రోత్సాహంతో ఆర్టీసీ, ఫుడ్స్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులు సూపర్‌బజార్ సహకార సంఘంలో సభ్యులయ్యారు.

మూడేళ్ళకు ఒకసారి జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తరపున నలుగురైదుగురు కార్మికులు పాలకవర్గ సభ్యులుగా ఎన్నికయ్యేవారు. సూపర్‌బజార్ నిర్వహణలో కార్మిక ప్రతినిధులు కీలక పాత్ర పోషించారు. కామ్రేడ్ శ్రీపతి పాలకవర్గంలో ఉంటూ సూపర్ బజార్ అభివృద్ధికి కృషి చేశారు. బ్యాంక్ ఉద్యోగులకు జిల్లాస్థాయిలో సహకార సొసైటీని ఏర్పాటుచేసి వారికి రుణ సదుపాయం కల్పించడంలో కపర్ధి గారి తోడ్పాటు ఎంతో ఉంది. నిధుల వసూళ్ళకు టిక్కెట్టు డ్రామాలు ఆడించే పద్ధతిని తాడేపల్లిగూడెంలో కమ్యూనిస్టు పార్టీ కొన్నేళ్ళపాటు అమలు చేసింది. ఇలాంటి ప్రయోగాల వెనుక కపర్ధి గారి ఆలోచనలు ఉన్నాయని చెప్పాలి. కపర్ధి కుటుంబ సభ్యులంతా కమ్యూనిస్టు సిద్ధాంతాలకు, ఆదర్శాలకు బద్ధులై వామపక్ష భావజాలంతో, వివిధ ఉద్యమాల శ్రేణుల్లోనే కొనసాగడం విశేషం.

కామ్రేడ్ కపర్ధి ఏ.ఐ.టి.యు.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పలు కార్మిక సంఘాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించారు. సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యునిగా, జాతీయ కౌన్సిల్ సభ్యునిగా పార్టీకి సేవలు అందించారు. కపర్ధి 1981 మే 25న హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆయన కనుమరుగై నాలుగు దశాబ్దాలు గడిచినా ఇంకా కార్మికవర్గం గుండెల్లో ఆయన స్మృతులు పదిలంగా ఉన్నాయి. ఆయన స్థాపించిన కార్మిక సంఘాలకు అప్పట్లో కార్యకర్తలుగా పనిచేసిన కుటుంబాల నుండి వచ్చిన మూడో తరం కార్యకర్తలు ప్రస్తుత కార్మికోద్యమంలో కొనసాగుతున్నారు. కామ్రేడ్ కపర్ధి వేసిన పునాది అంత పటిష్టంగా ఉందని చెప్పాలి! తాడేపల్లిగూడెం, ఏలూరు సహా అనేకచోట్ల పార్టీ లేదా కార్మిక సంఘాల కార్యాలయాలకు ఆయన పేరుపెట్టారు. పార్టీ కార్యకర్తలు కొంతమంది తమ పిల్లలకు ఆయన పేరు పెట్టుకున్నారు. సాటి నేతలలో కపర్ధిని ఒక విలక్షణ నేతగా నిలిపింది ఆయన జీవితమూ, కృషీ, వ్యక్తిత్వమూ అని తెలిసిన వారందరికీ తెలిసిన సత్యం! ❑



## లాల్ సలాం!

మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!
దరిలేని బానిస చాకిరీ
నరహంతల గుండాగిరీ
ఇక వద్దనీ, ఇది రద్దనీ
పోరాడి నేలకు ఒరిగినా
రణధీరులారా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!!
మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!

మత మూఢ విశ్వాసాలనూ
కుల జాతి విద్వేషాలనూ
నిరసించుతూ, ఎదిరించుతూ
పోరాడి నేలకు ఒరిగినా
యువ శూరులారా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!!
మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!

శ్రమశక్తి దోపిడిదారునీ
సమరాల గుత్త కుబేరునీ
అరికట్టుతూ, హతమార్చుతూ
పోరాడి నేలకు ఒరిగినా
శ్రమ వీరులారా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!!
మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!

చిరశాంతి భువి నిండాలనీ
నరజాతి కల పండాలనీ
యుగస్రష్టలై, కమినిస్టులై
పోరాడి నేలకు ఒరిగినా
ధ్రువతారలారా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!!
మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!!

– రాంభట్ల కృష్ణమూర్తి

## సహచర కార్మిక నేతల నివాళి

# ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ కపర్ధీ చిరస్మరణీయులు



- వెలుగూరి రాధాకృష్ణమూర్తి

ఆయన పూర్తి పేరు మందలపర్తి వెంకట నారాయణ కపర్ధీ. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖులు, కార్మికోద్యమ నిర్మాత. తాడేపల్లిగూడెం పూర్వపు తాలూకాలోని కొల్లేరు గ్రామం పెదనింద్రకొలనులో 1923 ఆగస్టు 30వ తేదీన రామచంద్రరావు, శేషమ్మలకు జన్మించారు. తండ్రి రామచంద్రరావు సహాయ నిరాకరణోద్యమంలో తన గ్రామ కరణీకానికి రాజీనామా చేశారు. కామ్రేడ్ కపర్ధీ చిన్న వయసులోనే మత, ధార్మిక గ్రంథాలెన్నింటినో మథించారు. ప్రాచీన సంస్కృత సాహిత్యంలో కామ్రేడ్ కపర్ధీకి విశేషమైన పరిచయం ఉంది. తిలక్ వ్రాసిన 'గీతా రహస్యం' ఆయనను తొలినాళ్ళలో ఎంతో ప్రభావితం చేసింది. జన్మించింది సాంప్రదాయ కుటుంబమైనప్పటికీ, 'సత్య శోధననిష్ట' ఆయనను మత విశ్వాసాలను ప్రశ్నించేలా చేసింది.

కపర్ధీ మొదటి నుండి ప్రతిభాశాలి. స్కూల్ ఫైనల్, ఇంటర్‌లో బంగారు పతకాలు సాధించారు. గుంటూరులోని ఎ.సి. కాలేజిలో ఆయన చదువుకున్నారు. ఆ రోజుల్లోనే వామ పక్ష విద్యార్థి ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆ తర్వాత అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎ.ఐ.ఎస్.ఎఫ్)లో చేరారు. కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య మార్గదర్శకత్వంలో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అధ్యయనం చేశారు. నిబద్ధతగల గతితార్కిక భౌతికవాదిగా మారారు. ఆయన మేనమామ కూతురు శేషమ్మ గారిని 1941లో వివాహమాడారు. ఆనాటి నుండి వారిద్దరూ కమ్యూనిస్టు ఉద్యమంలో కలిసి పనిచేశారు.

కామ్రేడ్ శేషమ్మ గారు 1952లో తాడేపల్లిగూడెం పంచాయతీ బోర్డు మెంబరుగా సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. దాదాపు 25 ఏళ్లు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఆమె పనిచేశారు. ఈ దంపతులకు ఆరుగురు కుమారులు. ఇద్దరు కుమార్తెలు. మొత్తం అందరూ కమ్యూనిస్టు కుటుంబంగా మారిపోవటం అరుదైన అంశం. కపర్ధీ ఉత్తమ శ్రేణి ఉపన్యాసకుడు. పార్టీ జాతీయ నాయకుల ఉపన్యాసాలకు ఆయనే అనువాదకుడు. తన ఉపన్యాసాలలో అలవోకగా హాస్యోక్తులు విసరడం, వివిధ కావ్యాల నుండి, నాటకాల నుండి సందర్భోచితంగా కొటేషన్లు వాడటం ఆ విధంగా తన ఉపన్యాససారాన్ని ప్రేక్షకుల హృదయాలకు చేరువచేయటం ఆయన ప్రత్యేకత. కామ్రేడ్ కపర్ధీ కడలూరు జైలులో మూడేళ్లు నిర్బంధంలో వున్నారు. జైలులో తోటి వారికి రాజకీయ అర్థ శాస్త్రాన్ని, మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని, ప్రపంచ రాజకీయాలను ఎంతో నేర్పు, ఓర్పుతో బోధించేవారు. వారిని విజ్ఞానవంతులు గానూ, చైతన్యవంతులు గానూ చేయాలని తపన పడేవారు. జైలులో కాల్పులు జరిగినపుడు, జరిగిన పోరాటాలలో అగ్రభాగాన ఉండేవారు. పోలీస్ కాల్పులకు వ్యతిరేకంగా కడలూరు జైలులో 28 రోజులపాటు జరిగిన ఆమరణ నిరాహార దీక్షలలో కపర్ధీ పాల్గొన్నారు. జైలు నుండి చిట్టచివరిగా విడుదలైన డిటెన్యూ కామ్రేడ్ కపర్ధీ.

సమాజంలో అంటరానివారిగా తీవ్ర అవమానాలకు గురవుతున్న రెల్లి కులానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుల సంఘాన్ని స్థాపించారు. కపర్ధీ 1948లో మోటారు కార్మిక సంఘాన్ని నిర్మించారు. పారిశుద్ధ్య కార్మికులను సంఘటితం గావించి వారి హక్కుల కోసం పోరాడారు. తాపీ పనివారల సంఘం, ఒంటెద్దు బళ్ళ సంఘం, రిక్షా కార్మిక సంఘం, హెూటల్ వర్కర్స్ యూనియన్, సి.డబ్ల్యు.సి., యఫ్.సి.ఐ. గోడౌన్ల ముఠా కార్మిక సంఘం, రైస్ మిల్లుల కార్మిక సంఘం ఇంకా అనేక రంగాలలోని అసంఘటిత రంగ కార్మికుల్ని సంఘటితం చేశారు. వారి హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించారు.

ఎన్నో దాడులు, పోలీస్ కేసులను ఎదుర్కొన్నారు. 1948–52 మధ్య కాలంలో కమ్యునిస్టు పార్టీ నిషేధానికి గురైనపుడు కామ్రేడ్ కపర్ధీ నాలుగేళ్లు జైలు జీవితం గడిపారు. 1953లో ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు గారి బలిదానం సందర్భంగా తాడేపల్లిగూడెంలో ఎగిసిపడిన నిరసన ప్రదర్శనలపై పోలీస్ కాల్పులు జరిగాయి. ఆ పోరాటంలో కపర్ధీ మరోసారి జైలుకి వెళ్ళారు. కొల్లేరు సర్వే చేయబడని భూముల రైతుల హక్కుల కోసం పోరాడారు. రైతాంగాన్ని సంఘటితం గావించారు. ఫలితంగా కపర్ధీతోపాటు ఇందుకూరి సుబ్బరాజు, దూసనపూడి విరాట్‌రాజు వంటి నాయకులను కొల్లేరు గ్రామాల్లో ప్రవేశించకుండా బ్రిటిష్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ఆంధ్రప్రదేశ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి దాని మొదటి మహాసభను 1948లో తాడేపల్లిగూడెంలో నిర్వహించారు. కామ్రేడ్ జ్యోస్యభట్ల సత్యన్నారాయణ అధ్యక్షులుగా, కామ్రేడ్ కపర్ధీ ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.

ప్రజా రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న నినాదాన్ని

తొలిసారిగా రూపొందించింది ఈ మహాసభలోనే! అందుకోసం రాష్ట్ర వ్యాపితంగా దశల వారీ పోరాటం నిర్వహించబడింది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. బస్సు రూట్లు జాతీయం కావటంతో ప్రైవేట్ బస్సులలో పనిచేసే వేలాది మంది కార్మికులు సంఘటిత మయ్యారు. ఎఐటియుసి నాయకత్వంలో ఆర్.టి.సి. ఎంప్లాయీస్ యూనియన్ ఏర్పడింది. ఈ మొత్తం ప్రక్రియలో కామ్రేడ్ కపర్ది గారి దూరదృష్టి, ఆయన కృషి కీలకం. ట్రేడ్ యూనియనిస్టుగా ఆయన ఒక ప్రత్యేక స్థానాన్ని పొందారు.

తాడేపల్లిగూడెంలో 600 ఎకరాల విమానాశ్రయ భూములు ఏళ్ళ తరబడి ఖాళీగా పడి ఉండేవి. వందలాది మంది పేదలను సమీకరించి కామ్రేడ్ కపర్ది ఆ భూముల్లో ఇళ్ళు వేయించారు. పేదలను ఖాళీ చేయించటానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. పోలీస్ బలాన్ని ప్రయోగించారు. 1975 ఎమర్జెన్సీ కాలంలో బుల్డోజర్లు తెచ్చి ఇళ్ళు కూల్చేందుకు మిలిటరీ ఎస్టేట్ అధికార్లు ప్రయత్నించారు. కామ్రేడ్ కపర్ది నాయకత్వంలో పేదప్రజలు ప్రతిఘటించారు. అంతిమంగా ఇళ్ళు కూల్చకుండా ప్రభుత్వం నుండి ఆదేశాలు జారీ చేయించి పేద ప్రజలకు కామ్రేడ్ కపర్ది న్యాయం జరిగేలా కృషిచేశారు. కామ్రేడ్ కపర్ది నాయకత్వంలో కమ్యునిస్టు పార్టీ చేసిన పోరాట ఫలితంగా 3000 మంది పేద ప్రజలు ఈనాడు సొంత ఇళ్ళు ఏర్పరచుకోగలిగారు. తనకు వచ్చిన ఆస్తి యావత్తు పీడిత తాడిత ప్రజల కోసం, సమాజ సేవలోనూ, కమ్యునిస్టు పార్టీలోనూ హారతి కర్పూరంలా ఖర్చు చేశారు. కామ్రేడ్ కపర్ది ఒక సంవత్సర కాలంపాటు మాస్కోలో రాజకీయ శిక్షణా తరగతులలో పాల్గొని వచ్చారు. కామ్రేడ్ కపర్ది గారిది కమ్యునిస్టు ఉద్యమ చరిత్రలో (1923-1981) ఒక ప్రత్యేక అధ్యాయం. హాస్యప్రియత్వం, చమత్కార ధోరణి ఆయన స్వంతం. ఏలూరు పార్లమెంటుకు ఒకసారి పోటీ చేసి ఓడిపోయారు. కామ్రేడ్ కపర్ది సి.పి.ఐ. పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా, జాతీయ సమితి సభ్యులుగా పార్టీకి అంకిత భావంతో నాలుగు దశాబ్దాలపాటు తమ సేవలందించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దాదాపు దశాబ్ద కాలంపాటు బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో పలు కార్మిక సంఘాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు. ఎన్నో ఒత్తిళ్ళను, సవాళ్ళను, బెదిరింపులను ధైర్యంతో ఎదుర్కొన్నారు. సహకార రంగ ఉద్యోగులు, బ్యాంక్, ఇన్సూరెన్స్, టెలికం, విద్యుత్, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం నిర్వహించారు. సింగరేణి, ఐ.డి.పి.యల్., ఇ.సి.ఐ.యల్., హెచ్.సి.యల్. వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సంఘాలకు భరోసాగా నిలిచారు. రాష్ట్రంలో ఎఐటియుసిని బలీయమైన శక్తిగా నిర్మించటానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది.




జీవితాంతం ఆయన "దోపిడి రహిత సమాజం" కోసం "కార్మిక వర్గ రాజ్యం" కోసం అంకితభావంతో, నిబద్ధతతో కృషిచేశారు. 1981 మే 25వ తేదీన ఆయన హైదరాబాద్‌లో మరణించారు.

కపర్ది శతజయంతి ఉత్సవాలను గుంటూరులో నిర్వహించాలని ఎఐటియుసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి నిర్ణయించింది. ఈ సందర్భంగా కామ్రేడ్ కపర్ది స్మారకోపన్యాసాలు గుంటూరులో సెప్టెంబర్ 3వ తేదీ నిర్వహించారు. "వర్తమాన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు - కార్మిక వర్గం పాత్ర" అనే అంశంపై హైదరాబాద్ యూనివర్శిటీ సోషల్ సైన్సెస్ విభాగ విశ్రాంత ఆచార్యులు మరియు మానవ హక్కుల ఉద్యమ నేత జి.హరగోపాల్ గారు ప్రసంగించారు. "భారత ప్రజాస్వామ్య - రాజ్యాంగం - ఒక పరిశీలన" అనే అంశంపై నాగార్జున యూనివర్శిటీ పొలిటికల్ సైన్స్ డిపార్టుమెంట్ ఆచార్యులు ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి ప్రసంగించారు. కామ్రేడ్ కపర్ది గారి కుమారులు మరియు కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులు మందలపర్తి కిషోర్, ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు పాల్గొన్నారు. ఘనమైన త్యాగ పూరిత, ఆదర్శవంతమైన చరిత్ర కల్గిన కామ్రేడ్ కపర్ది ఆశయాల సాధన కోసం పునరంకితమవుదాం. ఆయన ఆదర్శాలను పాటించటమే ఆయనకు నిజమైన నివాళి. ❑



ఏఐటీయూసీ అధ్యక్షుడు డాంగేతో కపర్దీ



కామ్రేడ్స్ వెల్లంకి సుబ్బారావు, జోశ్యభట్ల సత్యనారాయణ, కేఎల్ మహేంద్ర, ఎంవీఎన్ కపర్దీ, కె.పూర్ణచంద్రరావు



విశాఖలో ఏఐటీయూసీ మహాసభ ఆహ్వాన సంఘ సభ్యులతో కపర్దీ

# శ్రమ జీవుల కోసం జీవితాన్ని అంకితం చేసిన కమ్యూనిస్టు

## కమ్యూనిస్టు నాయకుల నివాళి

- సురవరం సుధాకరరెడ్డి



కామ్రేడ్ కపర్దీతో పరిచయం నా విద్యార్థి జీవితంలోనే ప్రారంభమైంది. పశ్చిమ గోదావరి జిల్లాలో ట్రేడ్ యూనియన్ నాయకులుగా, పార్టీ నాయకుడిగా, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (ఎ.ఐ.టి.యు.సి) ప్రధాన కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఆయన బాధ్యతలు నిర్వహించారు. ఆర్.టి.సి ఎంప్లాయీస్ యూనియన్ నిర్మాణంలో, ఉద్యమ నిర్వహణలో, విస్తరణలో కామ్రేడ్ కపర్ది కీలకమైన పాత్ర నిర్వహించారు. విభిన్న అంశాలపై లోతుగా అధ్యయనం చేసేవారు. తన వాదనా పటిమతో కార్మికులను, ప్రత్యర్థులను ఒప్పించేవారు. ఆయన గొప్ప వక్త. సభలు, సమావేశాల్లో ఆయన ఉపన్యాసాలు ఆసక్తికరంగా వుండేవి. పార్టీ జాతీయ నాయకుల ఉపన్యాసాలకు తెలుగు అనువాదం, వేములపల్లి శ్రీ కృష్ణ, యం.వి.యన్. కపర్ది చేసేవారు. ఒరిజనల్ ఉపన్యాసాలు వాడి, వేడి తగ్గకుండా ఆయన అనువాదాలు, ప్రజలను ఆకట్టుకునేవి. కామ్రేడ్ కపర్ది విద్యార్థి గానే జాతీయోద్యమం వైపు, కమ్యూనిస్టు ఉద్యమం వైపుకు ఆకర్షింపబడ్డారు. జిల్లాలో ఇతర నాయకులతోపాటు బలమైన విద్యార్థి ఫెడరేషన్ ఉద్యమాన్ని నిర్మించారు. తాడేపల్లిగూడెం కేంద్రంగా చేసుకొని కార్మిక సంఘాలను, కమ్యూనిస్టు పార్టీని నిర్మించారు. పేద ప్రజల నాయకుడిగా వారి హృదయాలలో స్థానం సంపాదించారు. కామ్రేడ్ కపర్ది మానవతావాది. నైతిక విలువలు, కమ్యూనిస్టు విలువలపట్ల నిబద్ధతతో వుండేవాడు. అనేక ఆర్థిక ఇబ్బందులు వున్నా తొణుకు, బెణుకు లేకుండా నిరంతరం చిరునవ్వుతో వుండేవాడు. యావత్తు కుటుంబసభ్యులను కమ్యూనిస్టులుగా మార్చిన త్యాగధనుడాయన. వ్యక్తిగా కామ్రేడ్ కపర్ది ప్రేమాస్పదుడైన నాయకుడు. ఎంత పెద్ద బాధ్యతల్లో వున్నా అందరికి అందుబాటులో వుండేవాడు. వయసుతో నిమిత్తం లేకుండా ఆయన కంటే బాగా చిన్నవారితో కూడా కలివిడిగా వుండేవాడు. మా పరిచయం అలాగే జరిగింది. అనేక రాజకీయ, నిర్మాణ సమస్యలపై మా అనుమానాలు, అభ్యంతరాలు ఆయనతో చర్చించేవారం. ఆయన ఓపికతో మాతో మాట్లాడి విషయ వివరణ చేసేవారు. కామ్రేడ్ - కపర్ది హాస్యప్రియులు. డాక్టర్ రాజ బహదూర్ గౌర్ కపర్ది కలిసి వుంటే అక్కడంతా నవ్వులే. సీరియస్ రాజకీయ చర్చలతో వేడెక్కిన వాతావరణాన్ని వారి జోకులతో చల్లపరిచే వారు. ఒక్కసారి వాతావరణం మారిపోయేది. కామ్రేడ్ కపర్ది శ్రమ జీవులకోసం, సోషలిస్టు లక్ష్యం కోసం జీవితాన్ని అంకితం చేసిన కమ్యూనిస్టు. ❑



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న డాంగే, ఆయన ప్రసంగాన్ని తర్జుమా చేస్తున్న కపర్దీ

# కార్యశీలి కపర్దీ





- వంక సత్యనారాయణ

అది 1944వ సంవత్సరం. క్విట్ ఇండియా ఉద్యమంతో దేశం అట్టుడుకుతోంది. సర్వత్రా స్వాతంత్ర్య పోరాట కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. సరిగ్గా అప్పుడే, అలీపూర్ క్యాంపు జైల్లో శిక్ష అనుభవించి, ఏలూరుకు బయల్దేరాం నేనూ నా మిత్రులూను. కామ్రేడ్స్ భూపతిరాజు సుబ్బరాజు, పరకాల రమణ రావు, పరకాల శేషావతారం, పేరిచర్ల సోమరాజు, అమరజీవి పాకెర్ల సంజీవరావు, నండూరి రామారావు, నేను రైలులో కూర్చుని జైలు అనుభవాలను కలబోసుకుంటున్నాం.

అంతలో అనుకోని సంఘటన ఒకటి జరిగింది.

మా పెట్టెలోని కొందరు ఆకతాయి కుర్రాళ్లు ఒక మహిళను వేధించడానికి ప్రయత్నించారు. మేం వాళ్లను వారించాం. మా వాదోపవాదాలు నెమ్మదిగా ఘర్షణ రూపం తీసుకున్నాయి. అదే కంపార్టుమెంటులోని ముగ్గురు యువకులు మా తరఫున తగాదాలో జోక్యం చేసుకున్నారు. ఆకతాయి కుర్రాళ్ల నోరు మూయించి గొడవ సర్దుబాటు చేశారు. ఆ యువకుల సత్ప్రవర్తన మమ్మల్నే కాదు – రైలు పెట్టెలోని వారందరినీ ఎంతో ఆశ్చర్యపరిచింది. వాళ్లు ఎవరో, ఊళ్లూ పేళ్లూ ఏమిటో, అప్పుడు మాకు ఏమీ తెలియదు.

రైలు ఏలూరు చేరాకా మేమందరం కమ్యూనిస్టు పార్టీ ఆఫీసుకు చేరుకున్నాం. చిత్రం!! రైల్లో మాకు కనిపించిన ముగ్గురు యువకులూ అక్కడ మాకు ఎదురయ్యారు. వాళ్లు – ఎం.వి.ఎన్ కపర్దీ, కర్లపాటి సుబ్బారావు, క్రొవ్విడి నరసింహం (ఈయన తర్వాత హైకోర్టు అడ్వకేటుగా రాణించారు). వాళ్లు ముగ్గురూ గుంటూరులో కాలేజీ చదువు చదువుతూ, విద్యార్థి సమాఖ్య కార్యకర్తలుగా పనిచేసి, మార్క్సిజం పట్ల ఆకర్షితులై, కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేయడానికి కృత నిశ్చయంతో ఉన్నారన్న సంగతి అంత వరకూ మాకు తెలియదు!!

ఇలా అతి విచిత్రంగా కపర్దీతో ఏర్పడిన పరిచయం, పీడిత ప్రజల పోరాటాలతో పెనవేసుకుపోయి సుదీర్ఘ కాలం కొన సాగుతుందని నేనానాడు ఊహించలేదు.

చిరకాలంపాటు భూస్వాముల కబంధ హస్తాల్లో నలిగి, నిరాశా నిస్పృహలతో కాలం బరువుగా నెట్టుకొస్తున్న కొల్లేరు రైతులను దోపిడీకి వ్యతిరేకంగా పోరుబాటలోకి తీసుకురావడంతో కపర్దీ తన త్యాగపూరిత జీవితం ప్రారంభించారు. ఆనాటి నుంచి ఆయన జీవితం పీడిత జన పోరాటాలకే అంకితమై కడదాకా సాగింది. ఈ పోరాట క్రమంలో ఎన్నో అడ్డంకులూ, అవరోధాలూ అడుగడుగునా ఎదురైనా కపర్ది ముందుకే సాగిపోయాడు. కొల్లేరు అన సర్వే రైతుల పోరాటం సమయంలో ఇందుకూరి సుబ్బరాజు, దూసనపూడి విరాటరాజు, కపర్ది కొన్ని ప్రాంతాల్లో అడుగుపెట్టడానికి వీల్లేదని ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించింది. రైతులకూ భూస్వాములకూ ముఖాముఖీ జరిగిన పోరాటాల్లో, రైతులకు స్థైర్యాన్నిచ్చి నిలబెట్టడంలో కపర్దీ కీలకపాత్ర వహించారు. జిల్లా కమిటీ ఆదేశాలకు అనుగుణంగా కపర్దీ కార్మికోద్యమ నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. ఆదిలోనే ఆయన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. అయితే, మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగడమే కపర్దీ నైజం! ఆయన ధైర్య సాహసాలు ఒక్కోసారి శత్రువులను సైతం ఆశ్చర్యచకితులను చేసేదనడం అతిశయోక్తి కాదు.

తాడేపల్లిగూడెం మునిసిపల్ వర్కర్స్ యూనియన్, ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్, మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ స్థాపించే కృషిలో ఎన్ని అడ్డంకులూ ఒత్తిళ్లూ ఎదురైనా కపర్దీ వెనకడుగు వేయలేదు. ఆ సందర్భంగా ఆయన మీద అక్రమంగా కేసులు కూడా బనాయించారు. ఎవరెన్ని విధాల ప్రయత్నించినా కపర్దీని అడ్డుకోలేకపోయారు. తాడేపల్లిగూడెం కేంద్రంగా మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అంతటా వ్యాపించడమే ఇందుకు నిదర్శనం!!

అది జైలు ! అక్కడ ప్రతి క్షణం క్రూర నిర్బంధం గుప్పిట్లో నలిగిపోతుంది. బతుకు భారంగా గడుస్తుందక్కడ. ఆ రోజుల్లో కపర్దీలో నిజమైన కమ్యూనిస్టు కార్యకర్తను చూశాను నేను. తోటి కామ్రేడ్స్ పట్ల కపర్దీ ప్రేమ, వారిని విజ్ఞానవంతులుగానూ చైతన్యవంతులైన మార్క్సిస్టులు గానూ తీర్చిదిద్దడంలో కపర్దీ పడే శ్రమ నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసేది. రాజకీయ అర్థశాస్త్రాన్నీ, ప్రపంచ రాజకీయాలనూ ఎంతో ఓర్పుతోనూ నేర్పుతోనూ తోటి వారికి బోధించి, వారిని మంచి కమ్యూనిస్టులుగా తీర్చిదిద్దిన మార్క్సిస్టు మేధావి కపర్దీ. జైల్లో ఉన్నరోజుల్లో ఇంగ్లిష్ భాషా సాహిత్యాలు పరిచయం చేసి అనేక మందిని విజ్ఞానవంతులుగా దిద్దారాయన. జైల్లో ఉన్న కమ్యూనిస్టు ఖైదీలపై జరిగిన కాల్పులకు వ్యతిరేకంగా సాగిన అన్ని పోరాటాల్లోనూ ముందు నిలిచిన యోధుడు కపర్దీ. **(మిగతా 46వ పేజీలో)**

# నవచైతన్య రూపశిల్పి

కమ్యూనిస్టు నాయకుల నివాళి



- పరకాల పట్టాభి రామారావు

ఏ దేశంలోనైనా విప్లవాన్ని సాధించి, నవసమాజ నిర్మాణానికి సాగిపోవాలంటే ఎన్ని మజిలీలు ? ఎన్ని పోరాట దశలు ? "దారి పొడుగునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ" ఎందరెందరు మహావిప్లవ యోధులు ఈ మహత్తర సామాజిక పరిణామ క్రమంలో సమిధలు కావాలి ? ప్రజలను సంఘటిత పరచాలి – వారిని సుషుప్తి నుంచి మేల్కొలపాలి ! వారిని నవ చైతన్య మూర్తులుగా రూపురేఖలు తీర్చిదిద్దాలి !!

ఆంధ్రదేశంలో అటువంటి నవ సమాజ నిర్మాణానికి ప్రారంభమైన అవిశ్రాంత విప్లవ పోరాట క్రమంలో, ఒక శ్రామిక విభాగాన్ని తీర్చిదిద్దడంలోనూ వారిని ఫ్యూడల్ సమాజ వ్యవస్థలో తలెత్తిన ప్రాథమిక పారిశ్రామిక దశ తాలూకు అవలక్షణాల నుంచి, అవాంఛనీయ ధోరణుల నుంచి తప్పించి, ఒక చైతన్య విలసిత నూతన కార్మిక వర్గంగా మలచడంలోనూ సంఘటిత స్వరూపం ఇచ్చే క్రమంలోనూ తన జీవితాన్నంతటినీ ధారపోసి శ్రమించిన నవచైతన్య రూపశిల్పి కామ్రేడ్ ఎమ్.వి.ఎన్. కపర్దీ.

ఒక రోజున 'విశాలాంధ్ర' కార్యాలయంలో, ఆంధ్రప్రదేశ్లోని మోటారు రవాణా కార్మికుల గురించి మేమిద్దరం ముచ్చటించుకున్నాం. నేటి సంఘటిత బస్ రవాణా కార్మికుల జీవన పరిస్థితుల పరిణామం గురించి ఒక కావ్యం, ఒక చక్కని నాటకమే రచించవలసినంత అద్భుత ఇతివృత్తం లభ్యం కాగలదనుకున్నాం. మా చిన్ననాటి (1930) బస్ రవాణా కార్మికులు, వారి జీవన పరిస్థితులు మా కళ్ల ఎదుట కనబడ్డాయి – సినిమా రీలు వలె! గ్రామాలలోని భూస్వాములూ, లేదా పట్టణాలలోని కంట్రాక్టర్లూ, మిల్లు యజమానులూ ఆ రోజుల్లో బస్సులను తిప్పుతుండేవాళ్ల యజమానుల మధ్య పోటీలూ కొట్లాటలకు కార్మికులు సమిధలయ్యేవారు. కార్మికులకు విశ్రాంతి, విరామమూ, కనీస వేతనాలూ, ఓ గ్యారంటీలూ, పనిగంటలూ ఏవీ ఉండేవి కావు! బస్ కండక్టర్లూ డ్రైవర్లను పాలేర్లలాగే చూసేవారు. ఇలాంటి నికృష్ట పరిస్థితుల్లో జీవించే ప్రైవేటు బస్ కార్మికులు నిజానికి కార్మికులు కాదు. వాళ్లు ఆ నాటి గ్రామీణ, పట్టణ దోపిడీ వర్గాల చేతుల్లో సంఘ వ్యతిరేక శక్తులుగానూ, రౌడీ బలగాలుగానూ ఉపయోగపడేవాళ్లు. ఈ నికృష్ట పరిస్థితుల వలన వాళ్ల జీవితాలు అరాజక జీవితాలుగా ఉండేవి. ఉండేవి అనడంకన్నా ఆ విధంగా ఉంచబడేవి అనడం సరైంది. అనేక దుర్లక్షణాలూ, దురభ్యాసాలూ వాళ్లలో ప్రబలంగా ఉండేవి.

భూస్వామ్య వ్యవస్థలోని సరదాలలో శ్రీరామనవమి పందిళ్లు, భోగం మేళాలు భాగంగా ఉండేవి. నవరాత్రి పందిళ్లు ముమ్మరంగా సాగేవి. ప్రతి ప్యాసింజరూ ఈ పందిళ్లకూ, ఉత్సవాలకూ, భోగం మేళాల ఖర్చులకూ చందాలు – నిర్బంధంగా – ఇచ్చుకోవాల్సిందే. బస్సు యజమానులు ఈ హడావిడికి పెత్తందార్లు.

**ఆనాటి ప్రైవేటు బస్సు సర్వీసులకు నియమిత వేళలు ఉండేవి కావు. సీట్లు నిండాలి – అప్పుడే బస్సులు కదలాలి. ఈలోగా బస్సు ఓనరుగారింట్లో ఎవరైనా బస్సెక్కితే వాళ్లింటి దగ్గర ఒక గంటో, అరగంటో పడిగాపులు పడాలి. సబ్ ఇన్స్పెక్టర్ గారి అల్లుడు గారో, బావమరిది గారో బయలుదేరుతుంటే వారి కోసమూ ఆగాలి. ఫ్రంట్ సీట్లో కూర్చోవడం, కూర్చోబెట్టడం ఆనాడు ఓ దర్జా. ఆ సీట్లో మామూలుగా ఎవరినీ కూర్చోనిచ్చే వారు కాదు. అవి వీఐపీలకు రిజర్వ్ అయి ఉండేవి. పొరపాటున ఎవరైనా కూర్చుంటే ఓనరు గారి తాలూకు గానీ, ఇన్స్పెక్టర్‌గారి తాలూకు గానీ ఎవరైనా వస్తే దిగి పోవాల్సిందే. ఇవీ ఆనాటి మర్యాదలూ, ఘరానా వ్యవహారాలూ.**

కొన్ని కొన్ని సందర్భాల్లో పోటాపోటీల మీద ప్యాసింజర్లను తక్కువ రేటుకు తీసుకుపోయేవారు. వారి పావలాకు తీసుకువెళ్తే, వీరు బేడ! అలా పోటీలుండేవి. అరటిపళ్లు పంచి పెట్టి ప్యాసింజర్లను కేన్వాస్ చేసి ఎక్కించుకునే వారు. ఒక్కోసారి ఊరికే తీసుకుపోవడం కూడా జరిగేది. ఎదుటి సర్వీసును పడగొట్టాలి. అందుకూ ఇదంతా. ప్రైవేటు బస్సు సర్వీసులు ఎలా ఉండేవో, అందులో పనిచేసే కార్మికుల జీవితం ఎలా ఉండేదో తెలుసుకోవడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

డ్రైవర్లకు, కండక్టర్లకు బొత్తిగా చదువు అక్కర్లేదు. సంస్కారం అసలే అక్కర్లేదు. అక్కర్లేదు అనడంకన్నా ఉండకూడదు అంటే రైటు. ఉన్నవాడు పనికిరాడు. మొరటుగా, జబర్దస్తీగా ఉండాలి. దౌర్జన్యాలకు, కొట్లాటలకు సంసిద్ధమై ఉండాలి. నూటికీ కోటికీ ఒక్కరు అలా పెద్ద మనుషులుగా, గౌరవ మర్యాదలు కలిగిన వాళ్లుగా ఉండేవారు. మహమ్మద్ మీరా (1980 దశకంలో

చనిపోయిన సీపీఎం బస్సు కార్మిక నాయకుడు) నరసాపురం – కోడేరు లైన్‌లో డ్రైవర్‌గా ఉండేవాడు. మార్గమధ్యంలో విద్యార్థులు చెయ్యి ఊపితే బస్సాపి ఎక్కించుకునేవాడు. ఆ తర్వాత మీరా యువజన ఉద్యమంలోకి, కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చాడు. 1939–45 రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బొగ్గు బస్సులొచ్చాయి. బొగ్గు ప్లాంటు బస్సుకు వెనకాల ఉండేది. కండక్టర్లూ, క్లీనర్లూ బాగా బ్లోయర్ కొట్టాలి. అలా కొడితే గానీ బళ్లు కదిలేవి కాదు. గుడ్డలన్నీ మసి మసి. లారీ సర్వీసు చాలా అరుదు.

1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1953లో ఆంధ్ర రాష్ట్రం, 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణతో రాష్ట్ర రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితులు మారడం మొదలైంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత, నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, అంతకుముందు హైదరాబాద్ స్టేట్ బస్సు రవాణా సంస్థను ఆంధ్ర ప్రాంతానికీ విస్తరించారు. ఏపీఎస్ఆర్టీసీ అలా అవతరించింది. ప్రైవేటు బస్సులు అదృశ్యమయ్యాయి. సంజీవరెడ్డిగారి ఏనుగులొచ్చాయి అనేవారు. ఆ రోజుల్లోనే ఆంధ్ర ప్రాంతంలో బస్సు రవాణా అసంఘటిత రూపం నుంచి సంఘటిత పరిశ్రమగా రూపొందింది. ఈ సంధి యుగానికి పూర్వమే 1940 దశకం అర్థ భాగానికే కామ్రేడ్ కపర్దీ విద్యార్థి ఉద్యమంలో నుంచి కమ్యూనిస్టు ఉద్యమంవైపు ఆకర్షితుడై జిల్లాలో కార్మికోద్యమ నిర్మాణంలో బాధ్యతలు వహించాడు. ఆయనకు బస్సు రవాణా కార్మికులను సంఘటితపరిచే లక్ష్యాన్ని పార్టీ నిర్దేశించింది.

కామ్రేడ్ కపర్దీ జాతీయోద్యమంలో పాల్గొన్న కుటుంబం నుంచి వచ్చారు. ఉన్నత విద్య, సంస్కారం, దేశభక్తి కలిగిన యువకుడాయన. ఆనాటికి అరాజక పరిస్థితుల్లో ఉన్న ప్రైవేటు బస్సు కార్మికులతో కలిసి, వారిని విజ్ఞానవంతులనూ, చైతన్యవంతులనూ చేస్తూ, దురలవాట్లను దూరం చేస్తూ, సంఘటిత కార్మికోద్యమంలోకి తీసుకురావడానికి కపర్దీ చేసిన కృషి ఆదర్శవంతమైంది. కష్టమైనది, క్లిష్టమైనది కూడా. వారి విశ్వాసాన్ని చూరగొనాలంటే వారిలో ఒకరుగా మెలగాలి. ఆనాడు బస్సు కార్మికులతో కలసి మెలసి తిరగడమంటే సంఘంలో న్యూనతగా చూసే స్థితి. ప్రైవేటు బస్సు కార్మికుల సంఘాలను పెట్టి, వారి సమస్యలను తీసుకుని పోరాడడమంటే ఆనాటి బలమైన స్వార్థపర వర్గాలలో ఒకరైన బస్సు యజమానులతో ఢీకొనడమే. వారి ధనబలం, రౌడీ బలగాలకు ఎదురొడ్డి నిలబడడం సామాన్యమైన విషయం కాదు. ఎన్నో తప్పుడు కేసులూ, దౌర్జన్యాలూ, కొట్లాటలూ అన్నింటికీ సిద్ధం కావాలి. అంతేకాదు బస్సు కార్మికులలో అంతకుముందున్న దెబ్బలాటలు, ముఠా తగాదాలు పరిష్కరించి ట్రేడ్ యూనియన్ మూల సూత్రాలూ, పోరాట విధానాలూ నేర్పడం అంటే అంత సులువేం కాదు. ఈ విధంగా అసంఘటిత రంగం నుంచి సంఘటిత రంగంలోకి మారే పరివర్తన దశలో కామ్రేడ్ కపర్దీ చారిత్రాత్మకమైన కర్తవ్యాన్ని నిర్వర్తించారు.

పశ్చిమ గోదావరి జిల్లాలోనూ, అటు తర్వాత రాష్ట్రంలోనూ ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అతి పెద్ద బస్సు కార్మిక సంఘంగా రూపొందడంలో కపర్దీ కీలకపాత్ర వహించారు. ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతంలో యూనియన్ బలాన్నీ, నిర్మాణాన్నీ పటిష్టం చేసే కృషిలో కపర్దీ అద్వితీయ పాత్ర పోషించారు. ఈనాటి ఆధునిక రవాణా పరిశ్రమలో ఆర్టీసీ కార్మికుడు ఎన్ని విధాల ఉన్నత స్థితిలో ఉన్నాడో వేరే చెప్పనవసరం లేదు. నియమిత జీవితం, చదువు సంధ్యలూ, నాగరికత, సంస్కారం కలిగిన ఆధునిక కార్మిక వర్గంలో భాగంగా ఆత్మవిశ్వాసంతో జీవించగల కార్మికుడిగా ఆర్టీసీ కార్మికుడు రూపొందాడు. తన హక్కులేమిటో పారిశ్రామిక వ్యవస్థలో తన కీలక స్థానం ఏమిటో గుర్తించగల స్థితికి చేరుకున్నాడు. ఈనాడు బీఏలు, ఎంఏలు చదివిన వారు కూడా డ్రైవరు, కండక్టర్లుగా ఉన్నారు. రైల్వేల తర్వాత పెద్ద యంత్రాంగం, సిబ్బంది, బస్సు స్టేషన్లు, ప్రత్యేక వర్క్ షాపులు, ఆసుపత్రులు, విశ్రాంతి మందిరాలు కలిగి ఉన్న ఆధునిక రవాణా పరిశ్రమ వ్యవస్థలో నైపుణ్యంగల శ్రామికుడిగా ఆర్టీసీ కార్మికుడు సమాజంలో గౌరవమర్యాదలు పొందుతున్నాడు. ఏ ప్రైవేటు యాజమాన్యానికీ వంగివంగి సలాములు చేయవలసిన దుస్థితిలో లేడు. వారికి బానిసలుగా, పాలేర్లుగా, రౌడీ బలగాలుగా ఉపయోగపడవలసిన పరిస్థితిలో లేడు. ఇటువంటి విద్యాధిక, సంఘటిత శ్రామిక వర్గాన్ని రూపొందించడంలోనూ, వారిలో రాజకీయ, సామాజిక చైతన్యాన్ని ప్రదీప్తం చేయడంలోనూ కామ్రేడ్ కపర్దీ వహించిన పాత్ర అక్షరాలా అమోఘమైనది. ❑

# కార్యశీలి కపర్దీ

**(44వ పేజీ తరువాయి)**


1952లో, మొదటి జెనరల్ ఎన్నికలు రావడంతో, కపర్దినీ ఇతర కమ్యూనిస్టు డిటెన్యూలనూ విడుదల చెయ్యక తప్పలేదు ప్రభుత్వానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఆ ఎన్నికల్లో కపర్దీ విరామమెరుగక పరిశ్రమించారు. గ్రామగ్రామాన తిరుగుతూ, కమ్యూనిస్టుపార్టీ ఆశయాలు వివరించడంలో కపర్దీ చూపించిన చాకచక్యం మరువరానిది. 1964లో, కొందరు మైనారిటీ వర్గం వారు మార్క్సిస్ట్ పార్టీగా ఏర్పడడంతో, కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక తప్పనిసరయింది. ఆ విపత్కర పరిస్థితుల్లో సైతం, కపర్దీ కనబరిచిన స్థైర్యం జిల్లాలోని అనేకమందిని చీలికవాదం వైపు కొట్టుకుపోకుండా ఆపింది. వాళ్లంతా మాతృసంస్థలోనే కొనసాగేలా చెయ్యడంలో కపర్దీ చేసిన కృషి ఎనలేనిది. ❑

# వెలుగు పంచిన వైతాళికుడు

**కమ్యూనిస్టు నాయకుల నివాళి**

-భూపతిరాజు సుబ్బరాజు,
సూర్యకాంతం





కొవ్వొత్తిలా కరిగిపోతూ ఎందరికో వెలుగు పంచిపెట్టి జీవులు కమ్యూనిస్టు. కమ్యూనిస్ట్ ఉద్యమం బలపడటానికి ఎంత త్యాగం అవసరమో అంతకు రెట్టింపుగా త్యాగం చేసి ఉద్యమాలకు ఊపిరిలూదిన మహా మనుషుల కోవకు చెందుతారు కామ్రేడ్స్ కపర్దీ, శేషమ్మగార్లు. అలాంటి వాళ్ళకి ఉద్యమమే ఊపిరి అన్నం, పానం, సర్వస్వం. జీవితాంతం వరకు కమ్యూనిస్టులుగా జీవించగలగటం మహా మనుషులకే సాధ్యం. అలా జీవించి చూపించారు కామ్రేడ్స్ కపర్దీ, శేషమ్మగార్లు. కామ్రేడ్ కపర్దీ సహ ధర్మచారిణిగా శేషమ్మ గారు ఆయన ఆశయాలకు 'అన్నివేళలా'- కష్టాలలో, సుఖాలలో-చేదోడు వాదోడుగా ఉంటూ, కపర్దీ ప్రతీ విజయం వెనుక శేషమ్మ గారి అపురూపమైన పాత్ర ఉంది అని అన్పిస్తుండేవారు ఆమె. అంతే కాదు వాళ్ళ సహచరులమైన మాకు ఆవిడ నిర్వహించిన పాత్ర కళ్ళకు కట్టినట్లు కనిపిస్తూనే ఉండేది.

ఒకసారి ఢిల్లీలో పార్టీ కాన్ఫరెన్సుకు గూడెం నుండి ఒక బస్సు. తణుకు నుంచి ఒక బస్సు బయలుదేరాయి. కామ్రేడ్ కపర్దీగూడెం బస్సుకు, నేను (సుబ్బరాజు) తణుకు బస్సుకు ఇన్చార్జిం. మా బస్సు ఢిల్లీకి సమీపంలో ఆగిపోయింది. ఇంతలో గూడెం నుండి బయలుదేరిన బస్సు అక్కడికి వచ్చింది. అందులో వున్న కపర్దీ బస్సు దిగి మా దగ్గరకు వచ్చి మా బస్సు బాగు చేయడానికి ఢిల్లీ నుంచి మెకానిక్‌ను పంపుతానని చెప్పారు. అలాగే ఎంతో శ్రమ పడి ఒక మెకానిక్‌ను పంపించి కాన్ఫరెన్సులో మా రాకకు ఆలస్యం గురించి ప్రకటించాడు. ఇది ఎందుకు చెప్పామంటే కపర్దీ లాంటి వాళ్ళు ఎంతో బాధ్యతాయుతంగా ఉంటూ ఉద్యమంలోకి వచ్చే కార్యకర్తలకు అత్యవసర సమయాలలో నాయకులు ఎంత బాధ్యతాయుతంగా ఉంటారో తెలియజేసి వాళ్లకి మానసిక స్థైర్యం కలిగించింది. అలాంటి రెస్పాన్సిబులిటీ సుశిక్షతులైన, నిజమైన కమ్యూనిస్టు నాయకులలో మాత్రమే సాధ్యం. కామ్రేడ్ కపర్దీ అలాంటి వాళ్లలో ముఖ్యుడు. ఒక సందర్భంలో మేమిద్దరం కపర్దీగారి ఇంటికి వెళ్ళాం. హైదరాబాద్‌లో ఆ రోజు రాత్రి వాళ్ల ఇంట్లో - హిమాయత్‌నగర్ అద్దె ఇంట్లో - ఉండాల్సి వచ్చింది. అది ఒకే రూమ్ ఉన్న ఇల్లు. అప్పటికే పెళ్ళైన వాళ్ళ పెద్దబ్బాయి ఆ రూమ్‌లో ఉండేవాడు. ఆ నాటికి కామ్రేడ్ కపర్దీ సి.పి.ఐ. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు. అంతటి నాయకుడు అలాంటి సాధారణమైన ఇంట్లో అంతమంది పిల్లలతో ఉండడం చూసిన మాకు కపర్దీ నిరాడంబరమైన జీవన విధానం ఆశ్చర్యం కలిగించింది. చివరగా ఒక మాట చెప్పదలచుకున్నాం. కష్ట జీవులు కష్టాల కడలిలో పడి కొట్టుకుపోకుండా వారి జీవితాలలో 'వెలుగు' కోసం శ్రమించే కమ్యూనిస్టులు ఎంత నిరాడంబరంగా ఉంటే అంత నియమబద్ధంగా ఉండగలుగుతారని మాకు కపర్దీ శేషమ్మ గార్ల జీవితాలను చూసాక బాగా అర్థం అయింది. అలాంటి నిస్వార్థపరుల చరిత్ర ఈనాటి తరానికి పెద్ద బాలశిక్షలాంటిది. అది వాళ్ళంతా చదివి తీరాల్సిందే.



ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయినపుడు పనిగట్టుకొని తణుకు పరిసర ప్రాంతాలలోని మొత్తం నియోజకవర్గం అంతటిలోను తిరిగి ప్రజలందరికీ థ్యాంక్స్ చెప్పారు. అలాంటి నూతన ఆచారాలను కపర్దీ మంచి కమ్యూనిస్టుగా ఆచరించి తరువాత తరం నాయకులకు ఆదర్శంగా నిలబడ్డారు. ఇలాంటివి ఎన్నో విశేషాలు ఉన్నాయి ఆయన జీవితంలో. అవన్నీ చెప్పగలిగే శక్తి, సమయం, ఓపిక మాకిప్పుడు లేవు. ❑

# మంచి మనసు

## కమ్యూనిస్టు నాయకుల నివాళి

- డి.ఎస్.రామచంద్రరావు

కపర్దీ గారి గురించి తలుచుకున్నప్పుడల్లా నాకు టెన్నిసన్ పద్యపాదం ఒకటి మనస్సులో మెదులుతుంది. "My Strength is as is the strength of ten, Because, my heart is pure" పరిశుద్ధ హృదయానికి ఉన్న శక్తి అంతటిది. 1981 మే 25న కామ్రేడ్ కపర్దీ కన్ను మూసే నాటికి సి.పి.ఐ కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డిగారు టూర్లో వున్నారు. కపర్దీ గారి అకాల మరణ వార్త విన్న రాజశేఖర్‌రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని ఓ టెలిగ్రాం ద్వారా తెలియజేశారు. "Kaparde a comrade of sterling qualities, a dynamic leader, a champion of the working class" అని రాజశేఖర్ రెడ్డిగారు ఆ టెలిగ్రాం లో పేర్కొన్నారు. ఆయన పరమ మితభాషి. ఎవరినీ పొగిడే మనిషి కాదు. ఈ విషయం తెలిస్తేగానీ కపర్దీగారి గురించి రాజశేఖర్ రెడ్డిగారు చెప్పిన మాటల్లోని సారాంశం పూర్తిగా బోధపడదు.


స్వాతంత్ర్యానికి ముందు విజయనగరం మహారాజా కాలేజి, పండితులు-కళాకారులు-విజ్ఞానవేత్తలకు నిలయంగా వుండేది. బందరు జాతీయ కళాశాల, జాతీయ భావాలుకల పత్రికా రచయితలకు, నాయకులకు కేంద్రంగా వుండేది. గుంటూరు లోని హిందూ, ఎ.సి. కాలేజీలు ప్రతిభావంతులైన వామపక్ష మేధావులకు ప్రసిద్ధి గాంచాయి. కపర్దీ గారు ఈ మూడో కోవకు చెందిన వారు. ఆయనకు సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్ భాషలు క్షుణ్ణంగా తెలుసు. సంస్కృతి, వాఙ్మయం, మతం, జాతీయ చరిత్ర, కళలు లాంటి విషయాల మీద మంచి పట్టు వుండేది. వాటిని మార్క్సిజం వెలుగులో విశ్లేషించే సామర్థ్యం ఆయన సొంతం. కపర్దీ గారు ట్రేడ్ యూనియన్ నాయకుడిగా జాతీయ స్థాయిలో రాణించారు. ఆయన కార్మిక సమస్యల విషయంలో మంచి నెగోషియేటర్. చక్కని మధ్యవర్తి. గడ్డు సమస్యలను పరిష్కరించడంలో గొప్ప నేర్పరి. ఆనాటి లేబర్ కమీషనర్లు గానీ, మేనేజ్మెంట్లు గానీ కపర్దీ గారిని ఎంతో గౌరవించేవారు. ఆయనకి కష్టజీవుల సంక్షేమం ఎంతో ముఖ్యమైంది. అయితే పరిశ్రమ మనుగడ సైతం అంతే ముఖ్యమైనదని ఆయన నమ్మేవారు. ఇదే కపర్దీ గారి విశిష్టతగా అందరూ చెప్పుకునేవారు. జీవితాంతం ఆయన మోటార్ కార్మికుల సంఘం నేతగా కృషి చేశారు. తొలిరోజుల్లో మోటార్ కార్మికులు మొరటుగా, క్రూరంగా వ్యవహరించే వారు. రాత్రిళ్ళు రోడ్లపై నిద్రించే మూగజీవాల మీద నుంచి, రోడ్డు ప్రక్కన ఉండే మనుషులపై నుంచి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపేవారని చెప్పుకునేవారు. కపర్దీ గారు వాళ్లను సంస్కరించి అభివృద్ధి పథంలోకి తీసుకు రావడానికి కంకణం కట్టుకున్నారు. చాలా వరకు జయప్రదం అయ్యారు కూడా.

కపర్దీగారు మంచి మాటకారి. "ఇఫ్ ఆల్ గోస్ వెల్, జాలీవెల్" అనేది ఆయన తరచూ వాడే ఓ ఫ్రేజ్. ఎల్లప్పుడూ హుషారుగా వుండే కపర్దీగారు సీరియస్ సబ్జెక్ట్ విషయానికి వస్తే అంతే సీరియస్‌గా వుండేవారు. ఆయన ఆవేశ పూరితమైన ప్రసంగాలు చేసేవారు. అంతేగాదు స్టార్ ట్రాన్స్‌లేటర్ కూడా. 1967లో ఏలూరులో జరిగిన రాష్ట్ర పార్టీ మహాసభ ముగింపు సందర్భంగా ఓ బహిరంగ సభ జరిగింది. ఆనాటి సి.పి.ఐ చైర్మన్ ఎస్.ఎ. డాంగే గారి ఉపన్యాసాన్ని కపర్దీ గారే అద్భుతంగా అనువదించారు.

కపర్దీ గారంటే కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు గారికి ఎంతో ఆత్మీయమైన అభిమానముండేది. ఆయన సీఆర్ గారి వద్ద అంతే ఏక్సెస్ కలిగి వుండేవారు. కపర్దీ గారు పోయినప్పుడు "మన కపర్దీ మనలను వీడివెళ్లిపోయాడు" అని సీఆర్ ఖేద పడ్డారు. కపర్దీ గారి శ్రీమతి శేషమ్మ గారు నిరాడంబరమైన, నిస్వార్థమైన జీవనం సాగించేవారు. ఆర్తులను ఆదరించడంలో ఆమె అన్నపూర్ణ. వారి కుటుంబ సభ్యులందరిలోనూ సేవాభావం తొణికిసలాడేది. ఆ ఇల్లు వైసియల్ కేంద్రంగా వుండేది. మా అబ్బాయి చింతామణి పైనా, మా కుటుంబ సభ్యులందరిపైనా వారికి ఎంతో అభిమానం. వారిల్లు ఎందరో కమ్యూనిస్టులకు పుఠిటిగడ్డ. ఆ కుటుంబానికి నా జేజేలు. ❑

**తొలి రోజుల్లో మోటార్ కార్మికులు మొరటుగా, క్రూరంగా వ్యవహరించే వారు. రాత్రిళ్ళు రోడ్లపై నిద్రించే మూగ జీవాల మీద నుంచి, రోడ్డు పక్కన ఉండే మనుషులపై నుంచి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపేవారని చెప్పుకునేవారు. కపర్దీ గారు వాళ్లను సంస్కరించి అభివృద్ధి పథంలోకి తీసుకు రావడానికి కంకణం కట్టుకున్నారు. చాలా వరకు జయప్రదం అయ్యారు.**

# సార్వత్రిక ఎన్నికల బరిలోకి..



...ంబరు 23 న ఏలూరులో మిత్రపక్షాల ఆధ్వర్యాన కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి శ్రీ కపర్ది విజయాన్ని కాంక్షిస్తూ జరిగిన ఎన్నికల సభలో ప్రసంగిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు శ్రీ సి. నాగభూషణం

## ఏలూరులో కపర్ది నామినేషన్

### పెందుర్తి శాసనసభ నియోజకవర్గానికి శ్రీ సన్యాసిరావు నామినేషన్

హైదరాబాదు, డిసెంబరు 7 ... [illegible]

9 పేజీ వివరాలు అందజేత

(మిగతా 2వ పేజీలో)

## కపర్ది విజయానికి తాడేపల్లిగూడెంలో ఇంటింటా యువకుల ప్రచారం

### [illegible] గ్రామాలలో ఎన్నికల కమిటీల ఏర్పాటు


[illegible]



...జకవర్గ మిత్రపక్షాల అభ్యర్థి గెలుపుకై తాడేపల్లిగూడెంలో జరిగిన ప్రచార బహిరంగసభలో ప్రసంగిస్తున్న శ్రీ యం.వి.యస్. కపర్ది (అభ్యర్థి, ప్రదేశ కమ్యూనిస్టుసమితి ...ర్శి శ్రీ గిరిప్రసాద్ : వేదికపై శ్రీయుతులు పిరివులపు సత్యనారాయణ (కాం), వంకా సత్యనారాయణ (కమ్యూ), మాగంటి భూపతిరావు (లోక్‌దళ్) ప్రభృతులు.

## ANDHRA PRADESH

| No. | CANDIDATE | SEX | PARTY | VOTES | % |
|---|---|---|---|---|---|
| 1 . | CHITTOORI SUBBARAO CHOWDARY | | INC(I) | 266805 | 59.15% |
| 2 . | K.SURYANARAYANA | M | JNP | 83470 | 18.50% |
| 3 . | KAPARDE M.V.N. | M | CPI | 81390 | 18.04% |
| 4 . | KRISHNAMURTHY YEERANKI | M | IND | 5768 | 1.28% |
| 5 . | PAYYATI VENKATESHWARA VAIDYA | M | IND | 4760 | 1.06% |
| 6 . | CHAKKA SREERAMULU | M | IND | 4364 | 0.97% |
| 7 . | M.KRISHNAMOHANA RAO THAMMAREDDY | M | IND | 2395 | 0.53% |
| 8 . | MOHD. SHERIFF | M | IND | 1319 | 0.29% |
| 9 . | VASE RAMA RAO | M | IND | 812 | 0.18% |



ఏలూరు సీటు నుండి పోటీచేస్తున్న [illegible] అభ్యర్థి శ్రీ ఎం.వి.యస్. కపర్ది విజయాన్ని కాంక్షిస్తు గుంటూరు డివిజన్ ఆర్.టి.సి. కార్మికులు పంపిన 9 వేల రూపాయల విరాళాన్ని శ్రీ కపర్దికి అందిస్తున్న ఏరియా ఎంప్లాయీస్ యూనియన్ చైర్మన్ శ్రీ కె. దేవయ్య ఏలూరులో అందజేస్తున్న దృశ్యం.







1980 పార్లమెంట్ ఎన్నికల్లో నేతల ప్రచార సభల్లో
ప్రసంగిస్తున్న సంకు అప్పారావు, విరాటరాజు


## స్మారకోపన్యాసాలు

# భారతీయ బహుళత్వ చరిత్ర : సమకాలీన ప్రాధాన్యం

- డాక్టర్ రామ్ పునియానీ



భారతదేశంలో మతవాదం పెచ్చరిల్లడమనేది, మన చరిత్రను ముఖ్యంగా, మధ్యయుగాల చరిత్రను వక్రీకరించడంతో ప్రత్యక్షంగా ముడి పడి వుంది. ముస్లిం రాజుల దురాక్రమణ కారణంగానే హిందువులకు బానిసత్వం దాపురించిందనే దుష్ప్రచారం ముమ్మరంగా జరిగింది. ఇస్లాం మత వ్యాప్తి హింసాత్మకంగా సాగిందనేది మరో దుష్ప్రచారం. పర్యవసానంగానే, హిందూ జన సమూహానికి భయంకరమైన కష్టనష్టాలు వచ్చిపడ్డాయన్నది మరో దుష్ప్రచారం. ఈ విధంగా, పక్షపాత బుద్ధితో చరిత్రను వక్రీకరించి ప్రదర్శించడం ఘోరమైన నేరం! అలా చేయడం మతపరమైన అసహనాన్ని పెంచి పోషిస్తుంది. ఈ విధమైన అసహన కథనాలూ, కల్పనలూ, కట్టుకథలూ ఇతరుల పట్ల మతపరమైన ద్వేషానికి ప్రాతిపదికలుగా మారతాయి. అది హింసకు దారితీస్తుంది.




చరిత్రను ఇలా మిథ్యా కల్పనగా మార్చడమనేది మతవాదుల చేతుల్లో మారణాయుధంగా పరిణమిస్తుంది. అంతేకాదు భారత సమాజానికి సహజమైన బహుళత్వ స్వభావాన్నీ, ఈ గడ్డ మీద పుట్టి, పెరిగిన సాంస్కృతిక సమ్మేళన సంప్రదాయాలనూ ఈ మిథ్యా కల్పన పక్కదోవ పట్టిస్తుంది కూడా. సామాన్య ప్రజల మనస్సుల్లో వాస్తవాలు మరుగున పడిపోయేలా చేస్తుందీ వక్రీకరణ. ఇంతకీ, మన చరిత్రకు సంబంధించిన వాస్తవమేమిటి ? మన మధ్య యుగాల చరిత్ర అంతా ముస్లిం రాజుల దురాక్రమణ యుద్ధాలతోనూ, దేవాలయాల విధ్వంసాలతోనూ, బలవంతపు మత మార్పిడులతోనూ నిండి వుందనే ప్రచారంలో నిజమేమైనా వుందా? ఈ దశ మన సామాజిక జీవన చరిత్రలో అంధయుగంగా ఉండిందా? ఎంత మాత్రం లేదు.

వాస్తవం ఈ దుష్ప్రచారానికి యోజనాల దూరంలో వుంది !

ఆ దశలో వ్యక్తమైన సామాజిక వైవిధ్యం మన జాతిని మరింత బలోపేతంగానూ, మరింత శక్తిమంతంగానూ మార్చింది. సరిహద్దులను మరింతగా విస్తరించుకోవడం కోసం, మరిన్ని విశాల భూభాగాలపై పెత్తనం సాధించడం కోసం రాజులు యుద్ధాలకు తెగబడిన మాట నిజమే. మతాధికారులూ, మతాధిపతులూ - ఉలేమాలూ, బ్రాహ్మణులూ - ఒకరి పూజా పద్ధతులను మరొకరు చిన్నచూపు చూసుకున్న మాటా నిజమే. కానీ, భిన్న మతాలకు చెందిన సామాన్య ప్రజలు - మధ్య యుగాల్లో నానా బాధలూ అనుభవించిన పీడితులు, అట్టడుగు వర్గాల ప్రజలు మాత్రం పరస్పరం సహ జీవనం చెయ్యడంలోని మాధుర్యాన్ని ఘనంగా ఆస్వాదించారు. మతాల చట్రాలను అధిగమించి రాజులు సైతం పరస్పర సంబంధాలను విస్తరించుకున్నారు. భౌతిక ప్రయోజనాల కోసం తమ తమ రాజ్యాలను కాపాడుకోవడంపైనా, మరింతగా విస్తరించుకోవడం పైనా ఆయా రాజులు కేంద్రీకరించిన మాట వాస్తవమే. కానీ, సమాజంలోని అత్యధిక సంఖ్యాకులు నానా పాట్లు పడినప్పటికీ, సామాజిక - ధార్మిక జీవనాల నుంచి ఆనందాన్నీ, మాధుర్యాన్నీ పొందారు.

విభిన్న వర్గాలకు చెందిన కులీనులు తమ తమ సామాజిక పెత్తనాలను స్థిరపర్చుకోవడం పైనా, పరస్పరం చిన్న బుచ్చుకోవడంపైనా ఎక్కువ ఆసక్తి చూపించిన మాట నిజమే. కానీ, అదే సమయంలో సృజనాత్మక రంగానికి చెందిన దర్బారీ కవులు, కళాకారులు, శిల్పులు, వాస్తు శిల్పులు, నటులు, గాయకులు, జానపద కళాకారులు, చిత్రకారులూ ఇతర స్రవంతులకు చెందిన సంప్రదాయాలని కూడా తమ కళల్లో మేళవించి సమగ్ర కళా రూపాలను ఆవిష్కరించారు. ఆ క్రమంలో, మొత్తంగానే కళారంగం సుసంపన్నం కాగలిగింది!

## రాజకీయ సంబంధాలు

మధ్యయుగాల్లో హిందువులూ ముస్లింలూ తన్నుకు చచ్చారనే దుష్ప్రచారం ఓ వైపు జరుగుతూండగా, అందుకు భిన్నమైన విరుద్ధమైన వాస్తవాన్ని వెల్లడిస్తోంది చరిత్ర. రాజ్యాధికారం కేంద్రంగా రాజులు పరస్పరం సంబంధాలను పెంచుకున్నారన్నదే ఆ వాస్తవం. రాజస్థానీకి చెందిన రాణా సంగ, స్వయంగా బాబర్‌ను భారతదేశంలోకి ఆహ్వానించిన వ్యక్తి. బాబర్ యుద్ధం చేసింది ఎవరితోనో తెలుసా ? ఇబ్రహీం లోఢీతో! ఎందరో ముస్లిం రాజుల ఆస్థానాల్లో హిందువులు ఉన్నత పదవుల్లో ఉండేవారు. హిందూ రాజులు కూడా మరెందరో ముస్లింలను తమ ఆస్థానాల్లో కీలకమైన పదవుల్లో నియమించుకున్నారు. అక్బర్ దర్బారులోని నవరత్నాల్లో బీర్బల్, తోడర్‌మల్ కూడా ఉండేవారు. ముఖ్యంగా, తోడర్‌మల్ అక్బర్ సామ్రాజ్యంలో అత్యంత కీలకమైన రెవెన్యూ విభాగానికి అధిపతిగా ఉండేవాడు ! కాగా, అక్బర్‌కు రాణా ప్రతాప్‌కు జరిగిన యుద్ధంలో అక్బర్ సేనలకు నాయకత్వం వహించిన వాడు రాజామాన్ సింగ్. అవతల, రాణా ప్రతాప్ తరఫున సేనాధిపతిగా ఉన్నవాడు హకీం ఖాన్‌సుర్. ఔరంగజేబును మతోన్మాదిగా చిత్రించి దుమ్మెత్తిపోయడం మన దేశంలో ఎక్కువయింది. కానీ, ఔరంగజేబు కొలువు కూటంలోని అధికారుల్లో హిందువుల సంఖ్య 34 శాతం అని అర్థర్ అలీ రాసిన పాఠ్య పుస్తకం చెబుతోంది. కాగా, ఔరంగజేబుకు–శివాజీకి జరిగిన ఓ యుద్ధంలో మొగల్ చక్రవర్తి తరఫున సేనలకు నాయకత్వం వహించిన వాడు రాజా జయ్ సింగ్. టిప్పు సుల్తాన్‌పై, హిందూ వ్యతిరేకిగా ముద్రకొట్టి చిన్నచూపు చూస్తారు కానీ, అతని ప్రధాన సలహాదారుడు పూర్ణయ్య అనే బ్రాహ్మణుడనే వాస్తవం దాచి పెడతారు. కంచి కామకోటి పీఠాధిపతి అయిన శంకరాచార్యకు టిప్పు నెత్తిన పెట్టుకుని గౌరవించి, ఎన్నెన్నో నిధులూ నిక్షేపాలూ కుమ్మరించాడు. శంకరాచార్యను టిప్పూ జగద్గురువుగా భావించి, అలాగే పిలిచే వాడు. మరాఠా సేనలు నాశనం చేసిన శ్రీరంగపట్నం దేవాలయానికి టిప్పూ మరమ్మతులు చేయించాడు. అలాగే, ఔరంగజేబు కాశీలోని విశ్వనాథ దేవాలయాన్ని కూల్చిన మాట నిజమే. కానీ, అసోంలోని కామాఖ్య దేవాలయానికీ, ఉజ్జయినిలోని మహాకాలుడి దేవాలయానికీ, బృందావనంలోని శ్రీ కృష్ణ దేవాలయానికీ – మరెన్నో హిందూ దేవాలయాలకు సయితం నిధులను సమకూర్చాడు.

## ధార్మిక రంగం

మధ్య యుగాలనాటి ప్రధాన మతాల్లో, మొత్తంగా ధార్మిక రంగంలో, ఎన్నో సమన్వయ పూర్వక వైఖరులు దర్శనమిచ్చాయి. హిందూ మతంలో భక్తి, ఇస్లాంలో సూఫీ ధోరణులు మధ్య యుగాలలో ప్రధాన మత ధోరణులుగా ఆవిర్భవించాయి. కబీర్, నానక్, తులసీదాసు సమన్వయ పూర్వక దృక్పథం వహించి, తమ రచనల్లోనూ జీవనంలోనూ రెండు మతాల ప్రభావాన్నీ ప్రదర్శించారు. కబీర్ దాసు ఉన్నత కులస్థులైన బ్రాహ్మణులు మాట్లాడే సంస్కృతం వాడడానికి నిరాకరించాడు. సరళమైన హిందీ భాషలోనే కబీర్ సామాన్య ప్రజలకు సందేశమిచ్చేవాడు. హిందూ ముస్లిం మతాల మధ్య నిర్మితమైన సమన్వయ వారధులను కబీర్ తన జీవిత సాహిత్యాల్లో ప్రతిఫలించాడు. ఆయన ఒక శబ్దంలో ఇలా అన్నాడు..

“బంగారమనే ఒకే మూలపదార్థం, వేర్వేరు నగల రూపంలో ఎలా దర్శనమిస్తుందో అదే విధంగా ఒకే భగవంతుడు అల్లాహ్, హరి, రామ్, రహీములుగా కనిపిస్తాడు. అవన్నీ ఒకే దైవానికి మనం పెట్టుకున్న వేర్వేరు పేర్లు” అని కబీర్ చెప్పాడు. హిందువుల పూజా పునస్కారాలూ, ముస్లింల నమాజ్ పఠనాలూ ఒకే దైవం పట్ల ప్రదర్శించే భిన్న ఆరాధనా రూపాలని పేర్కొన్నాడు. వ్యవస్థీకృత మతాలనూ, ప్రజలను చీల్చే మత సంప్రదాయాలనూ కబీర్ నిశితంగా విమర్శించాడు.

ముల్లాలనూ పూజారులనూ సమానంగానే విమర్శించాడు కబీర్. కుల వ్యవస్థ, అంటరానితనం వంటి సామాజిక దురాచారాలను ఆయన ఖండించాడు. మధ్య యుగాల కాలంలో తలెత్తిన అన్ని రకాల మతధార్మిక ధోరణుల్లోనూ కబీర్‌దాసు బోధనలు విస్తరించడం గమనార్హం. అదే యుగానికి చెందిన మరో భక్తి కవి తులసీదాసు. తన కాలంలో అమల్లో వుండిన ధార్మిక సమన్వయతను తులసీ ఒకానొక ఆత్మ కథాత్మక కవితలో ఇలా ప్రకటించాడు:

“ఎవరేమన్నా అనుకోనీ ఆ రాముని దాసుడు ఈ తులసీ!
దానధర్మాలు నాకాధారం – మసీదు వాకిలి నాకు ఆశ్రయం
ఈ లోకంతో నా లావాదేవీలంతటితోనే అంతమవుతాయి”
(తులసీ దాసు ‘కవితావళి’ నుంచి)

చరిత్రకు తెలిసిన అతి గొప్ప రామభక్తుడు – తులసీదాసు – మసీదులో నివసించడం గురించి చెప్పాడు. అక్కడ ఉంటూనే శ్రీరాముడి గుణగానం చేసిన ఎన్నెన్నో రచనలను వెలువరించాడాయన.

సమాజంలో శాంతి సౌఖ్యం వెల్లి విరియాలని కోరుకున్న మహనీయుడు గురునానక్. ఆయనపై కబీర్ రచనల ప్రభావం అపారం. సమన్వయవాదానికి కట్టుబడిన సంస్కర్త నానక్. హిందూ మతం నుంచి, ఇస్లాం నుంచి ఎన్నెన్నో భావాలను కూర్చుకుని, నానక్ ఆ రెండింటినీ ఒకే విశ్వాసంలో ముడి వేయాలని ప్రయత్నించాడు. ఇస్లాం నుంచి దేవుడొక్కడే అనే భావనను స్వీకరించి – విగ్రహారాధనను నిషేధించాడు నానక్.

హిందూ మతం నుంచి పునర్జన్మ విశ్వాసాన్నీ, కర్మ అనే భావననూ స్వీకరించాడు. మనుషులు ఈ జన్మలో చేసే పనులే వచ్చే జన్మల్లో వాళ్ల రాతను నిర్ణయిస్తాయని నానక్ బోధించాడు. ఆయన కుల వ్యవస్థను వ్యతిరేకించాడు. సిక్కు మతానికి పవిత్ర గ్రంథమైన 'గురు గ్రంథ్ సాహిబ్'లో కబీర్ రచనలూ, బాబా ఫరీద్ లాంటి సూఫీ సాధువుల బోధనలూ కనిపిస్తాయి. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయానికి శంకుస్థాపన చెయ్యాల్సిందిగా మరో సూఫీ సాధువు మీర్ మియాను నానక్ అభ్యర్థించడం గమనార్హం.

మధ్యయుగాల కాలంలో, అట్టడుగు కులాలూ వర్గాల ప్రజలను సూఫీ ధోరణి అపారంగా ఆకట్టుకుంది. అత్యధిక సంఖ్యాకులైన అట్టడుగు కులాలూ వర్గాల ప్రజలు ఇస్లాంలోకి మారడానికి సంప్రదాయాలతో సంబంధం లేని సూఫీ జీవన సరళే కారణం. సూఫీల మజార్‌ల – పవిత్ర స్థలాల తలుపులు ఎల్లరికీ తెరిచే వుంటాయి. మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా, ప్రతి ఒక్కరూ వాటిని దర్శించుకోవచ్చు. సూఫీలు, మౌలికంగా, ఇస్లాం మతంలోని ఆధ్యాత్మికతకు కట్టుబడి వున్నారు. అత్యున్నత సూఫీ సాధువుల్లో ఒకరైన ముహియుద్దీన్ ఇబ్న్ అరబీ "వహాదత్ అల్ ఉజూ" (ఒకే అస్తిత్వం) అనే సిద్ధాంత భావనను ప్రతిపాదించారు. ఈ ఒకే అస్తిత్వం అనే భావమే ఆధ్యాత్మిక విశ్వజనీన భావానికి తావిచ్చింది. కుల మత భేదాలను ఈ భావనే కూలదోసింది. నిజమైన అస్తిత్వం ఒక్కటేననీ – మనమందరం, దాని ప్రతి రూపాలం మాత్రమేననీ ఈ సిద్ధాంత భావన బోధిస్తుంది. భిన్న మతాలను అనుసరించే వారి మధ్య సద్భావనను నెలకొల్పిన సిద్ధాంతమిది.

సూఫీ సాధువుల ఆధ్యాత్మిక ప్రబోధాలు అతి సామాన్య ప్రజానీకానికి అత్యంత సన్నిహితం కాగలగడం విశేషం. బాబా ఫరీద్ తన ప్రబోధాలను మామూలు పంజాబీ భాషలోనే కవితల రూపంలో చెప్పేవారు. ఆయన రచనలనేకం సిక్కుల పవిత్ర గ్రంథం 'గురు గ్రంథ సాహిబ్'లో స్థానం సంపాదించుకోవడం అంతకుమించిన విశేషం. బాబా ఫరీద్ శిష్యుల్లో అగ్రగణ్యుడు నిజాముద్దీన్ ఆలియా. ఈ భూమి మీద ఎన్ని ఇసుక రేణువులు ఉన్నాయో దైవాన్ని ఆరాధించుకోవడానికి అన్ని మార్గాలూ ఉన్నాయని నిజాముద్దీన్ సగర్వంగా ప్రకటించారు. భజనలు వినడానికి ఆయన చెవి కోసుకునేవారు. ఖవ్వాలీ గానాన్ని కూడా నిజాముద్దీన్ అంతే పారవశ్యంతో వినేవారట. స్థానిక సంప్రదాయాల పట్ల ఆయన గౌరవాదరాలు అపారం. ఇస్లామ్ సంప్రదాయానికి నిజాముద్దీన్ ఎంత దూరంగా ఉండేవారో, స్థానిక సంప్రదాయాలను ఆయన ఎంత గౌరవించేవారో చెప్పడానికి ఈ చిన్న కథ చాలు!

ఒకనాటి ఉదయం, నిజాముద్దీన్ అలియా, ఢిల్లీలోని యమునా నదీ తీరం వెంబడిపోతున్నారు. ఆయనతో పాటుగా, ఆయన శిష్యుడు – ఉర్దూ కవితా పితామహుడు – అమీర్ ఖుస్రో కూడా ఉన్నారు. అప్పుడు, దూరంగా యమునలో స్త్రీలు స్నానం చేస్తున్నారు. అంతలో వారంతా సూర్యుడికి నమస్కరించడం మొదలు పెట్టారు. అది చూసి నిజాముద్దీన్ ఆలియా ఇలా అన్నారు:

'ఖుస్రో, చూడు ఆ మహిళలు కూడా దైవానికే మొక్కుతున్నారు. అయితే, ప్రార్థించుకోవడంలో ఎవరి మార్గం వారిదే మళ్లీ ? అలా అన్న తర్వాత నిజాముద్దీన్ ఖురాన్లోని ఈ కింది భాగం చదివి వినిపించారు :

ఎవరు ఏ వైపునకు తిరిగితే అటు వైపే ఓ దిశా నిర్దేశనం ఉంది. అంచేత, మంచి పనులు చేసే విషయంలో ఒకరితో ఒకరు ఉత్సాహంగా పోటీపడండి!"

(అసర్ అలీ ఇంజినియర్ పత్రం 'సూఫీయిజమ్ అండ్ ఇంటర్ఫెయిత్ హార్మనీ' నుంచి, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇస్లామిక్ స్టడీస్, మార్చ్ 4, 1995)

ఇక్కడ మనమందరం గమనించవలసిన విషయం ఒకటుంది. "ఇతర మతాలను పాటించే వారినందరినీ ఉలేమాలు కాఫిర్లుగా పరిగణించి అవమానించేవారు. కానీ, సూఫీలు మాత్రం అన్ని మతాల్లోని ఆధ్యాత్మిక ఆరాధనా మార్గాలనూ గౌరవించేవారు. వాటి పట్ల అపారమయిన గౌరవాదరాలు ప్రకటించేవారు." (పైన పేర్కొన్న పత్రం నుంచే.) మజార్ జానీజానాం షంషుద్దీన్ హబీబుల్లాహ్ గొప్ప కవి, ధర్మశాస్త్రజ్ఞుడు. ఆయన కూడా అన్య మతాచారాల పట్ల అపారమయిన గౌరవం కలిగివుండేవాడు. జహంగీర్ వారసుడయిన దారాషికో సంస్కృతంలో మహాపండితుడు. రాజ్యాధికారం కోసం ఇతన్ని సోదరుడే హత్య చేశాడుబీ అది వేరే విషయం! హిందూ ధార్మిక గ్రంథాలను దారా క్షుణ్ణంగా చదివినవాడుబీ 'మస్క్ ఉల్ బహైన్' (హిందూ–ఇస్లాం సాగర 'అనే పుస్తకం రాసినవాడు. ఇస్లామిక్ –సూఫీ–ధార్మిక పరిభాషను ఈ పుస్తకంలో తులనాత్మకంగా పరిశీలించాడు దారా.. పదాలలోనూ భావాలలోనూ ఎంతో సామ్యం వుందని ఆయన తేల్చిచెప్పాడు.

హిందూ – ఇస్లాం మతాచారాల మధ్య పరస్పర ప్రభావాన్ని డాక్టర్ బీ.ఎన్. పాండే తులనాత్మకంగా మదింపు వేశారు. "హిందూ మతానికీ, ఇస్లాంకీ మధ్య మొదట్లో ఎంతో వైరం ఉన్నట్లు కనిపించినప్పటికీ, చివరికి పరస్పరం సమ్మేళనం చెందాయి. ఒకదాన్ని మరొకటి క్షుణ్ణంగా అధ్యయనం చేసుకుంటున్నాయి. ఆయా ధార్మిక భావాల సమన్వయం ఫలితంగానే భక్తి, తసవ్వా ధోరణులు ఆవిర్భవించాయి. ఇవి, ప్రేమ–ఆరాధనలకు పెద్దపీట వేసిన మతథో భారతదేశంలో విభిన్న మతాలను పాటించే కోట్లాది మంది ప్రజల హృదయాల్లో పాతుకుపోయిన ధోరణులివి. హిందూ భక్తి భావన– ఇస్లామిక్

సూఫీ భావన పరస్పరం పెనవేసుకుని మహాప్రవాహంగా రూపొందాయి. ఆనాటి ధార్మిక మరుభూములను సారవంతంగా మార్చి, దేశం రూపరేఖలనే మార్చేసింది ఈ మహాప్రవాహం. హిందూ శ్రోత్రియ-సనాతన కర్కశత్వానికి, భయంకరమైన ఇస్లామిక్ కులీనతావాదానికీ మధ్య అసాధ్యమనిపించే సమన్వయాన్ని, ఈ భారతీయ స్ఫూర్తిమత్వం సాధించగలిగింది. ఈ సమన్వయ ఫలితంగానే అపారమైన పరిపూర్ణతా, అనంతమైన రూప వైవిధ్యమూ, హిందూ మతంతో సమ్మిళితమైన అంతరంగిక ఐక్యత తాలూకు సహజమైన దృక్పథమూ రూపుదిద్దుకున్నాయి. పర్యవసానంగానే, చరిత్రాత్మకమైన కళా ఖండాలు ఆవిర్భవించాయి. సాహిత్యం, చిత్ర కళ, సంగీతం, ప్రేమభావం చేత ప్రేరణ పొందిన మతం- ఇవీ మధ్య యుగాలనాటి భారతీయ చరిత్ర మనకి అందించిన మహోన్నత సాంస్కృతిక వారసత్వ సంపద!" అన్నారు డాక్టర్ బీ.ఎన్. పాండే.

## సాంస్కృతిక రంగం

ముస్లిం రాజులతోనూ, ఇస్లాంతోనూ స్థానిక సంస్కృతి మేళవించడంతో అన్ని రంగాల్లోనూ ఒక సమన్వయ పూర్వకమైన సంస్కృతి రూపుదిద్దుకుంది. ఈ సమ్మేళనం ఫలితంగానే హిందూస్థానీ సంగీతంలో ఖయాల్, గజల్, రుమ్రీ లాంటి అత్యద్భుతమైన ప్రక్రియలు రూపుదిద్దుకున్నాయి. అయిదు వందల సంవత్సరాలపాటు హిందూ-ముస్లిం సంస్కృతుల సమ్మేళన ఫలితంగా అవతరించినదే హిందూస్థానీ సంగీతం పేరిట ప్రసిద్ధమయిన ఉత్తర భారత సంగీతం. బిజాపూర్ రాజ్యాన్ని పాలించిన రెండో ఇబ్రాహీం ఆదిల్షాహీ (1580-1626) తన ఆస్థానంలో 300 మంది హిందూ గాయకులను పోషించాడు. ముస్లింలలో ఈ సంగీతం వ్యాపింప చేసే నిమిత్తం స్వయంగా కితాబే నౌరంగ్ అనే ఉర్దూ గీత సంకలనం వెలువరించాడు ఇబ్రాహీం. 59 గీతాలున్న ఆ సంకలనంలోని తొలి గీతం సరస్వతీ ప్రార్థన! పదిహేనో శతాబ్దానికి చెందిన చైతన్య మహాప్రభు, మరెందరో వైష్ణవ భక్తికవులు, ముస్లింలను ప్రభావితులను చేసి, వాళ్లు కూడా తమ సొంత పలుకుబడులతో పాటలు రాసేలా ప్రోత్సహించారు. ప్రజ భాషలో, శ్రీకృష్ణుని గురించి కీర్తనలు రచించిన వాళ్లలో రహీం, రసఖాన్లు ప్రసిద్ధులు, మధ్యయుగాల ప్రేమ కవితలకి తలమానికమైన హీర్-రాంఝాల ప్రేమ కథను రాసింది పద్దెనిమిదో శతాబ్దానికి చెందిన సుప్రసిద్ధ సూఫీ సాధు-కవి సయీద్ వారిస్ షాహ్, పదహారు, పదిహేడు శతాబ్దాలకి చెందిన ప్రసిద్ధ సూఫీ సాధు-కవి షేఖ్ ముహమ్మద్, మరాఠీ సాహిత్యానికి ఎనలేని సేవచేశారు. శివాజీకి ఆధ్యాత్మిక గురువుగా ఉండిన రామ్ దాస్ ఈ సూఫీ సాధు-కవి గురించి ఎంతో ఘనంగా ప్రస్తావించారు.

ఢిల్లీ చుట్టుపక్కల నివసించే ప్రజలు మాట్లాడే హిందీ మాండలికంతో కలగలిసిన పారశీ మాండలికమే, 'ఉర్దూ' అనే సరికొత్త భాష పుట్టడానికి దారి తీసింది. ఉర్దూ భాషను కేవలం పాలనా భాషగానే కాకుండా, సాహిత్య భాషగా కూడా స్వీకరించి ఆ భాషా సాహిత్యాలకి అపారమైన సేవ చేసిన గొప్ప హిందూ పండితులెందరో వున్నారు! హిందూ శిల్ప కళ అద్భుతమైన సున్నితమైన వివరాలతో నిండి, బొమ్మను కమ్మేస్తుంది. ఇస్లామిక్ శిల్పకళ పరిమితమైన వివరాలతో, శైలీ సౌలభ్యంతో కూడి బొమ్మకు అందచందాలను తీర్చిదిద్దుతుంది. ఈ రెండు కళా రీతుల సమ్మేళనం విభిన్న శిల్ప కళాఖండాల రూపకల్పనకి తావిచ్చింది. మధ్య యుగాల్లో ఈ రీతి శిల్పకళ వ్యాపించింది. ఆగ్రా కోటలోని జోధాబాయ్ మహల్లోనూ, ఫతేపూర్ సిక్రీలోనూ, కువాత్ ఉల్ ఇస్లామ్ మసీదులోనూ ఇదే తరహా సమ్మిశ్ర శిల్ప కళారీతి కనిపిస్తుంది. నేటి రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని హవేలీలలోనూ, జోధ్‌పూర్, బికనీర్, జైసల్మేర్ నగరాల్లోని కట్టడాల్లోనూ ఇదే హిందూ-ఇస్లామిక్ (ఇండోసారసేనిక్) వాస్తుశిల్పకళే కనిపిస్తుంది. పారశీక చిత్ర కళా రీతులనూ, హిందూ చిత్రకళ తాలూకు వర్ణ సమ్మేళనాన్నీ సమ్మిశ్రితం చేసిన దాని ఫలితంగా మినియేచర్ పెయింటింగ్ కవితాత్మకతను సంతరించుకుంది.

మతవాదశక్తుల దాడులను తట్టుకుని నిలబడిన కట్టడాల్లో ప్రముఖంగా ప్రస్తావించుకోవలసింది సూఫీ దర్గాల గురించి. ఈ దర్గాలు భిన్న నగరాల్లో వ్యాపించి వున్నాయి. కొన్నిచోట్ల హిందువులు మరి కొన్నిచోట్ల ముస్లింలు ఈ దర్గాల నిర్వహణ బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి. అన్ని మతాలకు చెందిన విశ్వాసులూ ఈ దర్గాలను సందర్శిస్తూ వుంటారు. మత విద్వేషాన్ని వ్యాపింపచేసే శక్తులు వెళ్లగక్కే విషాన్ని లెక్క చెయ్యకుండా వాళ్లు ఈ దర్గాలకు వస్తూనే వున్నారు. ముంబయ్ నగరానికి సమీపంలో ఉన్న హాజీ మలంగ్ దర్గా, మధ్యయుగాల నాటి సమన్వయ పూర్వక సంస్కృతికీ, కళా రీతికీ ఉత్తమ ఉదాహరణగా నిలిచింది. వారసత్వ సంప్రదాయం మేరకు ఈ దర్గాకు ట్రస్టీగా ఎన్నికైన వ్యక్తి కైలాష్‌నాథ్ గోపాల్ కేట్కర్. ఆయన కులానికి బ్రాహ్మణుడు. దర్గాలో జరిగే పూజలూ సేవలూ హిందూ-ముస్లిం మతాచారాలు రెండింటి సమ్మేళనంగా ఉంటాయి. కొందరు ఛద్దర్లు కప్పితే, మరికొందరు పూలూ కొబ్బరికాయలూ సమర్పించుకుంటారు.

ఇటువంటి ఉదాహరణలు మన దేశం నలుమూలలా కోకొల్లలుగా ఉన్నాయి. ఎంతో విలువైన ఇటువంటి సత్సంప్రదాయం తాలూకు ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు కొందరు కుట్ర పూరితంగా ప్రయత్నిస్తున్నారు ఇప్పుడు. ఇటువంటి నేపథ్యంలో సత్యాన్ని సమగ్ర దృక్కోణంలో దర్శించవలసివుంది. సమన్వయ

పూర్వకమైన ఈ సదాచారాల సుసంపన్నతను మనం నిలబెట్టాలి. మన సమాజంలోని విభిన్న విశ్వాసాలకు చెందిన ప్రజలు పరస్పరం వ్యక్తం చేసుకున్న ప్రేమాభిమానాలకూ, సహనానికి సమర్పించుకున్న ఘనమైన నివాళులవంటివి ఈ సుసంపన్న సంప్రదాయాలు.

## పరస్పర సామాజిక సంబంధాలు

సామాజిక స్థాయిలో విభిన్న సముదాయాలకు చెందిన ప్రజల మధ్య వర్ధిల్లిన పరస్పర సంబంధాలు, భిన్న సంప్రదాయాల నుంచి రూపుదిద్దుకున్నవై ఉంటాయి. ఆహారపు అలవాట్లు, వంటలూ పిండి వంటల్లో ఎన్నెన్నో మార్పులు చోటు చేసుకుని, పరస్పరం సుసంపన్నమవుతూ పోయాయి. వడా పావ్, బిర్యానీ, శాండ్విచ్, కట్లెట్ వంటి భిన్న అంశాలను విభిన్న సంస్కృతులు మనకి పరిచయం చేశాయి. అవి ఇప్పుడు మన ఉమ్మడి సంస్కృతిలో భాగమయ్యాయి. భిన్న సముదాయాల మధ్య పరస్పర సంబంధాలు మన వస్త్రధారణనూ, మన సంగీత రీతులనూ, విభిన్న జీవన విధానాలకు సంబంధించిన అనేక సంప్రదాయాలను ప్రభావితం చేశాయి.

## స్వాతంత్ర్యోద్యమం బహుళత్వం

మధ్య యుగాల్లో హిందూ ముస్లిం రాజుల పాలనలో విభిన్న సంప్రదాయాలు పాదుకున్న రీతిలోనే, స్వాతంత్ర్యోద్యమ కాలంలో కూడా వైవిధ్యం ఓ సంస్కారంగా వర్ధిల్లింది. వేర్వేరు మతాలకూ, ప్రాంతాలకూ, భాషలకూ కులాలకు చెందిన స్త్రీలూ పురుషులూ వలసవాదులకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్యోద్యమంలో ఐక్యంగా పోరాడారు. ఆధునిక భారత దేశాన్ని నిర్మించేందుకు వారందరూ ఉమ్మడిగా పోరాటం చేశారు. స్వాతంత్ర్యోద్యమం అనేది ఏదో రాజకీయ కార్యాచరణ మాత్రమే కాదు. ఆ ఉద్యమం మన సామాజిక జీవనాన్ని చేసింది. మన సంస్కృతికి అనేక కొత్త కోణాలు తీర్చింది. విభిన్న సంప్రదాయాలను పాటించే వారి మధ్య లోతైన పరస్పర సంబంధాలు ఏర్పడడానికి స్వాతంత్ర్యోద్యమ కాలం ఎంతో దోహదం చేసింది. ఆధునిక భారత దేశ సౌధానికి ఈ పరస్పర సంబంధాలే పునాది రాళ్లు.

## గాంధీ, నెహ్రూ మన బహుళత్వం

స్వాతంత్ర్యోద్యమం తాలూకు బహుళత్వ సారాన్ని గాంధీ, నెహ్రూలు అద్భుతంగా గ్రహించారు. అనేక సందర్భాల్లో, అనేక తరహాల్లో వాళ్లు ఈ వైవిధ్యం గురించి ప్రకటనలు చేశారు. 1909లో, హోం రూల్ ఉద్యమం గురించి రాసిన 'హింద్ స్వరాజ్' పుస్తకంలో గాంధీ మన గత చరిత్రలోని బహుళత్వాన్నీ, వైవిధ్యాన్నీ రేఖా మాత్రంగా చిత్రించారు. "ముస్లిం చక్రవర్తుల ఏలుబడిలో ఎందరో హిందువులు వృద్ధిలోకి వచ్చారు. హిందూ చక్రవర్తుల పాలనలో ముస్లింలూ బాగుపడ్డారు. పరస్పరం కలహించుకోవడం ఆత్మహత్యాసదృశమని అన్ని సముదాయాలూ గ్రహించాయి. ఆయుధాలతో బెదిరించినంత మాత్రాన ఏ మతం వారూ తమ విశ్వాసాలను వదిలి పెట్టరని వాళ్లు అర్థం చేసుకున్నారు. అందుచేత, రెండు మతాలకు చెందిన వాళ్లూ పరస్పరం శాంతి సౌఖ్యాలతో బతకాలనుకున్నారు. ఎప్పుడైతే ఇంగ్లిష్ వలసవాదులు అడుగుపెట్టారో, అప్పటి నుంచే మత కలహాలు తిరిగి పెచ్చరిల్లాయి. మన దేశంలో హిందువులుగా ఉన్న వాళ్లకీ, ముస్లింలుగా బతుకుతున్న వారికీ మూల పురుషులు ఒక్కరేనని వాస్తవాన్ని మనం గుర్తించాలా ? అక్కర్లేదా? మనందరి నరాల్లోనూ ప్రవహించే నెత్తురు ఒకటేననే సత్యాన్ని మనం గుర్తించాలా? అక్కర్లేదా? మతాలు మార్చుకున్నంత మాత్రన మనుషులు పరస్పరం శత్రువులుగా మారిపోతారా? ముస్లింల దేవుడు, హిందువుల భగవంతుడికి భిన్నమైనవాడా ? మతాలనేవి, ఒకే గమ్యాన్ని చేరే వేర్వేరు దారులు. ఒకే గమ్యాన్ని చేరడం నిజమైనప్పుడు ఏ దారిలో ప్రయాణిస్తే ఏం ? ఇందులో కలహించుకోవలసిన కారణం ఏముందసలు?' అని నిలదీశారు గాంధీజీ.

ఇక నెహ్రూ విషయానికి వస్తే, శతాబ్దాల తరబడి హిందువులూ ముస్లింల మధ్య వర్ధిల్లిన పరస్పర సత్సంబంధాల గురించి 'భారత దర్శనం' (డిస్కవరీ ఆఫ్ ఇండియా) పుస్తకంలో నెహ్రూ నొక్కి చెప్పారు. ఈ అంశాన్ని శ్యామ్ బెనిగల్ రూపొందించిన 'భారత్ ఎక్ ఖోజ్' అద్భుతంగా ప్రదర్శించింది.

## సారాంశం

- అనేక శతాబ్దాలుగా, భారత దేశం బహుళ-వైవిధ్యపూర్వక సమాజంగానే కొనసాగుతూ వచ్చింది.
- విభిన్న సంస్కృతులకు చెందిన ప్రజలు పరస్పరం సత్సంబంధాలు పెంచుకుని జీవితోత్సవాన్ని కన్నుల పండుగగా జరుపుకున్నారిక్కడ.
- ఒకే మత సంప్రదాయంతోనూ, సంస్కృతితోనూ దేశాన్ని అంతటినీ ముడిపెట్టే ఒంటెత్తు పోకడ మొదలయి వంద సంవత్సరాలే అయింది.
- మన సమాజంలో పరస్పర విద్వేషం, అసహనం, హింస పెరగడానికి ఈ ఒంటెత్తు పోకడే కారణం.
- శాంతి సౌభాగ్యాలను పునఃస్థాపించడానికి మనమందరం బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని బలోపేతం చెయ్యాలి.
- ప్రజలందరికీ పౌర హక్కులూ, మానవ హక్కులూ ఉండే సమాజాన్ని నిర్మించుకోవడానికి అదొక్కటే మార్గం. ❑


# తొలి తాంబూలం తెనాలిది!

## కపర్ది శత జయంతి సభలు

**తెనాలి**

**2023 ఆగస్టు 26**

**ప్రముఖ కమ్యూనిస్టు నేత, కార్మికవర్గ నాయకుడు, సాహిత్య అభిమాని, కొంత కాలం జర్నలిస్టు కూడా అయిన మందలపర్తి వెంకట నారాయణ (ఎం.వి.ఎన్.) కపర్ది 1923 అగస్ట్ 30న జన్మించి, 1981 మే 25న కన్నుమూశారు. ఈ ఏడాది - 2023- ఆయన శతజయంతి సంవత్సరం. ఈ ఆగస్టు 26న, తెనాలి పట్టణంలో మొదలైన శతజయంతి సభలు వరుసగా గుంటూరు, విజయవాడ, విశాఖపట్టణం మీదుగా తాడేపల్లిగూడెం వరకూ జరుగుతూపోయాయి. వాటి వివరాలు ఇక్కడ ఇస్తున్నాం**





### తొలి తాంబూలం తెనాలిది!

శతజయంతి సభల్లో మొట్ట మొదటిది 26-08-2023న తెనాలి పట్టణంలోని రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగింది. కపర్ది శత జయంతి సంఘం, "తెనాలి ప్రచురణలు" అనే సంస్థ ఉమ్మడిగా జరిపించిన ఈ సభలో కపర్ది ప్రథమ శిష్యుడు, "దారి దీపం" పత్రిక సంపాదకుడు డి.వి.వి.ఎస్.వర్మ, విశాలాంధ్ర సంపాదకుడు ఆర్వీ రామారావు, సీనియర్ జర్నలిస్టు-చిత్రకారుడు తల్లావజల శివాజీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. "ప్రజాస్వామ్యం-ప్రస్తుత పరిస్థితులు" అనే విషయంపై ఈ సభలో వక్తలు మాట్లాడారు. తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ సభకు అధ్యక్షత వహించారు. సభలో ముందుగా మాట్లాడిన రామకృష్ణారెడ్డి, కపర్ది కుటుంబ సభ్యులతో తన పరిచయం గురించి వివరిస్తూ, వారికి ఆ సహ జీవన - ప్రజాస్వామిక




**తెనాలి శతజయంతి సభలో 'నెమరు' పుస్తకావిష్కరణ చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, కపర్ది కుటుంబ సభ్యులు**

సంస్కారం నిస్వార్థ ప్రజాసేవకులైన కపర్దీ-శేషమ్మల నుంచే అబ్బిందన్నారు. హైదరాబాద్ రాక ముందు కూడా తాను ఎందరో కమ్యూనిస్టు నేతల ఇళ్ళకు వెళ్ళాననీ, వాళ్ళ ఇళ్ళలో అటువంటి సంస్కారం తాను చూడలేదన్నారు. సమాజ సేవ చెయ్యాలనుకునే వారు -ఏ సిద్ధాంతాన్ని అనుసరించినప్పటికీ- సంస్కారవంతులైతే ఆ లక్షణం వారి ప్రజాజీవనంలో ప్రతి ఫలిస్తుందని రామకృష్ణారెడ్డి చెప్పారు. తర్వాత మాట్లాడిన తల్లావజల శివాజీ కపర్దీని తాను ఒకే ఒక్కసారి చూశానన్నారు. అయితే కపర్దీ సంతానంలో ఇద్దరు ముగ్గురు తనకు బాగా తెలుసని చెబుతూ.. ప్రజాస్వామ్య సంస్కారం వాళ్ళ మౌలిక లక్షణమన్నారు. మన దేశంలో వందల సంవత్సరాల కృషి ఫలి తంగా రూపుదిద్దుకున్న ప్రజాస్వామ్య సంస్కారం ప్రస్తుతం చిక్కుల్లో పడిందన్నారు. అన్ని రంగాల్లోని సంస్కారవంతులూ నడుంకడితే తప్ప ఈ చిక్కులు తొలగిపోవని శివాజీ వివరించారు. విశాలాంధ్ర పత్రిక సంపాదకులు, కపర్దీ కుటుంబ సభ్యులందరికీ సుపరిచితులైన ఆర్వీ రామారావ్ ప్రధాన వక్తగా ప్రసంగించారు. సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, విభిన్న రాజకీయ పక్షాల నేతలు ఉమ్మడిగా చేసిన కృషి ఫలితంగానే భారతదేశం ప్రపంచంలో అతి పెద్ద ప్రజా స్వామ్య దేశంగా అవతరించిందన్నారు. అయితే, దూరదృష్టి - బుద్ధి వైశాల్యం కొరవడిన రాజకీయ నేతలు ఈ సౌధాన్ని కుప్ప కూలుస్తున్నారని హెచ్చరించారు. దాదాపు ఏభై యేళ్ళుగా మన ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఎదురవుతూ వచ్చిన సవాళ్ళను రామారావు పేర్కొన్నారు. కపర్దీ వంటి నేతలు, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విలువనిస్తూనే, కార్మికవర్గ ప్రయోజనాల కోసం ఎలా ఉద్యమించారో వివరించారు. ప్రస్తుత తరుణంలో ఈ కృషి మరింత చైతన్యపూరితంగా సాగాల్సిన అవసరం వుందని ఆయన పిలుపునిచ్చారు.




"దారి దీపం" పత్రిక సంపాదకుడు డి.వి.వి.ఎస్.వర్మ భారత ప్రజాస్వామ్యం విశిష్టతను వివరించారు. ప్రజాస్వామ్యం ఎన్ని కలకూ, పార్టీలకే పరిమితమైంది కాదనీ, ప్రజాజీవనంలోని అన్ని పార్శ్వాలలోనూ ఈ లక్షణం వెల్లివిరియాలని సందేశమిచ్చారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ప్రజాస్వామ్యం మనుగడకు దోహదం కలిగించకపోగా అడుగడుగునా ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నాయన్నారు. కపర్దీ వంటి నేతలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టడంలో ఆదర్శ ప్రాయంగా నిలిచారనీ, అటువంటి నాయకుల ఆవశ్యకత నానాటికీ పెరుగుతోందని చెప్పారు. మందలపర్తి కిషోర్ రాసిన జ్ఞాపకాల సంపుటి "నెమరు"ను, కిషోర్ మన వరాలు గిరిజ ఆవిష్క రించింది. కపర్దీ కుమారులూ, కుమార్తెలూ, కోడళ్ళూ, మనవలూ, ముని మనవరాలు పాల్గొన్నారు. కపర్దీ కుమారుడు జగన్మోహన్ వక్తలకూ, శ్రోతలకూ, నిర్వాహకులకూ కృతజ్ఞతలు తెలిపారు. ❑

# కార్మిక వర్గ ఐక్యతతోనే ఫాసిజం ఓటమి

## కపర్ది శత జయంతి సభలు

## గుంటూరు

2023
సెప్టెంబరు 3




విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు : విశాల ఐక్యత ద్వారా ఫాసిజాన్ని ఓడించటమే కార్మిక వర్గం ముందున్న కర్తవ్యమని పౌరహక్కుల ఉద్యమ ప్రముఖులు ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఉద్ఘాటించారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, సీపీఐ నాయకులు, కార్మికోద్యమ నిర్మాత ఎంవీఎన్ కపర్ది శత జయంతి సభ గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్కే హాలులో 2023 సెప్టెంబరు మూడో తేదీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కపర్ది చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్ 'వర్తమాన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు - కార్మిక వర్గం పాత్ర' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు.

1920వ దశకంలో జన్మించిన కపర్ది అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో కార్మికోద్యమంలోకి అడుగు పెట్టారని గుర్తుచేశారు. కార్మికులకు కనీస హక్కులు, మెరుగైన జీవన విధానం ఉండాలని, శ్రమ శక్తికి సామాజిక గౌరవం దక్కాలని ఆయన ఎన్నో పోరాటాలు సాగించారని, ఆయన ఆదర్శాలను నేటితరం స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. దేశంలో పెట్టుబడిదారి విధానం అభివృద్ధి చెంది నేడు తీవ్ర జాతీయవాదంతో చేతులు కల్పిందని, దీంతో దేశంలో ప్రజాస్వామ్య ఉనికికి ప్రమాదం ఏర్పడింద న్నారు. హక్కులను పరిరక్షించుకోవడంతోపాటు ప్రజాస్వామ్యా న్ని, సామాజిక న్యాయాన్ని కాపాడటానికి కార్మికవర్గం మరోసారి పోరాటాలకు పూనుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. కులం, మతం లేని సమాజాన్ని కపర్ది కోరుకున్నారని, కానీ నేడు అవే రాజ్యమేలుతూ ఆ నాటి నేతలు ఎన్నో త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు వెనుకబాటు పట్టాయని, పౌరుల ప్రాథమిక హక్కులను నేటి పాలకులు హరించి వేస్తున్నారని అన్నారు. అసమ్మతిని అణచివేస్తున్నారని, ప్రశ్నించే వారిని జైలు పాలు చేస్తున్నారని చెప్పారు. చివరకు ప్రజల మధ్య విభజన తీసుకువచ్చి విద్వేష వాతావరణాన్ని పాలకులు ఉద్దేశ పూర్వకం గానే తీసుకువస్తున్నారని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితులలో దేశానికి ఫాసిజ ప్రమాదం పొంచి ఉందని, దీనిని ఎదుర్కోవ డానికి కార్మికవర్గం ఐక్యత సాధించాలని, కుల, మత, ప్రాంతీయ భావాలను అణచడానికి సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.

ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన చారిత్రక అవసరం నేడు మనముందుందని ఏఎన్‌యూ ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి అన్నారు. స్మారకోపన్యాసంలో భాగంగా 'భారత ప్రజాస్వామ్యం-రాజ్యాంగం-ఒక పరిశీలన' అనే అంశంపై ఆయన మాట్లాడారు. నేడు భారతదేశంలోనే కాక అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో కూడా ప్రజాస్వామ్యం సంక్షోభం లోకి వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి నా పాత్ర ఏమిటి అనే ప్రశ్నను ప్రతి ఒక్కరూ తమకు తాము వేసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యం లేకపోతే కార్మిక హక్కులను కాపాడు కోలేమనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రస్తుతం నయా ఉదార వాదం రాజ్యమేలుతోందని, దీనిని మరింత లోతుగా అధ్యయనం



చేయాలని సూచించారు. కపర్ది వంటి వ్యక్తుల ఆశయాలు నేడు సంక్షోభంలో ఉన్నాయని, ఆ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు.

ఎంవీఎన్ కపర్దికి గుంటూరు నగరంతో విడదీయరాని బంధం ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ అన్నారు. ఆయన కళాశాల విద్యాభ్యాసం గుంటూరులోని ఏసీ కళాశాలలో జరిగిందని గుర్తుచేశారు. ఇక్కడ నుంచే విద్యార్థి ఉద్యమాలలో సైతం పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏఐటీయూసీని బలీయమైన శక్తిగా నిర్మించటానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైందని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులు, కపర్ది కుమారులు మందలపర్తి కిషోర్ ప్రసంగించారు. ఇటీవల అరసం జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన పెనుగొండ లక్ష్మీనారాయణను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు స్వాగతం పలుకగా, జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట సుబ్బయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు చల్లా చిన్న ఆంజనేయులు, పుప్పాల సత్యనారాయణ, రావుల అంజిబాబు, కపర్ది కుటుంబసభ్యులు జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కపర్ది ఆశయ సాధనకు కృషి: ఓబులేసు

కార్మికోద్యమ నేత కపర్ది ఆశయసాధనకు మరింత పట్టుదలతో పనిచేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. తెలుగునాట ఏఐటీయూసీకి గొప్ప చరిత్ర ఉందని అన్నారు. అసంఘటిత, సంఘటిత ఉద్యోగులు సీపీఐకి, ఏఐటీయూసీకి పనిచేసేలా తయారు చేయడంలో కపర్ది కృషి అభినందనీయమన్నారు. కార్మిక సంఘంలో పనిచేసిన కపర్ది అసాధారణ విజ్ఞానవంతులని, గొప్ప నిర్మాణదక్షులని, మార్క్సిస్టు సిద్ధాంతం, భారతీయ సాహిత్యం పట్ల లోతైన అవగాహన కలిగి ఉండేవారని అన్నారు. చరిత్ర ఉన్నంతకాలం కపర్ది లాంటి వ్యక్తులు కార్మికుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఓబులేసు చెప్పారు. భవిష్యత్ లక్ష్యసాధన కోసం కపర్ది వంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని పోరాటాలకు పునరంకితం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ❑



# ప్రజా చైతన్యంతోనే ప్రజాస్వామ్య మనుగడ

**కపర్ది శత జయంతి సభలు**

**విజయవాడ**

**2023 సెప్టెంబరు 24**




ప్రజలు విద్యావంతులై, సామాజిక అవగాహనతో చైతన్య వంతమైతేనే ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యమవుతుందని సిద్ధార్థ లా కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్‌బాబు అన్నారు. కమ్యూనిస్టు నేత మండలపర్తి వెంకట నారాయణ కపర్ది శత జయంతి సభ మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు అధ్యక్షతన విజయవాడ సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 'ప్రజాస్వామ్యం మనుగడ' అనే అంశంపై దివాకర్‌బాబు స్మారకోపన్యాసం చేశారు. మన దేశంలో పౌర, రాజకీయ హక్కులను ప్రాథమిక హక్కులుగా నిర్ణయించారని వాటికి భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని చెప్పారు. ఆర్థిక హక్కును ఆదేశిక సూత్రాల్లో చేర్చటం జరిగిందన్నారు. సరళీకరణ, నూతన ఆర్థిక విధానాలు ప్రపంచవ్యాప్తంగా అమలులోకి వచ్చిన తరువాత చట్టాల్లో మార్పు వచ్చిందన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన సీబీఐ, ఈడీ, ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించటం లేదన్నారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, చీఫ్ జస్టిస్ నిర్ణయం మేరకు ఎలక్షన్ కమిషన్‌ను నియమించాల్సి ఉందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నమోదు చేసే కేసుల్లో 90 శాతం ప్రతిపక్ష నాయకులు, సామాజిక ఉద్యమకారులపైనే ఉంటున్నాయన్నారు. బీమాకోరేగావ్ కేసు ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. ప్రసార మాధ్యమాలు 90 శాతం బీజేపీ చేతిలో ఉన్నాయన్నారు. దర్యాప్తు ఏజన్సీలు ప్రభుత్వం చేతిలో ఉంటున్నాయని చెప్పారు. దేశంలో నేర చరిత్ర ఉన్న 45 శాతం మంది చట్టసభల్లో ఉన్నారని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే పరిస్థితులు వస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగం నిర్దేశించినట్లు సహకార ఫెడరల్ వ్యవస్థను కేంద్రం దెబ్బ తీస్తుందన్నారు. ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాలను కేంద్రం ఆధీనంలోకి తీసుకుంటుందన్నారు. సామాజిక న్యాయం సనాతన ధర్మానికి పూర్తి విరుద్ధం అన్నారు. సెక్యులర్ వ్యవస్థను అమలు చేయటం లేదన్నారు. న్యాయమూర్తి ఇచ్చే తీర్పుల్లో వారు పెరిగిన వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో సాధికారత పరిపాలన ఉండాలంటే ప్రజల ఆలోచనల్లో మార్పు- రావాలన్నారు.

### పాలకుల దయాదాక్షిణ్యాలపై ప్రజాస్వామ్యం : రామకృష్ణ

దేశంలో ప్రజాస్వామ్యం పాలకుల దయాదాక్షిణ్యాలపై నడుస్తున్నదని ప్రజాస్వామ్య రక్షణకు ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కేంద్ర క్యాబినెట్‌లో ఒక్క ముస్లిం లేదని, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే లేదని చెప్పారు. 1950 జనవరి 26వ తేదీన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ఈ రాజ్యాంగం తమకు సమ్మతం కాదనీ, మనువాదం ఆధారంగా రాజ్యాంగం ఉండాలని తన అధికార పత్రికల్లో పేర్కొందని గుర్తుచేశారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెడతారని చెప్పారు. ప్రధాని, కొంతమంది సీఎంలు ప్రెస్ కాన్ఫరెన్సులు పెట్టకుండా నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిన నేపథ్యంలో రానున్న రోజుల్లో డబ్బు లేని **మిగతా 64వ పేజీలో..**

# వర్గ రాజకీయాల ప్రాతిపదికన భారతదేశ భావన రూపొందాలి

**విశాఖపట్నం**

**2023 అక్టోబరు 10**



**విశాఖపట్నం శత జయంతి సభలో మాట్లాడుతున్న మానం ఆంజనేయులు, చిత్రంలో ఓబులేసు తదితరులు**

వర్గ రాజకీయాల ప్రాతిపదికన భారతదేశ భావనను రూపొందించేందుకు కమ్యూనిస్టులు మేదో మధనం చేయాలని న్యూ సోషలిస్ట్ ఇనిషియేటివి చెందిన డాక్టర్ రవిప్రకాశ్‌సిన్హా అభిప్రాయపడ్డారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఎంవిఎన్ కపర్ది శత జయంతి సందర్భంగా విశాఖలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 'భారతదేశ భావన – మార్క్సిస్టు దృక్పథం' అంశంపై ఆయన మాట్లాడుతూ భారత దేశ భావనను కమ్యూనిస్టులు స్పష్టంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం లౌకిక, పౌరసత్వ భావజాలం ఆధారంగా.., హిందుత్వ భావజాలం ఆధారంగా రెండు రకాల జాతీయవాదాలు ముందుకు వచ్చాయని చెప్పారు. హిందుత్వ జాతీయవాదంపై క్రమంగా ఆకర్షణ పెరిగి 2014లో మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చారని చెప్పారు. హిందుత్వ అతి జాతీయవాదానికి వ్యతిరేకంగా వర్గ రాజకీయాల ప్రాతిపదికన భారతదేశ భావనను రూపొందించా లని అన్నారు. భిన్నమతాలు, విభిన్న సంస్కృతల కలయికతో కూడిన మన దేశంలో కమ్యూనిస్టులు దీనికోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు స్వాతంత్ర్య ఉద్యమంలో ఏ మాత్రం పాత్రలేని హిందుత్వ భావజాలం ఆ తరువాత ఆధిపత్యం సాధించిందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సీపీఐ సీనియర్ నాయకులు మానం ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ... తిరుగు లేని కార్మిక ఉద్యమ నాయకుల్లో కపర్ది ఒకరిని అన్నారు. మార్క్సిస్టు సిద్ధాంత అవగాహనతో ఆయన ఎన్నో కార్మిక సంఘాలను నిర్మించారని చెప్పారు. పర్మినెంట్ ఉద్యోగులు తగ్గి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులు పెరుగుతూ వారిని సంఘటితం కాకుండా చేస్తున్నారన్నారు ఈ నేపథ్యంలో మరింత నిర్మాణాత్మకంగా కార్మిక సంఘాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, వాటిని వర్గ దృక్పథంతో నడిపించాలన్నారు. కార్మిక ఉద్యమం కుల అస్తిత్వ ఉద్యమాలు, అంశంపై ఆచార్య కె.శ్రీనివాసులు, అసంఘటిత రంగం కార్మిక ఉద్యమాలు సమస్యలపై ఆచార్య జి.విజయ్, ఐటీ రంగం, కృత్రిమ మేధ – భవిష్యత్తు కార్మిక ఉద్యమం అంశంపై వై.కిరణ్ చంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడి రాజు, కపర్ది కుమారుడు జగన్మోహన్ రావు, కుమార్తె అమ్మాజీ, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు సీహెచ్ రాఘ వేంద్రరావు, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం మన్మథ రావు, జీఎస్ అచ్చుతరావు, విజయనగరం, పార్వతీపురం, తూర్పు గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల పార్టీ కార్యదర్శులు కె.మన్మథరావు, ఒమ్మి రమణ, కె.బోరకొండ, టి.మధుతోపాటు సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ❑



సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు

# కామ్రేడ్ ఎం.వి.ఎన్. కపర్ది
# శత జయంతి సభ

తేది : 30-09- 2023, శనివారం ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 5 గం॥ల వరకు

వేదిక : పౌర గ్రంధాలయం, ద్వారకానగర్, విశాఖపట్నం.

నిర్వాహణ : ఎం.వి.ఎన్. కపర్ది శత జయంతి నిర్వహణ కమిటీ, విశాఖపట్నం.

## ఆహ్వానం

### కామ్రేడ్ ఎం.వి.ఎన్ కపర్ది శత జయంతి సభ

సెప్టెంబరు 30, 2023,

వేదిక : పౌరగ్రంధాలయం, ద్వారకానగర్, విశాఖపట్నం.



మండలపర్తి వెంకట నారాయణ కపర్ది అత్యుత్తమ కమ్యూనిస్టు. ప్రముఖ ట్రేడ్ యూనియన్ నేత. 1923లో పశ్చిమ గోదావరిలో జన్మించారు. తండ్రి రామచంద్రరావు పెద నింద్రకొలనుకి కరణంగా పని చేస్తూ గాంధీ పిలుపు మేరకు 1919లో తన పదవికి రాజీనామా చేసి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు.

కపర్ది ఉత్తమ విద్యార్థి. చదువుకునే రోజుల్లోనే రెండుసార్లు బంగారు పతకాలు అందుకున్నారు. గుంటూరు ఎ.సి.కాలేజ్‌లో చదువుతూ వామపక్ష భావజాల రచనలతో ప్రభావితమయ్యారు. విషయం తెలుసుకున్న తండ్రి గ్రాడ్యుయేషన్ చదువును మధ్యలోనే వదిలేసి రావాలని బలవంతం చేయడంతో కపర్ది 1942లో సొంత గ్రామానికి తిరిగి వచ్చారు. 19 ఏళ్ల వయస్సులో తన తల్లి బంధువైన శేషమ్మను వివాహం చేసుకున్నారు. అదే సంవత్సరం సీపీఐలో సభ్యత్వం తీసుకున్నారు. పార్టీలో చేరిన తొలినాళ్లలోనే స్థానికంగా భూమిలేని పేదలకు కొల్లేరులో సర్వే చేయని భూములను పంపిణీ చేయాలనే డిమాండుతో ఉద్యమాన్ని చేపట్టారు. 1943లో తాడేపల్లిగూడెం చేరారు. సీపీఐ నేతగా జిల్లాలో బలమైన ముద్ర వేశారు. 1973 నాటికి తన కార్యకలాపాల కేంద్రాన్ని హైదరాబాద్‌కు మార్చుకుని కన్నుమూసేవరకూ (మే 25, 1981) అక్కడి నుండే కార్యకలాపాల్ని సాగించారు.

కపర్ది తొలుత పార్టీ ఉద్యమంతో మమేకమవుతూనే కార్మిక రంగంపైనా దృష్టి సారించారు. తాను నివాసముంటున్న గ్రామ పంచాయితీలో పనిచేసే స్కావెంజర్ల సమస్యల పరిష్కారం కోసం పని చేశారు. 1943లోనే గ్రామ పంచాయితి వర్కర్లతో భారీ స్థాయిలో మేడే ర్యాలీని నిర్వహించారు. అనంతర కాలంలో రోడ్డు రవాణా, నిర్మాణ రంగం వంటి అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తూ కార్మిక యూనియన్‌లను నిర్మించారు. చక్కెర మిల్లులు, జూట్ మిల్లుల్లోనూ కార్మికోద్యమాలకు నాయకత్వం వహించారు. కార్మికులు, రైతులు ఏకకాలంలో ఎర్రజెండా కిందికి చేరి సంయుక్తంగా ఉద్యమాలు నిర్వహించేలా చేయగలిగారు.

కపర్ది ఉద్యమ ప్రస్థానం నాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్‌గా నిలిచింది. దీంతో 1948లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసి మూడేళ్లపాటు జైలులో పెట్టింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు విడుదల కాని అతి కొద్దిమందిలో కపర్ది ఒకరంటే ఆయన నిర్వహించిన ఉద్యమాల తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. 1962 నాటికి ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు ప్రముఖ నేతగా ఎదిగారు. 1964లో సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1968 లో సీపీఐ జాతీయ సమితి సభ్యులయ్యారు. 1975-81 మధ్య కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పని చేశారు. ఈ సమయంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తూ రాష్ట్రంలో బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కి చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా, మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వహించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ వేదికలపై భారతీయ కార్మిక వర్గం తరపున ప్రాతినిధ్యం వహించారు. కపర్ది కుటుంబ జీవితం కూడా అన్ని వర్గాలకు ఆదర్శప్రాయం. ఆయన సతీమణి శేషమ్మ సహా సంతానం అందరూ వామపక్ష ఉద్యమంతో మమేకమై పని చేస్తున్నారు.

కపర్ది శత జయంతి సందర్భంగా ఎం.వి.ఎన్ కపర్ది శత జయంతి నిర్వహణ కమిటీ, విశాఖపట్నం అధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సుకు అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరుతున్నాం.

## కార్యక్రమం

మొదటి సమావేశం : కార్మికవర్గ ఉద్యమం - నూతన సవాళ్లు (చర్చాగోష్ఠి)

అంశం 1
కార్మికవర్గ ఉద్యమం - కుల అస్థిత్వ ఉద్యమాలు, భవిష్యత్తు
వక్త : ఆచార్య కె. శ్రీనివాసులు (ఉ :10. గం)

అంశం 2
అసంఘటిత రంగం- కార్మికవర్గ ఉద్యమ నిర్మాణం, సమస్యలు
వక్త : ఆచార్య బి. విజయ్ (ఉ. 11. గం)

అంశం 3
ఐటీ రంగం, కృత్రిమ మేధ - భవిష్యత్తు కార్మిక ఉద్యమం
వక్త : కామ్రేడ్. వై. కిరణ్ చంద్ర (మ. 12.గం)

(భోజనవిరామం)

రెండవ సమావేశం

అధ్యక్షులు : కామ్రేడ్ మానం ఆంజనేయులు, సీపీఐ మాజీ శాసన సభ్యులు
సందేశం : కామ్రేడ్ జి. ఓబులేసు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

కామ్రేడ్ ఎం.వి.ఎన్ కపర్తి స్మారక ఉపన్యాసం
అంశం : భారతదేశ భావన- మార్క్సిస్టు దృక్పథం
వక్త : డాక్టర్ రవి ప్రకాశ్ సిన్హా, న్యూ సోషలిస్టు ఇన్షియేటివ్, న్యూఢిల్లీ



# ఆదర్శ కార్మికోద్యమ నిర్మాత కపర్దీ

**కపర్ది శత జయంతి సభలు**

**తాడేపల్లిగూడెం**

**2023 నవంబరు 7**



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రంగనాధరాజు



ప్రసంగిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

శ్రామికవర్గ సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూనే సమాజంలోని వివిధ వర్గాలలో మానవతా విలువలు పెంచేందుకు అమరజీవి కపర్ది కృషి చేశారని, ఆయన ఆదర్శాలను అనుసరించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని వివిధ రంగాల ప్రముఖులు పేర్కొన్నారు. కార్మికోద్యమ నిర్మాత మార్క్సిస్టు మేధావి, ఆదర్శ కమ్యూనిస్టు అమరజీవి ఎం.వి.ఎస్. కపర్ది శత జయంతి సభ అక్టోబరు 31 తాడేపల్లిగూడెంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక కళా పరిషత్తుల సమాఖ్య అధ్యక్షుడు బుద్ధాల వెంకటరామారావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కపర్ది జీవిత విశేషాలను వివరించారు. 1940వ దశకంలో గుంటూరులో ఉత్తమ శ్రేణి విద్యార్థిగా ఉన్నప్పుడు మార్క్సిస్టు భావజాలంతో ప్రేరేపితులైన ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రవేశించి నాలుగు దశాబ్దాలపాటు కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమాలలో కీలక భూమిక పోషించారని తెలిపారు. మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు మాట్లాడుతూ కమ్యూనిస్టులు మాత్రమే నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి రాజకీయాల్లో నీతి నిజాయితీలు పాటిస్తున్నారని, అలాంటి విలువలను కాపాడుకునే ప్రయత్నం జరగాలన్నారు. కమ్యూనిస్టుల వల్లనే ప్రజలలో ప్రశ్నించేతత్వం అలవడిందని, ప్రభుత్వాలను నిలదీసి పోరాడే చైతన్యం వచ్చిందని తెలిపారు. రహస్య నాయకులను దాచి, వారి ప్రాణాలను కాపాడిన కుటుంబాల్లో తమ కుటుంబం ఒకటని తెలిపారు. నేడు రాజకీయాల్లో అంతరించి పోతున్న నైతిక విలువలను కాపాడుకోవాలని, అందుకు అమర జీవి కపర్ది జీవితం ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాకు, కడప జిల్లాకు చిరకాలంగా రాజకీయ, సాహిత్య సాన్నిహిత్యం ఉందని, ఆర్వీయార్ మాస్టారి ద్వారా తమకు అమరజీవి కపర్ది గురించి తెలుసుకునే అవకాశం కలిగిందని తెలిపారు. రాష్ట్ర కార్మికోద్యమంలో శిఖర సమానులైన నేతల్లో కపర్ది ఒకరని కొనియాడారు. ఒక వైపు కార్మికవర్గ హక్కుల కోసం పోరాడుతూ, కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం కృషి చేస్తూనే సమాజంలోని అన్నివర్గాల మన్ననలు పొందగలిగిన విశాల దృక్పథం కపర్ది సొంతమని తెలిపారు. కుల, మత ఉద్వేగాల మాటున దోపిడీ రాజ్యాన్ని బలోపేతం చేస్తున్న ప్రస్తుత పాలకవర్గాల విధానాలను ఎదుర్కోవాలని, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఈలి నాని మాట్లాడుతూ కపర్ది తోడ్పాటుతోనే తన తండ్రి ఈలి ఆంజనేయులు మునిసిపల్ చైర్మన్‌గా, శాసనసభ్యునిగా ఎన్నిక య్యారని, కపర్ది సలహాలు, సూచనలతో పట్టణాభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. కపర్ది సతీమణి శేషమ్మ మునిసిపల్ కౌన్సిలర్‌గా అపారమైన సేవలు అందించిన గొప్ప మనిషి అని అన్నారు.

మార్క్సిస్టు మేధావి, 'దారిదీపం' మాసపత్రిక సంపాదకుడు డి.వి.వి.ఎస్.వర్మ మాట్లాడుతూ కార్మిక నేతలు చాలామంది ఉన్నా కపర్ది విలక్షణమైన నాయకుడని, కార్మికోద్యమాన్ని



మానవీయంగా రూపొందించారని తెలిపారు. కార్మికవర్గం మనసెరిగిన నేతగా, కమ్యూనిస్టు నేతల్లో అత్యంత ప్రజాస్వామిక వాదిగా కపర్ది వ్యవహరించారని అన్నారు. జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జీవితాంతం నీతి నిజాయితీలతో కార్మికుల కోసం పోరాడిన కపర్ది ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. తన తండ్రి బొలిశెట్టి సత్యనారాయణ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకునిగా, కపర్ది సహచరునిగా ఉండేవారని గుర్తుచేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ప్రజా జీవితంలో కపర్ది ప్రధానపాత్ర పోషించారన్నారు. కార్మికులకు, యజమానులకు మధ్య వారధిగా నిలిచి వివాదాలు రాకుండా సమస్యలు పరిష్కారం చేశారని తెలిపారు. వైసీపీ యువనేత కొట్టు విశాల్ మాట్లాడుతూ కార్మిక శ్రేయస్సు కోసం కపర్ది చేసిన కృషి చిరస్మరణీయమైనదని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు, కపర్ది కుమారుడు మందలపర్తి కిషోర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం ఒక విస్తారమైన కుటుంబం మాదిరి పనిచేసిందని, ఆనాటి చారిత్రక పరిస్థితుల్లో కొన్ని విలువలకు ప్రాతినిధ్యం వహించిందని తెలిపారు. వ్యక్తులు ఎవరైనా తమ కాలం నాటి సామాజిక విలువల కోసం పనిచేయడం ముఖ్యమన్నారు. ప్రజల సామాజిక విలువలకు ప్రాతినిధ్యం వహించే నాయకత్వమే నిలుస్తుందని తెలిపారు.

నీటిపంపిణీ సంఘం మాజీ అధ్యక్షుడు పసల అచ్యుతం, నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు ఎగ్గిన నాగబాబు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు, మానవత స్వచ్ఛంద సంస్థ విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సాగిరాజు జానకిరామరాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మార్నీడి బాబ్జి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, పార్టీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఏఐటీయూసీ రాష్ట్ర సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్, బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్.ప్రసాద్, ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. తొలుత కపర్ది చిత్రపటానికి సీహెచ్ శ్రీరంగనాధరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీల నేతలు, సంస్థల ప్రతి నిధులు పుష్పాంజలి ఘటించారు. సభలో కపర్ది కుమారులు జగన్ మోహన్, కిషోర్, కుమార్తెలు మహాలక్ష్మి, డా. విమలాదేవి, కోడలు వాణీదేవి, మనుమలు హరీష్, మౌగ్లీ, కపర్ది కుటుంబ సన్నిహితులను నిర్వాహకులు సభకు పరిచయం చేశారు.

## ప్రజా చైతన్యంతోనే ప్రజాస్వామ్య మనుగడ

**(60వ పేజీ తరువాయి)**

వ్యక్తివి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నావ్ అని ఓటర్లు ప్రశ్నించే పరిస్థితి వస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్యానికి కాపాడుకోవటం కోసం కమ్యూనిస్టుల పునరేకీకరణ అత్యంత ఆవశ్యకమన్నారు. కమ్యూనిస్టులు, లౌకికవాదులు ప్రజా ఉద్యమంలో భాగస్వాములు అయి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సి ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు మాట్లాడుతూ కపర్ది తన రాజకీయ జీవితంలో ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించే వారని చెప్పారు. స్నేహశీలి అని, మంచి మార్గనిర్దేశకులన్నారు. కపర్దితో తనకు ఉన్న అనుబంధాన్ని, ఆ నాటి సంఘటనలను వివరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ, ఏఐటీయూసీ నాయకులు పీజే చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు టీవీ రమణమూర్తి, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కపర్ది కుటుంబ సభ్యులు జగన్మోహనరావు, అమ్మాజి, రామారావు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా కపర్ది చిత్రపటానికి ఆంజనేయులుతోపాటు సీపీఐ నాయకులు పూల మాలలువేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, విజయవాడ నగర అధ్యక్షులు ఎస్కే.నజీర్ అమర వీరులను స్మరిస్తూ అభ్యుదయ గీతాలు ఆలపించారు. ❑

# సమరశీల పోరాటాలు సాగించాలి!

**కపర్ది శత జయంతి సభలు**

**తాడేపల్లిగూడెం**

**2023 మే 1**



ప్రసంగిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్

తాడేపల్లిగూడెం, మే 1: అశేష త్యాగాలతో సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు కార్మికవర్గం సమర శీల పోరాటాలను కొనసాగించాలని ఏ.ఐ.టి.యు.సి. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. కార్మికో ద్యమనేత అమరజీవి ఎం.వి.ఎన్. కపర్ది శతజయంతి, తాడేపల్లిగూడెంలో తొలి మేడే నిర్వహించి ఎనభై ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఏ.ఐ.టి.యు. సి. ఏరియా కమిటీ మే 1న ఏర్పాటు చేసిన 'కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం'లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమానికి ఏ.ఐ.టి.యు.సి. రాష్ట్ర ఉపాధ్య క్షుడు డి.సోమసుందర్ అధ్యక్షత వహించారు. ఏ.ఐ.టి.యు.సి. పతాకాన్ని ఎగురవేసిన రవీంద్రనాథ్ సభలో మాట్లాడుతూ 137 సంవత్సరాల క్రితం ఎనిమిది గంటల పనిదినం కోసం జరిగిన పోరాటం నుండి మేడే ఆవిర్భవించిందని, మేడే అమరవీరుల రక్తార్పణం నుండి అరుణ పతాకం ఆవిర్భవించిందని గుర్తు చేశా రు. నూట మూడేళ్ళ క్రితం ఆవిర్భవించిన ఏ.ఐ.టి.యు.సి. బ్రిటిష్ సామ్రాజ్య వలసపాలనకు వ్యతిరేకంగా పోరాడి కార్మికు లకు మరెన్నో హక్కులను సాధించిందని తెలిపారు. ఎనిమిదేళ్ళ మోదీ పాలనలో కార్మిక హక్కులను కాలరాసి కార్మికులతో కార్పొ రేట్ యజమానులకు వూడిగం చేయిస్తున్నారని విమర్శించారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ సంపద సృష్టిస్తున్న కార్మికవర్గం సంపదలో తన వంతు వాటా పొందా లంటే ప్రస్తుత సామాజిక వ్యవస్థ మారాలన్నారు. కార్మికవర్గం వ్యవస్థను మార్చే పోరాటాలకు పూనుకోవాలని అన్నారు. ప్రస్తుత రాజకీయ సంస్కృతి ప్రజల్ని కులమతాల పేరుతో విభజిస్తున్న దని, సమాజాన్ని అవినీతి, దోపిడీ, వివక్షలతో ధ్వంసం చేస్తున్న దని ధ్వజమెత్తారు. రాజకీయాలంటేనే ప్రజలు అసహ్యించుకునే విధంగా ప్రస్తుత పాలకవర్గాలు దుష్ట సంస్కృతిని తెచ్చాయని, పాలకవర్గ దుర్నీతిని కార్మికవర్గ కుటుంబాలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కపర్ది శతజయంతి సంవత్సరంలో కార్మిక కుటుంబాల విద్య, సాంస్కృతిక స్థాయిల పెంపుదలపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఏ.ఐటి.యు.సి. ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ 1943 మే 1న తాడేపల్లిగూడెం లో తొలి మేడే పతాకాన్ని ఎగురవేసిన అమరజీవి కామ్రేడ్ కపర్ది కృషితో స్థానికంగా కార్మికవర్గం ఒక బలమైన శక్తిగా రూపొం దిందన్నారు. జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు, మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ అండతోనే కార్మికవర్గం ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధించుకున్నదన్నారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో అంటరానివారుగా ముద్రపడ్డ పారి శుధ్య కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసిన కపర్ది వంటి మహనీయుల వల్లనే తమకు సామాజిక గౌరవం దక్కిందని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు, ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆది నారాయణ, కపర్ది తనయుడు మందలపర్తి జగన్మోహన్, తదితరులు మాట్లాడారు.

### కపర్ది సహచరులకు సత్కారం!

అమరజీవి కపర్దితో కార్మికోద్యమంలో కలిసి పనిచేసిన భవన నిర్మాణ కార్మిక సంఘం పూర్వ అధ్యక్షుడు గురువు సూర్యారావు, మునిసిపల్ కార్మికురాలు కాకి వీరమ్మ, సి.డబ్ల్యు.సి. గోడౌన్ కార్మిక నాయకుడు యర్రగోగుల వీర్రాజు, ఎస్.డబ్ల్యు.సి. గోడౌన్ లేబర్ యూనియన్ నాయకుడు మాదాసు సత్యనారా యణ, కపర్ది శత జయంతి ఉత్సవాల సందర్భంగా సత్కరిం చారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ చేతుల మీదుగా




వారిని శాలువా పూలమాలలతో సన్మానించారు. వేదికపై కపర్ది మనుమడు, అమరజీవి శ్రీపతి కుమారుడు మందలపర్తి హరీష్, వివిధ యూనియన్ల నాయకులు పెనుమాక చంద్రరావు, కొడ మంచిలి ముత్యం, మేళం నాగరాజు, సత్తిసెట్టి అప్పలరాజు, కోసూరి శ్రీనివాస్, కే.జయరాజు తదితరులున్నారు. సోమవారం కన్నుమూసిన భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా కమిటి పూర్వాధ్యక్షుడు కొల్లూరి రాంబాబు మృతికి సభ ప్రారంభంలో సంతాపం తెలిపారు. రెండు నిముషాలు మౌనం పాటించారు.

## ఇంటింటిపై మే డే జెండా

తాడేపల్లిగూడెంలో 1943లో కామ్రేడ్ కపర్ది సారథ్యంలో తొలి మేడే జరిగి ఎనభై ఏళ్ళు పూర్తయిన సందర్భంగా, కామ్రేడ్ కపర్ది శతజయంతి ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఏ.ఐ.టి.యు.సి అనుబంధసంఘాల సభ్యులు కుటుంబ సభ్యులతో కలిసి తమ తమ ఇళ్ళపై మేడే జెండాలు ఎగుర వేయాలని ఏరియా కమిటీ ఇచ్చిన పిలుపునకు కార్మికుల నుండి విశేష స్పందన లభించింది. ముందురోజు రాత్రి నుండి ఎడ తెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికి కార్మికులు లెక్క చేయ కుండా అత్యంత ఉత్సాహపూరితంగా ఇళ్ళపై ఏ.ఐ.టి.యు.సి. జెండాలు ఎగురవేశారు. వందలాది కుటుంబాలు జెండా ఎగుర వేయడంతోపాటు సెల్ఫీలు తీసుకుని యూనియన్ల వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేయడానికి పోటీ పడ్డారు. ఏరియాకమిటీ నుండి 800 మంది కార్మికులు జెండాలు తీసుకువెళ్లగా సుమారు 670 మంది తమ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇళ్ళపై జెండాలు ఎగురవేశారు. ఆరు వందల మంది కార్మికులు జెండాతో తమ కుటుంబసభ్యులు దిగిన ఫోటోలను యూనియన్ వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. పరిసర గ్రామాల్లో భవన నిర్మాణ కార్మిక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇళ్ళపై ఏ.ఐ.టి. యు.సి. పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం వందలాది మంది కార్మికులు తాడే పల్లిగూడెంలో జరిగిన "కార్మిక కుటుం బాల ఆత్మీయ సమ్మేళనం" కార్యక్రమానికి తరలివచ్చారు. మహిళలు, పిల్లలు ఉత్సాహంగా తరలి రావడం విశేషం. పట్టణంలో మునిసిపల్ కార్మికులు 80 మంది, భవన నిర్మాణ కార్మికసంఘం సభ్యులు 70 మంది, సి.డబ్ల్యు.సి. గోడౌన్ కార్మికులు 50 మంది, ఎస్.డబ్ల్యు.సి. కార్మికులు 40 మంది, మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ 70 మంది, పెంటపాడు పంచాయతీ కార్మికులు 15 మంది, అనుబంధం మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు 30 మంది, ఏరియా ఆస్పత్రి పారిశుధ్య, సెక్యూరిటీ విభాగాల సిబ్బంది 30 మంది, విడివిడి కార్మికులు 30 మంది అరుణ పతాకాలను తమ ఇళ్ళపై ఎగురవేశారు. పట్టణంలో కార్యక్ర మానికి కొడమంచిలి ముత్యం, ఉప్పాటి నాగరాజు, నరేంద్ర, మండేల్లి పండు, గోకా నాగరాజు, తాడేపల్లి వెంకటేష్, ఏడుకొండలు, నర్సన్న, ప్రసాద్ అంబేద్కర్, విజయకుమార్, కృష్ణంరాజు, నాగేంద్ర, బి.రామ్మో హన్, కుమార్, అంకం భాస్కరరావు, రాజా వెంకటరావు, మెండెం జేమ్స్, కాకర్ల రాంబాబు, రౌతు శ్రీనివాస్, రామిసెట్టి సత్తిబాబు, కోడె సాయిబాలాజీ, పిల్లంగోళ్ళ కృష్ణ, సింహాచలం, రెడ్డి మురళి, జగన్నాథం, చందు, తదితరులు నాయకత్వం వహించారు. రూరల్ మండలంలో మేడే ఘనంగా జరిపారు. భవన నిర్మాణ కార్మికసంఘం సభ్యులు ఆరుగొలనులో 40 మంది, నందమూరులో 20 మంది, **(మిగతా 69వ పేజీలో)**

# కపర్దీ స్ఫూర్తితో కార్మికోద్యమాన్ని బలోపేతం చేయాలి!

## కపర్ది 42 వ వర్ధంతి సభ

**తాడేపల్లిగూడెం**

**2023 మే 25**

తాడేపల్లిగూడెం, మే 25 : సుప్రసిద్ధ కార్మిక నేత, ఆదర్శ కమ్యూనిస్టు, అమరజీవి కామ్రేడ్ ఎం.వి.ఎన్ కపర్ది పోరాట స్ఫూర్తితో కార్మికోద్యమాన్ని బలోపేతం చేయాలని పలువురు కార్మిక నాయకులు పిలుపునిచ్చారు. కపర్ది శతజయంతి ఉత్సవాలలో భాగంగా 42వ వర్ధంతిని మే 25వ తేదీ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. కపర్ది విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏ.ఐ.టి.యు.సి. పతాకాన్ని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సీనియర్ నేత వీకే రావు ఎగురవేశారు. ఏ.ఐ.టి.యు.సి. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం కార్మికోద్యమ పితామహునిగా, కార్మిక సంఘాల వ్యవస్థాపకునిగా, రాష్ట్ర, జాతీయస్థాయిలో కార్మిక హక్కుల సాధనకు పోరాడి ఎన్నో విజయాలు సాధించిన నేతగా కపర్ది పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఖాళీగా పడి వున్న తాడేపల్లి గూడెం విమానాశ్రయ భూములను ఆక్రమించి వేలాది మంది పేదలకు సొంత ఇళ్ళు ఏర్పాటు చేసిన ఘనత కపర్ది గారికి చెందుతుందని అన్నారు. ఏ.ఐ.టి.యు.సి. ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ ప్రైవేటు బస్సు కార్మికులను సంఘటితం చేసి, బస్సు రూట్ల జాతీయకరణ కోసం కపర్ది చేసిన పోరాటంతో ప్రభుత్వరంగ ఆర్టీసీ సంస్థ ఏర్పడిందని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో భద్రత తెచ్చిన ఘనత కామ్రేడ్ కపర్దికే దక్కుతుందన్నారు. ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ 1943లోనే తాడేపల్లిగూడెం ఏరియాలో భవన నిర్మాణ కార్మికులకు సంఘాన్ని ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం కామ్రేడ్ కపర్ది చేసిన కృషి మరువలేనిదన్నారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో అంటరానివారిగా పరిగణించి అత్యంత హీనంగా చూస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఎనభై ఏళ్ళ కిందటే సంఘటితం చేసి వారి జీవితాల్లో వెలుగు నింపిన మహానుభావుడు కామ్రేడ్ కపర్దియేనని, ఆయన చలువ వల్లనే తమకు సామాజిక గౌరవం దక్కిందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో కార్మికుల, కష్టజీవుల హక్కుల కోసం పోరాడిన అమరజీవి కామ్రేడ్ కపర్ది స్ఫూర్తితో కార్మిక సంఘాలను బలోపేతం చేయాలని, కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఏ.ఐ.టి.యు.సి. ఏరియా కమిటీ కోశాధికారి అల్లం కుమారస్వామి, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నాయుడు, బాషా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంకం భాస్కరరావు, ఏరియా కమిటీ కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, కోశాధికారి కాకర్ల రాంబాబు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.ముత్యం, కాటమరాజు, మండేల్లి రామకృష్ణ, అల్లం నరేంద్ర, పెనుమాక భాస్కర్, రౌతు రాజేష్, కండేల్లి దుర్గారావు, సుబ్బారావు, మార్కెట్ యార్డ్ హమాలీ యూనియన్ నాయకులు మేళం నాగరాజు, కృష్ణంరాజు, విజయకుమార్, సి.డబ్ల్యూ.సి. గోడౌన్ లేబర్ యూనియన్ నాయకులు యాలం నరసన్న, గాది శ్రీనివాస్, దాసరి రమేష్, ఎస్.డబ్ల్యూ.సి. లేబర్ యూనియన్ నాయకులు మాదాసు సత్యనారాయణ, చంద్రశేఖర్, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఆలమూరి సత్యనారాయణ, టి.రామాంజనేయులు, కే.ఎస్.మణ్యం, తదితరులు పాల్గొన్నారు. ❑




ప్రసంగిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్

# కపర్ది సారధ్యంలో తాడేపల్లిగూడెంలో రాష్ట్ర యువజన రాజకీయ పాఠశాల



- డి.సోమసుందర్

సరిగ్గా యాభై ఏళ్ల క్రితం 1972 మేలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో యువజనుల కోసం అతి పెద్ద రాజకీయ పాఠశాల జరిగింది. 1972 మే 8 నుండి 18 వరకూ తాడేపల్లిగూడెంలో పది రోజులపాటు జరిగిన యువజన రాజకీయ పాఠశాలకు 850 మందికి పైగా హాజరయ్యారు. ఇంత మంది ప్రతినిధులకు పది రోజులపాటు వసతి సదుపాయాలు కల్పించడం చిన్న విషయం కాదు. నాటి ఏ.ఐ.టి.యు.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాడేపల్లిగూడెం వాస్తవ్యులు ఎం.వి.ఎన్.కపర్ది గారు అధ్యక్షుడిగా, సి.పి.ఐ. జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సుబ్బరాజు గారు ప్రధాన కార్యదర్శిగా ఆహ్వాన సంఘం ఏర్పడింది. పార్టీ జిల్లా కార్యదర్శి, నాటి పెనుగొండ ఎమ్మెల్యే వంక సత్యనారాయణ, జిల్లా పార్టీలోదిగ్గజాలు మాజీ ఎమ్మెల్సీ సంకు అప్పారావు, భూపతిరాజు మణ్యం, కలిదిండి భీమరాజు, మారెళ్ళ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే అత్తలూరి సర్వేశ్వరరావు, మాజీ ఎంపి కోంద్రు సుబ్బారావు, పులవర్తి విజయసారథి, డి.వి.వి.ఎస్.వర్మ, ఐ.ఎస్.రాజు, జల్లేపల్లి వెంకటరాజు, చేకూరి భద్రిరాజు, కంచనకాశీ విశ్వనాథరావు, పూడి అప్పలస్వామి, బోడపాటి వెంకటరెడ్డినాయుడు, ఇందుకూరి సుబ్బరాజు(జూనియర్) ఆహ్వాన సంఘం సభ్యులుగా ఉన్నారు. పాఠశాల నిర్వహణకు అవసరమైన నిధుల సేకరణ, పక్కాగా వసతి సౌకర్యాల ఏర్పాట్లు కోసం ఆయా విభాగాలలో అనుభవంవున్న వారితో వివిధ ఉప సంఘాలను ఏర్పాటుచేశారు. కపర్ది గారి నిరంతర పర్యవేక్షణతో మూడు నెలలపాటు అందరూ శ్రమించారు. రాష్ట్ర యువజన పాఠశాల కోసం ఆహ్వానసంఘం ఏకంగా 'చలసాని నగర్" పేరుతో ఒక తాత్కాలిక గ్రామాన్ని విమానాశ్రయం పక్కన నిర్మించారు. కలప, వెదురు గెడలు, తాటి ఆకు వినియోగించి ఒకేసారి వెయ్యి మంది కూర్చోవడానికి వీలుగా తరగతుల కోసం పెద్ద పాకను నిర్మించారు. అందులో 1000 మందికి సరిపోయే పాఠశాల హాలు, 200 మంది ఒకేసారి భోజనం చేయడానికి వీలుగా భోజనశాల నిర్మించారు. వంటశాల, స్టోర్ గది, ప్రిన్సిపాల్‌కు ఒకటి, ఆహ్వాన సంఘం ఆఫీస్‌గా మరొకటి తాటాకు షెడ్లు నిర్మించారు. వైద్య ఆరోగ్య సేవల కోసం ఒక తాటాకు పాక నిర్మించారు. అలాగే స్నాక్స్, టీ కాఫీల కోసం ఒక చిన్న టీ స్టాల్, కిళ్ళీ షావు, నిత్యావసరాల స్టోర్ కోసం మరో షెడ్ నిర్మించారు. విద్యార్థులు నిద్రించడానికి వేరుగా మరో మూడు పాకలు వేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఒక భారీ వేదికను నిర్మించారు. ఆవరణ చుట్టూ దడి కట్టి ప్రతినిధుల ప్రవేశం కోసం ఆర్చితో కూడిన గేటు పెట్టారు ఆవరణలో, పాకల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటుచేశారు. ఆవరణకు కొద్దిదూరంలో యాభై వరకూ తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించారు. మొత్తం




పాఠం చెబుతున్న కామ్రేడ్ రాజశేఖర్ : ఆసక్తితో వింటున్న విద్యార్థులు





క్యాంపు నిర్వహణా సమన్వయ బాధ్యత సంకు అప్పారావు చూశారు. వంక సత్యనారాయణ ప్రిన్సిపాల్‌గా, డి.వి.వి.ఎస్. వర్మ వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. వంటల బాధ్యతలు పార్టీ సీనియర్ నేత యాళ్ళబండి పోలిశెట్టి చూసుకున్నారు. ఆయనకు పైబోయిన సోమయ్య సహకరించారు. ఆనాటి మహిళా సంఘం నేతలు మందలపర్తి శేషమ్మ, దూసన పూడి సుబ్బాయమ్మ, యాళ్ళబండి పుణ్యవతి, కాళ్ళ ధనలక్ష్మి, మద్ది సీతమ్మ, గాదంసెట్టి సత్తెమ్మ, కాకర్ల అనసూయమ్మ వంటి వారు పాఠశాల కోసం ఆవకాయ పచ్చళ్ళు పట్టారు. పాఠశాల జరిగిన పది రోజులూ వాళ్ళు క్యాంపు దగ్గరికి వచ్చి వంటల తీరు తెన్నులను గమనించి సూచనలు చేస్తూ ఉండేవారు. తాలూ కా పార్టీ సీనియర్ నేత మద్ది శేషయ్య స్టోర్స్ బాధ్యతలు చేపట్టి సరఫరాలను చూసుకున్నారు. పార్టీ స్థానిక నేతలు దూసనపూడి విరాటరాజు, యాళ్ళబండి రంగ నాయకులు, పిచ్చా వెంకట రత్నం, కాకర్ల సూర్యప్రకాశరావు, సుంకవల్లి రాజగోపాలరావు, కోరాడ గోపాలం, జాన లక్ష్మణరావు, పాబోలు పాపారావు, దూలం కృష్ణారావు, కాళ్ళ చంద్రరావు, ప్రత్తి బ్రహ్మన్న, దింట కుర్తి మాలకొండయ్య, బత్తుల కృష్ణ, బత్తుల సోమరాజు వంటివారు వివిధపనుల్లో ఆహ్వాన సంఘానికి తోడ్పడ్డారు. పాఠశాలలో పాల్గొంటున్న ప్రతీ ఒక్కరికీ ఒక తాటాకు చాప, అల్యూమినియం ప్లేటు, గ్లాసు, తాటాకు విసనకర్ర ఇచ్చారు. ప్రతినిధులకు ఒక నోటు బుక్కును, పెన్నును ఇచ్చారు. పది రోజులపాటు ప్రతినిధులకు ఎలాంటి లోటు లేకుండా అన్ని వసతులు కల్పించడం జరిగింది. తాడేపల్లిగూడెం పాఠశాలకు నమోదైన ప్రతినిధులు 750 మందే అయినా, స్థానికులు మరో వంద మంది ప్రతిరోజూ ఆసక్తిగా వచ్చి క్లాసుల్లో కూర్చునే వారు. వారికి వివిధ రకాల సేవలందించడానికి దాదాపు 150 మంది వాలంటీర్లు కూడా నెల రోజులు పనిచేశారు. కపర్దీ గారికి, పార్టీ నాయకత్వానికి తాడేపల్లిగూడెంలో ఉన్న సామాజిక గౌరవం, నాయకత్వ బృందపు నిర్వహణా సామర్థ్యం, పిలిస్తే పలికే కార్యకర్తల బలగం పుష్కలంగా ఉండటం కారణంగానే ఇంత భారీ పాఠశాలను విజయవంతంగా నిర్వహించగలిగారని చెప్పాలి. పాఠశాల అధ్యాపకులుగా రాష్ట్ర పార్టీ ప్రముఖ నాయకులు వచ్చారు. పాఠశాల ముగింపుగా పట్టణంలో జరిపిన భారీ బహిరంగ సభలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు ప్రసంగించారు చలసాని నగర్ నిర్మాణం, పాఠశాల నిర్వహణ, క్యాంపులో ఏర్పాట్లు, కార్యకర్తల సమీకరణ వంటివి కామ్రేడ్ కపర్దీకి గల నిర్మాణ దక్షతను వెల్లడిస్తాయి. ❑

## సమరశీల పోరాటాలు సాగించాలి!

**(66వ పేజీ తరువాయి)** ఎల్.అగ్రహారంలో 40 మంది, మాధవరంలో 20 మంది, పుల్లాయిగూడెంలో 40 మంది, ఎల్లమిల్లిలో 40 మంది నవాబుపాలెంలో 10 మంది యూనియన్ పిలుపు మేరకు తమ తమ ఇళ్ళపై ఏ.ఐ.టి.యు.సి. పతాకాలను ఎగురవేశారు. ఆయా గ్రామాల్లో మోటారు సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. గ్రామ కూడళ్ళను యూనియన్ తోరణాలతో అలంకరించారు. గ్రామాల్లో కార్యక్రమానికి టి.దనరాజు, జి.నరేష్, తాతగుంట్ల శ్రీనివాస్, ఈనుల పోతురాజు, పాలూరి సుబ్రహ్మణ్యం, దయ్యం పాండురంగారావు, గంధం సత్యనారా యణ, సిద్దిరెడ్డి సత్యనారాయణ, కుసుమరాజు విజయదుర్గా ప్రసాద్, కొండపల్లి చంటి, తలా మాణిక్యాలరావు, గుండు మోగు ల త్రిమూర్తులు, బండి సర్వేశ్వరరావు, రుద్ర శ్రీనివాస్ నాయ కత్వం వహించారు. 'కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం'కు ఎనిమిది వందల మంది హాజరయ్యారు. ❑



పశ్చిమ గోదావరి జిల్లా కమ్యూనిస్టు పార్టీ కమిటీ సమావేశం 1952 నవంబరు 16వ తేదీన శృంగవృక్షంలో జరిగిన సందర్భంలోదీ చిత్రం. కూర్చున్నవారు వరుసగా : అన్నె అనసూయ, అన్నె వెంకటేశ్వరరావు, నెక్కలపూడి రామారావు, ఉద్దరాజు రామం, గొట్టిముక్కల వెంకట్రామరాజు, సంకు అప్పారావు, కొటికలపూడి సూరన్న (ఆహ్వానితులు). మొదటి వరుసలో నిలబడిన వారు : కుమ్మర కోటేశ్వరరావు, ఇందుకూరి సుబ్బరాజు, ....... గారపాటి సత్యనారాయణ, మైలవరపు రామారావు, చేకూరి నరసింహం, భూపతిరాజు లక్ష్మీ నరసింహరాజు, అల్లూరి సత్యనారాయణ, విరాట్‌రాజు, వెనుక నిలబడినవారు : నేతల పోతురాజు, ఆకుల సుబ్బారావు, సత్యనారాయణరెడ్డి, ఎంవీఎన్ కపర్ది, కొల్లా వెంకటరత్నం, వంకా సత్యనారాయణ, యాళ్లబండి రంగనాయకులు



ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ మహాసభ సందర్భంలో ప్రైవేటు మోటారు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులతో ఎంవీఎన్ కపర్దీ

# చిరస్మరణీయులు

## సన్నిహితుల ఆప్తవాక్యాలు

- చెరకువాడ శ్రీ రంగనాథరాజు



సమాజంలో పేదలు, కార్మికులు, కర్షకులతోపాటు రకర కాల వృత్తుల, వ్యక్తుల అభ్యుదయాన్ని సమానంగా కోరుకునే వ్యక్తులు అరుదుగా జన్మిస్తారు. అలాంటి వాళ్ళల్లో ముఖ్యులు కీర్తిశేషులు శ్రీ యమ్.వి.ఎన్. కపర్ది గారు. తాడేపల్లిగూడెం తాలూకాలోని పెదనింద్రకొలను గ్రామంలో జన్మించి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, ఆ తరువాత సీపీఐ ఆశయాలకూ సిద్ధాంతాలకూ ఆకర్షితులై సీపీఐ సభ్యులయ్యారు శ్రీ కపర్ది గారు. ఈ రాష్ట్రంలో మరీ ముఖ్యంగా ఈ జిల్లాలో ఎన్నో కార్మిక, రాజకీయ ఉద్యమాల్లో ముందుండి నాయకత్వం వహించిన నిజమైన కమ్యూనిస్టు ఆయన. ఉద్యమాన్నే ఊపిరిగా భావించి ఆ ఉద్యమ నిర్మాణం కోసం తాడేపల్లిగూడేన్ని కేంద్రంగా చేసుకొని ఎందరో యువకుల్ని ఉత్తేజపరిచిన వ్యక్తి ఆయన. కార్మికులు, కర్షకుల శ్రేయస్సుకు పెద్దపీట వేసి వారి శ్రేయస్సే ఏకైక ధ్యేయంగా ఉద్యమాన్ని నడిపించేవారు. ముఖ్యంగా ఆర్టీసీ కార్మిక సంఘాలు, రైస్‌మిల్ కార్మిక సంఘాలు, మార్కెట్ జట్టు కూలీల సంఘాలు, రైతు కూలీల సంఘాలను ముందుకు నడిపించిన కార్మికవర్గ పక్షపాతి కపర్ది గారు.

**కార్మికవర్గ పక్షపాతి అంటే యజమానులకు శత్రువు అని అర్థం కాదు. ఆయన ప్రధానంగా కార్మికుల అభివృద్ధిని కాంక్షించి, వారి శ్రమ శక్తికి తగిన వేతనం లభించేలా యజమానులతో సుహృద్భావ వాతావరణంలో చర్చలు సాగించేవారు. ఒకటి రెండుసార్లు చర్చించినా పరిష్కారం కాని సమస్యల్ని సైతం, మళ్ళీ మళ్ళీ చర్చల ద్వారానే పరిష్కరించుకోవటం కోసం ఆయన ప్రయత్నం చేసేవారు. చర్చల ద్వారానే చాలా సమస్యలకు పరిష్కారం చూపించిన అరుదైన కార్మిక నాయకులలో శ్రీ కపర్ది గారు అగ్రగణ్యులు.**

ఆయన ఏనాడూ బందులు, సమ్మెలు లేకుండా చర్చల ద్వారా ఎంతో చాకచక్యంతో సమస్యలను పరిష్కరించేవారు. కార్మిక చట్టాలను అందరికి అర్థమయ్యేలాగా విడమర్చి చెప్పి కార్మికులు, యజమానుల మధ్య మంచి సంబంధాలు కొనసాగేలా శ్రమించిన కార్మిక నాయకులు. ఆయన కుటుంబంతో మాకు వ్యక్తిగతమైన స్నేహం అభివృద్ధి చెందింది. ఆయన కుమారుడు శ్రీపతితో స్నేహం నన్ను ఆ కుటుంబ సభ్యుడిని చేసింది. జాతీయ, అంతర్జాతీయ విషయాల మీద ఆయన తన కుటుంబ సభ్యులతో చేసిన చర్చలు మాలో కూడా ఆయా విషయాల మీద ఆసక్తి రేకెత్తించాయి. అలా చక్కని అవగాహనతో కూడిన స్నేహం మాకు శ్రీపతికి మధ్య అభివృద్ధి చెందింది. ఆ తరువాత కాలంలో కీ॥శే॥ శ్రీపతి కార్మిక ఉద్యమంలో నాయకత్వ స్థానానికి, రైస్ మిల్లర్స్ సంఘాలలో నేను నాయకత్వ స్థానానికి ఎదిగాం. అయినా మా మధ్య స్నేహం అలాగే కొనసాగింది. వారి కుటుంబపరమైన సమస్యలు, వివాహాలు వంటి విషయాలలో నా సలహా, సంప్రదింపులకు ఆ కుటుంబం ప్రాధాన్యమివ్వడం నాకెంతో ఆనందాన్నిచ్చింది. శ్రీ కపర్ది గారు ఎంతో దూరదృష్టి కలిగిన రాజకీయవేత్త. దేశ ప్రపంచ రాజకీయాలలో మార్పులను కొన్ని సమావేశాలలో ఆయన వివరించినపుడు నేను ఎంతో శ్రద్ధగా వినేవాడిని. ఈ తరం నాయకత్వం ఆయన ఆచరణలో చూపించిన కొన్ని విషయాలను అవగాహన చేసుకోవలసిన అవసరం ఎంతో ఉంది. ఈ తరం నాయకులకు శ్రీ కపర్ది గారు ఆదర్శప్రాయులు. మన జిల్లాలో నీతి, నిజాయితీలకు మారు పేరుగా నిలిచిన కొద్దిమందిలో శ్రీ కపర్ది గారు ఒకరు.

**ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలకు విలువ ఇవ్వకుండా సమాజ శ్రేయస్సే పరమావధిగా శ్రమించిన కమ్యూనిస్టు నాయకుడు శ్రీ కపర్ది. అలాంటి ఆదర్శప్రాయుడు కాబట్టే ఆయన చనిపోయి 25 సంవత్సరాలు గడిచిపోయినా కూడా ఈ నాటికి రైస్ మిల్లింగ్ పరిశ్రమ ఏదో విషయంలో ఆయన పేరు తలచి, ఆయన చూపించిన సుహృద్భావ బాటలోనే పయనిస్తూ ముందుకు వెళుతోంది. అదే ఈతరం నాయకులు ఆయన స్మృతికి ఇవ్వదగిన ఘనమైన నివాళి.**

కపర్దిగారు చూపించిన బాటలోనే ఆయన కుటుంబ సభ్యులు కూడా నడుస్తూ, ఆయన ఆదర్శాలను ఆచరిస్తూ ముందుకు వెళ్ళటం నాలాంటి కపర్ది అభిమానులకు ఎంతో సంతృప్తిని ఇస్తుంది. ఆయన ఒక మార్గదర్శిగా ముందు తరాలకు ఎంతో స్ఫూర్తినిచ్చారు. అందుకే శ్రీ కపర్ది గారు చిరస్మరణీయులు. ❑



# కపర్దస్య జటాజూటం

- ఆర్వియార్

1981 మే నెల. హైదరాబాద్‌లో ఇంటర్మీడియేట్ పేపర్ వాల్యుయేషన్ పనిలో వున్నాను. ఆ పని ముగింపు దశలో వుండగా తణుకు నుంచి మా ఆవిడ కబురు చేసింది. జూన్ మొదటివారంలో మా మాస్కో ప్రయాణం ఖరారు అయినట్టు ఢిల్లీ నుంచి సోవియట్ అధికారులు వర్తమానం పంపించారని. అప్పటికే కపర్దీ గారు హాస్పిటల్లో వున్నారు. రెండు, మూడుసార్లు వెళ్లి చూశాను. ఈ వార్త చెప్పి వెళ్దామని కలిశాను. "బాగుంది మాస్టారూ! ప్రయాణంకండి. ఆ దేశంలోనే కలుద్దాం" అన్నారు. శేషమ్మ గారి దగ్గిరా, ఆయన దగ్గిరా సెలవు తీసుకుని, ఆ మర్నాడు ఉదయం బయల్దేరాను. విజయవాడలో జోషీని కలిసి, ప్రయాణానికి ఏర్పాట్లు చెయ్యమని చెప్పాలి. చంద్రం బిల్డింగ్స్‌లో జోషీని కలవగానే "కపర్ది పోయేడ్రా!" అన్నాడు. నోటమాట రాలేదు నాకు.

అంతకు ముందురోజే ఆయనను కలిశాను. ఇంతలోనే ఇంత దుర్వార్తా? మనసు వికలమైపోయింది. అప్పటికే సంతాప సభ జరుగుతోంది. ఆ సాయంత్రం అంతా కపర్దీ గారు పరిచయం అవడం-ఆయన సిద్ధాంత నిబద్ధత - కార్యదీక్ష - ఉద్యమ స్ఫూర్తి గురించిన ఆలోచనలే.

కపర్దీ గారితో నా పరిచయం జరగడమే ముందు గుర్తు వచ్చింది. నేను పశ్చిమ గోదావరి జిల్లావాడినే అయినా, 1969 వరకు జిల్లాతో సంబంధం లేకుండా పోయింది. 1955లో ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షలు అయిన తర్వాత కాలేజీ, యూనివర్సిటీ చదువులు, కళాశాలల్లో ఉద్యోగాలు. 1969 దాకా నన్ను వూళ్లు తిప్పేరు. పశ్చిమ గోదావరి జిల్లా నా స్వంత జిల్లా అయినా అప్పటి వరకు పరాయిదిగానే వుండిపోయింది. మణ్యం గారు, వర్మ, వంకా అప్పటికే పరిచయం. ఓ రోజు ఉదయం వర్మ కపర్దీ గారు మా ఇంటికి వచ్చారు. వర్మ ఆయన్ని పరిచయం చెయ్యబోతుండగా నేను గుర్తు పట్టి నమస్కారం చేశాను. "మా అబ్బాయి జగన్ ఇంటర్మీడియేట్ చదువుతున్నాడు. శ్రద్ధ తక్కువ!" అని బాధ్యత నా మీద పెట్టారు. జగన్ గురించి నేను ఆసక్తి చూపించడమే కాకుండా, తోటి లెక్చరర్స్‌కు చెప్పాను. ఆ తర్వాత జగన్ కాన్వెంట్ పెట్టి, ప్రిన్సిపాల్‌గా మరెంతో మందిపై శ్రద్ధ పెట్టేవాడయ్యాడని మాస్కోలో వున్నప్పుడు విన్నాను. సంతోషం కలిగింది. అప్పట్లో శ్రీపతి కూడా మా కాలేజ్‌లోని డిగ్రీ స్టూడెంట్. క్లాస్' సాయంత్రం ఆఖరి గంట అయినా శ్రీపతి హాజరయ్యే వాడు. అలా శ్రీపతి హాజరవడం నా విజయంగా, తోటి లెక్చరర్స్‌కు ఉడుకు కలిగించేది. శ్రీపతి మంచి ట్రేడ్ యూనియనిస్టు అయ్యాడు. ట్రేడ్ యూనియన్ లీడర్‌గా కపర్దీ గారు చాలా దక్షతతో కార్యకలాపాలు నిర్వహించేవారు. ఆర్టీసీ యూనియన్ నిర్వహణ మాత్రమే కాదు. బ్యాంకు ఉద్యోగ సంఘాల బాధ్యతనీ నిర్వర్తించేవారు. చాలామంది బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు ఆయన ద్వారానే నాకు మిత్రులు అయ్యారు. ఇదంతా ఒక ఎత్తయితే జీవితంలో, తన కుటుంబంలో నమ్మిన సిద్ధాంతాలని అమలు పరచడం మరొక ఎత్తు. కపర్దీ గారు తన పిల్లలందరికీ అంతర్వర్ణ వివాహాలే జరిపించారు. శ్రీపతి, సంధ్యల వివాహానికి నేను హాజరయ్యాను. నారాయణమూర్తి వివాహం మేనరికం. వివాహం ఆధునిక పద్ధతిలో జరిగింది. ఆనాటి పౌరోహిత్యం నేనే చేశాను. "ఇది పాతకొత్తల మేలు కలయిక మాస్టారూ!" అన్నారు కపర్దీగారు.

**కపర్దీ గారు నాయకునిగా తనదైన ముద్ర వేసి ఉద్యమానికి దోహదం చేశారు. కొత్త వాళ్లని ఆకర్షించడం, ఉద్యమానికి అనుకూలించేట్టు మలుచుకోవడం నాయకుని లక్షణాలు. ఆయన వ్యక్తిగతంగా ఏ సుఖాలూ కోరుకోలేదు. మండుటెండల్లో ఊళ్లు తిరిగేవారు. మన నాయకుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుని, వాళ్లను ఉద్యమానికి మరింతగా ఉపయోగపడేటట్టు కాపాడుకునే ఆలోచన మన కార్యకర్తలకు లేకపోయిందే అన్న బాధ వుండేది నాకు.**

కపర్దీ గారు పార్లమెంటుకు పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. "యేమిటీయన పేరు? అన్యమత నామధేయు"డనీ తణుకులో చాలా మంది పొరపాటు పడేవారు. "కపర్దస్య జటాజూటం" అంటే, కపర్దకమంటే శివుని జటాజూటమని మేమందరం చెప్పడం నాకింకా గుర్తు. కపర్దీగారిని పరిచయం చేసుకోవటం, ఆయన కుటుంబ సభ్యులందరికీ ఆప్తవర్గంలోని వాణ్ణి కావడం నాకు మిగిలిన తీపిగుర్తులు. ❑

# కార్మిక నేతలో మరో పార్శ్వం

## సన్నిహితుల ఆప్తవాక్యాలు

- ఏటుకూరి ప్రసాద్



"అరేయ్! మాష్టారొచ్చార్రా, త్వరగారా!" - అంటూ నన్ను చూసి, ఆ ఉన్న రెండు గదుల పోర్షన్‌లోనే గావుకేక పెట్టేవారు కపర్ది గారు కిషోర్‌ను పిలుస్తూ. అది ఉదయం తొమ్మిది గం॥ల సమయం. ఆయన ఎ.పి.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ హిమాయత్ నగర్లో ఉండే సత్యనారాయణరెడ్డి భవన్ వెనకభాగంలో కాపురం ఉండేవారు. రాష్ట్ర కార్మికవర్గ సంఘ కార్యదర్శిగా ఆఫీసు కార్యాలయ భవనంలోనే కాపురమున్న వ్యక్తులలో కపర్ది గారే మొదటి వారు కావచ్చు. వారొక చిన్నపాటి 'కుటుంబరావు' గారు. బహు సంతానధనులు! అది 1970వ దశకం ఉత్తరార్థమనుకుంటా. కపర్ది గారి ఆరో అబ్బాయి కిషోర్ హైదరాబాద్ పాతబస్తీలో ఉండే ప్రభుత్వ సిటీ కాలేజీలో బి.ఎ చదువుతుండేవాడు. ఆ సిటీ కాలేజీ నిజాం రాష్ట్రంలో చాలా పురాతనమైందీ, చరిత్రగలదీనూ. మనకు సంబంధించినంత వరకూ అక్కడ ప్రముఖ కమ్యూనిస్టు కార్మికనాయకుడు, ప్రజా కవీ మఖ్దూం ఉర్దూ లెక్చరర్‌గా పనిచేశాడు. అలాగే ప్రస్తుతం హైదరాబాద్‌లోని సి.ఆర్. ఫౌండేషన్‌లో ప్రముఖులు గురవారెడ్డి గారు అక్కడే లెక్చరర్‌గా పనిచేశారు. ఫీజులు తక్కువ వుంటాయి. స్వేచ్ఛ ఎక్కువ వుంటుంది. వివిధ రకాల రాజకీయ అభిప్రాయాలు వున్న వాళ్లు అక్కడ విద్యార్థులుగా వుంటుంటారు. ప్రజాస్వామిక తెంపరితనానికి సిటీ కాలేజీ ఓ ఉదాహరణ ఆ రోజుల్లో. కానీ చదువులో వెనుకబాటుతనం మాత్రం కనబడేది కాదు.

నేను మదీనా దగ్గర వున్న ఓ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేసేవాడిని. అక్కడికి సిటీ కాలేజీ దగ్గరే. కిషోర్‌ను రోజూ నా రిక్షాలో కాలేజీకి తీసుకెళ్లే అంటగట్టని బాధ్యత నాది. నేను డాక్టరేట్ కోసం అడ్డమైన సోషియలాజికల్, మైథలాజికల్ పుస్తకాలు చదువుతుండే వాడిని. తాపీ వారి 'దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు?', 'పెళ్లి - దాని పుట్టు పూర్వోత్తరాలు', 'ఇనుప కచ్చడాలు' వెనక వున్న సాంఘిక, మతపరమైన అంశాల వెదుకులాటలో వుండేవాడిని. ఇంగ్లీష్, తెలుగు పుస్తకాలను బట్టీ పెట్టడం వుండేది. ఇవన్నీ మా రిక్షా ప్రయాణంలో కిషోర్‌కు చెబుతుండేవాడిని. దొక్క శుద్ధి వున్న కుటుంబం వారిది.

కపర్ది గారిలో కనపడని సాహిత్య విద్యార్థి, విమర్శకుడు ఉండేవాడు. ఆయన అన్నగారు ఉపేంద్రశర్మ గారు గుంటూరు హిందూ కళాశాలలో తెలుగు శాఖాధిపతి. వారి సన్నిహిత శిష్యుడిగా నా బి.ఎ. 1955-57లో అక్కడ సాగింది. అదిగో వారి తమ్ముడే వీరు - కపర్ది గారు. ఓ నాడు హటాత్తుగా కిషోర్ కోసం ఎదురు చూస్తున్నప్పుడు "మాష్టారూ, 'రానున్నది ఏది నిజం' నవల యువజన సమాఖ్య ప్రచురణగా వేయడం ఏం బాగోలేదు" అంటూ ఆరంభించారు సంభాషణ. నేను తెల్లబోయాను. దాశరథి రంగాచార్య గారి చిరునవల అది. గతంలో ధారావాహికంగా ప్రచురితమైంది ఓ పత్రికలో. "ఏం ఎందుకు?" అని రెట్టించాను. సోషలిజం పరిణామాల వల్ల సాధించిన అభివృద్ధిని ఓ కలగా చూపించడం ఏమిటండీ, కళ్ల ముందు అనేక దేశాల్లో జరుగుతుంటేను.. మన దేశంలోనూ ఆ గాలుల ప్రభావం కనబడుతుంటేను! ఈ నవల ఏ 30 దశకం లోనో రాసి వుంటే సమర్థనీయం. 70 దశకంలో రాయదగ్గది కాదు. ఒక వేళ రాసినా మీరు ప్రచురించటం ఏమిటి?" అంటూ విమర్శచేశారు. ఓ సభలో ఓ మంత్రి కునుకు తీసిన సమయం లో వచ్చిన కలే ఆ నవలకు ఇతివృత్తం. అందులో వివిధ రంగాల్లో సోషలిజం దశలో వచ్చిన అభివృద్ధిని ఆ మంత్రి కల కంటాడు. అంతలో ఓ చీమ కుట్టడంతో ఆయన మేల్కొంటాడు. దేశం అలా అభివృద్ధి సాధించాలని భావిస్తాడు. కార్మిక నేతగా, వస్తూత్పత్తులను, ఉత్పత్తి శక్తుల బల సంపదలను చూస్తున్న వ్యక్తి కనుకనే ఇంకా ఇలాంటి ఊహాలోకాలను నిర్మించడం వాస్తవిక వాదం కాదన్నది కపర్దిగారి వాదన వెనక వున్న తాత్వికత.

అలాగే ఒకసారి నేను రాసిన ఒక పాటలో సంపన్నదేశంగా వున్న రాజ్యమల్లా దోపిడీ చేస్తుందన్న అర్థం వచ్చేలా వస్తువు తీసుకున్నాను. దాని మీదట "సంపన్న దేశం కావడం నేరం కాదు! సోషలిస్టు దేశాలన్నీ సంపన్న దేశాలుగా వుండకుండా పేద దేశాలుగా పడి వుండాలనా మీ ఊహ? అది తప్పు. దోపిడీని అరికట్టాలన్న అంశం వివరించాలే తప్ప సంపన్న దేశంగా ఉండకూడదనడం పొరపాటు" అంటూ ఆ పాటను తీవ్రంగా విమర్శించారు కపర్ది గారు. మార్క్సిజం అంటే పేదరిక సిద్ధాంతం కాదని, పేదరికాన్ని నిర్మూలించాలనే సిద్ధాంతమని వివరిస్తూ తన వాదాన్ని బలపర్చుకున్నారు. నీలం రాజశేఖర్ రెడ్డి గారు నేను రాసిన ఓ పాటల పుస్తకానికి పీఠిక

(మిగతా 77వ పేజీలో)

సన్నిహితుల ఆప్తవాక్యాలు

# మూస నుంచి పక్కకు



- డి.సోమసుందర్

వర్ధంతిని నిర్వహించడానికి ఒక మూసతంతు వుంది. స్మారక స్థూపం దగ్గర జెండా ఎగరేయడం-చిత్రపటాలకు పూల మాలలు వేయడం ఊరేగింపు చేసి చివరగా సభ జరపడం. అమరజీవి కపర్ది వర్ధంతులు కూడా మొదట్లో ఇలాగే జరిగాయి. ఆ కార్యక్రమాలు కపర్ది గారి ఆలోచనలకూ బహుముఖ పార్శ్వాలకు ప్రాతినిధ్యం వహించడం లేదన్న బాధ మాకు వుండేది. అయితే మూస నుంచి పక్కకు తప్పుకోడం చాలా కష్టమైన పని. శ్రీ ఎం.వి.ఎన్. కపర్ది మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఈ కష్టమైన పనిని సాధించింది. 1996లో ప్రారంభించిన ఈ ట్రస్టుకు శ్రీ డి.వి.వి.ఎస్. వర్మ అధ్యక్షులు. కపర్ది గారి అబ్బాయి కీ.శే. శ్రీపతి మేనేజింగ్ ట్రస్టీ. నేను కోశాధికారిని, కీ॥శే॥ మణ్యం గారు, వైట్ల వెంకటనారాయణ ఈ ట్రస్టీలు. స్వాతంత్ర్య సమర యోధులు, ఆంధ్రరాష్ట్ర శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్, సంగీత నాటక అకాడమీ మాజీ అక్షులు కీ.శే. పసల సూర్య చంద్రరావుగారు ఈ ట్రస్టును ప్రారంభించారు. అయితే ట్రస్ట్ పుట్టడానికి పదేళ్ల ముందు నుంచి కపర్ది స్మారకోత్సవాలను నిర్వహిస్తూ వచ్చాము. '86లో ఐదు నాటకోత్సవాలు నిర్వహించి ఒక సావనీరును ప్రచురించాము. అందులోని కొన్ని వ్యాసాలను ఈ "తెరిచిన పుస్తకం"లో కూడా పునర్ముద్రించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు కీ.శే. సి.నాగభూషణం (రక్త కన్నీరు ఫేమ్), ప్రధాన కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వర్లు ఈ నాటకోత్సవంలో పాల్గొన్నారు. 1991లో 10వ వర్ధంతి సందర్భంగా ప్రజా నాట్య మండలి సహకారంతో రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహించాం.

1996 నుంచి 2004 వరకూ ఏటేటా జిల్లా స్థాయి నాటక పోటీలు జరిపాం. 1996లో, అప్పట్లో జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న అక్షరాస్యతా ఉద్యమంలో కపర్ది ట్రస్ట్ సాంస్కృతిక బృందం చురుగ్గా పాల్గొని 75 చోట్ల వీధి నాటికలు, మ్యాజిక్ షోలు, డాన్సు, పాటలతో సాంస్కృతిక కార్యకలాపాలను నిర్వహించాము. తాడేపల్లిగూడెంలో మున్సిపల్ ఏరియాలో వయోజన విద్యా కార్యక్రమాల నిర్వహణకు కపర్ది ట్రస్టును కో ఆర్డినేటర్‌గా నియమించారు. 20 రాత్రి పాఠశాలలను నడిపాము. వాటిలో ఆరింటిని ట్రస్ట్ నిర్వహించింది. కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు, యువకులు వలంటీర్లుగా పనిచేశారు. 1998-99లలో నిరంతర విద్యా కార్యక్రమం మొదలైంది. కపర్ది ట్రస్ట్ కార్యక్రమం పైలెట్ ప్రాజెక్ట్ మొదలుకొని ఫీడ్ బ్యాక్ సర్వే వరకూ ఆద్యంతం ఈ కార్యక్రమంలో పాల్గొని 1998-2001 మధ్యలో ఓ బాలకార్మిక పాఠశాలను 'క్రాస్' అనే స్వచ్ఛందసంస్థ సహకారంతో నడిపాం. 2000 సంవత్సరంలో ఎన్.ఐ.ఓ.హెచ్. నిర్వహించిన సదస్సుకు ట్రస్ట్ సహకరించింది. 800 మంది రైస్ మిల్ కార్మికులను ఆరోగ్య పరిస్థితిని పరీక్ష చేయించాము.

2002, 03, 04 సంవత్సరాలలో ఏటేటా ఆరోగ్య శిబిరాలు నడిపాము. ఒకసారి 80 వేలు, మరొకసారి 38 వేలు, ఇంకోసారి 20 వేల రూపాయల విలువచేసే మందులు పంచిపెట్టాము. సామాజికవేత్త పెంటపాటి పుల్లారావు ఈ కార్యక్రమాలకు సహకరించారు. 2004లోనే ఎన్.ఐ.ఓ.హెచ్. ఆధ్వర్యంలోనే 400 మంది తాపీ కార్మికులకు ఆరోగ్య శిబిరం నిర్వహించాం. ఎయిడ్స్ మహమ్మారి గురించి 2000 సంవత్సరంలోనే ఒక సదస్సు నిర్వహించాం. 600 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సదస్సులో డా. కూటికుప్పల సూర్యారావు, ఆనాటి ఎమ్మెల్యే యర్రా నారాయణస్వామి పాల్గొన్నారు. చిన్నపిల్లల గుండె జబ్బులకు వైద్యం చేయించే నిమిత్తం 2002లో వివేకానంద యువజన సమితిని ప్రోత్సహించి ట్రస్ట్ సాంస్కృతిక కార్యక్రమాలను నడిపించింది. అనేక రక్తదాన శిబిరాల్లో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అధికార అనధికార సంస్థల వ్యవస్థల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నో వర్క్ షాపులు, సదస్సులలో ట్రస్ట్ కోశాధికారినైన నేను పాల్గొన్నాను. కపర్ది స్మారక ట్రస్ట్ కార్యకలాపాలకు ఆది నుంచి అండదండలుగా వున్న పెద్దలు ఇద్దరు. నాటి జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు, నేటి ఆచంట ఎమ్మెల్యే శ్రీ చెరుకువాడ శ్రీరంగనాధరాజు వారిలో ముందుగా చెప్పుకోవల్సిన వారు. తాడేపల్లిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు శ్రీ రామచంద్ర అగర్వాల్‌కు కపర్ది గారంటే ఎంతో అభిమానం, మరెంతో గౌరవం. వారిద్దరు ట్రస్ట్ కార్యక్రమాలకు ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలబడ్డారు.

తాడేపల్లిగూడెం ప్రజానాట్యమండలి కళాకారులు, ఎ.ఐ.టి.యు.సి. కార్యకర్తల సహకారం లేకుండా కార్యక్రమాలు నిర్వహించడం సాధ్యమయ్యేది కాదు. ❑

# వారి పరిచయం నా అదృష్టం

## సన్నిహితుల ఆప్తవాక్యాలు

- కె.వి.రమణారావు

"మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ" అన్నారు. అవన్నీ నాకు శేషమ్మ గారు, కపర్ది గారే. కపర్ది గారిని ఏలూరులో ఎ.కె.గోపాలన్ గారి ఉపన్యాసానికి తెలుగు అనువాదం చేస్తుండగా మొదటిసారి చూశాను. ఆ తరువాత 1961లో రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగిగా చేరినప్పుడు ఏలూరు డి.వి.ఎమ్. ఆఫీసు దగ్గర చూశాను. ఆయన దగ్గరికి వెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకొని "ఉద్యోగం వస్తుంది, మెడికల్ పరీక్షకి హైదరాబాద్ వెళ్ళాలి" అని చెప్పగానే ఒక ఉత్తరం ఆర్.టి.సి. ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాల యానికి రాసిచ్చారు. ఆ ఉత్తరం తీసుకొని 15 మంది వెళ్ళాం. మమ్మల్ని పరీక్షలు చేయించి, పాస్ చేయించి, తిరిగి బస్సు ఎక్కించి ఏలూరు పంపేలా అన్ని ఏర్పాట్లుచేశారు. 1968లో తాడేపల్లిగూడెం డిపోకి బదిలీ అయి వచ్చాను. యూనియన్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడం ప్రారంభించాను. కొద్ది రోజులకి నాకు ఏలూరు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. వెళదామని అనుకుంటుండగా కపర్ది గారు నన్ను ఆర్.టి.సి యూనియన్ ఆఫీసుకు పిలిచించారు. "రమణారావ్! నువ్వు యూనియన్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నావని మన వాళ్ళంతా చెప్పారు. అందుకని కొంత కాలం ఇక్కడే పనిచెయ్యి. నువ్వు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఏలూరుకు ట్రాన్స్‌ఫర్ చేయిస్తాను" అని చెప్పారు. అప్పటి నుండే నేను తాడేపల్లిగూడెం వాస్తవ్యుడైపోయాను. నేను, మిత్రుడు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు కలిసి ఆర్.టి.సి.లో కండక్టర్ల కేసులకు సంజాయిషీ రాసేవాళ్ళం.

మరీ పెద్ద కేసయితే కపర్ది గారితోనే రాయించేవాళ్ళం. ఒకసారి ఒక కండక్టరు సీరియస్ కేసిచ్చాడు. అతన్ని తీసుకుని కపర్ది గారింటికి వెళ్ళాం. ఆయన కోపంగా "ఇలాంటి కేసులు నా దగ్గరకి తీసుకురావద్దు" అని మమ్మల్ని వెళ్ళగొట్టారు. మాకు కోపం, కసీ వచ్చింది. ఆ రాత్రంతా కూర్చుని ఆ కండక్టరుకు సంజాయిషీ రాసి ఇచ్చాం. అది చూసి డి.ఎం.గారు "కపర్ది గారు రాశారా?" అన్నారు. మేం నవ్వి ఊరుకున్నాం. ఎంతైనా ఆయన శిష్యులం కదా. ఆయన శైలిలోనే రాశాం. ఆ కండక్టరు బతికి బయటపడ్డాడు. చాలా రోజుల తరువాత గురువు గారు ఇంటికి వచ్చి, మాకు కబురు పెట్టారు. వెళ్ళాం. "ఏమయ్యా సంజాయి షీలు బాగా రాస్తున్నారట కదా! నాకు తెలిసింది! మీరు నేర్చు కుంటారనే అలా ఆ రోజు కోప్పడ్డాను!!" అన్నారు. అప్పుడు ఆయన అంతర్యం అర్థమయ్యింది. గురువు గారు రాష్ట్ర బాధ్యత ల్లో ఎన్ని రోజులు ఊర్లు తిరిగి వచ్చినా, ఆయన విశ్రాంతి కూడా మానుకొని మాకు శాఖా సమావేశాలు పెట్టి ప్రపంచ రాజకీ యాలు బోధించేవారు.

> 'ఏమయ్యా సంజాయిషీలు బాగా రాస్తున్నారట కదా! నాకు తెలిసింది! మీరు నేర్చుకుంటారనే అలా ఆ రోజు కోప్పడ్డాను!!" అన్నారు. అప్పుడు ఆయన అంతర్యం అర్థం అయ్యింది.

ప్రజానాట్యమండలి ద్వారా రాష్ట్రం నలుమూలలా ప్రదర్శనలిచ్చి అనేక బహుమతులూ, ప్రశంసలూ అందుకున్నాం. మాకు రచయిత ఎమ్.జి. రామారావు గారు, దర్శకుడు ధవళ సత్యం గారు. అప్పుడప్పుడు గురువు గారు మమ్మల్ని నాటకాలకి ప్రాధాన్యత ఇచ్చి, పార్టీ పనులకీ, యూనియన్ పనుల మీద శ్రద్ధ తగ్గిస్తున్నా" రని మందలించేవారు. విశాఖపట్నంలో ఎ.ఐ.టి.యు.సి. ఆల్ ఇండియా మహాసభలో మా "ఇరుసు" నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ఆ రోజు గురువు గారు మమ్మల్ని డాంగే గారికి పరిచ యం చేసి మా గురించి గొప్పగా చెప్పారు. ఆర్.టి.సి. ఎంప్లా యిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు తాడేపల్లిగూడెంలో జరిపారు. ఆ సభలకి భోజనాల ఏర్పాటు శేషమ్మ' గారి ఆధ్వర్యం లో జరిగాయి. మేమంతా వాలంటీర్లుగా ఆవిడతో పనిచేసే అదృష్టం లభించింది. ప్రతినిధులంతా మా గురించి బాగా చెప్పుకున్నారు. 1972 పట్టణ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రాష్ట్రంలో మొదట మేమే స్థాపించాం. దానికి అధ్యక్షులు కపర్ది గారు, కోశాధికారి కామ్రేడ్ శ్రీపతి, కార్యదర్శిని నేను. అలా కపర్ది గారితోనూ, శ్రీపతి గారితోనూ కలిసి పనిచేసే అదృష్టం లభించింది. ఇలా చెప్పుకుంటూపోతే గురువు గారి సంగతి ఎంతైనా చెప్పవచ్చు. ఆయన నిజాయితీకి మారుపేరు. అంతటి గొప్పవ్యక్తిని మరొకరిని నేను ఈ రోజు వరకూ చూడలేదంటే అతిశయోక్తి కాదు. నేను వాళ్ళ పిల్లలతోపాటు పెరిగాను. వారి కుటుంబ సభ్యులందరిలోనూ నాకు ఈనాటి వరకూ ప్రత్యేకమైన గౌరవం వుంది. ముఖ్యంగా శ్రీపతి, నారాయణమూర్తి, జగన్, కిషోర్ హితులు, సన్నిహితులు. ❑

# మా ఇంటి పేరు కపర్ది భవన్

## సన్నిహితుల ఆప్తవాక్యాలు

- పాబోలు పాపారావు

కపర్ది గారు తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాలలో ఎంతో మందిని ప్రభావితం చేసి ఆయన నిర్వహించిన ఉద్యమాల్లో వాళ్ళందరూ పాల్గొనేలా చేశారు. అలా కపర్ది గారితో విశేషమైన అనుబంధాన్ని పెంచుకొని, ఆయన కుటుంబంలో సభ్యుడిగా, ఆయన మానస పుత్రుడిగా మనగలిగిన కొందరిలో నేనూ ఉన్నందుకు ఎంతో గర్వపడతాను. కపర్ది గారు, శేషమ్మ గారు ఒకరికోసం ఒకరు పుట్టినట్టుగా మా కళ్ళకు కనిపించేవారు.

కపర్ది గారితో నా అనుబంధం తాడేపల్లిగూడెం పంచాయితీగా ఉండే రోజుల నుంచి ఆయన చనిపోయే వరకు కొనసాగింది. అప్పట్లో మార్కెట్లో బండ్ల సంఘాలు స్థాపించి ఆ రోజుల్లోనే కాంట్రాక్టర్ల చేతుల్లో దోపిడీకి గురయ్యే పల్లెటూరు వాళ్లను, కష్టపడకపోతే పొట్టగడవని పేద వారిని కష్టాల నుంచి కాపాడేవారు. సంత మార్కెట్లో బండ్ల పన్ను వసూలు, మనిషికి ఒక రకంగా ఉండేది. బండ్ల వాళ్ళ అమాయకత్వంతో ఆటలు ఆడుకునే కాంట్రాక్టర్లు మనిషికో రేటు చొప్పున వసూలు చేసి ఎన్నో ఇబ్బందులకు గురిచేసేవారు. అలాంటి స్థితిలో బండ్లవాళ్ళకు, లేబరుకు, జట్ల కూలీలకు సంఘాలు స్థాపించి మార్కెట్‌లో పన్ను వసూలు కూలీ రేట్లలో జరుగుతున్న అన్యాయాన్ని అంతం చేసి వాళ్ళకి ఎనలేని సేవ చేశారు. ఈ ఉద్యమాన్ని సంత మార్కెట్లో "పావలా అర్ధణా ఉద్యమం" అంటూ పిలిచేవారు. ఈ పన్ను ఉద్యమాన్ని నిర్వహించి పంచాయితీ వారికి కనువిప్పు కలిగించి కాంట్రాక్టర్ల దోపిడీని అరికట్టారు.

**ఆ రోజుల్లో రాజకీయాలు, వ్యక్తులు, ఆశయాలు అన్నీ నిజాయితీతో కూడుకొని ఉండేవి. అందుకే అలనాటి నాయకులు ప్రజల అభివృద్ధి కోసం కష్టించి పనిచేసేవారు. అలా కష్టాలు లెక్కచేయని మనుషుల్లో మా కపర్దిగారు, మా శేషమ్మగారు మరీ ముఖ్యులు. వారు మా మనస్సుల్లో అత్యన్నత స్థానాల్లో ఉన్నారు. ఎప్పుడూ ఉంటూనే వుంటారు.**

కపర్ది గారితో అనుబంధాన్ని మరింతగా పెంచిన ఇంకో ఉద్యమం జై ఆంధ్రా ఉద్యమం. సెపరేట్ ఆంధ్రా ఉద్యమం పేరుతో కొందరు యువకుల్ని, రాజకీయ నిరుద్యోగుల్ని రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకు పోవాలని ఆ ఉద్యమాన్ని లేవదీశారు. ఆ రోజుల్లో కపర్ది గారు చాలా ధైర్యంగా మార్కెట్లో సమావేశాలు నిర్వహించి సమైక్య ఆంధ్రా అవసరాన్ని వివరించి చాలా మందిని ఆ ఉద్యమం నుంచి బయటకు వచ్చి, సమైక్య రాష్ట్రాన్ని బలపరిచేలా చేశారు. స్వామినీడు, బత్తుల కృష్ణ–సోమరాజు సోదరులు, విప్పర్ల సుబ్బరాజుగారు, సన్యాసిరావు మేష్టారు, కలిదిండి సూరపరాజు గారు, పాలెం నుంచి గూడెం వచ్చి స్థిరపడిన కాకర్ల ప్రకాశరావు గారు ఇలా ఎందరో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆ రోజుల్లో కపర్ది గారి సాహచర్యంలో ఎంతో నేర్చుకున్నారు. అలా ఎందరికో ఆయన ఆదర్శప్రాయుడిగా నిలిచారు.

ఇక శేషమ్మగారు..

ఆవిడను అన్నపూర్ణ అని పిలుచుకునేవారు ! ఎవరైనా ఆకలితో ఆ ఇంటికి వస్తే అన్నం పెట్టి పంపించేవారు. అలా ఎందరికో అన్నం పెట్టిన మా తల్లి శేషమ్మ గారు. కపర్ది గారు రాజకీయంగా ఎంతో బిజీగా ఉండి కుటుంబానికి దూరంగా పార్టీ పనుల్లో అటూ ఇటూ వెళుతున్న సమయంలో మా అమ్మ మాక్కూడా ఆవిడ అమ్మే, నేను వారి పెద్ద కొడుగ్గా ఆవిడే అందరితో చెపుతూ ఉండేది – మొత్తం కుటుంబాన్ని ఒక చేతితో ముందుకు నడిపేది. పేద వాళ్ళు శేషమ్మగారి చేతి చలువను ఎంతో మెచ్చుకునే వారని చెప్పటానికి ఒక ఉదాహరణ ఒకప్పుడు, కపర్ది గారు పోటీ చేసి ఓడిపోయిన ఆనాటి 4వ వార్డు సీతారామ్ పేటలో శేషమ్మ గారు మంచి మెజారిటీతో గెలవటమే.


ఆ రోజుల్లో రాజకీయాలు, వ్యక్తులు, ఆశయాలు అన్నీ నిజాయితీతో కూడుకొని ఉండేవి. అందుకే అలనాటి నాయకులు ప్రజల అభివృద్ధి కోసం కష్టించి పనిచేసేవారు. అలా కష్టాలు లెక్కచేయని మనుషుల్లో మా కపర్దిగారు, మా శేషమ్మగారు మరీ ముఖ్యులు. వారు మా మనస్సుల్లో అత్యన్నత స్థానాల్లో ఉన్నారు. ఎప్పుడూ ఉంటూనే వుంటారు. చివరగా ఒక్క మనవి. నా ఇంటికి కపర్ది భవన్ అని పేరు పెట్టాను. మా చుట్టాలూ పక్కాలూ "ఆయన నీకేమైనా చుట్టమా?" అని అడుగుతుండేవారు. దానికి నా సమాధానం : "అవును! ఆయన నాకు పితృ సమానులు" అని. ఆయన పేరు పెట్టిన మా ఇంటిలో ఉంటే నాకు ఆయన సమక్షంలోనే ఉన్నట్లు భావం కలుగుతుంది. ఆ అనుభూతి నాకెంతో ఆనందాన్ని ఇస్తుంది. ❑

# స్నేహానికి మారుపేరు

## సన్నిహితుల ఆప్తవాక్యాలు

-డా॥ బి.రమేష్ చంద్రబాబు





యువ కార్మిక నాయకులతో కపర్ది

1971లో ఎ.ఐ.ఎస్.ఎఫ్. కార్యక్రమంలో పాల్గొంటున్నపుడు నేను కపర్ది గారిని మొదటిసారి చూశాను. శ్రీపతి విద్యార్థి ఉద్యమంలో మాకు కొంచెం సీనియర్. ఒకసారి గూడెంలో కపర్ది గారి ఇంటికి వెళ్ళాను. అదే మొదటిసారి కూడా. అప్పటికే బాబూరావు మాస్కో వెళ్ళిపోయాడు. ఆనాటికి నాకు శ్రీపతి తప్ప ఆ కుటుంబంలో ఎవరితోనూ పరిచయం లేదు. ఆ రోజు అందరం కలిసి కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు పూర్తి చేశాము. ఆ క్షణం నుంచి మొదలు పెట్టి ఇప్పటి వరకు ఆ కుటుంబంతో – కపర్ది గారు శేషమ్మ గారితో సహా–ఏదో తీయని స్నేహబంధం ఏళ్ళ తరబడి కొనసాగుతూనే వుంది. జీవితంలో ఒకోసారి కొందరు వ్యక్తులు తారసపడినపుడు వీరితో స్నేహం మొదలైతే బావుంటుంది అనిపిస్తుంది. సరిగ్గా అలాంటి ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఆ కుటుంబ సభ్యులందరిది. ఎంతో సంస్కారవంతులు వాళ్ళంతా. మనం ప్రేమిస్తే మనల్ని ప్రేమించే వ్యక్తులు వాళ్లు. మాస్కోలో బాబూరావుతో మరింత బలపడిన స్నేహ బంధం ఆ తరువాత కాలంలో నన్ను ఆ కుటుంబానికి మరింత దగ్గరగా చేసింది. ఆ కుటుంబ సభ్యులు కపర్దిగారైన, శేషమ్మ గారైన ఎవ్వరైనా అందరిదీ ఒక్కటే అప్రోచ్. అది స్నేహానికి మారు పేరు. అలాంటి బాండేజ్ ఎల్లప్పుడూ కొనసాగాలని అందరూ కోరుకొనేంత 'స్నేహం' పంచిపెడతారు వాళ్ళందరూ. మేము మాస్కోలో చదువుకుంటున్నపుడు మధ్యలో కపర్దిగారు అక్కడికి వస్తుండేవారు. అక్కడ ఆయనతో గడిపిన మధురక్షణం. నేనెప్పుడూ మరచిపోలేను. ఆయన పిల్లలతో పిల్లాడిలాగ, పెద్ద నాయకులతో పెద్దవాడిలాగా ద్విపాత్రాభినయం చేస్తూ–చేసిన ప్రతిసారీ రెండు పాత్రలను చక్కగా ఎఫిషియెంట్గా పోషిస్తూ – ఎంతో డిఫరెంట్గా ఉండేవారు. అలాంటి వ్యక్తులు జీవితంలో అరుదుగా కనిపిస్తారన్నది ఇప్పటికీ నాకున్న చెక్కుచెదరని అభిప్రాయం. అనారోగ్య కారణాలతో నా పెళ్ళికి ఆచార్యత్వం వహించలేకపోయారు కపర్ది గారు. అది కూడా జరిగి ఉంటే ఆయనతో పెంచుకున్న అనుబంధం మరికొంచెం తీయగా ఉండి ఉండేది డెఫినెట్గా. ❑

# కార్మిక నేతలో మరో పార్శ్వం

**(73వ పేజీ తరువాయి)**

రాస్తున్న సందర్భంగా, ఈ అంశాన్నే మరో కోణం నుంచి నాకు క్లాస్ తీసుకున్నారు. మనకున్న కార్మిక నేతలు – డాంగే నుంచి తీసుకుంటే– అందరూ సాహిత్యాభిమానులే. సద్విమర్శకులే. ఆ ఒరవడిలో కపర్ది గారి సాహితీ విమర్శ సోషలిస్టు వాస్తవికత దృక్పథంతో చేసిందే. తమకు దొరికిన కొద్దిపాటి సమయంలో నుంచే, కొంత సాహిత్యాధ్యయనానికి కూడా కేటాయించే శ్రామిక వర్గ నేత కపర్ది గారు. సాహిత్యానికి శ్రామిక వర్గ నేతృత్వం అంటే ఇదేనేమో. చక్కని చమత్కార ధోరణి కపర్ది గారి నైజం. స్పష్టమైన వక్తృత్వం వారి సహజత్వం. నిర్మొహమాటానికి పంచదార పూత పూయటం వారికి స్వభావ సిద్ధం. వారితో నా పరిచయం కొద్దిపాటిదే అయినా అమూల్యం. వారిలోని మరో వ్యక్తిని దర్శించుకోవడానికి నాకు అందివచ్చిన అవకాశం. వారికిదే నా అక్షరార్చన. ❑

# తీరని కోరిక

## సన్నిహితుల ఆప్తవాక్యాలు

- కీ.శే. ఎం.జీ.రామారావు



కపర్ది గారితో నా సాన్నిహిత్యం భాషకు ఒదిగేది కాదు. అందుకే, మా సాహచర్య బంధాన్ని చవిలేని చచ్చు పదాల్లో పొదిగేందుకు ప్రయత్నించడం లేదు. అయితే, చిరకాలంగా నా గుండెల్లో గూడు కట్టుకుని, తీరని కోరికగా మాత్రమే మిగిలిపోయిన ఓ ఉదంతం నాచేత ఈ నాలుగు ముక్కలూ రాస్తోంది. కపర్ది గారు కాలంతో పరుగు పందెం వేసేవారు. క్షణం తీరిక దొరకడం దుర్లభంగా ఉండేది. అయినా సరే, నానా అవస్థలూ పడి ఏటికో, పూటికో ఓ నాటకం చూసేవారు. నేను రాసిన 'సత్యం వధ' నాటక ప్రదర్శనానికి కపర్ది గారు హాజరు కావడం అలాంటి అరుదైన సంఘటనల్లో ఒకటి. నాటకం అంతా చూశాకా నన్ను పిలిచి ఐదు నిమిషాలు నాతో చర్చించారు. ఆ నాటకంలో ఓ గాంధీ వాది పాత్ర ద్వారా నేను చూపించాననుకున్న దానికన్నా విశాలమైన భావాన్ని నా కళ్ల ముందు ఆవిష్కరించారాయన. సృష్టికర్తనే దిమ్మెరపోయేలా చెయ్యగల సృజనాత్మక విమర్శకుడిని ఆ క్షణంలో ఆయనలో చదగలిగాను! "రామారావు, నీకో పని చెప్పాలని ఉందయ్యా!", అన్నారు కపర్ది గారు ఓ సారి. "అవశ్యం, సెలవీయం"దన్నాను. "నా బుర్రలో ఓ ప్లాట్ చాలా కాలంగా రూపుదిద్దు కుంటోందయ్యా! నువ్వు దానికి రూపక రూపం కల్పించాలి" అన్నారాయన. ఆ క్షణాన్నే సిద్ధమైపోయాను. అయితే, ఆయన ఆ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోలేదల్లే ఉంది. అంచేత, "ఇప్పుడు కాదు, మరోసారి తీరిగ్గా వివరిస్తా"నంటూ హామీ ఇచ్చి హడావిడిగా వెళ్లిపోయారు.

అటు తర్వాత అనేకసార్లు కలిశాం. ప్రతీసారీ నేను ప్లాట్ గురించి అడగడమూ, ఆయన వాయిదా వెయ్యడమూ పరిపాట యిపోయింది. విచిత్రమేమిటంటే నాకు విసుగెత్తకపోగా సదరు ప్లాట్ని ఎలాగైనా నాటకంగా రాయాలనే కోరిక బలపడుతూ వచ్చింది. కానీ, అంతలోనే అనుకోకుండా అంతా అయిపో యింది. ఆయనతో పాటే, ఆయన చెప్పకుండా పోయిన ప్లాట్ కూడా అదృశ్యమైపోయింది. నా కోరిక తీరకుండానే మిగిలిపోయింది!! ❑

# మహా పురుషులు

- డాక్టర్ వంక రాందాస్



కపర్ది గారి తోటి, వారి కుటుంబ సభ్యులందరితోటి - వయో భేదాలు లేకుండా - నాకు స్నేహం. నేను మాస్కోలో ఉన్నప్పుడు వాళ్లబ్బాయి బాబూరావుతో స్నేహం మరింతగా పెరిగింది. ఆ తరువాత నేను హైదరాబాద్ వచ్చేశాక గాంధీ హాస్పటల్లో పనిచేస్తున్న రోజులలో కపర్ది గారి ఇంట్లో ఇంచుమించుగా మేము ప్రతిరోజూ కలుస్తూ ఉండేవాళ్ళం. ఇంకా ఇప్పటికి కూడా ఆ స్నేహం ఆ కుటుంబసభ్యులతో అలాగే కొనసాగుతోంది.

కపర్ది గారిది విశిష్టమైన వ్యక్తిత్వం. ఆయన రాగద్వేషాలకు అతీతుడు. ఆయనకు న్యాయం అనిపించింది. అది ఎంత కష్టమైన పనైనా దానిని సక్సెస్ చేయడానికి ఆయన తీవ్రమైన ప్రయత్నం చేసేవారు. నాకు మంచి మార్కులు వచ్చినా కూడా మాస్కోలో ముందు మెడిసిన్లో సీటు రాలేదు. ఫిజిక్స్లో సీటు ఇచ్చారు. నేను ఢిల్లీలో మిగిలిన విద్యార్థుల మార్కు లను పోల్చి నాకు మెడిసన్లో సీటు రానందుకు బాధపడుతుంటే ఆ విషయం తెలుసుకున్న కపర్ది గారు నన్ను వెంటనే ఇస్కస్ నాయకుడు ప్రేమసాగర్ గుప్తా దగ్గరకు తీసుకెళ్ళి మా వాడికి సీటు విషయంలో అన్యాయం జరిగింది అని చెప్పారు. వెంటనే తగిన చర్య తీసుకొని వాడికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీ గుప్తా గారు వెంటనే రియాక్ట్ అయి పి.ఎఫ్.యు. రెక్టర్కు ఒక లెటర్ రాసి నా చేతికిచ్చి పంపించారు. ఆ తరువాత మాస్కోలో నేను మెడిసిన్లో చేరడానికి కపర్ది గారి యాక్ట్ రియాక్షన్ ఎంతో ఉపయోగపడింది. ఆ తరువాత కొంత కాలానికి మాస్కో వచ్చిన కపర్ది గారు నేను మెడిసిన్ చేరినందుకు నన్ను అభినందించారు. అప్పుడు నేనొక మాట చెప్పాను. "మీలాంటి మంచి మనుషులు నా వెనకాల ఉంటే నేను దేనినైనా సాధిస్తాను" అని. చివరగా ఒక మంచి మాటతో ముగిస్తాను. పురుషులలో మహా పురుషులు వేరుగా అరుదుగా ఉంటారు. కామ్రేడ్ కపర్ది అలాంటి వారిలో ఒకరు. ❑

# స్ఫూర్తినిచ్చే కుటుంబం

## సన్నిహితుల ఆప్తవాక్యాలు

- సంకు మనోరమ




కపర్దీ, శేషమ్మ గార్లను గుర్తు చేసుకోవడం ఒక అనిర్వచనీయమైన అనుభూతి. అదొక స్ఫూర్తిదాయకమైన కుటుంబం. ఆంధ్రప్రదేశ్‌లో అనేక పట్టణాలు, గ్రామాల్లో ఆ నాడు చాలా మంది కమ్యూనిస్టు నాయకులు పనిచేశారు. పార్టీ సిద్ధాంతా ప్రభావం కంటే ఆ నాయకులు ప్రభావం ఆ ప్రాంత ప్రజలపైన, బంధువర్గంపైన ఎంతగానో వుండేది. ఆనాడు కమ్యూనిస్టు కుటుంబం అంటే అది కేవలం వారి సభ్యులకే పరిమితం కాకుండా కమ్యూనిస్టు కుటుంబాలన్నింటి విస్తృత కుటుంబాలుగా వుండేవి. అన్ని కుటుంబాల మధ్య బంధువులకున్న సంబంధాలు ఉండేవి. అలాంటి కుటుంబాలలో పుట్టిన నాలాంటి వారికి మధ్య అలాంటి సంబంధాలు సహజసిద్ధంగా వచ్చాయి.

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో మా తండ్రి సంకు అప్పారావు గారు రహస్య జీవితం నుంచి జైలుకు వచ్చారు. మా అమ్మ, పిల్లలం ఎడ్ల బండి మీద కొండేపాడు నుంచి 25 కిలోమీటర్లు వచ్చి తాడేపల్లిగూడెంలోని కపర్దీ గారి ఇంటికి చేరాం. అతి చిన్న వయసులోనే కపర్దీ, శేషమ్మ గార్లను చూడడం జరిగింది. ఏలూరులో జరిగే పార్టీ మీటింగులకు వచ్చే పార్టీ నాయకులు మా ఇంటికి భోజనానికి వచ్చేవారు. ఆనాటి ప్రముఖ కమ్యూనిస్టు నాయకుల కుటుంబాలన్నీ అలాంటి బాంధవ్యాన్ని కలిగి వుండేవి. తాడేపల్లిగూడెం పట్టణంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఏర్పాటుతో ప్రారంభమైన కపర్దీ గారి రాజకీయ జీవితం, అంచెలంచెలుగా విస్తృతమైన రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కమ్యూనిస్టు పార్టీ అగ్రశ్రేణి నాయకులయ్యారు. తాడేపల్లిగూడెం పట్టణాభివృద్ధికి ప్రముఖులందరినీ సమీకరించి సాగించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలలో కీలకపాత్ర పోషించారు. శేషమ్మ గారు దశాబ్దాల పాటు పంచాయతీ సభ్యులుగా వుండి సేవలందించారు. మాజీ మంత్రి ఈలి ఆంజనేయులు గారికి కపర్దీ గారి పట్ల గురుభావం వుండేది. 1971లో నన్ను లెక్చరర్ పోస్టుకు ఎంపిక చేసేందుకు హయ్యర్ ఎడ్యుకేషన్ ఆఫీసు నుంచి పిలుపు వచ్చింది. మా నాన్న గారి సలహా మేరకు ఈ విషయం కపర్దీ గారికి చెప్పాను. అప్పటికి ఎమ్మెల్యేగా వున్న ఈలి ఆంజనేయులు గారికి అప్పగిస్తే ఆయన వెంట నేను ఇంటర్వ్యూకు వెళ్లాను. అది పూర్తయ్యే వరకు ఆయన అక్కడే వున్నారు. కపర్దీ గారికి పార్టీ పిల్లల పట్ల వున్న ప్రేమకు, బాధ్యతకు ఇది ఉదాహరణ మాత్రమే.



**కపర్దీ, శేషమ్మ గార్లతో సంకు మనోరమ**

కపర్దీ గారి రెండో అబ్బాయి నాకు బాగా సన్నిహితుడు. బీఏ చదువు పూర్తి చేయాలని శేషమ్మ గారు గుంటూరులో పని చేస్తున్న నా దగ్గరకు శ్రీపతిని ఒక సీసా నెయ్యి, ఒక సీసా పచ్చడితో సహా పంపించారు. శ్రీపతి నాలుగు రోజులు వుండి తాడేపల్లిగూడెం వెళ్లాడు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మద్దుకూరి నారాయణ గారి కూతురు సంధ్యారాణి. ఆమెను చదువు కోసం మా ఇంటికి తీసుకువచ్చారు. మా నాన్న సంధ్యను, నా చెల్లెలు సూర్యకుమారిని మొందూరులో పార్టీ కామ్రేడ్ నడిపే స్కూలులో చేర్చారు. శ్రీపతి, సంధ్య పెళ్లి కుదర్చడం నా ప్రమేయంతోనే జరిగింది. అలాగే కిషోర్, విరాటరాజు గారి అమ్మాయి వాణిల వివాహాన్ని సానుకూల పర్చింది నేనే. సనాతన సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన కపర్దీ, శేషమ్మ గార్లకు ఆరుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. ఆ కుటుంబంలో ఎక్కువ మంది కులాంతర వివాహాలే చేసుకున్నారు. ఎలాంటి అడ్డుకోడలు లేని కుటుంబంగా పిల్లల్ని ఆ దంపతులు తీర్చిదిద్దారు. కపర్దీ గారిల్లు ఒక చిన్న కమ్యూన్. కొందరు సత్రం అనేవారు. శేషమ్మ గారు దగ్గరుండి అందరికీ వడ్డించే వారు. పార్టీ నాయకులు, పిల్లలు, పాలేర్లు అన్న తేడా లేకుండా చూశారు. డి.వి.వి.ఎస్.వర్మ గారు కూడా కొంత కాలం అక్కడే వున్నారు. కమ్యూనిస్టు జీవన విధానానికి ఆ కుటుంబం ప్రతీక. కుల, మత, విభేదాలు దరిచేరనీయని ఆరాధ్య కుటుంబం. కొవ్వొత్తిలా కరిగి శ్రామికవర్గానికి అంకితమైన జీవితం కపర్దీ గారిది. అంతే త్యాగ పూరితమైంది. శేషమ్మ గారి జీవితం సదా స్ఫూర్తిదాయకం. ❑



తాజ్‌మహల్ మునివాకిట కపర్దీ, శేషమ్మ




కపర్దీ తండ్రి రామచంద్రరావు



కపర్దీ తల్లి శేషమ్మ



కపర్దీ
అత్త గారు
కనకదుర్గమ్మ



పెళ్లయిన కొత్తలో కపర్దీ, శేషమ్మ




కపర్దీ కుటుంబ సభ్యులు





శ్రీపతి, కిషోర్, రామచంద్రరావు, అమ్మాజి, వాణి, బాబూరావు, జగన్ – కుటుంబ సభ్యులు అమ్మాజీ, నిర్మల, మనీష, ఇందు, గిరిజ



బంధువులతో అమ్మాజి, వాణి



శేషమ్మ గారితో అమ్మాజీ, వాణి

రామచంద్రరావు, బాబూరావు, చిట్టిపాప, శ్రీపతి





వంకా నాగమణి, శేషమ్మ, మనోరమ



శేషమ్మ గారితో సంకు లక్ష్మీకాంతం, పదాల శ్యామసుందరరావు, చినమల్లం సుబ్బరాజు, ఆశపు గంగరాజు తదితరులు



కపర్దీ గారు చదివిన ఏసీ కాలేజీ ప్రాంగణంలో కుమారుడు కిషోర్, కుమార్తె వాణి

# My personal experiences with our father



MANDALAPARTHY BABURAO



In addition to my personal experiences with our father, late Sri M.V.N. Kaparde, in my day-to-day life (during my childhood). I had the rare opportunity of observing him from close quarters in two roles played by him amazingly well.

Our father was in Moscow for an advanced learning on the organization of Trade Unions, when I was doing my MS in Engineering at the People's Friendship University in Moscow. At the age of about 52, he was a more dedicated student than I was or many of my friends at the university. In the name of expressing his doubts about the application of the technology and seeking clarifications from us, he used to spend several hours in our hostel. In the process, he would expose our shallow knowledge of things.

Now, I realize that his strength as a student was that he had total clarity about the purpose of his learning. Our father used to take me and my friends shopping for gifts and souvenirs for family members and friends in India. We, of course, enjoyed two distinct advantages over him: we all could speak Russian fluently, we stayed in Moscow for a much longer time, and hence we knew the city well. During the shopping, he would make us realize our superiority and seek our advice on the items to be purchased. We used to prepare a list of items, after long deliberations, but he would purchase most of the items outside the list and used to explain the prudence, both economically and utility-wise, in the purchase of those items. I must confess that this helped us mature faster.

I am proud that many of my friends, even today, recollect their association with our father - they consider it as friendship - very fondly. In early 1981, our father was invited by the Trade Union leaders of Hindustan Cables Limited to represent their case to the management on promotion policy. He surprised the representatives of workers as well as the management by opposing time-scale promotions of workers on the ground that such a policy would discourage hard-working and skillful workers and adversely affect the organization. Due to their compulsions, the management and the Trade union had reached an agreement on timescale promotions, setting aside the objections of our father. That was the first year of my service in the same organization in the cadre of "Officers," and the agreement was not even applicable to us, but I also thought that our father was wrong in his assessment.

Ten years later, I was negotiating a bound promotion policy for officer cadre, in my capacity as the President of the Officers' Association, and the then Director (Personnel) pleaded with me not to press for the policy because a similar policy for the workers had deteriorated the performance level by more than 20%. He told me that during the negotiations with the workmen, a trade unionist with

vision strongly advocated against the time-bound promotion policy and the workmen, a trade unionist with vision strongly advocated against the time-bound promotion policy and the management was surprised at his unexpected suggestion and went ahead with time scale promotions and within ten years the company paid a heavy price for their hasty decision. He was pleasantly surprised to learn that it was our father, who was "the trade unionist with vision" and successfully scuttled our attempt to agree on time scale promotion. He called it a tribute to our father. But two years later we "achieved" the timebound promotions for the officer cadre also and within ten years, the company is on the verge of closure.I must confess that there are a great number of experiences with our father that have helped me in my career, which will need a much greater space.

Since I propose to narrate some more traits of our father, I will limit my professional experiences to the above two. I shall now dwell upon some personal traits of our father and his total commitment to family matters in spite of his whole-time preoccupation with the party and trade union work. 30 Our father was a man with a lot of common sense and ready wit.

His presence could easily be noticed in a crowd because of his argumentative skills on a wide range of topics.Although he was not a voracious reader, he made sure that his knowledge was updated regularly on the topics that he would be called upon to deal with.

His greatest strength was his capability to lucidly present his thoughts in his speeches as well as writings. He was famous for presenting the cases of the workers most convincingly when charge sheets or show-cause notices were issued to them. Even when he was the district-level Trade union leader, his explanations of charge sheets to workers were considered a benchmark. His attractive "pearl like" handwriting added more flavor to his already content-rich writings.Our father was an orator of a high order in Telugu and was considered to be a very learned man by the all-important people of our town.

His knowledge of the English language was also quite good and hence he was the obvious choice for translating the speeches of national leaders during their visits to our town or for that matter any town in our district. His friends would proudly claim that his translation was better than the original speech (as far as the presentation of points was considered). Since our father was required to participate in various conferences, conventions, meetings and discussions with the management of different industrial units, both in the private and public sectors, he was out of station for more than 15 days every month.

He clearly knew that the children would be missing him very much and would be eagerly awaiting his return. To compensate for his absence, he used to bring fruits and small gifts to the children on his return home. This made his return not only thrilling but also helped us forget his absence.Although he had very little free time even when he was in town, he always made sure that he would spend sufficient time to personally verify the academic progress of the children. This practice continued till I joined my Engineering course in REC, Calicut. I am not very sure, for two reasons- I went away for further studies abroad and he

grew in stature and position in the party and became even busier, whether he monitored the studies of my younger brothers and sisters. This clearly shows how concerned he was, about all of us, amidst his busy and demanding schedule.Our father was educated at Guntur in the famous A.C. College and stayed with his eldest brother late Shri M. Upendra Sharma, who retired as the Principal of Hindu College, Guntur. Although our father was involved in many extra-curricular activities, including the organization of students' movements, he was very good at studies and his elder brother told this to us on a number of occasions.

It is only natural that he enjoyed a great amount of love and affection from his brother, but surprisingly he also enjoyed a lot of affection from his Sister-in-law, late Smt. M. Bangaramma. She probably loved him more than his brother and his mother did. She lived for almost twenty years after his death and would shed tears whenever any one of us visited her.

He was, for all practical purposes, her eldest son (she has only one son MS Sharma, who was more than 25 years younger than our father). I still remember that my father also reciprocated a similar sentiment towards her.This narration would be incomplete if I didn't mention the significant contribution of our mother, late Smt. M. Seshamma, for the success of our father. Our family was very large - almost ten children, eight of her own children, her younger brother BSA Satyanayana or Anjibabu and her younger sister Subbalaxmi or Bujjamma in addition to the population of our cousins. Our family had more than twenty members on any given day. As I mentioned earlier, our father had to spend most of his time outside our home. Our mother had to take care of everybody in his absence with very meager financial resources at her disposal. 31 Our mother was not as educated and as learned as our father. She had to undergo heavy mental stress due to this, but she accepted the challenge very boldly and I should agree that had fulfilled the responsibility rather well. But for her support, our father could not have reached the positions he had reached and could not have achieved what he had achieved.


Although she was handling such great responsibility single-handedly, she never tried for any separate identity for herself. She was always identified with our father and was known to the world as our father's wife only. To help her with physical stress, she had an able aide in her mother - Smt. B.Kanaka Durgamma. Nevertheless, the mental stress had to be borne by her alone. This must have adversely affected her health and she had suffered at least two heart attacks. Despite her full-time involvement in family matters, she found time for social service also. She was elected to the gram panchayat for about three terms and Municipality for two terms.

Although our mother had no separate identity other than that of our father, ironically, she had never lost an election and our father never won one.In retrospect, our father and mother had discharged their duties extremely efficiently with the meager resources at their disposal. I wonder whether we will be able to reach the halfway mark of their efficiency with much greater resources (several times more than what they had) available to us. This, I think, is what makes them great and makes their lives memorable. ❑

## కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు

# తీపి గుర్తులు

- మందలపర్తి జగన్మోహన్



ఏ 'కాలమానం'తోనూ (నేను కరెక్టుగానే రాశా – కాల మానమే, కొలమానం కాదు!) కొలవ లేని అమ్మా, నాన్నల ప్రేమను తలవని సంతానం ఉంటారంటే నా మనస్సు నమ్మనంటోంది. ఆ దివ్యానుభూతిని సొంతం చేసుకోని జీవితం అసలు జీవితమే కాదు, నా దృష్టిలో! స్పందన కరువై జీవం జవం చచ్చిన అణువులు సముదాయంగా ఈ శరీరం మనగల గటం అంటే అది సజీవ సమాధితో సమానం. అలాంటి సజీవ సమాధులు ఎన్నింటినో ఎన్నదగిన ఈ రోజుల్లో కాల గర్భంలో కలిసిపోయిన 40 సంII కిందటి సుస్మృతులు మళ్ళీ మననం చేసుకోవటం అంటే కాలానికి కళ్ళెం వేయటమే. ఆ చక్కటి అనుభూతుల్ని ఆలోచన స్రవంతిలోకి 'రీ ఎంట్రీ' చేసి అక్షరీ కరించటం అంటే ఎంతో సాహస ప్రక్రియే! అదిగో అలాంటి సాహసం చేయాలనేదే మా అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల ప్రయ త్నం. అమ్మా, నాన్నలతో కలగలిపి పెనవేసుకున్న అనుభూతుల చిక్కుముడులను నెమరువేసుకోవడం అంటే ఎవరికైన ఎంతో ఇష్టం. ఒక్కోసారి 'కష్టం' కూడా. అమ్మా నాన్నలను కాకుండా ఇంకో ప్రపంచం తెలియని వయస్సు నుంచి, వాళ్ళు కన్ను మూసే వరకు వున్న అనుభూతుల పరంపరను మీ ముందు ఉంచితే, ఈ భూగోళాన్ని మూడుసార్లు చుట్టి వచ్చిన ఘనత నాకు దక్కుతుంది ! అయితే, అంత సాహసం చేయటం లేదు, కంగారుపడకండి !

మాలో జిజ్ఞాసను గుర్తించి ఎన్నో విషయాలను గమ్మత్తుగా గుదిగుచ్చి మా కందించిన మా నాన్న కపర్ది – మా కళ్ళకు విశ్వమంతా ఆయనే అనేట్లుగా కనిపించే వారు. ఆయనతో మాట్లాడిన వాళ్లలో ఎక్కువ మందికి ఈ అనుభూతే కలిగేది. ఎంతో నెమ్మదిగా, నమ్రతగా ఉండే మా అమ్మ – శేషమ్మ – లోతైన గుండెలో పీడితుల పట్ల ప్రేమ, సానుభూతి జీవనదులు కృష్ణ, గోదావరుల్లా ఎప్పుడు ప్రవహిస్తూనే ఉంటూ ఉండేవి. ఎందరికో, ముఖ్యంగా రిక్షా కార్మికులకు, అన్నపూర్ణమ్మ తల్లిగా నేటికీ ఆవిడ 1982లో చనిపోయింది – గుర్తుండిపోయింది. అలాంటి వాతావరణం–ఇప్పటికి కూడా మా ఇంట్లో కొనసా గటం మాకెంతో ఊరట కలిగించే విషయం.

"కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం, రెప్పపాటే ఈ ప్రయాణం" అనే మెట్ట వేదాంతంలో మాకు ఎవరికీ నమ్మకం లేదు. ఈ జనన మరణాలు అత్యంత సహజంగా జరిగిపోయే ప్రక్రియలనే వాస్తవం మాకు తెలుసు. కాకపోతే అందులో ఆనందం, విషాదం అనివార్యమని తెలుసు. అయితే, జీవితాన్ని అందంగా, హాయిగా జీవించగలగటం ఒక కళ. అలా జీవించి చూపించిన మా అమ్మా, నాన్న గారు మా అందరికి ఒక చక్కని ప్రెసిడెంట్ను ప్రజంట్ చేశారు. కళ్ళ ముందు కదలాడినంత సేపు ముందుండి నడిపించటం అందరూ చేసే పనే! కాని ఆయన కనిపించకపోయినా, ఆయన స్ఫూర్తిని ఆలంబనగా చేసుకొని జీవించగలగటం మాకు లభించిన వరం. అంత గొప్ప ప్రభా వాన్ని మా నాన్న గారు మా మీద చూపించారు.

ఇక చిన్న నాటి ముచ్చట్లు కొన్ని చెప్తాను. తాడేపల్లిగూడెంలోని సుబ్బారావుపేటలో, మేము ముత్యాలమ్మ గారి ఇంట్లో అద్దెకు ఉండేవాళ్ళం. అప్పుడు మేమంతా బాగా చిన్నపిల్లలం. ఒకసారి మా ఇంట్లో నేను కత్తి పీట మీద పడిపోయాను. కొంచెంలో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. కన్ను పక్కగా పెద్ద గాయమైంది. ఇక చూస్కోండి, మా అమ్మ కంగారు. ఆ దెబ్బకు కారణమైన మా పాలవాడు చింతన్న కళ్ళలో బెరుకు. ఇంతలో మా నాన్న గారు రావటం – మంచి వేసవి ఎండల్లో జరిగింది ఇది – ఇంటికి వచ్చిన మా నాన్న గారు దెబ్బలు చూసి, రక్తం గడ్డకట్టడానికి గాయం మీద వేసిన అరపూసను చూసి మా అమ్మకు 'అక్షింతలు' వేశారు. వెంటనే కాళ్ళు కూడా కడుక్కోకుండా రామారావు గారి ఆసుపత్రికి పరిగెత్తుకొని వెళ్ళి వెంటనే టి.టి. చేయించి తీసుకొచ్చే వరకు ఆయనకు మనశ్శాంతి లేదు. ఆ రోజు మా నాన్న గారు చూపించిన కన్సర్న్ ఆయన మీద మాకున్న గౌరవాన్ని రెట్టింపు చేసింది.

ఇంకోముచ్చట చెప్పనా ?! దాని దారిన అదిపోతున్న ఒక తేలును వెంటాడి, వెన్నంటి తరిమి, అది కసి తీరేదాక కుట్టేలా చేసుకొని, ఆ బాధకు తట్టుకోలేక లబోదిబోమంటుంటే ఉపశమనం కోసం ఏదో టాబ్లెట్ తెచ్చి కుట్టిన చోట ఉంచి ఏవేవో సేవలు చేశారు నాన్నగారు. ఇంకా గోల పెడుతుంటే మూడు చక్రాల సైకిలును లంచంగా సమర్పించుకున్నారు కూడా ! థ్యాంక్స్ టు శ్రీమాన్ తేలు గారు, ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సైకిల్ ఆ క్షణంలో నా సొంతమైంది. ఇలాంటి

చిన్ని చిన్ని బహుమానాలు చాలా మంది పిల్లలకి తల్లిదండ్రులు కొనిస్తారు. కాని ఆ బహుమానం అందుకున్న పిల్లలు మాత్రం తమ తల్లిదండ్రులకు తమ మీద ఏదో ప్రత్యేక ప్రేమ ఉన్నట్లుగా ఫీలవుతారు. అలా పిల్లలను ఫీల్ చేయించటంలోనే ఆ తల్లిదండ్రుల సక్సెస్ ఉంది !!

ముత్యాలమ్మ గారి ఇంట్లో ఉన్నప్పుడే కరణం గారు మాకు తాత గారు కూడా. ఆయన పొరిగింటాయన. ఆయన పిల్లలు రాధక్క, రాజక్క అంటే మాకు ఎంతో ఇష్టం. వాళ్ళతో ఎక్కువ సమయమే గడిపేవాళ్ళం. ఎంత ఎక్కువ అంటే రాత్రి పొద్దు పోయే దాకా కబుర్లు చెప్పి (మా ఇంట్లో ఎక్కువ మంది కబుర్ల పోగులు!) అక్కడే పడుకుండిపోయే వాళ్ళం. రాత్రి పొద్దు పోయాకా, మా నాన్నగారు ఇంటికి వచ్చాకా, ఆయనా మా అమ్మ గారు వచ్చి మమ్మల్ని మా ఇంటికి తీసుకొచ్చేవారు. అలా తీసుకొచ్చిన ప్రతీసారి ఎవరింట్లోనైనా పడుకోవడం మూలంగా వాళ్లకి ఎన్ని ఇబ్బందులు ఎదురవుతాయో మాకర్థమయ్యే భాషలో చెప్పటానికి నాన్నగారు ప్రయత్నించేవారు. అయితే, ఏనాడూ పరుషంగా చెప్పి మమ్మల్ని భయపెట్టే ప్రయత్నం మాత్రం చేయలేదు. మా లేత మనసులు గాయపడకుండా ఉండేలా చెప్పి ఒప్పించటం చూస్తే ఆయన మాకు ఎంతో గొప్ప వారుగా కనిపించేవారు. ఊహ వచ్చిన తరువాత తెలిసి తప్పు చేస్తే ఎంతో కరుగ్గా ఉండేవారు. అలాంటి తప్పులు చేస్తే భవిష్యత్తులో ఎలాంటి తిప్పలు పడతామో గట్టిగా హెచ్చరించి చెప్పేవారు. అదీ ఆయన విచక్షణ! ఆత్మీయుడు లలితానంద్ కబుర్లాడుతూ, ఒక్కోసారి మఖ్దూం భవన్లోనే ఉండిపోయిన ఘటనలు నాకు జ్ఞాపకం. అలనాటి స్నేహాలు అంత మధురంగా ఉండేవి.

అప్పటికే మా అమ్మగారికి ఒక్కసారి హార్ట్ ఎటాక్ వచ్చింది. ఇదేమి లెక్కలేని మాకు – ముఖ్యంగా నాకూ, కిషోర్‌కు – మా నాన్నగారు ఎన్నోసార్లు నయానో, భయానో చెప్పటానికి ప్రయత్నం చేశారు. కాని మేము లెక్కచేస్తే కదా! దీనితో విసిగిపోయిన మా నాన్నగారు మమ్మల్ని కూర్చోబెట్టి మా అమ్మ ఆరోగ్య విషయం, ఆవిడ మూలపడితే కుంటుపడే మా కుటుంబ విషయాలు ఎంతో ఓపికగా తెలియజేశారు. ఒక్కోసారి మఖ్దూం భవనంలోనే మేము భోజనం చేస్తూ ఉండేవాళ్ళం. కాని, మేము భోజనం చేసిన విషయం మా ఇంటి దగ్గర చెప్పకుండా అమ్మని ఇబ్బంది పెట్టడం మా నాన్నగారికి కోప కారణం అయ్యేది. 'కనీసం ఫోన్ చేసి అయినా మీ అమ్మకి చెప్పండి !' అని ఆయన తరచూ మందలించేవారు. లేటెస్ట్ టెక్నాలజీని ఉపయోగించటం, దానికి సరిపోయినట్లుగా తమను తాము ఎడెక్ట్ చేసుకోవటం అలవాటు చేసుకోవాలని ఎన్నోసార్లు చెబుతుండేవారు. అప్పట్లో తెలియలేదు. కాని, మా నాన్న గారికి మా అమ్మంటే అమితమైన ప్రేమ, అనురాగం ఉండేవని ఆ తరువాత ఆలస్యంగా అర్థం అయ్యింది.

మా నాన్న గారిని మా మనస్సులలో అత్యున్నత స్థానంలో కూర్చోబెట్టిన లక్షణాలు రెండు. ఆయనలోని నిజాయితీ, స్ట్రెయిట్ ఫార్వర్డ్‌నెస్. వ్యక్తిగత, కుటుంబ ప్రయోజనాలకు ఆయన ఎలా, ఏమి చేయాలనుకున్నారో అలాగే చేసేవారు. ఏనాడూ తన పిల్లల 'బంగారు భవిష్యత్తు' కోసం ఆయన తనకు అందుబాటులో ఉన్న ఏ ఆర్గనైజేషన్‌ను దుర్వినియోగం (నిజానికి అసలు వినియోగమే) చేయలేదు. 'వాళ్ళు కష్టపడి సాధించుకోగలరు. నేను సహాయపడవలసిన వాళ్ళు వేరే ఉన్నా'రనే భావం ఆయనకు ఉండేది. వాళ్ళకే ఆయన ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఆయనలోని ఈ గుణం ఇప్పటికి కూడా ప్రజలలో ఆయనకు సుస్థిరస్థానం ఇచ్చి నిజాయితీకి, నిస్వార్థతకు మారుపేరుగా ఆయన పేరు చెప్పటం మాకెన్నోసార్లు అనుభవంలోకి వచ్చింది. మా నాన్నగారికి ప్రజలు ఇలా నీరాజనాలు పడుతుంటే మా ఛాతీలు గర్వంతో ఉప్పొంగుతాయి. అవసరంలో ఉన్న వారికి చెయ్యందించి కష్టాల ఊబిలో నుంచి బయటపడేయటం నాన్న గారికి బాగా ఇష్టం. అలా, ఆరోగ్య విషయాలు, కుటుంబ తగాదాలు, ఉద్యోగ అవసరాలు ఆయనతో చర్చించి మనస్ఫూర్తిగా ఆయన ఇచ్చిన సలహాలు, సహాయాలు అందుకున్న వారు ఎందరో ! వాళ్ళందరి సహృదయ ఆశీర్వాదాలు – మా అమ్మ, నాన్నగార్ల అభిలాష కూడా – మేమందరం ఇలా సంతోషంగా ఉండటానికి కొంత దోహద పడ్డాయని అనుకోవటంలో తప్పు లేదనిపిస్తుంది.

ఎడతెరిపి లేకుండా ఆదర్శాలు వల్లించి, అసలు విషయం వచ్చేటప్పటికి జారుకునే వాళ్ళను మా నాన్నగారు అస్సలు సహించేవారు కాదు. స్వవిషయంలో సంపూర్ణంగాను, సలహాలు ఇచ్చి ఇతరులను మా నాన్నగారు తన పంథాలో నడిపించడానికి శాయశక్తులా కృషి చేశారు. మా తరంతోపాటు మా పిల్లల తరంలో కులాంతర వివాహాలు చేసుకుంటూ మా నాన్నగారు చెప్పి, చేసి చూపించిన ఆశయాలను, ఆదర్శాలను కొనసాగించటం మాకెంతో గర్వకారణం.

ప్రపంచాన్ని మేలు కొలిపి వెన్ను చరిచి ముందుకు నడిపించిన, నడిపిస్తున్న సజీవ సిద్ధాంతం మార్క్సిజం. ఆ ఇజాన్ని ఇలలో నిజం చేయాలని తపించిన వారిలో మా నాన్న, అమ్మ గార్లు కూడా ఉండటం మాకు గర్వకారణం. సంక్లిష్టమైన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని మనసా, వాచా నమ్మి ప్రచారం చేసిన కపర్దిగారు, పతితులు, భ్రష్టులు, బాధా సర్పదష్టుల అభ్యుదయానికి తపించే హృదయాలలో చిరంజీవి ! ఆయన జీవితం, కమ్యూనిస్టులకు, అభ్యుదయ కాముకులకు కరదీపిక. ఆయన ఆశించిన కమ్యూనిజాన్ని ఈ భువిలో స్థాపించి మానవాళికి మేలు చేయటమే వారికి మనం ఇవ్వదగిన ఘననివాళి అనిపిస్తుంది. ❑

# ప్రేమించిన మనుషులు!

## కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు



- మందలపర్తి కిషోర్

కన్నతల్లి గురించి రాయడం ఎవరికైనా కష్టమే! అమ్మ గురించి రాయవలసిన విశేషాలు లేక కాదు లెక్కకు మించినన్ని ఉండడమే ఇబ్బంది. మా అమ్మ మందలపర్తి శేషమ్మ విషయంలో నాకు కూడా ఇదే సమస్య ఎదురవుతోంది. ఇంకో చిక్కేమిటంటే, అమ్మ గురించి రాసి ఊరుకుందామంటే వీల్లేదు. ఆవిడ జీవిత గాథతో మరెందరి కథలో ముడిపడి ఉన్నాయి. అన్నీ రాస్తేనే అమ్మకీ, వాళ్లకీ కూడా న్యాయం జరుగుతుంది. అందుకే, వీలైనంత క్లుప్తంగా ఆ విషయాలన్నీ రాసే ప్రయత్నం చేస్తాను. మా అమ్మకి మనుషులను ప్రేమించడం ద్వితీయ ప్రకృతి కాదు – అదే ఆవిడ ప్రథమ ప్రకృతి. అందుకే, ఇక్కడ నేను అమ్మకు సంబంధించిన ఆ ఒక్క విషయం గురించే రాయాలనుకుంటున్నా.

అమ్మ పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలో 1926లో పుట్టింది. వాళ్ల 'బాబు గారు' బొమ్మకంటి సూర్యనారాయణమూర్తి, అత్తిలి కరణం. అక్కడే మా అమ్మ పెళ్లయ్యేదాకా ఉంది. మా నాన్న గారు, ఎం.వి.ఎన్. కపర్ది, మేనమామ దగ్గిర అంటే మా అమ్మా వాళ్ల ఇంట్లోనే కొంత కాలం ఉండి చదువుకున్నారు. ఆ విధంగా మా అమ్మా, నాన్న గారూ కలిసే పెరిగారు.

అమ్మకి వాళ్ల బాబు గారంటే చాలా ఇష్టం. ఆయన చదివింది ఎస్ఎల్సీయే అయినా గొప్ప మేధావి అని అమ్మ తరచూ చెప్పేది. హిందూ డైలీలో వచ్చే క్రాస్‌వర్డ్ పజిల్‌ను వాళ్ల బాబు గారు సునాయాసంగా పూర్తి చేసే వారట. అయితే, పోటీకి పంపడానికి ఆయన దగ్గర డబ్బుండేది కాదనీ, అందువల్ల ఆయనకు బహుమతులు రాలేదనీ అమ్మ చెప్పేది. మా తాతగారు చనిపోయాక ఆయన ట్రంకుపెట్టె తెరిచి చూస్తే అడుగున వందల సంఖ్యలో పూర్తిచేసిన క్రాస్‌వర్డ్ పజిల్స్ పడి ఉన్నాయట!

మాది పే..ద్ద కుటుంబం కావడం వల్ల అమ్మకు ఊపిరి తిప్పుకోలేనంత పని ఉండేది. పూటకు పాతిక, ముప్ఫయి మంది భోంచేసేవాళ్లు. (వాళ్లలో సగం మంది మేమే ఉండేవాళ్లం!). అమ్మ పై పనులు మాత్రమే చేసేది. వంట పనంతా అమ్మమ్మే. అయితే, క్యాబేజీ టమాటా నూల్ కూల్ – చౌచౌ – బీన్స్ – ముల్లంగి క్యారట్ లాంటి 'ఇంగ్లిష్ కూరలు' అమ్మమ్మ – బొమ్మకంటి కనకదుర్గమ్మ వండేది కాదు. (అమ్మ చేసిన ఆ కూరలు తినడానికి మాత్రం అమ్మమ్మకి అభ్యంతరం ఉండేది కాదు. అమ్మమ్మ ఆచారమంతా మా మామ్మ కోసమే!) అమ్మమ్మది అమృత హస్తం. ఆవిడ వంటను ఇన్నేళ్ల తర్వాత కూడా తలుచుకునే వాళ్లు డజన్ల సంఖ్యలో కనిపిస్తారు. నేను చెప్పేది 'బయటివాళ్ల' గురించి! (దాదాపు నిత్య పారాయణంగా మా అమ్మమ్మ పేరే తలిచే మా అన్నదమ్ములనూ, అక్క చెల్లెళ్లనూ ఆయా ఇళ్లల్లో వాళ్లు విసుక్కోవడం దైనందిన కృత్యం!! కాగా, అమ్మమ్మను అమ్మ ఘాటుగానే మందలించేది. వాళ్లిద్దరికీ ఇరవ య్యేళ్ల వార ఉండేది కానీ అమ్మమ్మ వయసును అమ్మ లెక్క చేసేది కాదు. మాలో – అంటే పిల్లల్లో – ఒకరిగానే అమ్మమ్మను చూసేది. మేం కూడా అలాగే అనుకునేవాళ్లం. అయితే, దాదాపు మూడు దశాబ్దాలపాటు మా ఇంటికొచ్చిన వాళ్లందరికీ వండి వార్చి పెట్టిన అమ్మమ్మంటే అమ్మకీ, నాన్న గారికి బోలెడు గౌరవం. అమ్మమ్మ అమ్మకన్నా కూడా ఎక్కువ చదువుకుంది. ఆ విషయాన్ని పదే పదే గుర్తు చేసేది కూడా! ఆవిడకి వెయ్యికిపైగా పద్యాలు నోటికొచ్చు. అమ్మమ్మ దగ్గర ఓ లావుపాటి పాటల పుస్తకం కూడా ఉండేది. మా ఇంట్లో అందరి పేర్ల మీదా ఒక్కో పాటో పద్యమో పాడి, నిద్రలేపేది అమ్మమ్మ. అమ్మమ్మ పాటంటే అమ్మతో సహా ఇంట్లో అందరికీ ఎంతో ఇష్టం.

మా మామ్మ పేరు కూడా మందలపర్తి శేషమ్మే. అమ్మ ఆవిణ్ణి 'శేషక్కయ్య' అనేది. మామ్మ అమ్మకి మేనత్తే. మా తాతగారు నారాయణ మూర్తిగారు ఆవిణ్ణి 'శేషక్కయ్య' అని పిల్చేవారట. అమ్మకీ అదే అలవాటు. ఆఖరికి అమ్మమ్మ కూడా ఆవిణ్ణి అదే పిలుపు! మా ఇంట్లో కుల, మతాలు లేవు కానీ అందరు బ్రాహ్మల ఇళ్లల్లో మాదిరే – ముట్టు, మైల వంటివి ఉండేవి. అవి ముఖ్యంగా మామ్మ కోసమే. నాకు తెలిసే సరికే మా మామ్మకి చూపు తగ్గిపోయింది. మేం, పిల్లలం, ఇలాంటివి పెద్దగా పాటించే వాళ్లం కాదు. అందుకు అమ్మ ఎప్పుడూ అడ్డు చెప్ప లేదు కూడా! ఇక నాన్నగారి సంగతి సరేసరి. ఆయనకి ఏ 'ఆచారం'లోనూ నమ్మకం లేదు. నమ్మకం లేని సదాచారాన్ని పాటించే అలవాటూ లేదు. అయితే, ఇలాంటి విషయాల్లో పనిగట్టుకుని మామ్మతోగానీ, అమ్మమ్మతో గానీ అమ్మా నాన్న గారూ వాదించడం ఎప్పుడూ చూడలేదు.

మామ్మ పట్టింపులకు కొన్ని మినహాయింపులు లేకపోలేదు. ఉదాహరణకు కప్పల వెంకటస్వామి. వెంకటస్వామిది ఓడూరు.

అక్కడ కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి, మా ఇంటికి వ్యవసాయం పనులు చూసేందుకు 1967 ప్రాంతాల్లో వచ్చాడు. (వెంకట స్వామిని పాలేరు అనడానికి నాకు నోరు రావడం లేదు. అతని స్థానం కచ్చితంగా అంతకన్నా ఎక్కువే!) కులానికి వెంకటస్వామి మాల. అతను మా ఇంట్లోనే ఉండేవాడు. తర్వాత అతని భార్య – మహాలక్ష్మి – మా ఊరొచ్చి కొన్నాళ్లు ఉంది. మా ఇంట్లో ఉన్న రోజుల్లో వెంకటస్వామి విషయంలో ఎలాంటి 'ఆచారం' పాటించిన గుర్తు లేదు. బాధ్యతగా ఉండే అతనంటే మామ్మకి ఎంతో అభిమానం కూడా. ఒక్కో రోజు మామ్మ, వెంకటస్వామి – ఎదురుబొదురుగా కూర్చుని మరీ – చెరో గేదెకీ పాలు తీసేవారు.

వల్లూరు నుంచి గడ్డి, తాటాకులు తీసుకొచ్చే పంచాది రాముడు విషయంలోను మామ్మ పెద్దగా పట్టింపులు చూపించేది కాదు. అతను, మా తాతగారి రోజుల నుంచీ వల్లూరులో వ్యవసాయం పనులు చేసేవాడు. పెద్ద వయసు వచ్చిన తర్వాత ఎడ్ల బండికి ముందు నడిచి వచ్చేవాడు. రాముణ్ణి, వెంకట స్వామిని అమర్యాదగా పిలవడం మా అమ్మకు ఇష్టం ఉండేది కాదు. దూలం కృష్ణారావు బావ గారు – కులానికి కాపు – ఒకసారి వెంకటస్వామిని 'ఒరే' అని మాట్లాడినప్పుడు మా నాన్న గారు అభ్యంతరం చెప్పారు. "కిష్టావ్! అతన్ని నువ్వు అలా పిలిస్తే, మరి నిన్ను నేనేమనాలోయ్?" అని నాన్నగారు అడిగిన దానికి బావగారు చిన్న బుచ్చుకున్నారు కూడా!

ఒకసారి అమ్మతో, మామ్మ తాలూకు 'మూఢనమ్మకాల' గురించి వాదనకు దిగాను. "ఎవరి నమ్మకాలు వాళ్లవి. – నీకేం బలవంతం లేదుగా, మిగతా విషయాలు నీకనవసరం!!" అన్నట్లు మాట్లాడి నా నోరు మూయించింది అమ్మ. కానీ, నాకు సంతృప్తి అనిపించలేదని ఆవిడ గ్రహించినట్లుంది. అప్పుడు అమ్మ ఓ విషయం చెప్పింది.

1948లో, ప్రకాశం ఆర్డినెన్స్ పుణ్యమాని నాన్నగారు అరెస్టయ్యారు. అప్పటికి మా మూడో అన్నయ్య మందలపర్తి నారాయణమూర్తి – ముద్దు పేరు చిట్టిపాప – పసికందు. తనకన్నా పెద్ద వాళ్లిద్దరూ – రామచంద్రరావు, శ్రీపతి మూడు, నాలుగేళ్ల పిల్లలు. అది, కమ్యూనిస్టుల కుటుంబాలను కూడా వేధించి, హింసించిన పాడు కాలం. సొంత వాళ్లు కూడా కమ్యూనిస్టులను 'అంటరాని వాళ్లు'గా చూసిన ఆ రోజుల్లో మామ్మ అమ్మను పుట్టింట్లో ఉండనివ్వలేదు. పెదనింద్రకొలను లోని తనింటికి తీసుకెళ్లిపోయింది. దాదాపు నాలుగేళ్లపాటు నాన్నగారు జైల్లో ఉన్నారు. అంత కాలమూ మామ్మే అమ్మనూ, అన్నయ్యలనూ "కంటికి రెప్పలా కాపాడింది".. (ఈ మాటలు నావి కావు అమ్మవే!). ఇదంతా చెప్పి అమ్మ ఓ ప్రశ్న వేసింది. పాతకాలపు నమ్మకాలను వదులు కోలేదు కదాని, అలాంటి గొప్ప మామ్మతో గొడవపడడం మంచిదా? సర్దుకుపోవడం మంచిదా?" ఇదీ అమ్మ వేసిన ప్రశ్న.

నిజం చెప్పాలంటే, అమ్మ ప్రశ్నకు సమాధానం నాకు అప్పుడే కాదు – ఇప్పుడు కూడా తెలియదు. ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, అమ్మకీ, నాన్న గారికీ ఇలాంటి విషయాల్లో ఎప్పుడూ వాగ్వాదాలు జరిగిన జ్ఞాపకం లేదు. కలిసి బతకడానికి సంబంధించిన గ్రామర్ ఏదో వాళ్లిద్దరికీ బాగా తెలుసని మాత్రం అనిపించేది. అమ్మకి 'పెద్దక్కయ్య' అంటే చాలా ఇష్టం. ఆవిడ మా అక్కయ్య కాదు. మా అమ్మకు మేనత్త! అంటే, మా మామ్మకి అక్కగారన్న మాట. ఆవిడ అసలు పేరేమిటో చాలా కాలం నాకు తెలీదు. ఎందుకంటే, ఆ 'అసలు' పేరుతో ఆవిణ్ణి ఎవరూ ఎప్పుడూ పిలవగా మేం వినలేదు. (ఈ మధ్యే మా సుబ్రహ్మణ్యం అన్నయ్య ఆవిడ అసలు పేరు 'పోడూరి నరసమ్మ' గారని చెప్పాడు!)

మా పెద్దక్కయ్యకి పిల్లలు లేరు. ఆవిడ బాల వితంతువు. ఆవిడ వీరేశలింగం గారి శిష్యురాలట కూడా. కలిదిండి సూర్య నారాయణరాజు అనే కమ్యూనిస్టు యోధుడిని పోలీసులు కాల్చినప్పుడు ఆయన తొడకు గాయమయిందట. అంత గాయమైనా కూడా ఆయన పోలీసులు కన్నుగప్పి తప్పించుకుని మా తాత గారింటికి చేరారట. మా రెండో మేనత్త బావగారు – డాక్టర్ తాడినాడ నీలాచలం – సూర్యనారాయణరాజు గారికి రహస్యంగా వైద్యం చేసే వారట. 'పెద్దక్కయ్య' సూర్యనారాయణ రాజు గారిని "కన్న కొడుకు కన్నా ఎక్కువగా" చూసుకునేదని అమ్మ అనేది. అటక మీద "అండర్‌గ్రౌండ్"లో ఉన్నాడట ఆయన. మల మూత్రాదుల కోసం ఓ మట్టి కుండను ఏర్పాటు చేశారట. మా పెద్దక్కయ్య నిత్యం ఆ కుండను అటక మీంచి దింపి, కడిగి శుభ్రం చేసి తిరిగి అటక మీదికి చేర్చేదట. గాయం నయం అయ్యాక, ఆయన మా తాతగారి ఇంట్లోంచి వెళ్లి పోయారట. అయితే ఓ ద్రోహి కారణంగా కొద్దిరోజులకే పోలీసులు ఆయన్ని పట్టుకుని చంపేశారు. అప్పుడు పెద్దక్కయ్యతోపాటు మా తాతగారి ఇంట్లో వాళ్లంతా దారుణంగా ఏడ్చారని అమ్మ చెప్పేది. ఆవిడ మా అమ్మతోనూ, పెద్ద మావయ్యతోనూ, సంగులత్తయ్యతోనూ తీయించుకున్న ఫొటో ఒకటి మా ఇంట్లో ఉండేది. ఇప్పుడది ఏమైపోయిందో మరి!

మా పెద్దక్కయ్యకి ఇతరుల పిల్లలను కన్నబిడ్డల్లా చేరదీయడం కొత్తేమీ కాదు. మా పెద తాత గారు బొమ్మకంటి ప్రకాశం గారికి ఇద్దరు పిల్లలు పుట్టాక భార్య పోయింది. తల్లి లేని మా మావయ్యలిద్దరినీ బొమ్మకంటి సుందరగోపాలం, బొమ్మకంటి శ్రీరామ చంద్రమూర్తి (రాముడు మావయ్య)లను పెద్దక్కయ్యే పెంచి పెద్ద వాళ్లను చేసింది. రాముడు మావయ్య పెద్దక్కయ్య పెడితే తప్ప అన్నం తినేవాడు కాడట. అమ్మ చెప్పిన ఈ

విషయాలు నాకు బుర్రకెక్కిపోవడం వల్లనే నేను రాస్తున్న "తరం-తరం" నవలలో పెద్దక్కయ్య - అదే పేరుతో - పాత్రగా ప్రత్యక్షమైంది.

నాన్న గారి మీద వాళ్ల పెత్తల్లి ప్రభావం బాగా ఉందని అమ్మ అనేది. ఆ మాట ఏమో కానీ, అమ్మ మీద మాత్రం పెద్దక్కయ్య ప్రభావం చాలా ఉండేదని నాకు అనిపించేది.

అమ్మకు ఇద్దరు తమ్ముళ్లు. మా పెద్ద మావయ్య - బొమ్మకంటి సుందరరామగోవిందశర్మ - అంటే అమ్మకు చాలా ఇష్టం. ఆయన ముప్ఫయ్యేళ్ల ప్రాయంలో, 1967లో పోయాడు. ఆయనను అంతా సుందర్రామయ్య అనే వారు. మా నాన్న గారూ, మా బాబయ్యలూ, ఇంకా దగ్గిర బంధువులూ ఆయన్ని "డిడ్డూ" అనేవారు. పెద్ద మావయ్య మా ఇంటికి డ్రిల్ మాస్టర్ లాంటివాడు. ఇంట్లో క్రమశిక్షణ నెలకొల్పే బాధ్యత ఆయన బుజాలమీదే వేసుకునేవాడు. నేనూ ఆయన వేసిన "తాళాధ్యాయాలు" రుచి చూసిన వాణ్నే. అయితే, మా అన్నయ్యలతో పోలిస్తే నేను అదృష్టవంతుణ్ణి.

పెద్ద మావయ్య చక్కగా పాడేవాడు. వీనుల విందుగా ఈల పాట పాడేవాడు. "ముఘలే ఆజమ్" లాంటి సినిమాల్లో లతా మంగేష్కర్ పాడిన పాటలంటే మా పెద్ద మావయ్యకి చాలా ఇష్టం. అవి రేడియోలో వచ్చేటప్పుడు ఎవరైనా మాట్లాడితే తన్నే వాడు. నాన్న గారికి మావయ్య పాటలంటే ఇష్టమని అమ్మ అనేది. కానీ, వాళ్లిద్దరూ స్నేహంగా ఉండేవారనడానికి ఆధారా లేం లేవు. 1964లో కమ్యూనిస్ట్ పార్టీ చీలిపోయే నాటికి మా నాన్న గారు సీపీఐ జిల్లా సెక్రటరీగా ఉండేవారు. మా పెద్ద మావయ్య సీపీఐ(ఎం) వర్గానికి దగ్గరగా ఉండేవాడు. వాళ్లిద్దరి మధ్యా అప్పటికే ఉన్న అగాధం దీంతో మరింత పెరిగి ఉండాలి. అయితే, మా అమ్మ ఈ పరిస్థితి వల్ల పెద్దగా ఇబ్బంది పడిందను కోను. ఆ పాటి సంస్కారం, అటు మా నాన్న గారికీ, ఇటు మా పెద్ద మావయ్యకీ కూడా ఉండేది. అన్నింటికీ మించి, ఇలాంటి పరిస్థితిని తట్టుకునే స్థైర్యం అమ్మకీ ఉంది.

మా మావయ్యలలో చిన్నవాడు బొమ్మకంటి శ్రీఆంజనేయ సత్యనారాయణ. అంతా ఆయనను 'అంజిబాబు' అంటారు. మా అంజిమావయ్యని అమ్మ తమ్ముడిగా చూసేది కాదు. కొడుకుగానే చూసేది. ఆయన క్కూడా మా అమ్మమ్మ దగ్గిరకన్నా అమ్మ దగ్గిరే చేరిక. అమ్మ అంజి మావయ్యని మా కన్నా చిన్నపిల్లాడిలా పరిగణించేదని నాకెందుకో అనిపించేది. తనకెప్పుడూ ఎలాంటి పనీ చెప్పేది కాదు. తనకన్నా రెండు మూడేళ్లు చిన్నవాళ్లయిన మా అన్నయ్యలకే అన్ని బాధ్యతలు అప్పగించేది. అయితే, ఆది నుంచీ అంజి మావయ్య ఎంతో శ్రమజీవి. (ఇప్పుడు ఇదే పేరుతో మా మావయ్య ఓ మ్యాగజిన్ నడుపుతున్నాడు!) పదహారు పదిహేడేళ్ల ప్రాయంలోనే అంజి మావయ్య బతుకుపోరు మొదలుపెట్టాడు. ఇప్పటికీ దాదాపు 65 ఏళ్ళ వయసులో అడ్వకేట్‌గా తన బతుకు తాను బతుకుతూనే ఉన్నాడు. అంతకు మించి తను నమ్ముకున్న ఆదర్శాలకు అంకితమై ఉన్నాడు. మేమెవరూ చెయ్యని ఓ పని మా మావయ్య చేశాడు. తన కూతురికి మా అమ్మ పేరు పెట్టుకున్నాడు. అమ్మ పేరెత్తితే అంజి మావయ్య కళ్లు ఇప్పటికీ చెమ్మగిల్లుతూనే ఉంటాయి.

రాజకీయాల విషయానికి వస్తే మా మావయ్య మావోయిస్టు. యూనియన్ రాజకీయాల్లో కూడా మావయ్యకీ నాన్న గారికీ చుక్కెదురు. కానీ, ఇది వాళ్ల సంబంధాలను ప్రభావితం చెయ్య లేదు. అమ్మ ఇలాంటి వాటిని ఖాతరే చేసేది కాదు. ఎమర్జెన్సీలో మా అంజి మావయ్యని పోలీసులు 'పట్టుకుపోయారు'. చట్ట బద్ధంగా అరెస్టూ చెయ్యలేదు, ఏ న్యాయస్థానంలోనూ నిల బెట్టనూలేదు. దారుణంగా హింసించి వదిలిపెట్టారు. మావయ్య అజాపజా తెలియక అమ్మ విలవిల్లాడిపోయింది. ఒకరోజున చటుక్కున మావయ్య ఎక్కడి నుంచో ఊడిపడ్డాడు. దాదాపు నెలన్నర రోజులు మంచం పట్టి అవస్థ పడ్డాడు. జ్వర తీవ్రతతో సంధి పేలాపనలు చేసేవాడు. అప్పటికే, అమ్మకీ-నాన్నగారికీ ఇద్దరికీ గుండె జబ్బు వచ్చింది. ఇద్దరికీ సుగరు, బీపీ ఉండేది. అలాంటి వాళ్లు ఇలాంటి పేషెంటును ఎలా భరించగలుగుతా రోనని అందరూ ఆందోళనపడ్డారు. కానీ, ఇద్దరికిద్దరూ మావయ్యకి నయమయ్యే దాకా నిబ్బరంగా ఉండడం తల్చుకుంటే ఇప్పటికీ విడ్డూరంగానే అనిపిస్తుంది.

అమ్మ మా తాత గారింట్లో అందరికన్నా పెద్దది. మా బొజ్జి పిన్ని అందరికన్నా చిన్నది. మా పిన్ని అసలు పేరు మందలపర్తి సుబ్బలక్ష్మి. తనకి రెండు, మూడేళ్ల వయసున్నప్పుడే మా తాత గారు నారాయణమూర్తి గారు - పోయారు. అప్పటి నుంచి పిన్ని మా ఇంట్లోనే పెరిగింది. పిన్ని మా అమ్మని అక్కా అనేది కాదు. అమ్మా అనే పిలిచేది. వాళ్ల అమ్మని 'మాలాగానే అమ్మమ్మా అనేది. మా నాన్న గారినే నాన్న గారనేది. మా ఊళ్లో అందరూ ఇప్పటికీ మా పిన్నిని "కపర్దీ గారి పాప" అనే అంటారు. మా అన్నయ్యల్లో తనకన్నా పెద్ద వాళ్లని పిన్ని అన్నయ్యలనే అనేది. మమ్మల్ని తమ్ముళ్లనే అంటుంది. మా అమ్మకు ఆరుగురు కొడుకుల తర్వాత గానీ కూతుళ్లు పుట్టలేదు. కూతుళ్ల కోసం పెంచుకున్న మమకారమంతా అమ్మ పిన్ని మీదే కుమ్మరించింది. పిన్ని సరిగ్గా చదువుకోనందుకు అమ్మ రహస్యంగా బాధపడేదే తప్ప గట్టిగా గద్దించి పిన్నికెప్పుడూ చెప్పలేదు. ఈ అతి ప్రేమ వల్ల పిన్నికి మేలు కన్నా కీడే ఎక్కువగా జరిగిందనిపిస్తుంది.

అమ్మ ప్రేమను జుర్రుకున్న వాళ్లల్లో ఇసుకపల్లి సత్యవతక్కయ్య గారొకరు. మా నాన్న గారు తాడేపల్లిగూడెంలో పొలం కొని

స్థిరపడినప్పుడు ఇసుకపల్లి సుబ్బరాజుగారిని పనిలో పెట్టుకున్నారట. అది నేను పుట్టడానికి అయిదారేళ్లకు ముందుమాట. 1952లో కాబోలు. అప్పుడే సుబ్బరాజు గారికి పెళ్లి అయిందట. అప్పటికి అక్కయ్య గారు పదహారేళ్ల చిన్నపిల్ల. అమ్మ ఆమెని కూతురులాగే ఆదరించింది. మా ఇంట్లో అందరిమీదా అక్కయ్య గారు 'అథార్టీ' చెలాయించేవారు. మమ్మల్ని కొట్టడానికి సైతం ఆవిడ వెనకాడేది కాదు. అమ్మ ఏ మునిసిపల్ కౌన్సిల్ మీటింగ్ కు వెళితే అక్కయ్య గారిదే ఇంటి పెత్తనం. అమ్మమ్మ, మామ్మ కూడా అక్కయ్య గారికి చెప్పకుండా ఏమీ చేసేవారు కాదు. మాకు అక్కయ్య గారి మీద గొంతు దాకా మంట ఉండేదంటే ఉండదా? కానీ అమ్మ ప్రేమ అనే రక్షణ కవచం అక్కయ్య గారిని అన్నింటి నుంచీ కాపాడేది. అంతకుమించి, అక్కయ్య గారికి మా సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదన్న సంగతి మాకందరికీ తెలిసిందే! బహుశా అమ్మకు అందుకేనేమో అక్కయ్యగారంటే అంత అభిమానం!

అమ్మ స్నేహితులలో ముఖ్యులు యాళ్లబండి పుణ్యవతిగారూ, దూసనపూడి సుబ్బాయమ్మ గారూను. అమ్మ పోయిన తర్వాత వీళ్లిద్దరూ ఆమెకు వియ్యపురాళ్లు కావడం సంగతి అలా ఉంచండి. పుణ్యవతి గారి చిన్నమ్మాయి బేబీ – సుశీలాకుమారిని మా అన్నయ్య పెళ్లాడాడు. మా ఆవిడ వాణీదేవి సుబ్బాయమ్మ గారి చిన్నమ్మాయే! పుణ్యవతి గారిని మేమంతా అత్తయ్య గారనే అనేవాళ్లం. 1967లో చింతలపూడి నుంచి వాళ్ల కుటుంబం తాడేపల్లిగూడెం వచ్చింది. అంతకు పదిహేనేళ్ల క్రితం కూడా వాళ్లు గూడెంలో కొన్నాళ్లున్నారట. యాళ్లబండి రంగనాయకులు మావయ్య గారు కొంత కాలం చింతలపూడిలో బెల్లం వ్యాపారం చేసి, 1967 నాటికి తిరిగి తాడేపల్లిగూడెం వచ్చేశారు. స్వాతంత్ర్యం రాక ముందు మావయ్య గారు ఓ రహస్య పత్రిక (బహుశా 'స్వతంత్ర భారత్') ముద్రణ, పంపిణీల బాధ్యతల్లో పాలు పంచుకున్నారు. అప్పట్లో ఆ పని ప్రాణాలతో చెలగాటం లాంటిది. అది చేసినందుకేనేమో, మావయ్యగారంటే నాన్న గారికి హీరో వర్షిప్ లాంటి భావన ఉండేది. ఇక, అత్తయ్య గారంటే అమ్మకి బోలెడు అభిమానం.

దూసనపూడి సుబ్బాయమ్మ గారు మా అమ్మా నాన్నగార్లకి రెండు వైపుల నుంచీ 'చుట్టం'. సుబ్బాయమ్మ గారి తల్లిదండ్రులు పైబోయిన కొండమ్మ గారూ, వెంకట్రామయ్య గారూ మా అమ్మా నాన్నగార్లకు ఫ్యామిలీ ఫ్రెండ్స్. సుబ్బాయమ్మ గారి భర్త దూసనపూడి విరాటరాజు గారు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, కమ్యూనిస్టు పార్టీలో దాదాపు అర్ధ శతాబ్దికాలం పనిచేశారు. ఆయన దగ్గిరే మా నాన్నగారు తన రాజకీయ కార్యకలాపాలు మొదలుపెట్టారు 1942లో అనుకుంటా. ఈ రెండు కారణాల వల్లా సుబ్బాయమ్మ గారు మా అమ్మకు చాలా ఆప్తురాలు. ఈ ముగ్గురు స్నేహితులూ "డిప్రెషన్" రోజుల్లో ఒకరి కొకరు గొప్ప ఊతమిచ్చుకున్నారట. అంతే కాదు – ఆ విషయం ఎన్నడూ మర్చిపోలేదు కూడా.

మా నాన్న గారికి ప్రథమ శిష్యుడూ, మాకందరికీ తొలి ఉపాధ్యాయుడూ దాట్ల వీరవెంకట సుబ్రహ్మణ్యేశ్వరవర్మ – డి.వి.వి.ఎస్.వర్మ – అన్నా, ఆయన సతీమణి సంకు మనోరమ అన్నా, అమ్మకు చాలా అభిమానం. మనోరమ, వర్మ గార్ల వివాహానికి సంధానకర్త మా నాన్నగారే. (ఆవిడ ఆ రుణం తీర్చుకున్నారు కూడా ! నా పెళ్లి ఆవిడ సూచించిందే!!) వర్మ గారికి ఓ దశలో తీవ్రమైన అనారోగ్యం చేసింది. అప్పట్లో ఆయన కొద్ది రోజులు మా ఇంట్లో ఉన్నారు. ఆయనకు నిజమైన మందు ప్రేమాభిమా నాలే. అవి అమ్మా నాన్న గార్ల దగ్గిర కొల్లలుగా లభించడం వల్ల వర్మ గారు త్వరలోనే కోలుకున్నారు.

మా ఇంట్లోనే ఉంటూ అమ్మ అభిమానాన్ని చవి చూసిన వాళ్లలో గుల్లిపల్లి శ్యామలరావు, యాళ్లబండి రాజేంద్రప్రసాదూ, మందలపర్తి వెంకటరమణారావు, బొమ్మకంటి కృష్ణకుమారీ, కాకర్ల విమల ముఖ్యులు. మా బావలూ, మా పెత్తండ్రి–పిన తండ్రి పిల్లలూ, బంధుమిత్రులూ అమ్మ ఆదరాభిమానాల గురించి కించిత్తు అతిశయోక్తులతో – చెప్పేమాటలు మేమే విన లేం. అమ్మ ప్రేమను అందరికన్నా ఎక్కువ సంపాదించు కున్న దెవరో నాకు తెలీదు. ఆ విషయం చెప్పడానికి అమ్మ లేదిప్పుడు. అయితే, అమ్మ నాన్న గారిని విపరీతంగా ప్రేమిం చిందని నా అంచనా. ముందే చెప్పినట్టు, అమ్మ నాన్న గారికి మేనమామ కూతురే. వాళ్లిద్దరికీ పెళ్లి చెయ్యాలన్నది మా మామ్మ పట్టుదల. 1941లో వాళ్లకి పెళ్లయింది. 'మేనత్త కొడుకూ మొగుడేనా?' అంటూ ఓ నాటు సామెత చెప్తారు. కానీ అమ్మను చూసిన వాళ్లు ఆ సామెత వాడడానికి జంకుతారనిపిస్తుంది.

అమ్మా, నాన్నగార్ల పెళ్లి జరిగిన ఆరు నెలల్లోపే తాతగారు (మందలపర్తి రామచంద్రరావు) పోయారు. నాన్నగారికి ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చేసింది. వెంటనే ఆయన పూర్తిస్థాయిలో సీపీఐ కార్యకలాపాలు మొదలుపెట్టారు. అవి 40 ఏళ్లపాటు, 1981 మే 25న నాన్న గారు పోయేదాకా కొనసాగాయి. అన్నేళ్లూ, అమ్మ కూడా పార్టీ కార్యకలాపాల్లో ఏదో రూపంలో పాలు పంచుకుంటూనే ఉంది. (అమ్మ దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు–బ్రేక్ లేకుండా–తాడేపల్లిగూడెం స్వపరిపాలన సంస్థలో సభ్యురాలు. బహుశా ఇది రికార్డు!!). నాన్న గారి మీద బెంగతోనే ఏడాదిన్నర తర్వాత 1982 నవంబర్ 25న, మా 'సొంత' ఊరు తాడేపల్లిగూడెంలో, మా సొంత ఇంట్లోనే అమ్మ పోయిం దని నా నమ్మకం. అందుకే, అమ్మకి నాన్నగారి మీదున్న ప్రేమను విపరీతం అనడం. అమ్మ గురించి ఇలా రాస్తూ పోతే అంతం ఉండదనిపిస్తుంది. అందుకే ఇంతటితో ఆపేస్తున్నాను. ❑

# అమ్మ ప్రేమ అక్షయ పాత్ర!

## కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు



- మందలపర్తి అమ్మాజీ

అమ్మ.. తలచుకోగానే ముందు నా పెదాల మీద నవ్వు విరుస్తుంది. తర్వాత లేదని గుర్తొచ్చి ఏడుపొస్తుంది. అమ్మా నాన్న గార్ల మీద పుస్తకం వేద్దామని కిషోర్ అన్నయ్య చెప్పగానే, నా కళ్ళ ముందు హిమాయత్నగర్లో పార్టీ ఆఫీసు వెనకింట్లో లుంగీ, బనీనుతో బల్ల మీద కూర్చున్న నాన్నగారు, గుమ్మంలో కూర్చుని కళ్ళజోడు తగిలించుకుని పేపర్ చూస్తున్న అమ్మ, దొడ్డి వాకిట్లో కాళ్ళు జాపుకుని కూర్చుని మమ్మల్ని పక్కన కూర్చొపెట్టుకుని మా పేర్లతో పాటలు పాడే అమ్మమ్మ, అమ్మమ్మ 'దగ్గర స్థానం కోసం పోటీపడే వాణీ, నేను, అమ్మా.. బొజ్జలో పాలే.. అని ఏడ్చే సత్తి గాడు, దొంగచాటుగా సిగరెట్లు కాల్చే అన్నయ్యలు (వాళ్ళలో ఎవరి బ్రాండ్ ఏమిటో కూడా నాన్న గారికి తెలుసు, ఆయనకి తెలుసునని వీళ్లకీ తెలుసు) అందరూ కళ్ళ ముందు కదిలారు. ఎక్కడి నుండి మొదలు పెట్టాలో తెలీలేదు. అయినా మొదలు పెట్టేశాను! అమ్మ ఆరుగురు అన్నయ్యల తర్వాత ఎంతో అపు రూపంగా నన్ను కంది. నా వెనకే వాణీ కూడా ఆడపిల్ల కావడం అమ్మకి, నాన్న గారికీ సంతోషమే అయినా, నాకు మా ఇంట్లో ప్రత్యేక స్థానం వుంది. వాణీకి లేదని కాదు, కానీ ఎందుకో అన్న య్యలకి, పిన్ని, మావయ్యకీ నా మీద ప్రేమ ఒక పిసరు ఎక్కువనిపిస్తుంది నాకు. మా వాణీ కూడా అన్నయ్యలతో 'మీకు అక్కంటేనే ఎక్కువ ఇష్టం' అని దెబ్బలాడేది. (ఇప్పుడు తగిలిన ఒక్కొక్క దెబ్బకీ బెంగపడుతూ దిగులు పడుతున్న మాకు వంతు లు వేసుకునే ఆసక్తి కూడా పోయింది) అమ్మ, నాన్నగార్ల ప్రేమ అక్షయ పాత్రలాంటిది. ఎందరికి ఎంత పంచినా తరిగేది కాదు.

నేనూ, వాణీ గూడెంలో ఎక్కువ కాలం వుండకపోయినా జీవితంలో తలచుకుని నవ్వుకునే ఘట్టాలు మాత్రం ఎక్కువ అక్కడివే. అమ్మ నన్నూ, వాణీని అమ్మాజక్క, బేబక్క, కిషోర్ అన్నయ్యా, జగనన్నయ్యలని పొలం తీసుకువెళ్ళేది. నీళ్ళ తొట్టి కింద తలంటేది. మధ్యాహ్నం భోజనం అక్కడే చేసి, దారిలో నూతి పక్కనున్న సీతాఫలం చెట్టు పట్టుకుని ఊగి, కింద పొలంలో మామిడి చెట్టు చూసి, తూములో ఆడుకుని, సాయంత్రం తాపీగా కబుర్లు చెప్పుకుంటూ వానపల్లిగూడెం మీదుగా నడుచుకుంటూ వచ్చే వాళ్ళం. దారిలో పిచికాకు దూసుకుని, తాటాకుతో నమిలి, నోరు పండితే ఎవరిది బాగుందో వంతులేసుకుంటూ ఇంటికి చేరేవాళ్ళం. అమ్మా, నాన్న గారితో సినిమాకి వెళ్ళడం గొప్ప ప్రివిలేజ్. నాన్న గారు ఎప్పుడో కానీ సినిమా చూసేవారు కాదు. మా కోసం, లేకపోతే అమ్మకి ఏదో ఒక సరదా తీర్చాలనో సినిమాకి తీసుకెళ్ళేవారు. వెనక నేనూ, వాణీ తోకలం. నాన్న గారితో వెళితే ఇంటర్వెల్లో కూల్ డ్రింక్స్ తాగొచ్చు. అప్పటికి అదే చాలా గొప్ప.

మా పిన్ని (పేరుకే పిన్ని గాని, తను మాత్రం మమ్మల్ని చెల్లెళ్ళగానే చూస్తుంది. అలాగే చెబుతుంది). మావయ్యల దగ్గర మాకు బాగా చనువు. మాకు పెద్ద మావయ్య వుండేవాడు కాని నాకు ఆయన గుర్తు లేదు. అందుకని మాకు ఒక్కడే మావయ్య అనేది బుర్రలో పడిపోయింది. మావయ్య దగ్గర రోజూ 'లంచం' గుంజుకోవలసిందే! అన్నయ్యలు, మావయ్య ఇచ్చే చిల్లర అప్పట్లో నాకు కోట్లతో సమం. కాని వాటిని దాచుకోవడం తెలీదు. అమ్మ అల్లిచ్చిన అరచేయంత ఆకుపచ్చ, నీలం ఊలు పర్సులో పెట్టి గోడకు తగిలించే దాన్ని. కిషోరన్నయ్య బస్కి, అమ్మ కూరలకి, జగనన్నయ్య అప్లికేషన్లకి అందులో నుంచి 'అప్పు' తీసుకునే వారు. (డబ్బు కంటే విలువైన ప్రేమతో ఇప్పటికీ అప్పు కడుతునే వున్నారనుకోండి) నాకు కోపం వస్తే తప్ప నా అప్పు గుర్తుకొచ్చేది కాదు. నన్నేమన్నా అంటే నా డబ్బులు ఇవ్వు అని దెబ్బలాడేదాన్ని కాని వెంటనే మర్చిపోయేదాన్ని.

నేను, వాణీ 'మాడపాటి'లో చదువుకున్నాం. నాన్న గారు పొద్దున రిక్షా మీద వెళ్ళడానికి రూపాయి ఇచ్చేవారు. ఇంట్లోంచి బయటికి రాగానే చిల్లర మార్చి చెరొక అర్ధరూపాయి ఆస్తి పంపకాలు చేసుకునేవాళ్ళం. వాణీ చిన్నది కదా దానికి మధ్యాహ్నం ఫ్రెండ్స్‌తో కలిసి కొనుక్కోవాలని వుండేది. కొనుక్కొని తినేసేది. నేను మాత్రం దాచుకునే దాన్ని. సాయంత్రం నేను కొనుక్కుంటే మళ్ళీ వాటాకి వచ్చేది దానితో మా ఇద్దరికీ పెద్ద యుద్ధమే. సాయంత్రం కేశవ్ మెమోరియల్ సందులోంచి, పావనక్క (ప్రేం పావని) వాళ్ళ ఇంటికి, అక్కడ కాసేపు కబుర్లు, తర్వాత ఇక మెల్లిగా ఇంటికి. అక్కడికి ఒక అధ్యాయం పూర్తయ్యేది. నేను కొంచెం పెద్దయ్యాక నా అడ్డా సంగం రెస్టారెంట్ పైనున్న ఎస్.ఎఫ్ ఆఫీసుకు మారింది. అందులోనే అరసం లైబ్రరీ కూడా వుండేది. ఎక్కువ అక్కడే గడిపే దాన్ని. నాన్న గారు, అమ్మ ఏమీ అనేవారు కాదు. మా మీద వాళ్ళకున్న నమ్మకం గొప్పది. నాకు చదువుకంటే రాజకీయాలే బాగా నచ్చేవి. అందుకే చదువు మధ్యలోనే బురిడీ

కొట్టింది. వాణీ మాత్రం డాక్టరయ్యింది. వయసులో మా అందరికంటే చిన్నదైనా, ఇప్పుడు ఎంతగొప్ప డాక్టర్ సలహా చెప్పినా, దానికి వాణీ గ్రీన్ సిగ్నల్ వుంటేనే పాటించడం.

అన్నయ్య పెళ్లికి మేము చిన్న పిల్లలం. మా పెద్ద వదిన మమ్మల్ని చూడటానికి ఇస్సామియా బజార్ వచ్చి, ముచ్చటకొద్దీ జడలేస్తే, చెంపపిన్నులు కనిపించకుండా గడపచాటున పెట్టిందని, దొబ్బేసిందని మా అన్నయ్యతో దెబ్బలాడటం తలుచుకోగానే నవ్వొస్తుంది. మా వదినకు వాణికంటే నేనంటే ఎక్కువ ఇష్టం. కాని రూపాయి వున్నా సరే దానికే కొనిపెట్టేది అదే నాకర్థమయ్యేది కాదు. 1981 మే 25న మా జీవితంలో మొదటి దెబ్బ. నాన్న గారు పోయారు. బెంగపడ్డాం. గూడెంలో ఇంటర్ సెకండ్ ఇయర్‌లో చేరాను. హఠాత్తుగా నాకు డీసెంట్రీ పట్టుకుంది. నెల్లాళ్ళయినా తగ్గలేదు. అమ్మ పైకి ధైర్యంగా వున్నా, బాగా భయపడింది. ఒక రోజు నాకల్లోకి నాన్న గారు వచ్చి.. పిచ్చి మొద్దూ దీనికి భయపడతారా.. తగ్గిపోతుందిలే అన్నారు. నిజంగానే మర్నాటికి తగ్గిపోయింది. నాన్నగారి మీద బెంగ వల్ల జబ్బు పడ్డానేమోనని అమ్మ బాధపడింది.

ఈలోపు పెద్ద వదిన పోయింది. అమ్మ ఇక కోలుకోలేదు. ఆర్నెల్లు తిరగకుండానే అమ్మ కూడా పోయింది. ఇన్ని ఆటుపోట్లకు తట్టుకుని మేము నిలబడగలగడానికి కారణం పెద్దన్నయ్యే. అమ్మ లేకపోవడం వల్ల నాకు ఈ లోటు జరిగింది అనుకోడానికి అవకాశం ఇవ్వకుండా పెంచాడు. అందుకే ఇప్పుడు అన్నయ్య లేని లోటు ప్రతిక్షణం కనిపిస్తోంది.

నాకూ, వాణీ అన్నయ్య పిల్లలు నితీష్, సతీష్‌కు వయసులో తేడా తక్కువ, అందుకేనేమో అన్నయ్య మమ్మల్ని చెల్లెళ్ళలా కంటే కూతుళ్ళుగానే చూశాడు. కిషోరన్నయ్య, ధనుంజయ్, వెంకట్రామారావు, వాళ్ళని వెంట బెట్టుకుని రాత్రి ఆలస్యంగా వచ్చి దొడ్డి తలుపు కొట్టేవాడు. అమ్మడూ పాపం వాడు పొద్దుటి నుండీ ఏమీ తినలేదే, అన్నం వండు చాలు. ఉన్నదే తినేస్తాం అనేవాడు. పెద్దన్నయ్యకి కోపం వచ్చేది. ఎవరికైనా సహాయం చేయడానికి అన్నయ్య వ్యతిరేకం కాదు. కానీ ఆలస్యంగా వచ్చి నన్ను ఇబ్బంది పెట్టేవాడని కోపం. అవి అన్నయ్యకీ గడ్డు రోజులే. వాళ్ళు (ఇ.సి.ఐ.ఎల్.) సమ్మెలో వున్నారు. మాకు వేరే ఆదాయం లేదు. పెద్దన్నయ్యకి బాబూరావన్నయ్య రైట్ హ్యాండ్. నిజానికి ఏ విషయంలోనైనా ప్లాన్ బాబురావన్నయ్యది, ఆచరణ పెద్దన్నయ్యది. జగనన్నయ్యా, కిషోరన్నయ్యా నా తరపున, వాణీ తరపున దెబ్బ లాడుకుని పొడి చేస్తా అంటే నరికేస్తా అనేదాకా వెళ్ళేవారు. దీనికి కారణమైన నేను, వాణీ మాత్రం కలిసిపోయి ఆడుకునే వాళ్ళం. అమ్మా, నాన్నగారు, అన్నయ్యలు వీరిలో ఎవరి ప్రభావమో, అందరి ప్రభావమో తెలీదు, వాణీ, నేను బాగా దగ్గరగా వుండేవాళ్ళం. ఎదురుపడితే తగువులాడుకున్నా పరోక్షంలో ప్రతిక్షణం ప్రేమగా తలచుకుంటాం. అందుకేనేమో వాణి ధనుంజయ్‌ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నట్లు అన్నయ్యకి నన్నే చెప్పమంది. ఎందుకో మరి, మాకు ఏది కావాలన్నా అన్నయ్యని అడగడమే అలవాటు. ఇప్పుడు కూడా అవసరం, కష్టం, అనారోగ్యం ఏది వచ్చినా ముందు అన్నయ్యే గుర్తొస్తాడు. చిట్టన్నయ్య నిజంగా చిట్టి పాపే. ప్రేమ, అభిమానం, ఉక్రోషం అన్నీ పిల్లల్లానే. అన్నయ్య చిట్టి అప్పట్లో వనస్థలిపురంలో వుండే వారు. అన్నయ్య కలర్ టి.వి. కొన్నాడు. చిట్టన్నయ్యకి బ్లాక్ అండ్ వైట్ పోర్టబుల్ టి.వి., దానికి స్టాండు వుండేది. అన్నయ్య చెక్క పీట మీద కలర్ టి.వి. పెట్టడం చిట్టన్నయ్యకి నచ్చలేదు. అది తను తీసుకొని, తన స్టాండ్ అన్నయ్యకి ఇచ్చాడు. కొన్ని రోజుల తరువాత సతీష్, తాను దెబ్బలాడుకుని స్టాండ్, పీట మళ్ళీ మార్చేసుకున్నారు. 1984 మే 22న నాకు పెళ్ళయ్యింది. మా బాబీ పుట్టాడు. వాడికి కొద్దిగా నడక వచ్చిన దగ్గర నుండీ నితీష్, సతీష్, చిట్టన్నయ్య క్యారమ్స్ ఆడటానికి బోర్డు పెట్టగానే వెళ్ళి మధ్యలో కూర్చుని ఉచ్చ పోసేవాడు. అక్కడి నుండీ చిట్టన్నయ్య పగలబడి నవ్వితే నితీష్ సతీష్ ఏడ్చేవాళ్ళు. అలాగని నా పిల్లాణ్ణి ఎప్పుడూ దూరంగా వుంచలేదు. ఉంచరు కూడా. ఇంకా చాలా చెప్పాలని వుంది. కానీ అన్నీ కలగాపులగంగా గుర్తొచ్చి, పిచ్చెక్కిస్తున్నాయి. అందుకే సరిగా చెప్పలేకపోతు న్నాను.

చాలా చిన్నప్పుడు – అప్పటికి నా వయస్సు ఎంతో తెలీదు – మా ఇల్లు కడుతున్నారు. నా కాలి మీద ఉలి పడింది. రక్తం కట్టడం లేదు. బాబురావన్నయ్య ఎత్తుకుని తీసికెళ్ళి కాలికి కుట్లు వేయించుకొచ్చాడు. తర్వాత, 1970లో, బాబురావన్నయ్య మాస్కో వెళ్లాడు. మధ్యలో సెలవలకు గూడెం వచ్చాడు. తనకి స్వాగతం చెప్పడానికి శ్రీపతన్నయ్యా, రంకిరెడ్డి సుబ్బారావుగారూ అర్ధరాత్రి నుండే పెద్ద వంతెన దగ్గర కాపలా వున్నారు. పూల దండ పట్టుకుని వాణీ, నేను తెల్లారుగట్లే బయల్దేరాం. తీరా, అన్నయ్య బస్సు దిగేటప్పటికి దండలో పువ్వులు రాలిపోయాయి. అయినా బాబురావన్నయ్య దాన్నే చాలా సంతోషంగా చేతుల్లోకి తీసుకుని మా ఇద్దరినీ తీసుకుని, కబుర్లు చెబుతూ రిక్షాలో ఇంటికి తీసుకొచ్చాడు. నేను సెవెన్త్ రాసినప్పుడు నాన్న గారు రష్యా వెళ్ళారు. కిషోరన్నయ్య, నేను వెళ్ళి స్కూల్లో రిజల్ట్స్ చూసుకొన్నాం. నేను తప్పు నెంబర్ చూసి ఫెయిల్ అయ్యానని ఏడ్చేశాను. నాన్నగారు ప్రసాద్ బావని స్కూల్‌కు వెళ్లి మళ్లీ ఫీజు కట్టమన్నారు. బావ రిజల్ట్స్ చూసి నెత్తి మీద మొట్టికాయ వేసి నువ్వు పాసయ్యావని చెప్పాడు. ఎంత సంతోషపడ్డానో చెప్పలేను. అమ్మ సంతోషానికి ఎల్లలు లేవు. పెద్దన్నయ్య కూడా నవ్వేసి కంగ్రాట్స్ చెప్పాడు.

నేను రోడ్డుమీద సినిమా వాల్‌పోస్టర్లు చూస్తూ నడిచే దాన్ని. అందుకే అన్నయ్యా వాళ్లు, ముఖ్యంగా శ్రీపతన్నయ్య నన్ను వాల్‌పోస్టర్ల ఇంజనీర్ అనేవాడు. చిన్న పిల్లల్లో సహజంగా వుండే

ఒక ఆసక్తి నాకూ ఇప్పటికీ వుంది. అదే కథలంటే పిచ్చి. అమ్మమ్మ మంచి మంచి కథలు, పాటలు వినిపించేది. కిశోరన్నయ్య దెయ్యం కథలు చెప్పి భయపెట్టేవాడు. భయపడినా, మళ్లీ మళ్లీ వినాలనే ఆసక్తే. చిట్టన్నయ్య వల్ల బుక్ హౌస్‌లో చాలా పుస్తకాలు చదివేవాళ్ళం. ఇప్పటికీ నేను మా పిల్లలకి ఆ కథలు చెబుతాను. నా చిన్నకొడుక్కి నాలాగే కథలంటే ప్రాణం. మా మరిది పిల్లలు కూడా నా కథల కోసం పడిచస్తారు. అమ్మమ్మ దగ్గర పాటలు, ముగ్గుల పుస్తకం వుండేది. మా ప్రాణానికి అదే గొప్ప గ్రంథం. ఎన్ని పాటలు వుండేవో, మా ఇంట్లో అందరి పేరు మీద ఒక పాట పాడేది.

సినిమాల గురించి చెప్పాలంటే చిట్టన్నయ్యనే ముందు చెప్పాలి. అన్నయ్య విశాలాంధ్ర బుక్ హౌస్‌లో పనిచేసేవాడు. ప్రతి నెలా జీతం రాగానే ఒక సినిమాకి తీసుకెళ్ళేవాడు. కృష్ణ వదిన అప్పటికి సెట్విన్లో పనిచేసేది. తను ఒక సినిమాకి స్పాన్సర్ చేసేది. డబ్బులుంటే నేను, మంజు (డాక్టర్ రాజ బహదూర్ గౌర్ మనవరాలు, నాకు ఫ్రెండ్) వెళ్ళేవాళ్ళం. అమ్మ కానీ, నాన్న గారు కానీ ఇలా వుండు, ఇలా చెయ్యి, వీళ్ళతోనే స్నేహం అని ఆంక్షలు పెట్టలేదు. మేము స్వేచ్ఛగా పెరగాలని వాళ్ళ ఉద్దేశం. చిన్నప్పుడు కూడా సినిమాలు మాకు గొప్ప మెమరీలు. కిశోరన్నయ్య, ఆజాద్ బావ, అమ్మాజక్క, బేబక్క, నేను, వాణీ తెలుగు సినిమాకి వెళితే, అక్కడి దాకా మాతో కలిసి వచ్చిన జగనన్నయ్య మాత్రం హిందీ సినిమాకి వెళ్ళేవాడు. మా చిన్న తనం నాన్న గారి కంటే అమ్మ దగ్గరే ఎక్కువ కాలక్షేపం. నాన్న గారు ఎప్పుడూ క్యాంప్ (రాజకీయాలు) కెళ్ళిపోయేవారు. కానీ మేము హైదరాబాద్ వచ్చేశాక, మేము పెద్దవుతుంటే మేము ఆయన ఆబ్సెన్స్ ఫీలవుతున్నామని తెలుసుకున్నారో, వయసు పెరుగుతుంటే, మాకూ ఆయనకీ గల వయసు తేడా బాధ పెట్టేదో, ఊరిలో వున్నంత కాలం ఏదో ఒక రకంగా మాతో గడపటానికే చూసేవారు.

ఐదవ క్లాసు వరకూ నేను గూడెంలో ఆదర్శ బాలమందిర్‌లో చదువుకున్నాను. ఆరు నుండి హైదరాబాద్ మాడపాటిలో, గూడెంలో నేను, వాణీ ఎక్కువగా అమ్మమ్మ దగ్గర పడుకునేవాళ్ళం. మామ్మ ఎప్పుడైనా తన దగ్గర పడుకోమంటే నువ్వు ముసలి వాసన వేస్తావనే వాళ్ళం. ఆ మాటంటే మామ్మకి కోపం వచ్చేది. అమ్మమ్మ కానీ, అమ్మ కానీ ఎప్పుడూ ముసలి వాసన వేయలేదు ఎందుకో.. (అమ్మ పూర్తిగా ముసలితనం చూడలేదనుకోండి). హైదరాబాద్లో మమ్మల్ని స్కూల్లో చేర్చి, అప్పటికే అక్కడ వుంటున్న అమ్మమ్మ, మావయ్య, పెద్దన్నయ్య, చిట్టన్నయ్యల దగ్గర వుంచారు. మేము అమ్మకోసం బెంగపెట్టుకోకుండా అన్నయ్యా వాళ్ళు చాలా తెరిచిన పుస్తకం తంటాలు పడ్డారు. మాదంతా రాజభోగం. వాణీ తనకే ముందు స్నానం చేయించాలి, జడ వెయ్యాలి, బట్టలు తొడగాలనేది. చివరికి స్కూల్ టైంకి కడుపులో నొప్పి, కాలు నొప్పి, తల నొప్పి అనేది. బాగా చిన్నప్పుడు శంభుడిని కూడా అలాగే ఏడిపించేది. (శంభుడు మమ్మల్ని స్కూల్‌కు తీసుకెళ్ళే రిక్షా డ్రైవర్). ఇలా బాల్యం చాలా ఆనందంగా గడిచింది. మంచి బట్టలు, నగల గురించి ఎప్పుడూ ఆలోచన వుండేది కాదు. మా అమ్మ, నాన్న గార్ల పెంపకంలో ప్రత్యేకత అదే. మా నాన్న గారికి వాణీకి, నాకూ చెవులు కుట్టించడం కూడా ఇష్టం లేదు. నా పిల్లలు ఎలాంటి అలంకరణ లేకుండానే బాగుంటారు అనేవారు. అమ్మ కి మాత్రం వాణీ గురించి, నా గురించి చిన్న చిన్న సరదాలు వుండేవి. అమ్మ చివరి రోజుల్లో మా గురించి బాధపడలేదు. (మనసులో వుండేదేమో తెలీదు) తన కొడుకుల మీద అమ్మకి అంత నమ్మకం. ఆ నమ్మకాన్ని అన్నయ్యలెప్పుడూ నిలబెట్టుకున్నారు. అందుకే అమ్మ, నాన్న గార్ల ఎడబాటుకంటే శ్రీపతి, చిట్టి అన్నయ్యల మరణం ముఖ్యంగా పెద్దన్నయ్య లేక పోవడం తట్టుకోలేకుండా వున్నాం. అమ్మకి బొంత అరటిపండు చాలా ఇష్టమట! వాళ్ళ చిన్నన్నయ్య – మా రాముడు మావయ్య అవి ఎక్కడ కనిపించినా తన కోసం తెచ్చే వాడని అమ్మ చెప్పేది. మా అమ్మకు ఇద్దరు అన్నయ్యలు. వాళ్ళ పెదనాన్న గారి పిల్లలు. కానీ ఎప్పుడూ అలా చెప్పేది కాదు. చంద్ర రాజేశ్వరరావు గారు హైదరాబాదులో వుంటే ఉదయం మా ఇంటి వైపు వాకింగ్‌కు వచ్చి, ఇంట్లోకి వచ్చేవారు. మా అమ్మ అంటే ఆయనకి చాలా అభిమానం, గౌరవం. నాన్నగారిని కపర్దీ ఈ రోజు నువ్వు ఇంత నాయకుడివి అయ్యావంటే శేషమ్మ గారి వల్లే. కుటుంబ బరువు బాధ్యతలు నీ మీద వెయ్యకుండా తనే మోసింది. అందుకే ఇలా తిరగగలుగుతున్నావు. నేనెప్పుడూ శేషమ్మగారి పక్షమే అనేవారు. బహుశా అమ్మ చనిపోయినప్పుడు మా కుటుంబానికి ప్రత్యక్షంగానే కాదు, పత్రికా ముఖంగా సంతాపం, సానుభూతి తెలిపినది ఆయనొక్కరే అనుకుంటా. అమ్మ పెద్దగా చదువుకోలేదు. అలాని నిరక్షర కుక్షి కాదు. ఇంగ్లీషు నేర్చుకోలేదు. వాణీ అమాయకపు ప్రశ్న అమ్మ ఇంగ్లీషు నేర్చుకునేలా చేసింది. ఒకసారి వాణీ, “నాన్న గారూ, మీరు, నేను, అన్నయ్యలు, అక్క చదువుకున్నాం కదా! మనం ఇంగ్లీషులో మాట్లాడుకుంటే అమ్మ ఏం చేస్తుందీ!” అని అడిగింది. దానికి నాన్న గారు నవ్వి వేళాకోళంగా మీ అమ్మ తెల్లమొహం వేసుకుని చూస్తుంది అని సమాధానం చెప్పారు. అమ్మ కి పౌరుషం వచ్చి, నా దగ్గరా, వాణీ దగ్గరా ఎ, బి, సి, డి లు నేర్చుకుంది. ఇంగ్లీషు పేపర్ హెడ్‌లైన్స్ మెల్లగా చదివేది. ఇది అమ్మకి ప్రేమించడమే కాదు, పట్టుదలగా అనుకున్నది సాధిం చగలిగే దృఢచిత్తం వుందనడానికి నిదర్శనం. అమ్మమ్మ కూడా చిన్న చిన్న ఇంగ్లీషు మాటలు ప్రయోగించేది. అది చూసి మేము నవ్వితే తనూ నవ్వేసేది. ఒకసారి పక్కింటి వాళ్ళతో మాట్లాడు తూ, ఆర్థిక పరిస్థితి గురించి ప్రస్తావన రాగానే ఏదో ఇలా 'గెటాన్' అవుతున్నాం అంది. ఇంకోసారి మావయ్య కోసం

వెళ్లి ఏడీ అని అడిగితే 'జస్ట్' ఇక్కడికే అని వెళ్ళాడు అని చెప్పిం ది. అమ్మమ్మని వేళా కోళం చేస్తే అమ్మకి కోపం వచ్చేది. ముద్దు గానే కోప్పడేది. ఒకసారి నేను 10వ తరగతిలో వుండగా, ధర్మ భిక్షం గారివో, రాజబహదూర్ గారివో ఎన్నికలు. నేను చీర కట్టు కుని ఓటు వేస్తానని మఖ్దూం భవన్ వెళ్ళాను. నాన్న గారు నాతో మాట్లాడుతుంటే నీలం రాజశేఖరరెడ్డి గారు చూసి ఎవరీ అమ్మా యి? అని అడిగారు. మా అమ్మాయి అని నాన్నగారంటే నీకు ఇంత పెద్ద కూతురుందా? అని ఆశ్చర్యంగా అడిగారు. నాన్న గారు నవ్వి, మీరు రోజూ చూసే ప్యాంటూ, చొక్కాల అమ్మాయే. ఈ రోజు ఓటు వేస్తానని చీర కట్టుకుంది అని చెప్పారు. రాజ శేఖరరెడ్డి గారు నా నెత్తిన ఒక మొట్టికాయ వేశారు. అమ్మ, నాన్నగారు, అమ్మమ్మ, అన్నయ్యలు, మావయ్య వీళ్ళతో అను బంధం, అనుభవాలు అపారం, అనంతం. ఎంత చెప్పినా తరగడం లేదు. అందుకే ఇప్పటికి ఇక ముగిస్తున్నాను. ❑

# అనురాగమే భూషణం..



- వై.బాబూరావు

కపర్ది గారు కార్మిక నాయకుడిగానే తెలుసు తప్ప ప్రత్యక్ష పరిచయం లేదు. అమ్మాజీని వివాహం చేసుకుని వాళ్ళ కుటుంబంలో సభ్యుడినయ్యాకే ఆయన గొప్పతనం తెలిసింది. శేషమ్మ గారిని ఒకటి, రెండుసార్లు చూడటమే. సమష్టితనం అనేది వాళ్ళింట్లోకి వచ్చాకనే నాకు బాగా తెలిసింది. వాళ్ళ కుటుంబంలో నాకు నచ్చిన స్వభావం అదే. కష్టమైనా, సుఖ మైనా అందరూ కలిసి పంచుకుంటారు. ఒకరి కష్టం అందరి దీను! విద్యార్థి ఉద్యమంలో వుండగా, నేను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తూ, మఖ్దూం భవన్‌లో వుండేవాడిని. శ్రీపతి గారు అమ్మాజీని చేసుకోమని ప్రపోజ్ చేస్తే, నా గురించి తెలుసో లేదో అర్థం కాలేదు. అప్పటికి మఖ్దూం భవన్‌లోనే ఉంటున్న గాంధీ గారితో "నా కులం తెలిసే పెళ్లి గురించి ప్రపోజ్ చేశా రా?" అని సందేహంగా అడిగాను. అయితే కపర్ది గారి ఇంట్లో అలాంటి పట్టింపులు లేవని తర్వాత తెలిసింది. అప్పుడే కాదు, ఇప్పటికీ నేను వాళ్ల నుంచి ఎలాంటి ఇబ్బంది ఎదుర్కోలేదు. నిజానికి నాకు ఎంతో ప్రాధాన్యమిస్తారు. నేను ఈ ఇంటికి వచ్చాక వాణి పెళ్లి దగ్గర నుండి స్మిత పెళ్ళి దాకా చూశాను. ప్రతి సందర్భంలోనూ అందరూ నిస్సంకోచంగా వారి అభిప్రాయాలను వ్యక్తం చేసి చర్చిస్తారు. ఒకరి అభిప్రాయం ఒకరికి నచ్చకపోయినా, అందులో తప్పొప్పులు చర్చించి, తప్పుంటే మార్చుకోవడానికి వెనుకాడరు. అదే సమయంలో ఇంటికి పెద్దగా రామచంద్రరావు గారి పట్ల చాలా మర్యాద. సాధారణంగా ఈ చర్చల్లో రామచంద్రరావు గారు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించడం నాకు చాలా నచ్చే విషయం. ఉద్యోగరీత్యా రామచంద్రరావు గారింట్లో ఒక ఏడాది వున్నాను. వాళ్ళంతా చాలా ప్రేమగా, ఆప్యాయంగా వుంటారు. నన్ను వారి లో ఒకడిగానే తప్ప ఎన్నడూ ఇబ్బంది పడేలా చూడలేదు. ఇదంతా వారి కుటుంబానికి అతి సహజమైన లక్షణం. అన్న దమ్ముల మధ్య సంబంధాలే అంతంతమాత్రంగా వుంటున్న ఈ రోజుల్లో ఇలాంటి కుటుంబాన్ని చూడటం చాలా అపురూపం. ఆ ఇంట్లో ఇప్పటి కొత్తతరం, మా మేనల్లుళ్లు, మేనకోడళ్లు, మా పిల్లల మధ్య అదేరకమైన సంబంధాలు కొనసాగుతున్నాయి. తరతరాలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ.. ❑

# అంగార గంగ

బంగారు భూమి సూక్తమలాపించుతూ పద
అంగార గంగలా తరంగించుతూ పద
అందాలచేలవాలె పతంగాల మూకలు
చండాగ్ని కీలలా ప్రదాహించుతూ పద
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
నేరాల కుమ్మరించె దురంతాల మబ్బులు
సంవర్త ఝంఝులాగ ప్రభంజించుతూ పద
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
చింతేల నిగ్రహించు బలం లేకపోయినా



గొంతెత్తి మానిషాదమలాపించుతూ పద
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
శాపాలతోటి కాళతమోరాసి తూలదు
ఏపాటిదైన వెల్గు ప్రసారించుతూ పద
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
కొవ్వొత్తిలా కాలి ప్రదీపించువారికి
చెయ్యెత్తి లాల్ సలాము సమర్పించుతూ పద!
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
అంగారగంగలా తరంగించుతూ పద

– రాంభట్ల

# నాన్నే నా బెస్ట్ ఫ్రెండ్

**కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు**



-వాణి(డాక్టర్ ఎం.విమలాదేవి)

నా అసలు పేరు విమలాదేవి (వాణి). కపర్దీ-శేషమ్మగార్ల ఆఖరి సంతానాన్ని నేను. అమ్మా నాన్నగార్లతో మా అన్నయ్యలూ - అక్కా, నాకన్నా ఎక్కువ సంవత్సరాలు కలిసి ఉన్నారు. నాకు పదహారేళ్ల వయసులో నాన్న గారూ, ఆ తర్వాత ఏడాదిన్నరకే అమ్మా చనిపోవడంతో నేను చాలానే మిస్సయ్యాను. అయితే, వాళ్లతో కలిసి ఉన్న కొద్ది కాలంలోనే నాకు బోలెడన్ని అనుభవాలూ, ఎన్నెన్నో జ్ఞాపకాలూ మిగిల్చివెళ్లారు. నేను ఇప్పుడు రాయబోయే సంగతులన్నీ మా కుటుంబం అంతా కలిసినప్పుడు నిత్యం మాట్లాడుకునేవే. మేము అతి తరచుగా కలుస్తూనే ఉంటాం కూడా.. అయితే, ఈ సారి నేను ఈ విషయాలన్నీ నా 'పాయింటాఫ్ వ్యూ'లో రాస్తున్నాను.

చిన్నప్పుడు నాకు వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో చాలా బహుమతులు వచ్చాయి. కానీ, ఆ అనుభవం ఇప్పుడేమీ పనికి రావడం లేదు. అమ్మా, నాన్న గార్ల గురించి రాయాలని ఎంత ఉత్సాహంగా వుందో, అంతకు మించినంత భారంగా కూడా అనిపిస్తోంది. అందరి ఇళ్లల్లోని ఆఖరి సంతానం మాదిరే, మా ఇంట్లో కూడా నన్ను బాగా పేంపర్ చేసేవారు. ముఖ్యంగా మా నాన్న గారు. ఆ గారాబం ఆధారంగానే నేను ఆయన దగ్గర కొంచెం అతి చనువు తీసుకునే దాన్ని కూడా. అలాంటి వాటిలో కొన్ని ఇక్కడ ఇస్తున్నాను.

నిడదవోలులోని "లింగమూర్తి హాస్పిటల్"లో నేను పుట్టగానే, డాక్టర్ బి.వి.ఎల్.ఎన్. రాజు గారు నాకు వలెంతినా తెరిష్కోవా (అంతరిక్షంలోకి వెళ్లిన మొట్ట మొదటి మహిళ, రష్యన్ కాస్మోనాట్) పేరు పెట్టమని మా అమ్మకు సలహా ఇచ్చారట. అయితే ఆ పేరు వింతగా వుందనుకుని, మా అమ్మ నాకు వాణి అని పేరు పెట్టింది. నన్ను ఇంట్లోనూ, బయటా కూడా ఎక్కువ మంది ఇప్పటికీ ఆ పేరుతోనే పిలుస్తారు. అయితే మా కుటుంబానికి ఎంతో సన్నిహితంగా వుండే వీరమాచనేని విమలాదేవి గారు (1962 జనరల్ ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గం నుంచి సీపీఐ తరపున లోక్‌సభకు పోటీ చేసి గెలిచినావిడ) 1967లో చనిపోయారు. ఆవిడని మేము 'విమలక్క' అని పిలిచేవాళ్లం. తను మా అమ్మని 'అమ్మా' అని అనేదట. ఆవిడ గురించి నిజానికి నాకు పెద్దగా తెలీదు. ఆవిడ పోయిన కొత్తల్లో, ఒకసారి నేను మా నాన్నగారిని 'విమలక్క ఏది?' అని అడిగాను. తను ఇక రాదని నాన్నగారు చెప్పారు. వెంటనే నేను తన పేరు పెట్టుకుంటానని అడిగితే, సరేనని పర్మిషన్ ఇచ్చారు. అంతే - నేను తిన్నగా స్కూలుకు వెళ్లి మా హెడ్మాస్ట్రెస్ జి.మేరీ నీలవేణి మేడమ్‌ను నా పేరు విమలా దేవిగా మార్చేయమని అడిగాను. ఇంటి దగ్గర నుంచి లెటర్ తీసుకువస్తే తప్ప పేరు మార్చనని మా మేడమ్ అన్నారు. మా నాన్నగారు లెటర్ ఇవ్వనున్నారని, పేరు మార్చమని ఆయనే చెప్పారని గట్టిగా చెప్పేశాను. నాన్న గారి మీద గౌరవంతో నీలవేణి మేడమ్ నాపేరు మార్చేశారు. అలా నా పేరు నేనే పెట్టేసుకున్నాను.

మా అక్క అయిదో తరగతి పూర్తి చేసిన తర్వాత తనను హైదరాబాద్ పంపించి చదివించాలని నాన్న గారు అనుకున్నారు. ఆ మేరకు అక్క టీసీ కోసం నాన్నగారు ఉత్తరం రాసిచ్చారు కూడా. అక్కతోపాటు నా టీసీ కూడా ఇచ్చేయమని మేడమ్‌ను అడిగాను. ఆవిడ "మీ నాన్నగారు ఉత్తరంలో మీ అక్క టీసీ మాత్రమే ఇవ్వమని రాశారు. నీ టీసీ కోసం ఇంకో ఉత్తరం రాయించి తెచ్చుకో"మన్నారు. నేను మళ్లీ పాతపాటే పాడి, మా నాన్నగారు నోటిమాటగా చెప్పమన్నారంటూ దబాయించి, నా టీసీ కూడా తీసేసుకున్నాను. ఇంటికొచ్చి రిక్షా కూడా దిగకుండా నాన్న గారికి నా టీసీ చూపించాను. ఆయన కొద్దిగా ఆశ్చర్యపోయినా నన్నేమీ అనలేదు.

అప్పట్లో మా అంజి మామయ్య, పెద్ద అన్నయ్య, చిట్టి అన్నయ్య, అమ్మమ్మను తోడు పెట్టుకుని హైదరాబాద్‌లోని ఇసామియా బజారులో ఉండేవారు. అక్కను అక్కడే పెట్టి చదివిద్దామనుకున్నారు నాన్న గారు. అయితే నా అఘాయిత్యం పుణ్యమా అని, మొత్తం కుటుంబం అంతా తొందర్లోనే హైదరాబాద్‌కు తరలి వచ్చేశాం. ఇలాంటి తొందరపాటు పనులు చేసినందుకు అమ్మ గానీ, నాన్న గారు కానీ నన్నెప్పుడూ కోప్పడలేదు. వాళ్లు మా అందరితోను ఎప్పుడు ఇలాగే, లిబరల్‌గా వుండేవారు.

నాకు ఊహ తెలిసే నాటికి మా అమ్మా, నాన్నగార్లకి బీపీ, గుండె జబ్బు ఉండేది. అమ్మకి వీటికి తోడు షుగర్ కూడా వుండేది. కానీ వాళ్లు ఎప్పుడూ ఆ కారణంగా మా ఆనందాలకు అడ్డు చెప్పేవారు కాదు. మా కుటుంబం మొత్తం సినిమాకి

వెళ్లాలంటే కనీసం డజన్ టిక్కెట్లు కొనాలి. అయినా సరే, మా నాన్న గారు అప్పుడప్పుడూ అలాంటి ఫ్యామిలీ ఔటింగ్ సెషన్స్ ఏర్పాటు చేసేవారు. నాకు బాగా గుర్తున్నవి రెండే సినిమాలు. ఒకటి మేరానామ్ జోకర్, మరొకటి ప్రేమనగర్. ఈ రెండు సినిమాల్లో కూడా నేను క్లైమాక్స్ దాకా మెలకువగా లేను. మా నాన్న గారు నన్ను ఎత్తుకుని ఇంటికి తీసుకువచ్చారు! నాకు మా నాన్న గారి దగ్గర, మిగతా వాళ్లకన్నా, చేరిక ఎక్కువ. మా నాన్న గారికి నా మీద ప్రేమ ఎక్కువని కూడా నేననుకుంటాను. అమ్మ నన్ను ఎంత గారం చేసినా మా నాన్న గారే నాకు బెస్ట్ ఫ్రెండ్. మా నాన్నగారు క్యాంపునకు వెళ్లినప్పుడు గుర్తు లేదు కానీ, ఆయన ఊళ్లో వున్నప్పుడు మాత్రం నేను ఆయన ఒళ్లోనే నిద్రపోయేదాన్ని – ఆయన మీటింగ్‌లో వున్నా సరే!

మేం గూడెంలో వుండగా నాన్న గారు ఎండా కాలం ఇంట్లో వుంటే మధ్యాహ్నం పూట కొంచెం సేపు నిద్రపోయేవారు. ఆ టైంలో ఏమైనా అమ్మకానికి వస్తే నేను వాళ్లను పిలిచి, నాన్న గార్ని నిద్రలేపే దాన్ని. "ఎవరో వచ్చి మీ కేమైనా కావాలా అని అడుగుతున్నారండీ!" అని చెప్పేదాన్ని. నాన్న గారు ఏ మాత్రం విసుక్కోకుండా బేరం చేసి కొనిపెట్టేవారు. అమ్మ మాత్రం "ఆయన్ని కాసేపు కూడా ప్రశాంతంగా నిద్రపోనియ్యవు!' అని విసుక్కునేది. నేను ఇంకా ఆదర్శ బాల మందిర్లో చదువుకునే రోజుల్లో ఓ రోజు జ్వరం వచ్చింది. స్కూల్లో ఆ రోజు "అవర్ ఎర్త్" అనే పాఠం జరిగింది. మా నాన్న గారు ఆ పాఠాన్ని, ఒక బత్తాయి పండు చూపిస్తూ, ఎక్స్‌ప్లైన్ చేశారు. ఆ తర్వాత పండు వలిచి నాకు పెట్టేశారు. అప్పటి నుంచి ఎర్త్ గురించి ఏమైనా అడిగితే "బత్తాయి పండు ఊరికే కూడా తినచ్చమ్మా, పనిగట్టు కుని పాఠం నేర్చుకోనక్కరలేదు" అని నవ్వుతూ అనేవారు. మా ఆఖరి అన్నయ్యలు ఇద్దరూ, అక్కా, నేనూ కలిసి సినిమాలకు వెళ్లే వాళ్లం. తీరా పర్మిషనూ డబ్బులూ తీసుకోవలసి వచ్చేసరికి అందరూ నన్నే ముందుకు తోసేవాళ్లు. మా నాన్న గారు సాధారణంగా నేను అడిగిన దాన్ని కాదనే వారు కాదు. మా నాన్న గారి గురించిన ఇంకో జ్ఞాపకం "జాయ్ బేకరీ"తో ముడిపడివుంది. అది హిమాయత్ నగర్‌లో మా ఇంటికి (సత్యనారాయణరెడ్డి భవన్‌కి ఎదురుగా వుండేది – రోడ్డుకి అవతల. అందులో మా నాన్న గారు నాకు, నా తర్వాత మా పెద్దన్నయ్య కొడుకులు నితీష్, సతీష్‌కి కూడా చిరుతిళ్లు కొనిపెట్టేవారు. "నీకేం కావాలో చెప్పు, నేనే కొనితెస్తా"నని నాన్న గారు అనేవారు. ఎందుకంటే బేకరీలోకి వెళితే, ఇక నా ఇండెంట్‌కు అంతుండేది కాదు! అందుకే నేను పట్టుపట్టి ఆయన వెంటవెళ్లి నాకు నచ్చినవన్నీ చూపించే దాన్ని. "ఇవన్నీ చాలా బాగుంటాయి – తర్వాత మీ ఇష్టం" అనే దాన్ని. మా నాన్నగారు పిల్లల్ని ఎప్పుడూ నిరాశ పర్చేవారు కాదు! మేం బయటికి ప్రయాణమైనా, సినిమాకి వెళ్లినా "దాహం వేస్తోంది, కూల్ డ్రింక్ కావా"లని పేచీ పెట్టేదాన్ని. మా నాన్న గారు దానికి "కూల్ డ్రింక్ దాహం" అని పేరు పెట్టారు. ఇప్పటికీ మా అన్నయ్యలు ఆ మాటను తలుస్తూనే వుంటారు.

నేను సెవెంత్ పాసయిన సంవత్సరమే, మా జగన్ అన్నయ్య బి.ఎ. పాసయ్యాడు. నాన్నగారు ఇంట్లోనే ఏదో మీటింగ్‌లో ఉండగా ఆ రిజల్ట్స్ వచ్చాయి. అన్నయ్య చేత నాన్న గారు స్వీట్స్ పంచి పెట్టించారు. నేను పాసయినందుకు పార్టీ ఇవ్వలేదని గుర్తు చేస్తే వెంటనే మళ్లీ స్వీట్స్ తెప్పించారు. మా నాన్నగారు బి.ఎ. ఎక్కువ, సెవెంత్ తక్కువ వంటి మాటలు ఎప్పుడూ అనే వారు కాదు. ఇది చాలా చిన్న విషయమే అయినా నాకు ఎంతో ఇష్టమైన విషయం. మా నాన్న గారు స్వయంగా నాతో రిక్షాలో వచ్చి, నన్ను రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో, ఇంటర్‌లో చేర్పించారు. అమ్మ మాటలను బట్టి, ఆయన అలా ఎవరిని వెంట పెట్టుకుని వెళ్లింది లేదట. ఇది నాకు ఒక ప్రివిలేజ్ మాత్రమే కాక స్పెషల్ మెమరీ కూడా. కాలేజీలో నేను చాలా అల్లరి చేసేదాన్ని. ఒకసారి మా చిట్టన్నయ్యకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడ్డాను కూడా. అమ్మ చేత చివాట్లు కూడా తిన్నాను. అయితే నాన్న గారు మాత్రం చాలా సపోర్టివ్ మాట్లాడారు. "ఇప్పుడు కాకపోతే, ఎప్పుడు చేస్తుంది అల్లరి?" అంటూ తేలిగ్గా కొట్టిపారేశారు.

మా నాన్న గారు పోయిన 20 ఏళ్ల తర్వాత నేను తాడేపల్లిగూడెంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో డాక్టర్‌గా ఆరు నెలలు పనిచేశాను. ఆ రోజుల్లో పేషెంట్లు వచ్చి "మా కపర్దీ గారి పాప గారు ఏరండీ? ఆరికే సూపించుకోవాలి" అనేవారు. మా కొలీగ్స్ అంతా నన్ను ఆటపట్టించేవారు. "ఓ కపర్దీ గారి పాపా, మెడలో బోర్డు కట్టుకో, జనాలకు తొందరగా కనబడతావు!" అనేవారు. మా ఊళ్లో ప్రజలకి నాన్నగారి మీద ప్రేమాభిమానాలు ఇప్పటికీ అలాగే వున్నాయి. వాళ్లు అదే అభిమానాన్ని నాన్నగారి పిల్లలమైన మా మీద కూడా చూపిస్తున్నారు.

నేను జాబ్ రిపోర్టింగ్‌కి మా శ్రీపతి అన్నయ్యతో కలిసి ఏలూరు వెళ్లాను. అప్పుడు నన్ను చూసిన ఓ సీనియర్ డాక్టర్ గారు మర్నాడు నన్ను పలకరించారు. "అలాంటి మహానుభావుడికి మనవరాలిగా పుట్టావు ఎంత అదృష్టమమ్మా !" అన్న ఆయన మాటలు విని నేను ఆశ్చర్యపోయాను. మీరు ఏమంటున్నారో అర్థం కాలే"దన్నాను. "నువ్వు కపర్దీ గారి మనవరాలివి కావా?" అని ఆ డాక్టర్ గారు అడిగారు. "అయ్యా నేను కపర్దీ గారి మనవరాలిని కాదు, ఆఖరి సంతానాన్ని" అని వివరించాను. ఆ మాటలు విని ఆయన కొద్దిగా ఆశ్చర్యపోయినా, మా నాన్న గారి ని దేవుడనీ, మహాజ్ఞాని అనీ మరీ మరీ మెచ్చుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఎంతో గర్వంగా అనిపిస్తాయి. అదే సమయంలో మా భుజాల మీద ఎంత పెద్ద బాధ్యత ఉందో కూడా గుర్తుచేస్తాయి. నేను గూడెంలో పనిచేసే రోజుల్లో

పేషెంట్ల మీద కాస్త కోప్పడాలన్నా జంకేదాన్ని. వాళ్లు నన్ను, 'నన్ను'గా కాక, కపర్ది గారి అమ్మాయిగా గౌరవిస్తున్నప్పుడు, నేను ఆయన పేరుకి మచ్చతేకుండా పనిచేయాలని ప్రతిక్షణం అనిపించేది.

నాకు ఊహ వచ్చిన తర్వాత మేము గూడెంలో చాలా తక్కువ కాలం వున్నాము. అందుకే మా కజిన్స్ వేసవి సెలవుల్లో మా ఇంట్లో గడపడం లాంటి విషయాలు పెద్దగా జ్ఞాపకం లేదు. అయితే మా ఫ్యామిలీ మీట్ – అంటే మా తాతగారు మందలపర్తి రామచంద్రరావు గారి పిల్లలు, మనవలు అంతా కలిసే సందర్భంలో మా కజిన్స్ అమ్మనే ముందుగా తలిచేవారు. నాన్న గారి ప్రస్తావన కూడా ఆ తర్వాతే. ప్రేమించడం అమ్మకు వ్యాపకమో, స్వభావమో, అలవాటో కాదు. అది ఆమె శరీరంలోని రక్తమాంసాలంత సహజమైన భాగం. అమ్మ మనుషులను ఎంచుకుని ప్రేమించేది కాదు. అందర్నీ సహజంగా, సమానంగా ప్రేమించేది. ఇంట్లో వుండే పిల్లలందర్నీ స్వంత పిల్లలలాగే చూసేది. మా వదినలైతే "మీ అమ్మ మీ భాగం ప్రేమ కూడా మాకే పంచి ఇచ్చింది" అంటారు ఇప్పటికీ.

తాడేపల్లిగూడెంలో వుండగా మాకు సొంత పాడి వుండేది. ఇంట్లో ఆవు కానీ, గేదె కానీ ఈనిందంటే మా పిల్లల పని అయినట్లే! మా అమ్మ పెద్ద నీళ్ల కాగులో జున్ను వండి, చిన్న క్యాన్లలో పెట్టి, చుట్టుపక్కల అందరిళ్లకీ ఇచ్చి రమ్మనేది. అలా ఇళ్లన్నీ తిరిగి ఇచ్చి వచ్చాకే మాకు పెట్టేవాళ్లు. ఈ అలవాటు అమ్మకు హైదరాబాద్‌లో కొనసాగింది. మాకు అప్పుడప్పుడూ గూడెం నుంచి కూరగాయలు, పళ్లు వచ్చేవి. వెంటనే అమ్మ పంపకాలు మొదలుపెట్టేది. ఇది మా అమ్మ జీవిత కాలమంతా పాటించిన ఓ పద్ధతి.

మా అమ్మకి ప్రేమ ఎంత సాధారణ ప్రకృతో స్నేహం కూడా అంతే. నా ఫ్రెండ్స్ అంతా మా అమ్మకి కూడా స్నేహితులే. మా అన్నయ్యల ఫ్రెండ్స్‌ను కూడా మా అమ్మ అంతే స్నేహంగా చూసేది. ఒకసారి నేను పదో తరగతిలో ఉన్నప్పుడు యాన్యువల్ డే పోటీల్లో నాకు బహుమతులు వచ్చాయి. బహుమతులు ఇచ్చే రోజు అమ్మను బలవంతంగా స్కూల్‌కు తీసుకువెళ్లాను. అమ్మ మా స్కూల్‌కు రావడం అదే మొదటిసారి. నేను మా క్లాస్ అమ్మాయిలందరినీ అమ్మకి పరిచయం చేశాను. నా ఫ్రెండ్ ఒక అమ్మాయి "ఈ అమ్మాయి పేరు విమల" అంటూ నన్ను మా అమ్మకే పరిచయం చేసింది! "అలాగా?! ఆ పేరుతో మాకు తెలీదులే! థ్యాంక్స్" అనేసింది. మా ఫ్రెండ్స్ అంతా అమ్మ స్పాంటేనిటీకి ఆశ్చర్యపోయారు. అదే సమయంలో వాళ్లు "ఈవిడ మీ అమ్మా? అమ్మమ్మా?" అని కూడా అడిగారు. మా అమ్మ జుట్టు అప్పటికే నెరిసిపోయింది. అయినా నా కళ్లకు మా అమ్మ అలాగే బాగుండేది. అందుకే "మా అమ్మ చాలా తెలివైంది. అందుకే జుట్టు తొందరగా నెరిసిపోయింది" అని ఫ్రెండ్స్‌తో అన్నాను. అమ్మ బతికున్నంత కాలం తనే నాకు అన్నం తినిపించేది. టెంత్‌లోకి వచ్చిన తర్వాత నాన్న గారు అమ్మని వారించేవారు. సొంతంగా నేర్చుకోమనేవారు. కానీ నేను సరిగా తింటానో లేదోనని అమ్మకు భయం. అందుకే మా వదిన నాకు జడలు వేస్తుంటే అమ్మ అన్నం తినిపించేది – వంటింటి పక్క రూమ్. నేను స్కూల్‌లో నేర్చుకున్న పాఠాలన్ని అమ్మకి నేర్పించేసేదాన్ని. ఇంటర్‌లోకి వచ్చాక డిసెక్షన్ ఎలా చేశామో కూడా అమ్మకు చెప్పేదాన్ని. "ఈ ఒక్క పాఠం నాకు నేర్పద్దులే అమ్మా" అనేది అమ్మ. నేను తన మాట విన్నది తక్కువే లేండి! ఎందుకంటే అమ్మకి పాఠం చెపుతుంటే నాకు రివిజన్ అయిపోయేది.

మా కిషోర్ అన్నయ్య మా ఇంట్లో పెరిగిన మా మామయ్యలూ, పిన్ని గురించి వివరంగా రాశాడు. అయితే అదే రోజుల్లో మా ఇంట్లో వున్న మా దత్తు బాబయ్య గురించి, పరబ్రహ్మం బాబయ్య గురించి తను రాయలేదు. వాళ్లు మా నాన్న గారి గురించికంటే వాళ్ల "బుల్లి వదిన" (అంటే మా అమ్మ) గురించే ఎక్కువ మాట్లాడే వారు. అయితే వాళ్ల మీద మా నాన్నగారి ఆలోచనల ప్రభావం బాగానే వుండేది. ఎప్పుడైనా మతాచారాల ప్రస్తావన వస్తే "నేనూ మీ నాన్న దగ్గరే పెరిగాన్రా! అంచేత, మరోలా ఆలోచించను" అనేవాడు మా పరబ్రహ్మం బాబయ్య.

అమ్మా, నాన్న గార్లతో నేను కలిసి వున్నది 16,17 ఏళ్లే అయినా వాళ్ల గురించిన ఒక ముఖ్యమైన విషయం గమనించాను. వాళ్లెప్పుడూ మా ముందు ఆవేశంగా మాట్లాడుకోవడం గానీ, దెబ్బలాడుకోవడం గానీ చేయలేదు. వాళ్ల మధ్య ఏదో స్పెషల్ బాండింగ్, ఒక చిత్రమైన కెమిస్ట్రీ వుండేది. నేను పుట్టే నాటికి మా అమ్మా, నాన్న గార్లు 40 ఏళ్లకు దగ్గరగా వున్నారు. బహుశా ఆ కారణం చేతనే కావచ్చు, వాళ్ల మధ్య ఆలోచన వున్నంత ఎక్కువగా ఆవేశం వుండేది కాదు. మా అమ్మా, నాన్న గార్లతో దాదాపు సమానంగా మమ్మల్ని ప్రభావితం చేసిన మనిషి మా అమ్మమ్మ. ఆవిడలో ఒకటి కాదు – ఆవిడలో ఒకటి కాదు – ఎన్నో టాలెంట్స్ వున్నాయి. అమ్మమ్మ మహా రుచికరంగా వండేది. వందల కొద్దీ (బహుశ వేలు కూడా) పాటలూ పద్యాలూ పాడేది. నన్ను అంతా ఏ పేరుతో పిలిచినా అమ్మమ్మ మాత్రం ఎప్పుడూ 'వరవీణా' అనే పిలిచేది. మా అమ్మమ్మ దగ్గర మా ఇంట్లో అందరి పేర్ల మీద ఒకో పాట వుండేది. "వర వీణా మృదుపాణీ వరరుహలోచను రాణీ సురుచిర బంభర వేణీ సకలకళా కళ్యాణీ" అంటూ కళ్యాణి రాగంలో అమ్మమ్మ నా మీద ఓ పాట పాడేది. అమ్మమ్మ మరో విషయంలో కూడా దిట్ట. అదే ముగ్గులు! ఆవిడ దగ్గర ఓ లావుపాటి నోట్ బుక్ వుండేది. దాన్నిండా ముగ్గులు వుండేవి. అమ్మమ్మ కావడానికి పాత కాలం మనిషే అయినా, బొత్తిగా చాదస్తం వుండేది కాదు. పైగా కరెంట్ ఎఫైర్స్‌లో ఎప్పుడూ

ప్రాంప్ట్ వుండేది. వినికిడి మీద చిన్న చిన్న ఇంగ్లీషు ప్రయోగాలు నేర్చుకుని నిర్భయంగా, దాదాపు కరెక్ట్‌గా వాడేది. మేము ముందు ఆశ్చర్యపోయి, తర్వాత నవ్వేవాళ్లం.

అమ్మమ్మ మా కోసం ప్రతిరోజూ పాట కచేరి కానీ, మాట కచేరీ కానీ, కథా కాలక్షేపం కానీ చేసేది. అందుకే మేము ఎప్పుడూ అమ్మమ్మ దగ్గరే పడుకునే వాళ్లం. మామ్మ రమ్మని పిలిచినా వెళ్లే వాళ్లం కాదు. అమ్మమ్మ మాకు భారతం, రామాయణంలోని కథలు మాత్రమే కాదు - థ్రిల్లర్, హారర్ కథలు చెప్పేది! మాకు చాలా ఇష్టమైన కథ 'పింగళారి పీకి'. ఇది ఓ దయ్యం కథ. ఇప్పటికీ మేం మా పిల్లలకు చెపుతుంటాం.

అమ్మమ్మ దాదాపు 70, 75 ఏళ్లు బతికింది. చివరి దాకా తన పని తనే చేసుకుంది. మా అందరికీ సేవలు చేసింది. ఇంటికి వచ్చిన అతిథి అభ్యాగతులకు మర్యాద చేసింది. ఎప్పుడూ ఫిల్టర్ గిన్నెలో కాఫీ తాగి, తనే తొలిచేసేది. తన రవికెలు తానే చేత్తో కుట్టుకునేది. అమ్మమ్మ ఇన్‌స్పిరేషన్‌తో నేను రష్యాలో నా బట్టలు చేత్తో కుట్టుకుని వేసుకునే దాన్ని. ఆవిడ చూపు దెబ్బ తిందో లేదో తెలీదు. అయితే చివరి వరకు సూదిలో దారం తానే ఎక్కించుకునేది. నాకు తెలిసి అమ్మమ్మ జీవితం మొత్తంలో, ఒక్క వారం రోజులే మంచం పట్టింది.

అది కూడా మరణానికి ముందు!

మా కుటుంబం గురించి ఒక మాట చెప్పాలి. మాది చాలా వెల్నిట్ ఫ్యామిలీ. బంధుమిత్రులనూ ఆదరించడం మా అమ్మా, నాన్న గార్ల నైజం. దాని వల్లే మా పెద నాన్న గార్లూ, బాబాయిలూ, మేనత్తలూ వాళ్ల పిల్లలతో వేసవి సెలవులకు స్వతంత్రంగా మా ఇంటికి వచ్చేవారూ, వుండేవారూ. ఈ నైజం మా అన్నయ్యలకు అదే పాళ్లలో వచ్చింది. మా అమ్మా, నాన్న గార్లూ పోయిన తర్వాత మా అక్కా నేనూ ఎవరి సంరక్షణలో వుండాలనేది కనీసం చర్చకు కూడా రాలేదు. "అమ్మాజీ, వాణీ నా దగ్గరే వుంటారు" అని మా పెద్దన్నయ్య ఆటోమెటిక్‌గా డిక్లేర్ చేశాడు. ఆ బాధ్యతను ఎంతో గొప్పగా, సక్సెస్ ఫుల్‌గా పూర్తి చేశాడు కూడా. ఇలా, బోలెడంత రాయచ్చు. కానీ ఎక్కడో ఒక చోట ఆపాలి కనక ఇక్కడ ఫుల్‌స్టాప్ పెడుతున్నాను. ❑

# అక్కే నాకు అమ్మ!



-బుజ్జమ్మ(మండలపర్తి సుబ్బలక్ష్మి)

మా అక్కే నాకు అమ్మ. మా బావే నాకు నాన్న గారు! నా చిన్నప్పుడే మా నాన్న గారు - బొమ్మకంటి నారాయణమూర్తి గారు పోయారు. దాంతో మేమంతా మా అక్క (అమ్మ) దగ్గరకు వచ్చేశాం. అప్పటికి మా అక్కకు ఆడ పిల్లలు లేకపోవడంతో ఆవిడ దగ్గిర కూతురు స్థానం నాకు దక్కింది. ఆవిడంటే నాకు చాలా ఇష్టం. తన గురించి రాయడానికి బోలెడంత ఉంది. కానీ, ఏమీ రాయలేకపోతున్నాను. ఓ సరదా అయిన విషయం తో మొదలు పెడతాను. మా అమ్మకు పూలజడ అంటే చాలా ఇష్టం. తను వేసుకోవడమంటే కాదు.. మాకు వెయ్యడమంటే ! ఒకసారి అమ్మ నాకు పెద్ద పూలజడ వేసింది. అప్పుడు మేం మా పెద్ద చెల్లి (అమ్మాజీ) కాన్పు కోసం నిడదవోలు వెళ్తున్నాం. ప్యాసింజరు రైలు కోసం స్టేషన్‌లో ఎదురుచూస్తూ కూర్చున్నాం. అంతలో ఓ మేక వచ్చి, మెల్లిగా నా పూల జడ తినేయడం మొదలెట్టింది. నాన్న గారు మేకను అదిలించినా అది పట్టు వదల్లేదు. పూల జడతోపాటు నన్ను కూడా లాక్కుపోయింది. దాని పట్టు వదిలించుకునే సరికి తాతలు దిగొచ్చారు. నాన్న గారికి కోపం వచ్చింది. నిండు గర్భిణి అని కూడా చూడకుండా, అమ్మను "శేషా! నీ పూలజడ పిచ్చితో పిల్లను చంపేస్తావా ?" అని తిట్టారు. అంత జరిగినా మా చెల్లెళ్లకు, మా అమ్మాయికి కూడా మహా ముచ్చటగా తన సరదా మేరకు పూలజడలు అల్లుతూనే ఉండేది. మా నాన్నగారు రాజకీయ జీవితం కారణంగా మాతో కలిసి ఉన్న సందర్భాలు తక్కువే. అయితే, ఆయన మమ్మల్ని చాలా ప్రభావితులను చేశారు. చిన్నప్పుడు మాకు జ్వరాలొచ్చినా, దెబ్బలు తగిలినా, మందూ మాకులకన్నా నాన్న గారి మాటలే బాగా పనిచేసేవి. నాన్న గారు తూతూ మంత్రం వేసి ఉఫ్ అని ఊదితే మొత్తం మాయమైపోయేది! అందుకే, మా నాన్న గారు ఇంట్లో ఉండడమంటేనే మాకు పండగలా ఉండేది. అయితే, మరోపక్క ఆయనంటే భయంతో వణికేవాళ్లం కూడా. మా చిన్నప్పుడు సెలవులకు మేం పెద్దగా ఎక్కడికీ వెళ్లే వాళ్లం కాదు. మా ఇంట్లోనే మాకు బోలెడంత కాలక్షేపం అయ్యేది. అప్పుడప్పుడూ మా ఇంటికే చుట్టాలు వచ్చే వాళ్లు. ఒక్కోసారి, రాజమండ్రిలోని పెద్దమ్మమ్మ వాళ్లింటికి వెళ్లే వాళ్లం. నిజానికి ఆవిడ నాకు పెద్ద అమ్మమ్మ కాదు - పెద్దమ్మే! కానీ నేను ఆవిణ్ణి అలాగే అనేదాన్ని. మా ఇంట్లో అందరూ బాగానే చదువుకునేవాళ్లు. నాకు మాత్రం పెద్దగా చదువు అబ్బ లేదు. మా అన్నయ్యలూ, వదినలూ, తమ్ముళ్లూ, మరదళ్లూ అంతా చదువుకుని ఉద్యోగాలు చేసేవాళ్లే. నేను సరిగ్గా

చదువుకోనందుకు తర్వాత తర్వాత చాలా బాధపడుతూ ఉండేదాన్ని. అయినా ఏం లాభం? మా పిల్లలకి మాత్రం చదువులు బాగానే వచ్చాయి. అది చూసుకుని సంతోషిస్తా. నాకు రాజకీయాలంటే చాలా ఇష్టం. అయితే, చదువు రాకపోవడం వల్ల రాజకీయాల గురించి పెద్దగా తెలుసుకోలేక పోయాను. దానికితోడు మా అత్తగారింట్లో ఎవరికీ రాజకీయాల మీద ఆసక్తి లేకపోవడం కూడా మరో కారణం. అయితే, నేను బొత్తిగా రాజకీయాలతో సంబంధం లేకుండా లేను. అది నా పెంపకం ప్రభావమే అనుకుంటా! మా చిన్నప్పుడు మా నాన్న గారు అంటే, కపర్ది గారు మాస్కో వెళ్లారు. అప్పుడు మేమెన్నో కష్టాలు పడాల్సి వచ్చింది.

మా అమ్మ ఎంతో ఓర్పుతో, ప్రేమతో మా ఆలనా పాలనా చూసింది. అంతటి ఓర్పు, ప్రేమా మా బాబీ అన్నయ్య – అసలు పేరు రామచంద్ర రావు – దగ్గరే చూశాం. మా నాన్న గారూ మా అమ్మా పోయి దశాబ్దాలు గడిచినా, మేమెప్పుడూ అలా అనుకోవలసిన అవసరం లేకుండా మా బాబీ అన్నయ్యే మాకు అండదండగా ఉన్నాడు. ఇప్పుడు తనూ లేడు. అలా అనుకున్నప్పుడల్లా నా గుండె బరువెక్కిపోతుంది. ఇంకా ఎంతో చెప్పాలని ఉంది. కానీ, ఈ గుండె బరువుతో ఇంతకన్నా ఏమీ చెప్పలేను. ❑

---

# అత్త మామలు కాదు, తల్లిదండ్రులే



– సంధ్య

నేను కపర్దిగారి రెండో కోడల్ని. శ్రీపతి భార్యని. మా ఇంట్లో (అంటే, కపర్ది గారింట్లో) మాది మొదటి కులాంతర వివాహం. అయితే దానివల్ల నేను ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. అత్తయ్య గారి తల్లి దుర్గమ్మ గారికి, మామయ్య గారి తల్లి శేషమ్మగారికి కొంచెం ఇబ్బంది అనిపించినా మా అత్తయ్య గారు శేషమ్మగారు ఎవరికీ ఇబ్బంది కలగకుండా సర్దుబాటు చేసేవారు. నేను శ్రీపతి తాడేపల్లిగూడెంలో వుండేవాళ్లం. మిగతా వాళ్లంతా హైదరాబాద్‌లో వుండేవారు. మమ్మల్ని చూడడానికి మామయ్య గారు తరచూ వైజాగ్, విజయనగరం, వెళుతూ వస్తూ గూడెంలో దిగేవారు. కనీసం ఒక రోజైనా వుండి మా మంచి చెడ్డలు చూసే వారు. నా భర్త శ్రీపతి కమ్యూనిస్టు పార్టీలో హోల్ టైమర్‌గా పనిచేసే వారు. అలవెన్స్‌లు కానీ, బిల్లులు కానీ సరిగ్గా టైంకు చేతికి అందేవి కాదు. అందుకే మా మామయ్య గారు మా కుటుంబంలో అందరిని ఒక ఎత్తు, మమ్మల్ని ఒక ఎత్తుగా చూసేవారు. మాకు – ముఖ్యంగా నాకు పిల్లలకు వైద్యానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేవారు.

అప్పుడప్పుడూ అత్తయ్య గారు “మీకు పిల్లలందరూ సమానం కాదా ? అందరికి ఒకేలా ఎందుకు ఖర్చుపెట్టరు ?” అని మామయ్య గారిని అడిగేవారు. “హోల్ టైమర్ల పిల్లలను మిగతా వాళ్లతో సమానంగా చూడడం తప్పు. వాళ్లంతా ఉద్యోగాలు చేసుకుని సంపాదించుకుంటున్నారు. వాళ్ల అవసరాలు వాళ్లే తీర్చుకోవాలి. హోల్ టైమర్ల విషయంలో అలా కాదు” అనేవారు మామయ్యగారు. మేం తాడేపల్లిగూడెం లో ఉండటంతో మమ్మల్ని చూడడానికి అత్తయ్య గారు, పిల్లలు వేసవి సెలవులకు వచ్చేవారు. ఆవిడ వెళ్లే రోజున అత్తయ్య గారిని సాగనంపడానికి గూడెం విమలానగర్‌లోని స్నేహితులం తా కట్టకట్టుకుని బస్టాండ్‌కు వచ్చి వెక్కి వెక్కి ఏడ్చేవారు. మొదట్లో నాకు అదంతా వింతగా, విడ్డూరంగా అనిపించేది. తర్వాతకు గానీ అర్థం కాలేదు. ఆమెలోని ప్రేమించి, ప్రేమిం చబడే తత్వం నాకు ఆలస్యంగా బోధపడింది. మా అత్తయ్య గారు మామయ్య గారు ఎప్పుడూ అలా ప్రవర్తించలేదు. మమ్మల్ని అమ్మా నాన్నలకన్నా ఎక్కువగా చూసుకున్నారు. పెళ్లయిన తర్వాత నేనెప్పుడూ పది రోజులు కూడా పుట్టింట్లో వుండలేదు. పిల్లలు కూడా అత్తయ్య గారింట్లోనే పుట్టారు. ఎప్పుడైనా భార్యాభర్తల మధ్య గొడవలు వస్తే మామయ్య గారు మాత్రం కోడలి పక్షమే వుండేవారు. అత్తయ్య గారు మాత్రం పైకి కొడుకులనే సమర్థించేవారు. మా ముందు వాళ్లు లోకువై పోతారేమోనని ఆవిడ భయం. ఇవన్నీ ఇప్పుడు తల్చుకుంటే బాధగా వుంది. ఒక సంతోషకరమైన నిండు సంసారంలో నుంచి ఒక్కొక్కరూ తరిగిపోతుంటే గుండె తరుక్కుపోతోంది. ఉన్నతమైన సిద్ధాంతాలను ఉపన్యాసాలలోనే కాక ఆచరణలో చేసి చూపించి అదే పది మందికి చెప్పి తన కుటుంబాన్ని కూడా ఆ దారిలోనే నడిపించి, ఇప్పటికీ మా కుటుంబ జీవనానికి దాన్నే పునాదిగా చేసిన మామయ్య గారిని, ఆయనకు అన్ని విధాలా సహకరించిన అత్తయ్య గారిని ఎన్నటికీ మరవలేను. ❑

## కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు

# కోడళ్లం కాదు, కూతుళ్లమే!

- అరుణ (నిర్మల)



ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు కపర్దీగారి నాలుగో కోడలిగా నేను వారింట అడుగుపెట్టాను. ప్రకాశం జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు నల్లూరి అంజయ్య గారి అమ్మాయిని నేను. కపర్దీ గారి నాలుగో కుమారుడు బాబూరావు భార్యగా 1978 మే 17వ తేదీన నేను ఆ కుటుంబంలో సభ్యురాలిని అయ్యాను. పెళ్లికి ముందు నుంచి నేను సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తూనే వున్నాను. పార్టీ వాళ్ల చొరవతో, సహకారంతో కుదిరిన పెళ్లి సంబంధం మాది. అయితే, ఒక అర్థంలో మాది స్వయంవరమే. ఒకరినొకరం చూసుకుని ఇష్టపడ్డాక పెద్ద వాళ్ల మధ్య పెళ్లి మాటలు మొదలయ్యాయి. కపర్దీ గారు పెద్ద కుటుంబంతో ఎ.ఐ.టి.యు సి ఆఫీసు వెనకాల కాపురం వుండేవారు. నేను అప్పటికి మహిళా సమాఖ్య జనరల్ సెక్రటరీ శ్రీమతి గుజ్జుల సరళాదేవి గారి ఇంట్లో వుండేదాన్ని. పెద్దల మధ్యన పెళ్లి మాటలు జరగడానికి ఎ.ఐ.టి.యు.సి. ఆఫీసు గెస్ట్ రూమ్‌ను వేదికగా నిర్ణయించారు. మా అమ్మా నాన్నలతోపాటు సరళాదేవి గారి భర్త, ప్రముఖ కమ్యూనిస్టు నేత గుజ్జుల యల్లమందారెడ్డి గారూ, ప్రజానాట్యమండలి నాయకుడు నల్లూరి వెంకటేశ్వరరావు గారూ కూడా ఆ సంప్రదింపులలో పాల్గొన్నారు. పెద్దవాళ్ల వ్యవహారంలో మనమెందుకులే అన్న అభిప్రాయంతో నేను బ్యాంక్‌లోనే ఉండిపోయాను. కానీ కపర్దీ గారు నేను ఆ సమయంలో అక్కడే ఉండి తీరాలని పట్టుపట్టారు. నేను వచ్చే వరకు నా పెళ్లి మాటలు మొదలు పెట్టలేదు. చిన్న వాళ్లయినా పెళ్లి చేసుకునే వారి అభిప్రాయాలకు పూర్తివిలువ ఇవ్వాలన్నది మావయ్యగారి సిద్ధాంతం. అది నూటికి నూరుపాళ్లు పాటించేవారు. పెళ్లి మాటలను మొదలు పెడుతూ మావయ్య గారు తన కుటుంబం పరిస్థితులను వివరంగానూ, ఉన్నది ఉన్నట్లు గాను చెప్పారు. మనస్సులో మాట చెప్పడానికి ఆయన ఎప్పుడూ జంకేవారు కాదు. “మాది పెద్ద కుటుంబం. మా ఇంట్లో అందరికన్నా ఎక్కువ చదివింది, ఎక్కువ సంపాదిస్తున్నది మా బాబూరావే. వాడికన్నా చిన్నపిల్లలు నలుగురు వున్నారు. అందరూ సెటిల్ అయ్యే వరకూ బాబూరావు సహాయం కుటుంబానికి అవసరం. అందువల్ల ఒకవేళ నువ్వు మా వాడిని పెళ్లి చేసుకుంటే కనీసం ఏడాదిపాటు మాతోనే కలిసి వుండాలి. తరువాత మీ ఇష్టం. అలా కలిసి వుంటేనే కుటుంబ సభ్యుల అందరి మధ్య సదవగాహన, ప్రేమానుబంధాలు పెరుగుతాయి” అంటూ మావయ్య గారు తేల్చి చెప్పారు. ఆయన దృష్టిలో పెళ్లి ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగేది కాదు. అది రెండు కుటుంబాల మధ్య ఏర్పడే కలయిక. నాకు మా మావయ్య గారి మాటలు బాగా నచ్చాయి. అందుకే ఆయన చెప్పినట్లే నడుచుకున్నాను. కుటుంబ అభివృద్ధికి బాబూరావుతోపాటు నేనూ నా వంతు కృషి చేశాను. అంతేకాదు, అందుకు ఎంతో గర్విస్తున్నాను. మా మావయ్య గారు కమ్యూనిస్టు సిద్ధాంతాలను త్రికరణ శుద్ధిగా నమ్మారు. అంతే కాదు ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టారు. తన పిల్లలందరూ వర్ణాంతర వివాహాలు చేసుకోవడానికి స్ఫూర్తినిచ్చారు. మేమంతా పార్టీ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లమే కావడం చేత పరస్పరం అన్యోన్యంగానూ, సఖ్యంగానూ వున్నాము. మా అత్తయ్య, మావయ్య గార్ల అన్యోన్య దాంపత్యం ఆదర్శప్రాయం. నా పెళ్లి కుదిరినప్పుడు ప్రేమ పావని మా అత్త గారి గురించి ఎంతో గొప్పగా చెప్పింది. “శేషమ్మ గారు ఎంతో మంచిది. కోడళ్లను కూతుళ్లకంటే కూడా ప్రేమగా చూస్తారు” అని పావని చెప్పిన మాటలు విని ఆశ్చర్యపోయాను. అసలు అదెలా సాధ్యమని కూడా మనస్సులో అనుకున్నాను. అయితే వాళ్లింట్లో అడుగుపెట్టిన తర్వాత నాకు విషయం అర్థం అయ్యింది. పావని చెప్పిన దాంట్లో ఆవగించంత కూడా అతిశయోక్తి లేదు. మా అత్తయ్యగారు అందరిని సమానంగా చూసేవారు. ప్రేమకు, ఆప్యాయతకు, సహనానికి ఆమె మారుపేరు. అత్తయ్యగారు నాకు అమ్మగానే కనిపించే వారు. తాడేపల్లిగూడెంలో చాలామంది ఆమెను అమ్మా అనే పిలిచేవారు. అందరు మంచి కమ్యూనిస్టుల మాదిరిగా మా మావయ్య గారు కూడా జీవితాన్ని సంపూర్ణంగా పార్టీకి అంకితం చేశారు. హోల్ టైమర్‌గా తన శక్తి యుక్తులన్నీ ఉద్యమానికే ధారపోశారు. కుటుంబపోషణకు ఆలంబనగా వున్న ఆస్తులన్నీ కరిగిపోయినా ఆయన కానీ, మా అత్త గారు కానీ, కుటుంబ సభ్యులు ఎవరూ కానీ ఎన్నడూ బాధపడలేదు. అత్తయ్య గారూ, మావయ్య గారూ ఒకరికొకరుగా, కష్టసుఖాలు అన్నింటిలో కలిసే జీవించారు. ఇంటి బాధ్యతలు అన్నీ అత్తయ్యగారు చూసుకునే వారు. చిన్నా పెద్దా అందరి అవసరాలను కనిపెట్టి అందరికి అన్నీ అమర్చిపెట్టేవారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఎదురైనా సహనంతో ఇల్లు గడిపేవారు. ఇంట్లో వారే కాకుండా ఎప్పుడూ

వచ్చే పోయే వారితో మా ఇల్లు సందడిగా వుండేది. అత్తయ్య గారు సహాయ సహకారాలతోనే మావయ్య గారు గొప్ప కమ్యూనిస్టు కాగలిగారని నేను అనుకుంటాను. మావయ్య గారు తరచూ మీటింగులకు వెళ్లేవారు. క్యాంపుల నుంచి రాగానే ఇంట్లో పిల్లలందరినీ కూర్చోపెట్టుకుని పార్టీగురించి, తాజా రాజకీయ పరిణామాల గురించి నాయకుల అభిప్రాయాల గురించి వివరంగా చెప్పేవారు. అందరి సందేహాలు తీర్చేవారు. ఆ చర్చా కార్యక్రమం నాకెంతో ముచ్చటగా వుండేది. ఒకసారి మావయ్య గారు వైజాగ్‌లో ఉండగా గుండెపోటు వచ్చింది. ఆ విషయం తెలుసుకుని అత్తయ్య గారు హడావుడిగా విశాఖపట్నం బయలుదేరారు. బ్యాంకులోవున్న నాకు ఫోన్ చేసి ఈ విషయాలు చెప్పారు. వెంటనే వెళ్లి అత్తయ్య గారిని చూడాలని నాకు అనిపించింది. అయితే నాపై అధికారి నేను వెళ్లడానికి వీలులేదని ఆదేశించారు. నాకేం చేయాలో తోచలేదు. భోరున ఏడ్చేశాను. మా అధికారి కంగారుపడి నన్ను వెంటనే పంపించేశారు. నాకు తెలిసి నేను అంతకుముందు గాని అటు తర్వాత గాని అంత ఎమోషనల్‌గా ఫీలవ్వలేదు. అత్తయ్య, మావయ్య గార్లతో నా అనుబంధం కొద్దికాలమే అయితే అవి నా జీవితంలో మధురక్షణాలు. వాళ్లు బతికి వుండగా మా పిల్లలు పుట్టలేదు. తాతా, మామ్మల ఒడిలో పెరిగే అవకాశం వాళ్లకు దక్కలేదు. నాకది బాధాకరం. అయితే అత్తయ్య గారు, మామయ్య గారు మరణించి ఎంత కాలమైనా వారు మా ఇళ్లల్లో, మా నోళ్లల్లో సజీవంగానే వున్నారు. ఈ తరం వారిని కూడా సన్మార్గంలో నడిపిస్తున్నారు. ❑

---

# ఆ జ్ఞాపకాలే తీపి గుర్తులు



- కనకం (బి.ఎస్.కె.దుర్గ)

నేను కపర్ది- శేషమ్మ గార్ల మేనకోడలినే కాక, వారి మూడో కోడల్ని కూడా. కీ.శే. మందలపర్తి నారాయణమూర్తి (చిట్టిపాప) భార్యని. నా పేరు బొమ్మకంటి శేష కనకదుర్గ. అంతా కనకం అంటారు. మా నాన్న గారు కీ.శే. బొమ్మకంటి సుందర గోపాలం మా అత్తయ్యకి పెద నాన్న గారి అబ్బాయి. మా మావయ్య గారికి స్వయానా మేనమామ కొడుకు. వాళ్లంతా చిన్నప్పుడు కలిసే పెరిగారట.

మా పెళ్లి 1975లో, మా మరిది బాబూరావు మాస్కో నుంచి తిరిగి వచ్చిన తర్వాత అయ్యింది. (బాబూరావు రష్యా నుంచి తిరిగి వచ్చేంత వరకూ పెళ్లి చేసుకోనని చిట్టిపాప భీష్మించుకుని కూర్చున్నాడు మరి!). 1982 వరకూ వాళ్లతోనే కలిసి ఉన్నాం. ఆ ఏడు సంవత్సరాలూ మా జీవితంలో గోల్డెన్ డేస్. నిజమైన ఉమ్మడి కుటుంబానికీ, అత్తాకోడళ్ల అనురాగబంధానికీ మా కుటుంబాన్ని – అంటే కపర్ది గారి కుటుంబాన్ని ఆదర్శంగా చెప్పుకోవచ్చు. అలాగే చెప్పుకునే వారు కూడా. మా పెళ్లయిన కొత్తలో, మా మావయ్య గారు మా ఇద్దరిని పిలిచారు. "మీకో విషయం చెప్పాలనుకుంటున్నాను" అని ఒక నిమిషం ఆగి, ఇలా అన్నారు. "ఎవరైనా సరే, జీవితంలో ఈతిబాధలు భరించలేక 'అసలు పెళ్లెందుకు చేసుకున్నార్రా బాబూ!' అనుకోవచ్చు. కానీ, ఎప్పుడూ కూడా 'వీళ్లనెందుకు చేసుకున్నార్రా దేవుడా!' అని మాత్రం అనుకోకూడదు. అలాంటి పరిస్థితి రాకుండా, అన్యోన్యంగా సంసారాన్ని నడుపుకోండి!!" అని చెప్పారు మా మావయ్య గారు. అది నాకు చాలా నచ్చింది. మా అమ్మాయి స్మితా కపర్దిని పెళ్లి చేసినప్పుడు, నేను ఇదే విషయం వాళ్లతో చెప్పాను.

మా మావయ్య గారి ఇంట్లో ఎప్పుడూ ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేది. కలిమి లేముల, కులమతాల తేడాలు మేమెప్పుడూ చూడలేదు కాబట్టి అనుకుంటా! పాపాయమ్మ గారు (మఖ్దూం భవన్ రామచంద్రరావు గారి భార్య) "మీ ఇంటికి వస్తే మనసుకు హాయిగా ఉంటుందండీ!!" అనేవారు. మావయ్య గారు ఉన్న కాసేపూ పిల్లలందరితోనూ కోడళ్లతో సహా – ఇంటి విషయాల నుంచి రాజకీయాల వరకు, అన్ని విషయాలూ 'నొప్పించక తానొవ్వక' అనేరీతిలో మాట్లాడేవారు. మా అత్తయ్య మనస్ఫూర్తిగా, హాయిగా, గట్టిగా నవ్వేది. అదే తనకి పెద్ద ఆభరణం. ఆవిడకి సహనం చాలా ఎక్కువ. ఇంటికి ఎవరు వచ్చినా ముందు "భోం చేస్తారా?" అని అడిగాకే మిగతా విషయాలు మాట్లాడేది. పిల్లలే తన సర్వస్వం. వీటితోపాటు ఆడపడుచుల రాకపోకలూ, పురుళ్లూ పుణ్యాలూ, వేసవి సెలవులకు మేనల్లుళ్లూ మేనకోడళ్లూ రావడం ఇవన్నీ షరా మామూలే! నేను మా అత్తయ్య దగ్గిరే చాలా విషయాలు నేర్చుకున్నాను. మాట తీరూ, ఓర్పూ ఇవన్నీ కూడా. చాలా కబుర్లు చెప్పుకునే వాళ్లం (పన్లు చేసుకుంటూనే!). ఒక రోజు అలాగే ఏదో మాట్లాడుకుంటున్నాం. అప్పుడు నేను మా అమ్మాయి-స్మితా కపర్దిని కడుపుతో ఉన్నాను. "అమ్మా! రోజూ

ఓ కొబ్బరి బొండాం తాగు, చాలా మంచిది!" అంది అత్తయ్య. "దమ్మిడీ ముండకి ఏగానీ క్షవరం – ఏం వద్దు!!" అన్నాను నేను, సరదాగా. "ఆ ఏగానీ నేనిస్తాలే గానీ, రోజూ కొబ్బరి బొండాం తాగు!!" అన్నారు మావయ్య గారు ఎప్పుడొచ్చారో ఏమో! (ఆయన నడుస్తోంటే చప్పుడయ్యేది కాదు!). ఇలా మా అత్తయ్య గురించి ఎంత రాసినా తనివి తీరదు. మాక్కూడా పురుళ్ల పోసింది. మా అబ్బాయి (భూపేష్) పుట్టినప్పుడైతే, ప్రాణాలుగ్గ బట్టుకుని మరీచేసింది. పేరు కూడా తనే పెట్టింది. మా అత్తయ్యా, మావయ్య గార్లిద్దరూ నిస్వార్థపరులే. 'కొంచెం స్వార్థం చూసుకున్నా ఇంకొంచెం కాలం బతికేవారేమో!' అనిపిస్తుంది. ఎవరో అన్నట్లు, "పోయినోళ్లు అందరూ మంచోళ్లు" – వాళ్ల జ్ఞాపకాలనే తీపి గుర్తులుగా తల్చుకుంటూ బతికేస్తున్నాం! ❑

---

# మా అమ్మ - మా పెద నాన్నగారు



**- తమ్మి (మందలపర్తి రఘుకుమార్)**

కపర్దీ గారు మా పెద నాన్న గారు. కానీ, మా అమ్మకి నాన్న గారు ! అర్థం కావట్లేదు కదూ?! మీకే కాదు, నాక్కూడా! మా అమ్మ చిన్నప్పుడే, వాళ్ల నాన్నగారు – అంటే మా తాతగారు బొమ్మకంటి సూర్యనారాయణమూర్తి గారు – చనిపోవడంతో మా అమ్మ మా పెద నాన్న గారింట్లోనే పెరిగింది. ఆవిడ మా పెద నాన్న గారిని, అంటే తన బావ గారిని, "నాన్న గారూ" అని పిలిచేదట. ఆయనకి సొంత కూతుర్లాగే, ప్రేమా ఆప్యాయతలతో పెరిగింది. అలా పెరగడం ఆవిడ అదృష్టం! అందుకే, నాకు మా అమ్మ అంటే కించిత్తు అసూయ!!

మా ఇంట్లో ఆచార వ్యవహారాలు బహు విచిత్రంగా ఉంటాయి. ఇక్కడ 'మా ఇల్లు' అన్నప్పుడు ఓ చిన్న వివరణ అవసరం. మా పెదనాన్నగారికి ఆరుగురు అబ్బాయిలు. ఇద్దరు అమ్మాయిలు. మా అమ్మ(బుజ్జమ్మ)ను సరే, నన్నూ, మా పాపాయక్కనూ కూడా కలుపుకునే 'మా ఇల్లు' అంటున్నాను. మేమంతా చాలా కలివిడిగా పెరిగి, ఇవాళ ఓ స్థాయికి చేరుకున్నామంటే, మా పెద్దమ్మ– పెదనాన్నగార్ల పెంపకం చలవే! నేను మా పెద్దమ్మని ఏ రోజూ పెద్దమ్మా అని పిలవలేదు. "అమ్మా" అనే అనేవాణ్ణి. ఆ మాటకి అసలు అర్థమేమన్నా ఉందో లేదో, ఉంటే అదేమిటో నాకు తెలీదు. అయితే సొంత అమ్మ కన్నా ఎక్కువగా ప్రేమించే అమ్మనే "అమ్మ" అనాలని నా అభిప్రాయం! (నేను కొద్దిగా ఎమోషనల్ అయ్యానేమో... ఆవిడ గురించి నాకున్న జ్ఞాపకాలు అలాంటివి మరి!)

మాకు ఊహ వచ్చే నాటికే పెదనాన్న గారూ అమ్మా హైదరాబాద్ వెళ్లిపోయారు. మా అమ్మలాగా, గూడెంలో వాళ్లింట్లో పెరిగే అవకాశం నాకు లేకపోయింది. కానీ, వేసవిలో మాత్రం హైదరాబాద్ ట్రిప్ తప్పనిసరి. మా నాన్న గారు – మందలపర్తి వెంకటచలం – పెద నాన్నగారికి సెకండ్ కజిన్. ఆయన ఆర్టీసీలో ఉద్యోగం చేసేవారు. మాకు ఫ్రీ బస్‌పాస్ సౌకర్యం ఉండేది. ఇక హైదరాబాద్ ప్రయాణానికి అడ్డేముంటుంది? అమ్మా వాళ్లింట్లో సెలవులు చాలా చాలా ఎంజాయ్ చేసేవాళ్లం. మా అమ్మమ్మ అమ్మ, అమ్మల కన్నతల్లి – రిక్షా వాళ్లతో వచ్చీరాని "హిందీ"లో బేరాలాడుతుంటే నవ్వొచ్చేది. అక్కడుండగానే, కుక్క పిల్ల అడ్డం రావడంతో బోల్తా కొట్టాను. చెయ్యి విరిగింది. దాంతో నాకు బెండప్పారావనే బిరుదు వచ్చేసింది. (మా పెద్దన్నయ్య, శ్రీపతన్నయ్య చివరిదాకా నన్నలాగే పిలిచేవాళ్లు). ఇలాంటివే ఎన్నో జ్ఞాపకాలు!! 1981లో మా పెద నాన్న గారు పోవడం మాకందరికీ పెద్ద షాక్. దాంతో కానికాలం వచ్చిపడింది. ఒక బాధలోంచి పూర్తిగా తేరుకోకముందే మరొకటి పెద్ద వదిన, అమ్మ, అమ్మమ్మ వరసగా షాక్ మీద షాక్!! అయినా, తట్టుకున్నాం. పెదనాన్నగారి పెంపకంలోని గొప్పదనం అప్పుడే అర్థమయింది. ముఖ్యంగా అన్నయ్యలు చూపించిన ధైర్యం నాకిప్పటికీ వింతగానే అనిపిస్తుంది. వాళ్లు ఒక్కటిగా ఉండడమే కాకుండా మమ్మల్నందరినీ కూడా ఒకే తాటి మీద నడిపించారు. మా అంజి మామయ్య కూడా వాళ్లకి దన్నుగా నిలబడ్డాడు.

ఇరవయ్యేళ్ల తర్వాత, ఏదోలా స్థిమిత పడుతున్నామనుకుంటుండగా, షాక్‌ల పరంపర తిరిగి మొదలైంది. వరసగా ముగ్గురన్నయ్యలని – చిట్టన్నయ్య, శ్రీపతన్నయ్య, పెద్దన్నయ్యలని – పోగొట్టుకున్నాం. ముగ్గురితోటీ కూడా నాకు ఎంతో సాన్నిహిత్యం. పెద్దన్నయ్య ఇచ్చిన షాక్ – ముఖ్యంగా నాకు చాలా పెద్దది. నేను డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్ వచ్చేసినప్పుడు అమ్మా నాన్నలకన్నా ఎక్కువగా ఆదరించాడు. చివరిదాకా నా విషయంలో ఎంతో శ్రద్ధ చూపించాడు. 'అన్నయ్యలూ– వదినలూ – అక్కయ్యలూ – అన్నయ్యల పిల్లలూ అందరం కలిసిన రోజున – ఎంత కష్టంలో ఉన్నా కూడా ఓ పండగ వాతావరణం ఉంటుందక్కడ! అదే మా ప్రత్యేకత!! ❑

# శేషమ్మ అత్తయ్యగారు

**కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు**



- యాళ్ళబండి సుశీలకుమారి

మా అమ్మ చెయ్యి పట్టుకొని ఒక ఇంటి ముందు రిక్షా దిగాను. మా అమ్మ గారు, నేను ఆ ఇంటిలోకి వెళ్ళేటప్పటికి ఒక డజన్ మంది భోజనాలు చేస్తూ కూర్చున్నారు. అందులో పెద్ద వాళ్ళు, చిన్న వాళ్ళు, పసివాళ్ళు అందరూ ఉన్నారు. అంతా సరదాగా నవ్వుకుంటూ, చాలా చలాకీగా ఉన్నట్లుగా నాకనిపించింది. మా అమ్మకేసి చూసి “ఏమిటమ్మా ఇదేమన్నా హాస్టలా? ఇంతమంది ఉన్నారు!” అని ప్రశ్నించాను అమాయకంగా. మా అమ్మ చిన్నగా కసురుకుని “ఇదే శేషమ్మ అత్తయ్య గారి ఇల్లంటే” అంది. అదిగో అలా నాకు మా శేషమ్మ అత్తయ్య గారితో పరిచయం ఏర్పడింది. నాకు ఊహ వచ్చినప్పట్నుంచీ, శేషమ్మ అత్తయ్య గారూ, కపర్ది మావయ్య గారూ నా దృష్టిలో హీరోహీరోయిన్స్. మా నాన్నగారు కీ॥శే॥ యాళ్ళబండి రంగనాయకులుగారు కపర్ది మావయ్యగారి గురించి చెప్పే కబుర్లన్నీ వాళ్ళు జైల్లో గడిపిన నాటి విషయాలే. మావయ్యగారు జైల్లో వాళ్ళకి నేర్పిన చెస్ ఆట గురించి, బ్యాడ్మింటన్ ఆట గురించి, ఇంగ్లీష్ భాష గురించి మా నాన్నగారు అస్తమానం గుర్తుచేసుకుంటూ ఉండేవారు. మేము చింతలపూడి నుంచి తాడేపల్లిగూడెం వచ్చిన తరువాత ఆ కుటుంబంతో మా స్నేహం మరింత బలపడింది. నేను ముందు చెప్పినట్టు ఆ యింట్లో సగం మంది కపర్దిగారి సంతానమైతే మిగిలిన సగం మంది చుట్టాలు, బంధువులు, మాలాంటి స్నేహితులు. అందుకే ఆ -యిల్లు ఎప్పుడు కళకళలాడుతుండేది. శేషమ్మ అత్తయ్యగారు ఎప్పుడు, ఎక్కడ ఉన్నా సరే భోజన సమయానికి వచ్చినవాళ్లు ఆ ఇంటిలో చెయ్యి కడిగి వెళ్ళవలసిందే. అదే అలవాటు హైదరాబాద్లో లాంటి సిటీలో కూడా అత్తయ్యగారు వదిలి పెట్టలేదు. ఇప్పటికీ కూడా మేము తాడేపల్లిగూడెం వెళ్ళినప్పుడు అక్కడ ఉండే రిక్షావాళ్లు, మా మావయ్యగారి పొలంలో పనిచేసినవాళ్ళు, - ముఖ్యంగా కడుపు చలవ కలిగిన తల్లి “మల్లి” (ఈవిడకి 11 మంది సంతానం. ఎప్పుడు చూసిన కడుపులో ఒకరు, చంకలో ఒకరు పిల్లలు!) - ఇంకా మా అత్తయ్య గారిని తలుస్తూనే ఉంటారు. అన్నపూర్ణమ్మ తల్లిగా ఆవిడని పిలుస్తూనే ఉంటారు. పేరు పేరు వరుసనా ఆ కుటుంబ సభ్యులు అందరూ ఎక్కడున్నారో ఏమిచేస్తున్నారో అంటూ అడుగుతూనే ఉంటారు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం మీకు చెప్పాలనుకుంటున్నాను. కపర్ది మావయ్యగారు ఊరునుంచి ఎప్పుడు వచ్చినా, ఆ కాలంలో దొరికే పళ్ళు దండిగా కొనుక్కురావటం ఆయన అలవాటు. ఆ పళ్ళ బుట్టను ఇంటిలో దింపటానికి ముందే శేషమ్మ అత్తయ్యగారు ఆ బుట్టలోని కొన్ని పళ్ళు తీసి, రిక్షా అబ్బాయికి ఇవ్వటం నేను ఎన్నోసార్లు ప్రత్యక్షంగా చూశాను. అలా ఇంటికి వచ్చిన ఎవరినైనా సరే ఖాళీ చేతులతో పంపించటం ఎందుకో మా అత్తయ్య గారికి ఇష్టం వుండేదికాదు.

అత్తయ్యగారితో నా అనుబంధం నాకు ఊహ వచ్చినప్పటి నుండి ఆమె చనిపోయే దాకా కొనసాగింది. మా సొంత మేనత్తలతో ఏనాడూ లేని చనువు, ఆప్యాయత మాకు శేషమ్మ అత్తయ్యగారి దగ్గర లభించేవి. శేషమ్మ అత్తయ్యగారు ఆవిడ పిల్లలు -మా బావలు- వాళ్ళ ఇల్లు, ఇవన్నీ మాక్కూడా అదేదో హక్కులాగా భావించే తత్త్వం మా సొంతం. బాల్యంలో పిల్లల సరదాలను అత్తయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలే తీరుస్తారు. అలాంటి సరదాలన్నీ నాకు శేషమ్మ అత్తయ్యగారే తీర్చారు. వాళ్ళ పిల్లలు అమ్మాజీ,వాణిలతో పాటుగా నాక్కూడా పూల జడలు వేయడం, బొమ్మల కొలువులు పెట్టించటం లాంటి సరదాలన్నీ శేషమ్మ అత్తయ్యగారి ఇంట్లోనే జరిగేవి. మా బావలు మమ్మల్ని ఏడిపించటం, మేము వారిని ఏడిపించటం లాంటి మేనత్తపిల్లలతో జరిగే సరదాలు అన్నీ కూడా మాకు ఆవిడ పిల్లలతోటే జరుగుతుండేవి. మా కెన్నో చిన్న చిన్నముద్దు పేర్లు - ఉదాహరణకి తింగరిగా ఉంటే తింగు- పెడుతుండేవారు. మా శ్రీపతి బావకి తెలియకుండా డిటెక్టివ్ నవల చదువుతూ దొరికిపోయి తీసిన గుంజీలు, చిట్టిపాప బావతో పొలం వెళ్ళటాలు, కిషోర్, అమ్మాజి, వాణిలతో సినిమాలకు వెళ్ళటాలు, ఇలాంటివన్ని నాకు ఇప్పటికి తియ్యటి బాల్య స్మృతులు. వీటన్నిటి వెనుకాల శేషమ్మ అత్తయ్యగారు పంచి ఇచ్చిన ప్రేమానురాగాలు మరీ తియ్యగా ఉండేవి. ఆవిడ ఎప్పుడు నా పిల్లలు, వాళ్ళ పిల్లలు అనే వేరు భావంతో చూసేవారు కాదు. పిల్లలందరూ సమానమే అంటూ ఆవిడ చెప్పిన మాటలు ఇప్పటికీ మా చెవుల్లో వినిపిస్తూనే ఉంటాయి.

మా రెండు కుటుంబాల మధ్య మంచి స్నేహం ఉండేది. మా అమ్మ, అత్తయ్యగారు ఒకరినొకరు వదినగారు అని పిలుచుకునేవారు. వారంలో ఏడు రోజులూ తప్పనిసరిగా

వాళ్ళిద్దరూ కలిసి తీరవలసిందే. వాళ్ళ ఇంటికి ఈవిడ, వీళ్ళ ఇంటికి ఆవిడ రాకపోకలు ప్రతి నిత్యం జరగవలసిందే. మా అమ్మగారు బాగా టైంకి ప్రాధాన్యత ఇచ్చేవారు. అనుకున్నటైంకి ఆవిడ మా అత్తయ్యగారి ఇంటికి వెళ్ళేవారు. కాని మా అత్తయ్యగారి సమయం ఎప్పుడూ ఆవిడ చేతిలో ఉండేదికాదు. ఆవిడ ఇల్లు కదిలారంటే ఆ వీధిలో ఉన్న మొదటి ఇంట్లో మొదలుపెట్టి మా ఇంటివరకు ఉన్న అన్ని ఇళ్ళల్లోనూ మా శేషమ్మ అత్తయ్యగారి పేరు ప్రతిధ్వనిస్తూనే ఉండేది. అలా అంతమందిని సంతృప్తి పరిచి కాని ఆవిడ మా ఇంటికి వచ్చేది కాదు. కాని ఆవిడ తిన్నగా మా ఇంటికి రావాలని, మా ఇంట్లో మాతోటే ఎక్కువ సమయం గడపాలని, మాతోనే ఎక్కువ కబుర్లు చెప్పాలని మా ఆశ. కాని ఆవిడ అందరితో కొనసాగించిన స్నేహం వెనుకాల ఉన్న గొప్పతనం మాకు చాలా ఆలస్యంగా అర్థమైంది. అలాగే పొలంలో పండే కూరగాయలు, చెరుకు పానకం, బెల్లం అన్నీ కూడా ఇంటికి రాగానే ఆవిడ స్నేహితులందరికి పంచిపెట్టి తీరవలసిందే. ఆవిడ స్వభావం ఏమిటంటే తన దగ్గర ఉన్నది ఏదైనా నలుగురితో పంచుకుని తినాలనే సద్బుద్ధి.

మా అత్తయ్య గారికి ఒక ఫ్రెండ్స్ బ్యాచ్ ఉండేది. వాళ్ళు మా అమ్మ, తులసక్క, షరీఫ్ గారి భార్య, కాళ్ల ధనలక్ష్మి గారు, సత్యవతి అక్క తదితరులు. వీళ్ళంతా పార్టీ మీటింగులకు, పార్టీవాళ్ళ ఇళ్ళల్లో జరిగే ఫంక్షన్స్కు, సినిమాలకు ఎప్పుడు కలిసే వెళుతూ ఉండేవాళ్ళు. వీళ్ళంతా కలిసి సినిమాకి బయలు దేరితే అందరూ ఫస్ట్ షో టైంకి కూడి, కలవటం మొదలు పెడితే సినిమా హాలు దగ్గరికి వెళ్ళేటప్పటికి సెకండ్ షో టైం అయ్యేది. అత్తయ్యగారి ఇంట్లో మమ్మల్ని బాగా ప్రభావితం చేసింది, అందరూ కలిసి కూర్చొని ఒకే పళ్ళెంలో భోజనం చేయటం. ఆవిడ పిల్లలందరిని చుట్టూరా కూర్చోబెట్టుకొని తనా పరాభేదం లేకుండా అందరికీ భోజనాలు తినిపించటం తలుచుకుంటే ఇప్పటికి ఎంతో ఆనందం కలుగుతుంది. ఆ ఇంటి కోడలైన నాకు ఆ తరువాత కాలంలో మా తోటి కోడళ్ళ పిల్లలు, మా పిల్లలు అందరూ కలిసి కూర్చొని మా స్మిత నాయకత్వంలోనూ, మా నితీష్ నాయకత్వంలోనూ ఇలాగే కలిసి భోజనాలు చేయటం చూస్తుంటే నాకు మా అత్తయ్యగారే గుర్తుకొస్తారు.

మా కపర్దీ మావయ్య గారికి రాజకీయాలు బాగా తెలుసు ఆయన ప్రపంచాన్ని చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్న వ్యక్తి. కాని మా అత్తయ్యగారు ఆయనలో భావాలన్నింటినీ ఆచరించి చూపించిన వ్యక్తి. అందరినీ సమానంగా చూడటం, అందరినీ ఆదరించటం ఇప్పటికీ తలుచుకుంటే మాకెంతో చిత్రంగా అనిపిస్తుంది. పోనీ ఆవిడ ఏమన్నా ఎక్కువ చదువుకున్న వ్యక్తా అంటే ఆ కాలంలో ఏడు, ఎనిమిది వరకే చదువుకున్నవ్యక్తి. కాని ఆవిడ ప్రపంచజ్ఞానం అమోఘం. పార్టీ ఉద్యమాల పట్ల ఆవిడ స్పందన, ఆవిడకున్న సామాజిక స్పృహని తెలియజేసేది. అప్పట్లో వ్యాపారస్తుల గోడౌన్ల మీద దాడి చేసి ఆ సరుకంతటిని వెలికితీసి పేదలకి అమ్మించేది కమ్యూనిస్టు పార్టీ. అలాంటి ఉద్యమాల్లో నిరాహారదీక్షలు, ధర్నాలు జరుగుతుండేవి. అప్పట్లో తాడేపల్లిగూడెంలో ఐ.డి. పోలీస్ పనిచేసే చంద్రరావు "ఎందుకండీ శేషమ్మగారూ, మీరు కూడా వస్తున్నారు? వాళ్ళంతా చేస్తున్నారు కదా!!" అని ఎంతో గౌరవంగా చెప్పేవాడు. కాని మా అత్తయ్యగారు బాగా కోప్పడి, "బజారులో వస్తువులు దొరక్కపోతే ముందుగా ఇబ్బందిపడేది ఆడవాళ్ళేనయ్యా! నీకేం, జీతం తెచ్చి మీ ఆవిడకి ఇచ్చేస్తావు –

# దయామయి

**- యాళ్ళబండి పుణ్యవతి**



ప్రియమైన స్నేహితురాలు శేషమ్మగారి గురించి చిన్నమాట. ఆమె ఒక దయామయి అంటే సరిపోతుంది. ఆమెకు తెలిసినవారు ఎవరైనా ఆపదలోకాని, ఇబ్బందుల్లోగాని వున్నారంటే వెంటనే వెళ్ళి చూడటమేకాదు. తాను చేయగల సహాయం చేసే వారు. అది ఆమె సహజమైన మంచితనం. ఆమె స్నేహం నాకు చాలా సంతోషంగా వుండేది. ఇక కపర్దీగారి గురించి చెప్పాలంటే నాతో నా సొంత అన్నలకంటే ఎక్కువ ప్రేమగా వుండేవారు. ఆయన సొంత చెల్లెల్లా చూసేవారు. ఆయన సొంత చెల్లెలా మీరు అని అడిగిన వాళ్ళు కూడా వున్నారు. వారితో మా కుటుంబానికున్న అనుబంధమే ఇద్దరం వియ్యమందుకొనేంతదాకా వెళ్ళింది. ఆమె జ్ఞాపకం యిప్పటికీ, ఎప్పటికీ మరుపురాని తీపి గుర్తు.

ఇంకా వారి కుటుంబం గురించి చెప్పాలంటే ఆ ఇల్లు ఎప్పుడూ ఆనంద నిలయంగా వెల్లింది. మనస్సు బాగుండకపోయినా, ఆరోగ్యం బాగుండకపోయినా అక్కడకు వెళితే ఎంతో సంతోషంగా వుండేది. ఇంకా వారి పిల్లల గురించి చెప్పాలంటే, ఎవ్వరు వచ్చినా చక్కగా మాట్లాడి సంతోషపెట్టేవారు. నన్నయితే అత్తయ్యగారూ, అత్తయ్యగారూ అని చాలా ప్రేమగా చూసేవారు. చిన్న ఉదాహరణ చెపుతాను "పుణ్యవతి వచ్చాక మమ్మల్ని మరచిపోయా"రని ఒకసారి కపర్దీగారి స్వంత చెల్లెలు ఒకరు అన్నారు. దీన్నిబట్టి వారికి మాకు ఎంత అనుబంధమో చెప్పవచ్చు. ఇట్లా వ్రాస్తుంటే నా మనస్సు గతంలోకి వెళ్ళి చాలా బాధగా వుంది. ఆ కుటుంబం గురించి నాకు వున్న అనుబంధం గురించి చాలా చెప్పాలని వుందిగానీ గతం జ్ఞాపకాలు ఏమీ చెప్పలేకపోతున్నాను. ❑

నెల అంతా ఇబ్బందిపడేది మీ ఆవిడే!" అని ఆడవాళ్ళ సమస్యల్ని ఏకరువు పెట్టి అతని నోరు మూయించేవారు. అలాంటప్పుడు ఆవిడ్ని చూస్తే ఇంట్లో మెత్తగా మాతో కలిసిపోయి ఉండే అత్తయ్యగారిలో అవసరమైతే తిరుగుబాటు చేసే "శేషమ్మగారు" కూడా ఉందని మాకనిపిస్తూ ఉండేది. వీళ్ళంతా నిరాహారదీక్ష చేస్తున్న ఫొటో, ఇప్పటికి ఆ ఉద్యమానికి సజీవ సాక్ష్యంగా మా ఇంట్లో ఉంది. ప్రత్యేక ఆంధ్ర ఆందోళన సమయంలో సమైక్యవాదుల మీద దాడులు జరుగుతుండేవి. అప్పుడు సిపిఐ సమైక్య ఆంధ్ర కోసం పోరాటం చేస్తూ ఉండేది. ఆ సమయంలో ఆర్టీసి కార్మికులు, లారీ వర్కర్స్ తమకు తాముగా వచ్చి "కాపలా ఉంటాం! సాయం ఉంటాం!!" అని అడిగితే చాలా నిక్కచ్చిగా వద్దని వాళ్ళకి సమాధానం చెప్పి, పిల్లలందరితో ఒక్కరే ఎంతో ధైర్యంగా ఉండేవారు అత్తయ్యగారు. ఆ సమయంలో తణుకు నుంచి వంకా సత్యంగారు (మాజీ ఎమ్.ఎల్.ఎ) తన కుటుంబాన్ని కూడా తీసుకొచ్చి మా అత్తయ్యగారి ఇంట్లోనే ఉంచారు. ఇలా ఆమె వ్యక్తిత్వాన్ని వెల్లడించే ఘటనలు కోకొల్లలు. వాళ్ళ పిల్లలతో పాటు మమ్మల్ని కూడా సినిమాలకు, షికార్లకు, ఊరు ప్రయాణాలకు పంపించటం ఇప్పటికీ మాలో సజీవంగా మిగిలిపోయిన తీపి జ్ఞాపకాలు. మా అత్తయ్య గారి గురించి నాకు, మా జగన్కి రోజు ఏదో సందర్భంలో పోట్లాట అవుతూనే ఉంటుంది. వాళ్ళమ్మగారు (శేషమ్మగారు), వాళ్ళ అమ్మమ్మగారు చేసే వంటలతోటి నా వంటలను పోలుస్తూ ఉంటాడు. అవి ఎంతో రుచిగా ఉండేవనీ, అలా వండటం నీకు చేత కాదు!!" అనీ ఇప్పటికి దెప్పుతాడు. నేను తప్పించుకోవటానికి "మీ నాన్నగారు ఊళ్ళో

ఉన్నప్పుడు మాత్రమే మీ అమ్మగారు బాగా వంటలు చేసేవా"రని పోట్లాడుతుంటాను. తల్లిదండ్రులను పదే పదే తలుచుకోవటం పిల్లలకు సర్వసాధారణం. కాని వారు చనిపోయి రెండు దశాబ్దాలు గడిచినా కూడా మా కుటుంబంలో మా మావయ్యగారిని, మా అత్తయ్యగారిని వాళ్ళ పిల్లలు, వాళ్ళతోపాటు మా పిల్లలు, ఏదో సందర్భంలో రోజూ తలుస్తూనే ఉంటారు. ఇదే విషయాన్ని మా పిల్లలతో చెప్పి అలాంటి మంచి అలవాట్లను కొనసాగించాలని ఇప్పటికీ చెపుతూనే ఉంటాం.

శేషమ్మ అత్తయ్యగారి నుంచి, కపర్ది మావయ్యగారి నుంచి మేము నేర్చుకున్నది మంచి మానవసంబంధాలతోటి చక్కటి కుటుంబ జీవితాన్ని ఎలా గడపాలన్న విషయం. దీనికి మన ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ప్రతిబంధకం కాదు అన్న విషయం కూడా తెలుసుకున్నాము. అత్తయ్య గారిలా అందరికి సహాయపడటం, మన దగ్గర ఉన్నది అందరికి పంచటం, అందరిని ప్రేమగా చూడటం, ఆదరించటం అనే సంపదని మేము మా పిల్లలకి వారసత్వ సంపదగా ఇచ్చి వాళ్ళను కూడా మంచి మానవత్వ విలువలున్న మంచి వ్యక్తులుగా మనగలగాలని చెబుతుంటాము. ఇలా మా పిల్లలందరినీ మంచి వ్యక్తులుగా పెంచగలగటమే మేము మా అత్తయ్యగారికి ఇచ్చే "గ్రేట్ ట్రిబ్యూట్" అని నేను అనుకుంటాను. ❑

## అన్నా వదినా అంటే ప్రాణం

**- మందలపర్తి కమలాంబ**



మా నాన్నగారు కపర్ది గారికి మేనల్లుడు, నేను కూడా వాళ్ళింటి కోడలినే అయ్యాను. మా నాన్నగారు కపర్ది మావయ్య గారు దగ్గర వయస్సు, మా నాన్నగారు ఇంటర్ చదవడానికి పెద్ద మేనమామ ఉపేంద్రశర్మ(నేను వారి కోడలిని) గారి ఇంటికి గుంటూరు వచ్చారు. మావగారు హిందూ కాలేజీ లో పనిచేస్తున్నారట. నాన్నగారు లెక్కల్లో వీక్. అందుకని హిందూ కాలేజీలో సీటు యివ్వలేదు. కపర్ది మావయ్యగారు ఎ.సి. కాలేజీలో చేర్పించారు. మీ మేనల్లుడంటున్నారు. ఫెయిల్ అయితే కాలేజీ ప్రతిష్ట పోతుందన్నారట ప్రిన్సిపాల్. నేను హామీ అంటూ మాటిచ్చి కాలేజీలో చేర్పి బాగా ప్రోత్సహించారట. తర్వాత కోయంబత్తూరులో అగ్రికల్చరల్ బి.ఎస్సీ చదవడానికి కపర్ది మావయ్య గారి ప్రోత్సాహం చాలా వుంది. మా పెద్ద బావగారి పెళ్ళిలో (కపర్ది గారి పెద్దబ్బాయి రామచంద్రరావు – బాబి) నన్ను చూసి, కపర్ది మావయ్య గారు, మా అన్నయ్య వదినలకి ఇలాంటి అమ్మాయి కోడలుగా సరిపోతుందని, సుబ్రహ్మణ్యం మావయ్యకి నన్ను ప్రపోజ్ చేశారు. ఆయన ప్రోద్బలంతోనే నా పెళ్ళి జరిగింది. కపర్ది మావయ్య గారికి అన్నయ్య, వదిన అంటే ప్రాణం. 1980లో విశాఖపట్నంలో గుండెపోటు వచ్చి, కోలుకుని హైదరాబాద్ తిరిగి వెళుతున్న కపర్ది మావయ్య గారిని చూడటానికి అత్తయ్య, మామ గారు విజయవాడ స్టేషన్‌కు వెళ్ళారు. అప్పటికి నేను, మా వారు హైదరాబాద్‌లో వున్నాం. మావయ్య గారిని చూడటానికి మేము వెళితే, తన ఆరోగ్యం సంగతి పక్కన పెట్టి వాళ్ళ అన్నయ్య గురించి నాకు జాగ్రత్తలు చెప్పారు. మా అన్నయ్యకు వళ్ళు వచ్చింది. ఆరోగ్యం సరిగా లేనట్టు కనిపిస్తున్నాడు జాగ్రత్త అంటూ అప్పగింతలు పెట్టారు. మా మామ గారికి పాలలో బ్రెడ్ వేసుకుని తినే అలవాటు. అది మాన్పించి పాలు తగ్గించమన్నారు. "బాగుండదేమో మామయ్య గారు" అంటే, "కపర్ది చెప్పాడని చెప్పు" అన్నారు. ఆయన వాళ్ళ అన్నయ్యని చూడటం అదే ఆఖరు. తరువాత రెండు రోజులకే మా మామ గారు చనిపోయారు. కపర్ది మావయ్యకు అది కోలుకోలేని దెబ్బే. ❑

# Down the memory line



Nitish Mandalaparthy



I did not realize that it would be such a challenging task to pen down my memories. I tried and got tired of giving shape to my memories and suddenly realized that the actual challenge is not penning down my thoughts but finishing writing about a man in a couple of pages about whom you could easily write a couple of books. Such was the personality my grandfather carried. By no means, he was an ordinary man and in my opinion, he was no less than a legend. I was fortunate to have spent more than 5 yrs of my childhood with him and I was also fortunate to have the first-mover advantage by being his eldest grandson. My father and uncles fondly recalled, on a number of occasions, the fun he had donned the role of a grandfather. I do remember some of them, myself, even today. I never used to let him go out without receiving the bribe and the bribe used to be a few chocolate cookies from the bakery opposite our house in Himayath Nagar.

I still remember the fun myself and my younger brother Satish had in the lift of Makhdoom Bhavan which was our favorite amusement place. I remember how we once got stuck up in the lift due to a power failure but we were lucky that someone or other was always watching us and we got out safely. I would say that we were always in the ambit of the radar of our grandfather, which protected us. He had amazing control and command in whatever he did and had a fantastic aura of personality that would leave a lasting impression on anybody and everybody who came in contact with him. I didn't understand this at that age but I started realizing it as I grew up.

For me life was fun. I had the best childhood and my grandfather's house was full of life. I didn't understand how privileged I was to be born as his grandson. I realize it only now when I miss him most. As I grew up I started realizing the greatness of my grandfather and experienced it in many ways and I would like to share some of my thoughts with you all.

In everybody's life, there are some great incidents that would change the course of his or her life and in my opinion, the most important event in my grandfather's life was his marriage with my grandmother, late Seshamma. I always feel that was the best decision in his life as I feel that he would not have achieved even a quarter of what he has accomplished in his life if it had been any other woman in her place. As the saying goes "Behind every successful man there is a woman" and behind the success of my grandfather, it was my grandmother who stood her ground and supported him in all walks of his life.

Undoubtedly, they were the greatest of lovers I have known in my life the kind of love they shared cannot be expressed in words. They had an amazing telepathy between them and they just knew what the other person wanted from him/her. I cannot recollect any incident where someone told me about their having an argument on anything and I would say my grandfather was very lucky to

have got married to my grandmother and this is undoubtedly the biggest factor that gave him the luxury to stay focused on his goals.

My grandfather had an amazing sense of responsibility towards the society he lived in as he always used to feel that one can never be happy if people around him are suffering. He was never bothered about anybody to understand his philosophy of life nor waited for anybody to support him. He was an initiator and finisher rolled into one.

He always believed in the law of equality and was a true secularist. He just did not preach secularism but put it into action as he encouraged his children to marry girls from any caste/religion.

I consider him a great parent too-he gave freedom to his children to decide how they wanted to lead their lives and never interfered in their lives unless and until it was necessary. This helped them to grow as confident and independent individuals. We, as his grandchildren, are also very lucky to have been raised similarly.

There is no doubt that he was a legend. Sometimes I wonder whether any one of us can accomplish at least a fraction of what he had achieved during his lifetime. I consider him a benchmark and an example of living life king-size. I am sure that one can learn a lot of things from him that can add tremendous value to one's life. When I think of his life the most striking point I observe in his personality is his "Passion". I feel what ever he did - whether it is a fight for a cause or standing for values or loving his friends and family-there is passion in everything he did and this has made him a man of a different class altogether.

For me, who has only seen good times in life and the society I live in, it is hard to imagine that men of his generation fought for this country, fought for freedom, and social justice and fought against inequalities. For me, all these words sound like a lesson from a Social Studies textbook. For me and many of my age, history is a fairy tale because we read about it but never had an opportunity to experience it. I feel proud that my grandfather took part in the freedom struggle and fought to ensure justice for the people around him even after the independence. He never cared for his comfort or that of his family. He toiled hard for the society. It is so easy for me to pen down a few lines but I know it would not have been easy for my grandfather to lead a life like that. He must have had enormous difficulties in his day-to-day life, he must have gone through many phases of emotional disturbances and acute financial crises but he never let anything shake his faith in the ideology he believed in. He never shied away from his other roles of being a responsible son, husband, brother, father, uncle and friend. I find it amazing that he lived his life with such ease and never made anybody feel the stress he was carrying.

I belong to a generation where management is such a big school, there are "n" numbers of books on how to manage yourself, how to manage time, how to manage people and also books to teach you about managing relationships, for us leading a normal life without any social responsibilities itself is a big challenge and when I think of my grandfather I feel I am looking at a Giant who never required any books or management schools to teach him how to manage his life.

I always miss him and will continue to miss him till my last moment, I feel proud that I am his grandson. If I can accomplish at least 10% of what he achieved I shall consider that I have lived my life completely. ❑

# నాన్న గారి నాన్న గారు!

## కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు

- స్మితా కపర్దిని



నేను కపర్దీ-శేషమ్మ గార్ల పెద్ద మనవరాలిని - వాళ్ల మూడో అబ్బాయి కీ.శే. మందలవర్తి నారాయణమూర్తి గారి కూతురిని. మా అమ్మ పేరు శేష కనకదుర్గ. మా శేషమామ్మకి కార్డియాక్ అరెస్ట్ అయి, నిమ్స్‌లో ఉండగా నేను పుట్టానట. తనకి మా తాతగారు గొప్ప చమత్కారంగా నా పుట్టుక వార్త చెప్పారని మా ఇంట్లో పెద్దవాళ్లు చెప్తారు.

ముందో స్వీట్ చేతిలో పెట్టి, నీకో స్వీట్ న్యూస్ చెప్పనా?! కనకానికి అచ్చం నీ లాంటి ఆడ పిల్లే పుట్టిందోయ్!" అన్నారట తాత గారు. ఆవిడ ఒక్క క్షణం ఎక్సైట్ అయినా, వెంటనే సర్దుకుందట! శేషమామ్మ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి వచ్చిం తర్వాత, నాకు 'స్మిత' అని పేరు పెట్టింది. మా తాతగారు పోయిం తర్వాత, నాన్న గారు నా పేరుకి 'కపర్దిని' జోడించారట! నా పేరులోనే తాత గారూ మామ్మల జ్ఞాపకాలు దాచుకున్నందుకు నాకెంతో గర్వంగా ఉంటుంది.

నాకు రెండేళ్ల వయసు వచ్చే నాటికే, తాత గారూ మామ్మా పోయారు. నాకంటూ వాళ్ల గురించి ప్రత్యేకంగా ఏం జ్ఞాపకం లేదు. మా అమ్మ పేరులోనూ, ఆమెకి ముందు మేనత్త - తర్వాత అత్త గారూ అయిన మా శేషమామ్మ పేరులోనూ, ఆవిడకి ముందు మేనత్త తర్వాత అత్తగారూ అయిన మా తాత మామ్మ పేరులోనూ కూడా 'శేష' అని ఉండడం ఓ విశేషం! వాళ్లు ముగ్గురూ మూడు తరాలకు చెందిన బొమ్మకంటివారి ఆడపడుచులే.

మా శేషమామ్మ గురించి చాలా మంది చాలా విశేషాలు చెప్తారు. అన్నింట్లోకీ మా సత్యవతత్తయ్య గారు తరచు చెప్పే ఓ విషయం నాకు ఇప్పుడు గుర్తుకు వస్తోంది. ఆవిడకి ఏ మాత్రం అవకాశం దొరికినా మా మామ్మ ఎంత ఓపికమంతురాలో కథలు కథలుగా చెప్తారు. అక్కడితో ఆగిపోతే బాగుండును - మాకెవ్వరికి అంత ఓపిక లేనందుకు మా అత్తయ్య మమ్మల్ని దెప్పుతుంటారు కూడా! ఆవిడే కాదు మరెందరిదగ్గరో మేం ఇలాంటి విషయాలే విన్నాం. మా మామ్మకి గొప్ప బ్యాలెన్స్ ఉండేదని కూడా అనిపిస్తుంది.

సాధారణంగా, ఇళ్లలో తాతయ్యలూ మామ్మలూ ఉంటే, వాళ్లు పిల్లలకి కథలూ కబుర్లూ చెప్తారు. మా ఇంట్లో అలా కాదు. మేం చిన్నప్పటి నుంచి మా మామ్మ, తాతగార్ల గురించిన కథలు వింటూనే పెరిగాం. నాకు ఊహ తెలిసే నాటికే, మా తాత గారు పెద్ద లీడరనే సంగతి నాకు తెలుసు. (మా ఇంట్లో పుట్టి పెరిగిన వాళ్లందరికీ దాదాపు ఇదే అనుభవం!) నిజానికి, తాత గారే మాకందరికీ తొలి హీరో! తాతగారి వేలు పట్టుకునే నేను బుడిబుడినడకలు నేర్చాను. నాకింకా మాటలు రాక ముందే, ఆయన నాకు చిన్న చిన్న పాటలు నేర్పించారట!

తాత గారి గురించి నాన్న గారు చెప్పిన చాలా విషయాల్లో ఒకటి నా మనసుకు హత్తుకుపోయింది. నా ఫస్ట్ బర్త్ డే 'గ్రాండ్'గా సెలెబ్రేట్ చెయ్యాలని మా వాళ్లనుకున్నారట. తాత గారు ఆ రోజుకు వచ్చేస్తానని ప్రామిస్ చేసి, వైజాగ్ వెళ్లారట. అయితే, అక్కడ ఉండగా ఆయనకి హఠాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చిందట. ఆయన కొద్ది రోజులు హాస్పిటల్లో ఉండాల్సి వచ్చిందట. తన అనారోగ్యం కారణంగా నా బర్త్ డే సెలెబ్రేట్ చెయ్యకుండా మానేస్తారేమోనని, తాత గారు వైజాగ్ నుంచి ఫోన్ చేసి, అలా ఎంత మాత్రం చెయ్యవద్దని మరీ మరీ చెప్పారట. పిల్లల మీద ఆయనకెంత కన్సర్న్ ఉండేదో ఈ విషయం వింటే తెలుస్తుంది. మా నాన్న గారికి కూడా పిల్లలంటే ప్రాణం. ఆయన్ని ఇంట్లో అంతా 'చిట్టిపాప' అంటారు. నిజంగా మా నాన్న గారు సార్ధకనాముడు! అంతకుమించి, పిల్లల విషయంలో నాన్న గారు వాళ్ల నాన్న గారికి అచ్చంగా వారసుడు!! నాన్నగారికి పుస్తకాలన్నా, చదివే వాళ్లన్నా చాలా ఇష్టం. తన తమ్ముళ్లకూ, చెల్లెళ్లకూ, మాకందరికీ పుస్తకాలు పరిచయం చేసింది నాన్నగారే! ఎవరికైనా గిఫ్ట్ ఇవ్వాల్సి వస్తే నాన్న గారు పుస్తకాలే ప్రిఫర్ చేసేవారు.

మా నాన్నగారు పుట్టిన కొద్దిరోజులకే, మా తాతగారు అరెస్టయి నాలుగేళ్లు జైల్లో ఉన్నారట. నాలుగేళ్ల వయసు వచ్చే వరకూ నాన్నగారు వాళ్ల నాన్నగారిని చూడనేలేదట! అటు తర్వాత కూడా నాన్న గారు తాత గారితో డైరెక్ట్‌గా మాట్లాడడానికి జంకేవారట. మామ్మ ద్వారానే తాతగారికి చెప్పించేవారట. అలా చేసినందుకు తాత గారు నవ్వేవారట కూడా. మా మామ్మకి ఆడపిల్లలంటే చాలా ఇష్టమట. ఆవిడ మా నాన్న గారిని - చిన్నప్పుడు- ఆడపిల్లలా తయారు చేసి ముచ్చట తీర్చుకునేదట. ఇలా ఇంకా ఎన్నో జ్ఞాపకాలు మదిలో మెదులుతూ ఉంటాయి. ❑

# ఓ ఫ్లాష్ బ్యాక్

## కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు



- మందలపర్తి సతీష్

కపర్దీ గారు మా తాతగారు. మా నాన్న గారు - మందల పర్తి రామచంద్రరావు, తాతగారి పెద్దబ్బాయి. మా శేషమామ్మ గురించీ, తాతగారి గురించీ నాకు తెలిసిందానికంటే విన్నదే ఎక్కువ. వాళ్లను అందరూ ఎందుకంతగా పొగుడుతారో, అభిమానిస్తారో, గౌరవిస్తారో నాకు చాలాకాలం వరకూ అర్థం కాలేదు. అందుకే, వాళ్ల గొప్పతనం గురించీ, వాళ్ల మంచితనం గురించీ, వాళ్ల స్ట్రగుల్స్ గురించీ నేనంతగా చెప్పలేను. మా అమ్మ ఇందిరాదేవి నాకు ఊహ తెలియకముందే పోయింది. ఆవిడ గురించి దాదాపు నాకేం తెలియదు. మానాన్న గురించి నాకు బాగా తెలుసు. కానీ ఆయన్ని నేనూ, నన్ను ఆయనా అంతగా అర్థం చేసుకోలేకపోయాం - అనిపిస్తుంది. అంటే, నేను అమ్మా-నాన్నల గురించి కూడా చెప్పగలిగేది పెద్దేమీ ఉండదు. అయితే, నాక్కూడా బాగా తెలిసిన విషయాలు ఒకటీ అరా లేకపోలేదు. వాటిని మీతో పంచుకోవాలనే, ఈ నాలుగు ముక్కలు రాసే సాహసం చేస్తున్నా. ఇప్పుడు మిమ్మల్ని ఓ పాతికేళ్లు వెనక్కి తీసుకెళ్తున్నాను! ఈ ఫ్లాష్‌బ్యాక్ గొడవెందుకంటే, నేను చెప్పబోయే ఒకటీ అరా విషయాలు అప్పటివే కాబట్టి. విషయ పరిజ్ఞానంలో నా సాఫ్ట్‌వేర్ పెద్దగా అప్డేట్ కాలేదు కాబట్టి ఫ్లాష్‌బ్యాక్ చక్రాలు తిప్పక తప్పడం లేదు. నాకప్పుడు అయిదారేళ్లుంటాయేమో. మాది ఓ ఉమ్మడి కుటుంబం టైపు. అడక్కుండానే అన్నీ కొనిచ్చే మా చిట్టి బాబాయ్ అన్నా, జిల్లెళ్లమూడి అమ్మ కథలు చెప్పి- నాతో ఓ సినిమా కూడా తీస్తానని వాగ్దానం చేసి - తప్పించుకు తిరుగు తున్న మా అంజి తాతయ్య అన్నా నాకు చాలా ఇష్టం. వాళ్లే నా చిన్నప్పటి హీరోస్! నాకు తెలిసినంత మటుకు నాకు జరిగినంత గారం మా ఇంట్లో ఎవరికీ జరగలేదు. మా తాతగారి ఇల్లు ఓ పెద్ద సంతలా ఉండేది. మేమంతా హిమాయత్‌నగర్‌లో ఉన్న సత్యనారాయణరెడ్డి భవన్‌కు వెనక వైపు ఉన్న చిన్న పోర్షన్‌లో ఉండేవాళ్లం. నాకు ఊహ తెలిసే టైమ్‌కు మేమంతా కమ్యూనిస్టులమని తెలుసు. (అయితే, కమ్యూనిజమన్నా, కమ్యూనిస్టులన్నా ఏమిటో ఎవరో నాకు అప్పటికీ ఇప్పటికీ కూడా పూర్తిగా అర్థం కాలేదు). అప్పట్లో నాకు తెలిసిన 'మహానటుడు' మాదాల రంగారావే! మఖ్దూం భవన్ లిఫ్టే నాకు తెలిసిన ప్లే గ్రౌండ్. గోరింటాకు పెట్టుకునే మా అత్త దగ్గిరకెళ్లి నాకూ పెట్టమంటే, ఓ చేతి మీద సీపీఐ అనీ, ఇంకో చేతిమీద కత్తీ సుత్తీ బొమ్మా వేసింది మా అత్త.

ఆ రోజుల్లో అందరి మూడ్ అలా ఉండేది. ఏదో అర్థం కాని స్పిరిట్ ఉండేది అందరిలోను. 1980-82 మధ్యలో మా ఇంట్లో పెనుమార్పులు జరిగాయి. మా కుటుంబం రూపురేఖలే మారిపోయాయి. మా తాతగారు, మా అమ్మ, మా శేషమామ్మ, తాతమ్మలిద్దరూ వరసగా - రెండు మూడేళ్ల గ్యాప్‌లోనే పోయారు. మా నాన్నకీ, బాబయ్యలకీ, అత్తలకీ అవి కోలుకోలేని దెబ్బలు. మామూలు వాళ్లయితే ఆ దెబ్బలకి ముక్కలైపోవాల్సిందే! కానీ మా వాళ్ల టైపే వేరు. మాది కపర్దీ గారి కుటుంబం. మా తాత ఓ జెయింట్. ఆయన ఇంపాక్ట్ మా వాళ్ల మీద ఎంతో కొంత పడకుండా ఉంటుందా?

మా నాన్న, మా బాబాయిలు-ముఖ్యంగా మా శ్రీపతి బాబయ్యా, బాబూరావు బాబయ్యా - మా కుటుంబం బాగు కోసం పడ్డ శ్రమ గురించీ, వాళ్ల ఆరాటం గురించీ, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న తీరు గురించి ఎంత చెప్పినా తక్కువే! అయినా నా వంతు ప్రయత్నం చేస్తాను. రాముడనే పేరులోనే ఉందేమో, అసలు గొడవంతా! ఆ విధంగా మా నాన్న సార్థక నాముడనే చెప్పాలి. ఆ రాముడిలాగానే మా నాన్న కూడా జీవితాంతం కష్టపడ్డాడు. అమ్మ పోయాకా మా కోసం ఒంటరిగానే ఉండిపోయాడు. నిజాయితీ కలిగిన ట్రేడ్ యూనియనిస్టుగా ఈసీఐఎల్ బాగు కోసం కృషిచేశాడు. మా నాన్నకు చివరికి మిగిలింది ఆయన స్నేహితులే! ఇక, మా శ్రీపతి బాబయ్య విషయానికి వస్తే, మా తాతగారి తర్వాత సీపీఐ హోల్‌టైమర్‌గా సేవలందించాడు. అందుకోసం ఆయన తన కెరీర్‌ను పక్కన పెట్టాడు. పేరుకు మా నాన్న ఇంటికి పెద్దయినా, మా బాబయ్యదే అసలు పెత్తనం. మా ఫ్యామిలీ సర్కస్‌కు ఆయనే రింగ్ మాస్టర్. మా చిట్టి బాబయ్య గురించి ఒక్క మాటలో చెప్పాలంటే, ఇప్పుడే పుట్టిన పసిపాప కన్నా కూడా ఎప్పుడూ ఒక నిమిషం చిన్న పాపాయే మా చిట్టిపాప బాబాయ్. తనే నా ఫస్ట్ ఫ్రెండ్! నా తొలి ఉపాధ్యాయుడు!!

మా తాత గారి ఇరవై అయిదో వర్ధంతి సందర్భంగా ఆయన్ని తలచుకునే ఈ ప్రయత్నంలో వీళ్లందరి గురించి రాయడానికి ఓ బలమైన కారణం ఉంది. నిజానికి మా నాన్న కానీ, మా బాబయ్యలు కానీ, మా తాతగారంత లెజెండ్సేమీ కాదు. ఆయనంత చదువుకోలేదేమో కూడా. కానీ, ఆయనంత గొప్పగానే లైఫ్ లీడ్ చేశారు. మా తాతగారి విలువలకెంతో

విలువిచ్చారు. మాది కపర్దీ గారి కుటుంబం అన్న గొప్ప ఫీలింగ్‌ను కాపాడారు. ఇప్పటికీ వాళ్లంతా కలసికట్టుగానే ఉన్నారు. వాళ్ల భావాలను మా మీద ఎప్పుడూ రుద్దలేదు. (రుద్దాలనుకున్నా అందుకు మేం అవకాశమిచ్చేవాళ్లం కాదేమో!). మాకెలాంటి ప్రిస్క్రిప్షన్స్ ఇవ్వలేదు. మమ్మల్ని వాళ్లు పెంచలేదు – పెరగనిచ్చారు. అదీ వాళ్ల గొప్పతనం!!

ఇన్నాళ్ల తర్వాత మా కుటుంబానికి మళ్లీ కష్టకాలం వచ్చింది. మా చిన్నప్పటి సంక్షోభమే రిపీట్ అవుతోందేమో అనిపిస్తోంది. వరసపెట్టి మూడు వికెట్లు పడిపోయాయి. ఇదే మాకు సిసలైన టెస్ట్ టైమ్. ఇప్పుడు పరిస్థితులన్నీ మారిపోయాయి. అప్పటి వాళ్లకున్న బాండేజ్ గానీ, బలమైన ఫీలింగ్స్ కానీ, ఐడియాలజీ కానీ ఇప్పుడు మాలో లేవు. ఈ మార్పులు మా కుటుంబం మీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయో చూడాలి. 'నార్మల్సీ ఈజ్ హెల్త్' అంటాడు మా బాబయ్య. మారుతున్న కాలాన్ని బట్టి మారడం ఆరోగ్యమే అయితే మేం మారుతున్న విధానం మంచిదే కావాలి. అయితే, ఆ విషయంలో నా అనుమానాలు నాకున్నాయి. ఇప్పుడు జరిగే ఈ రెట్రాస్పెక్టివ్ సందర్భంగా ఒక్క విషయం చెప్పి తీరాలి. అప్పటికీ, ఇప్పటికీ, బహుశా ఎప్పటికీ మా తాతగారే మా ఇంట్లో అందరికన్నా ప్రోగ్రెసివ్! ఇందులో అతిశయోక్తి ఆవగింజంత కూడా లేదు!! ❑

---

# అపర లక్ష్మణుడే

– మండలపర్తి సుబ్రహ్మణ్యశర్మ



కపర్దీ బాబయ్య మా అమ్మకి ప్రియమిత్రుడు. వరసకి మరిది అయినా కొడుకులానే చూసేది. తనూ అలానే వుండేవాడు. లక్ష్మణుడిలాగా మా బాబయ్యకి అమ్మ, నాన్న గారి మాటే వేదం. చదువుకుని సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నా అమ్మ దగ్గర మాత్రం ఎంతో వినయంగా, మన్ననగా వుండేవాడు. బాబయ్య హాస్యం మా అమ్మకి చాలా యిష్టం. నాన్న గారికి వివాహమయ్యేటప్పటికి బాబయ్య వయసు నాలుగేళ్ళట. అమ్మ దగ్గర బాగా మాలిమి. బాబయ్య భగవద్గీత వెనుక నుండి కూడా అప్పజెప్పేవాడని అమ్మ చెప్పేది. ఏదైనా వస్తువు కనపడక అమ్మ వెతుకుతుంటే బాబయ్య దానిని వర్ణించి తనకు తెలుసన్నట్లే చెప్పేవాడట. ఎక్కడుందో చూశావా? అంటే తెలీదనేవాడట. అయితే ఇద్దరం కలిసి వెతుకుదామనేదట అమ్మ. అమ్మా, నేను, బాబయ్య సినిమాలకి వెళ్ళేవారం. గుంటూరు కృష్ణనగర్లో ఇల్లు కట్టిన కొత్తలో బాబయ్య వచ్చాడు. నేను, బాబయ్య, అమ్మ, కలిసి సినిమాకి వెళ్ళాం. ఎం.ఎల్.ఎ. అనుకుంటా, అప్పట్లో ఆనందమహల్ ఇప్పుడు జ్యోతిమహల్. సినిమా అయిపోయేసరికి జోరున వాన, రిక్షా కూడా దొరకలేదు. ఎలాగో ఒక రిక్షా దొరికితే సగం తడిసి ఇంటికొచ్చి నాన్నగారితో తిట్లు తిన్నాం. బాబయ్య బి.ఎస్.సి గుంటూరు ఎ.సి. కాలేజీలో చదివేవాడు. అప్పటికే రాజకీయాలలోకి వెళ్ళాడు. ఇంట్లో వుంటే తన ఉద్యమ కార్యకలాపాలకి ఇబ్బందని బయట రూం తీసుకున్నాడు. క్రొవ్విడి నరసింహం, డా॥లక్ష్మీపతి, ఇంగ్లీష్ లెక్చరర్ టి.వి.జి. కృష్ణమూర్తి (తురగా వేణుగోపాల కృష్ణమూర్తి) గార్లు బాబయ్యకి మంచి ఫ్రెండ్స్, బాబయ్య రాజకీయాలలో తిరుగుతున్నందుకు అమ్మ, నాన్నగారు ఏమీ అనేవారు కాదు. కానీ మాకు పాలు పోసే బాపనమ్మ మాత్రం ఏమయ్యా కపర్దీ గారు, పార్టీ, పార్టీ అని తిరుగుతున్నావు. చదువు మీద దృష్టి పెడితే మంచి లాయరయ్యే వాడివి కదా అంది ఒకసారి. నాకు లాయర్లకంటే మంచి పేరే వుందని సమాధానం చెప్పేడట. డబ్బు వద్దా అంటే అదే వస్తుందిలే అని కొట్టిపారేశాడట. అమ్మ తరువాత బాపనమ్మని మందలించిందట.

బాబయ్య జోక్యం లేకుండా మా ఇంట్లో ఏదీ జరిగేది కాదు. 1974 ఏప్రిల్ 27న నా పెళ్ళి జరిగింది. అది కూడా బాబయ్య ప్రోద్బలంతోనే, మా అమ్మకి ఎలాంటి కోడలైతే బాగుంటుందో వెతికి, తనే నిర్ణయించి చేశాడు. బాబయ్య వుంటే అమ్మకి, నాన్న గారికి కొండంత అండ. 1978లో మా నాన్నగారికి ప్రొస్టేట్ గ్లాండ్ ఆపరేషన్ జరిగింది. బాబయ్య మాతోనే వున్నాడు. ఒకే రోజు రెండుసార్లు ఆపరేషన్ చెయ్యాల్సి వచ్చింది. రెండవసారి అనస్థీషియా ఇస్తే కోమాలోకి వెళ్ళిపోయే ప్రమాదం వుందని డాక్టర్లు చెప్పారు. అప్పుడు బాబయ్యే మాకు ధైర్యంగా, అండగా నిలబడ్డాడు. అన్నిటికీ తనే బాధ్యత వహిస్తానని సంతకం చేశాడు. మా పిన్ని నన్ను ఎప్పుడూ బావగారి కొడుకులా చూడలేదు. స్వంత కొడుకుగానే ప్రేమాభిమానాలు పొందాను. అమ్మ, పిన్ని అక్కచెల్లెళ్లలానే వుండేవారు తప్ప తోడికోడళ్ళలా వుండేవారు కాదు. కుటుంబ గౌరవ ప్రతిష్టలు కాపాడటానికి ఇద్దరూ ఎంతో కష్టపడ్డారు. పిన్ని చివరి రోజుల్లో నిమ్స్‌లో వుండగా చూసి చాలా బాధపడ్డాను. అమ్మ బాధ చెప్పలేను. నాకంటే చిన్నది అప్పుడే నా.. అంటూ బాధపడేది. రామచంద్రరావు గారి సంతానంలో మిగిలిన వాళ్ళంతా ఒక ఎత్తు, నాన్న గారు, కపర్ది బాబయ్యల అనుబంధం ఒక ఎత్తు. అది అపురూపమైనది. ❑

# కపర్దీ మావయ్య గారు

## కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు



- బొమ్మకంటి నాగరాజు


కపర్దీ గారు మా మావయ్య గారు. అయితే, నేను హైదరాబాద్ రావడానికి ముందు ఆయన్ని మూడే మూడుసార్లు చూశాను. 1974 జనవరిలో మా శ్రీపతి బావ పెళ్లిలో నేనాయన్ని మొట్ట మొదటిసారి చూశాను. వంకా సత్యంగారు సిపిఐ అభ్యర్థిగా పెనుగొండ నుంచి పోటీ చేసినప్పుడు మా మావయ్య గారు మా ఊరు (యండగండి) వచ్చారు. అక్కడ జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. అది రెండోసారి ఆయన్ని చూడ్డం. మూడోసారి కూడా యండగండిలోనే, మా అక్క పెళ్లిలో మావయ్య గార్ని చూశాను.

మావయ్య గారి కుటుంబం గురించి చెప్తే, మావయ్య గారి గురించి చెప్పినట్లే అవుతుందని అదే పని చేస్తున్నాను. 1975 సెప్టెంబర్ 28న మా పెద్దక్క పెళ్లి అయిన తర్వాత ఆవిడ హైదరాబాద్ వెళ్లిపోయింది. దాదాపు నాలుగేళ్లపాటు మా అక్క మా ఇంటికి రాలేదు. మధ్యమధ్యలో మా శ్రీపతిబావ, హైదరాబాద్ వెళ్లొచ్చినప్పుడల్లా మా ఇంటికొచ్చి, అక్క గురించీ, అత్తయ్య గురించీ, మావయ్యగారి గురించీ విశేషాలు చెప్పి వెళ్లేవాడు. ఆ ఒక్క కారణం చేతనే మాకు ఆయనంటే గౌరవం. తర్వాత కొంతకాలానికి మా అమ్మ పోయింది. నేను హైదరాబాద్ వచ్చేశాను. అప్పటికే, మా చిన్నక్క కృష్ణకుమారి అత్తయ్య వాళ్లింట్లోనే ఉండేది. నేను కపర్దీగారి ఇంట్లోనయితేనేమి, మా బావ ఇంట్లోనైతేనేమి, మొత్తం 12 ఏళ్లు ఉన్నాను. ఒక్కో సంవత్సరం అనుభవాలను ఒక్కో పుస్తకంగా రాయొచ్చు! (అయితే నేనా పని చెయ్యట్లెండి!) వీలైనంత క్లుప్తంగా నా జ్ఞాపకాలు రాయడానికి ప్రయత్నిస్తాను.

మా బావలు - ముఖ్యంగా మా జగన్ బావ, కిషోర్ బావ, అప్పుడప్పుడు మా చిట్టిబావ - మా అంజి బాబయ్యతో అనేక విషయాలు చర్చించే వాళ్లు. సాహిత్యం, రాజకీయాలూ, సాహిత్య రాజకీయాలూ, సినిమాలూ, సినిమా పాటలూ ఇలా ఏ విషయం మీద చర్చించినా ఓ పోజిటివ్ అప్రోచ్ ఉండేది. అప్పట్లో నేను ఆ చర్చలను ఆసక్తిగా గమనించేవాణ్ణి గానీ పాల్గొనేవాణ్ణి కాదు. అయితే, ఏ విషయాన్నయినా పోజిటివ్ గా ఆలోచించాలన్న విషయం ఆ చర్చల ద్వారానే నాకు అర్థమయింది.

నా జీవితాన్ని మలుపు తిప్పిన ఓ విషయం గురించి చెప్పకపోతే నాకు తృప్తిగా ఉండదు. నేను హైదరాబాద్ వచ్చేసరికి టెన్త్ తప్పి ఉన్నాను. మా అరుణక్క - మా బాబూ రావు బావ భార్య - నన్ను కోఠీలోని సెంట్రల్ బ్యాంకు పక్కన ఉండే రావూస్ ట్యుటోరియల్స్‌లో చేర్పించి నేను టెన్త్ గండం గట్టెక్కేలా చేసింది. మా అత్తయ్య నా లెక్కల పరీక్ష తనకే అన్నంత సీరియస్‌గా తీసుకుని ఆ భారం మా బాబూరావు బావ నెత్తిన పెట్టింది. అందుకే నేను పరీక్ష పాస్ కాగలిగాను.

నాకు అన్నీ ఓపిగ్గా నేర్పించాడు. తన పుణ్యమా అని నేను పరీక్ష పాసయ్యాను. అంతలో, మా మావయ్యగారు పోవడంతో అత్తయ్య తాడేపల్లిగూడెం వెళ్లిపోయింది. నేను కొంతకాలం హిమాయత్ నగర్‌లో మా బాబయ్య వాళ్లింట్లో ఉన్నాను. ఆ రోజుల్లో రోజూ మఖ్దూమ్ భవన్‌కు వెళ్లేవాణ్ణి. మా కిషోర్ బావ అప్పట్లో కొంత కాలం మా బాబూరావు బావ ఇంట్లో ఉండే వాడు. రోజూ తను మఖ్దూమ్ భవన్‌కు వచ్చేవాడు. తన ఫ్రెండ్స్ అందరూ నాకూ ఫ్రెండ్సే. వాళ్లతో కాలక్షేపం చేసేవాణ్ణి. ఓ రోజు మఖ్దూమ్ భవన్ లాంజ్‌లో టీవీ చూస్తుండగా ఓ పెద్దాయన వచ్చి నా పక్కన కూర్చున్నారు. ఎవరి తాలూకా బాబూ?" అని నన్నడిగారు. "నేను కపర్దీ గారి మేనల్లుణ్ణి" అనిచెప్పాను. "కిషోర్‌తో వచ్చావా?" అని అడిగి ఆయన వెళ్లిపోయారు. ఆయనెవరని సత్యపాల్‌రెడ్డి గారిని అడిగాను. "ఆయనెవరో తెల్వదా? ఆయనే సి.ఆర్!!" అన్నారు సత్యపాల్. నేను ఆశ్చర్యపోయాను ! మా బావలందరికీ - వదినలకి సైతం - నేనంటే ప్రత్యేకమైన అభిమానం. నాతో మా బావలంతా ఎప్పుడూ సరదాగా కబుర్లు చెబుతూ, హాస్యాలాడుతూ ఉంటారు. వాళ్లు అలా ఉండటమే నాకూ ఇష్టం !! ❑



# అనుభూతి నుండి అనంతానికి..

## కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు

- భాగవతుల కుటుంబరావు

కపర్దీ గారు మా అక్క ఇందిరాదేవి మామ గారు. ఆయనని నేను చాలా తక్కువసార్లు, సమీపం నుంచి గమనించాను. అయినప్పటికీ వాటి ప్రభావం నాపై కొన్ని విషయాల్లో చెప్పుకోదగ్గంతగా ఉన్నదని నా భావన. కపర్దీ గారిని తలుచుకున్న ప్పుడల్లా నా మనసులో ముద్రింపబడిన ఒక సంఘటన ఎప్పటికప్పుడు 'రీ ప్లే' అవుతుంది. అప్పుడు నా మనసు ఆనందానుభూతులకు లోనవుతుంది. ఆ పాజిటివ్ వైబ్రేషన్‌లో ఏదో ఒక కొత్త విషయం ఎప్పటికప్పుడు స్ఫురిస్తూ ఉంటుంది. అప్పుడు ఆ సంఘటన మరింతగా నా మనో ఫలకంపై మరింత బలపడుతుంది. ఇది దాదాపు పాతికేళ్లుగా పునరావృతమవుతున్న తంతు.

అది 1981 మార్చి మొదటి రెండు వారాల్లో ఒక రోజు. అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నానంటే 1981 ఫిబ్రవరి 21న మా పెళ్లి జరిగింది. ఆ సమయానికి కపర్దీ గారు ఊళ్లో లేరు బహుశా దేశంలోనే లేరేమో గుర్తు లేదు. అందువల్ల మా పెళ్ళికి రాలేదు. మా పెళ్ళయిన ఒకటి రెండు వారాల తర్వాత ఆయన ఊళ్ళోకి రాగానే మా ఇంటికి వద్దామనుకుంటున్నట్లుగా కబురు పంపించారు. భోజనానికి వచ్చేటట్లు రమ్మని మేము ఆహ్వానించగా వారు మన్నించారు. మధ్యాహ్నం పదకొండు, పన్నెండు గంటల మధ్యలో ఎండలో ధర్మపత్ని శేషమ్మ గారితో రిక్షా దిగారు. సాదరంగా ఆహ్వానించాము. వారు కుశల ప్రశ్నలు వేశారు. పెళ్లెలా జరిగిందో అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెళ్ళి ఫొటో ఆల్బమ్ చూశారు. ఆశీర్వదించారు. ఆహ్లాదపూరిత వాతావరణాన్ని కలిగించారు. అందరితో భోజనం చేస్తూ బావున్న పదార్థాలను బాగున్నాయని చెబుతూ ప్రశంసించారు. ఎండవేళ కాసేపు విశ్రమించారు. సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత బయలుదేరుతూ రిక్షా ఎక్కుతూ అన్నారు. 'కుటుంబరావు నీ పెళ్ళికి రాలేదన్న కొరత నాకు తీరిందయ్యా. నీకు సంతోషమేనా' అని. 'చాలా సంతోషంగా ఉందండీ మామయ్య గారూ' అన్నాను. అప్పుడు నా వయస్సు ఇరవై ఐదేళ్లు. అప్పట్లో ఆయన ఇంటికి భోజనానికి వచ్చి కొంత సమయాన్ని గడిపారన్న ఆనందం తప్ప పెద్దగా ఏమీ ఆలోచించలేదు. అయితే వయసు పెరుగుతూ అనుభవాలూ, ఆలోచనలూ విశ్లేషణ ధోరణి పెరుగుతున్న కొద్దీ ఈ సంఘటన నాకు ఎన్నో విషయాలు తెలిపింది. (చిన్నప్పుడు అర్థం తెలియక పోయినా ఒక నీతి పద్యాన్ని బట్టీ కొడితే పెద్దయిన తర్వాత దాని అసలు అర్థం స్ఫురించినట్లుగా) చివరికి రెండు మూడు నెలల క్రితం మా పిల్లలతో కూడా డైనింగ్ టేబుల్ దగ్గర ఈ విషయాన్ని ప్రస్తావించి, విశ్లేషించి చర్చించానవే భావాలను. ఇప్పుడు ఇక్కడ పంచుకోవడానికి ప్రయత్నిస్తాను.

అప్పుడు కపర్దీ గారితో పోలిస్తే వయస్సు రీత్యా గానీ ఇతరత్రా గానీ నేను చాలా చిన్నవాడిని. సహచరుడిని కాదు. పార్టీ వర్కర్‌ను కాదు. కనీసం తరచూ కలిసే వ్యక్తిని కూడా కాదు. అప్పటికి మా నాన్న గారు పరమపదించి ఏడాది దాటింది. చెప్పొచ్చేదేమంటే లౌకిక దృష్టితో చూస్తే ఆ స్థాయి వ్యక్తి పనిగట్టుకుని రావాల్సిన అవసరం లేదు. పోనీ కోడలు, తమ్ముడు గదా ఫార్మాలిటీ పాటిద్దామనుకుంటే ఎప్పుడో ఒక ఫ్లయింగ్ విజిట్ ఇచ్చేసి వెళ్లొచ్చు. కానీ ఆయనలా చేయలేదు. ఎందుకంటే ఆయన మానవతా విలువలు తెలిసిన మనిషి. మానవ సంబంధాల ప్రాముఖ్యతను పూర్తిగా అర్థం చేసుకుని ఆచరణలో పెట్టిన పరిణితి చెందిన వ్యక్తి. ఇక ఆ స్థాయిలో జీవితంలో సాధించిన వ్యక్తులు చాలా మంది ఒక ఆడంబరాన్ని ప్రదర్శిస్తారు. ఒక చోటికి వారు వెళుతుంటే వారి ముందరే మందీ మార్బలం వెళ్లి హడావుడి చేస్తారు. వాళ్లు వెళ్లిన తర్వాత వాళ్ళు వాళ్ళదైన శైలిలో పరిస్థితిని వారికి అనుకూలంగా నియంత్రణ చేసి మార్చుకుంటారు. ఆడంబరం, డాబు దర్పం కపర్దీ గారి నిఘంటువులోనే లేవు. చాలా సింప్లిసిటీ. ప్రకృతి ఎంత సహజమో ఆయన వ్యవహార శైలి దాదాపు అంతే సహజం. మాతో గడిపిన ఆ నాలుగు గంటలూ ఆయన ఒక సర్వసాధారణమైన వ్యక్తిలాగా వ్యవహరించారు. కమ్యూనిజం గురించి గానీ ట్రేడ్ యూనియన్ల విషయాలు గానీ తాను సాధించిన విషయాల గురించి గానీ కనీసం ఒక్కమాట కూడా ప్రస్తావించలేదు. అది అక్కడ సందర్భానికీ వ్యక్తులకీ అనవసరం అని ఆయనకు తెలుసు. కొత్తగా చూసే వారికి ఒక సామాన్యమైన వ్యక్తి సాధారణమైన సందర్భంలో సాధారణ రీతిలో ప్రవర్తిస్తున్నట్లుగానే ఉంది. ఇది చాలా అసాధారణమైన విషయం. ఎందుకంటే సర్వసాధారణంగా జీవితంలో కొద్దిపాటి స్థాయిలో సాధించినవారైనా ప్రతి సందర్భంలోనూ (ముఖ్యంగా ఇలాంటి సందర్భాలలో) తమ సిద్ధాంతాల గురించి సాధించిన విజయాల గురించి దర్పంగా చెప్పుకుంటూ వుంటారు. కానీ

అలా కాక తాము వ్యవహరిస్తున్న సందర్భం పాత్రనూ బట్టి అందులోకి 'ఒదిగి'పోవడం, అవసరాన్ని బట్టి ఎంతకైనా ఎదగడం అతి అరుదైన లక్షణం. అది 'ఇగో' ప్రాబ్లమ్స్ లేని చాలా కొద్ది మందికే ఉంటుంది. ఆ అసాధారణ లక్షణం 'కపర్దీ' గారికి చాలా సహజంగానే ఉంది. ఇక ఆనాటి సంఘటన క్లైమాక్స్, 'మనసు లోతు'కు సంబంధించిన విషయం. ఇంటికి వెళ్తూ 'మీ పెళ్ళికి రాలేదన్న కొరత తీరిందయ్యా' అన్నారు. అసలు మనస్సులో కొరత ఎందుకు ఉండాలి? అది బలమైన మానసిక కమిట్మెంట్. తాననుకున్న ఆ కమిట్మెంట్ తీర్చడానికి ఆయన తన నాలుగు గంటల అమూల్య సమయాన్ని మన స్ఫూర్తిగా గడిపారు. ఆహ్లాదాన్ని పంచారు. ఒక జీవిత కాలానికి చాలినంత మంచి అనుభూతిని (ఎంత డబ్బుతోనూ కొనలేని) అనుభవాన్ని పాఠాల్ని అందించారు. ఇక చివరగా 'నీకు సంతోషమేగా' అంటూ నా ముఖం వైపు చూశారు. అది ఎంతటి గొప్ప విషయమో ఆ సంఘటనలో ఉన్న వారికే బాగా తెలుస్తుంది. తాననుకున్న బాధ్యత తాను నెరవేర్చిన తరువాత దానికి ఎదుటి వ్యక్తి ప్రతి స్పందన ఎలా ఉంది. అనే ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం అనేది నిజంగా ఆ వ్యక్తి యొక్క మనస్సు లోతునీ, మానవతా విలువల పోషకతత్వాన్ని మానవ సంబంధాల నిర్వహణ నైపుణ్యాన్ని తేటతెల్లం చేస్తుంది.

అక్షరం నుండి అనంతం వరకు అన్నట్లుగా, సూక్ష్మంలో మోక్షం అన్నట్లుగా కొండను చిన్ని అద్దంలో చూపినట్లుగా ఈ అపురూప చిన్న సంఘటన కపర్దీ గారిలోని 'అసాధారణ వ్యక్తిత్వాన్ని' ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూ నా మనసును ఆనందానుభూతిని లోను చేస్తుంది. కేవలం ఈ సంఘటన మాత్రమే గాక కపర్దీ గారి మహోన్నత వ్యక్తిత్వాన్ని గురించి మరికొన్ని విషయాలు ప్రస్తావించడానికి సాహసం చేయగలను.

సాధారణంగా ఒక సిద్ధాంతానికి, ఒక మార్గానికి, ఒక 'ఇజం'కి కట్టుబడి దానిలో ఎంతో సాధించిన వారు కూడా ఇతర మార్గాలు సిద్ధాంతాలు 'ఇజం' లను వాటిలోని మంచిని గురించి పెద్దగా పట్టించుకోరు. తమ మార్గమే గొప్పదని వాదిస్తారు. కాని అది ఒక విధంగా సంకుచిత దృష్టి అనొచ్చు. "మా మతంలోనే గాక ఇతర మతాల్లో సత్యాలు ఉన్నాయన్న విషయాన్ని మేము విశ్వసిస్తాము" అన్నాడు స్వామి వివేకానంద చికాగో సర్వమత మహాసభల్లో. నిజానికి అది ఒక హైయెస్ట్ ఫిలాసఫీ. నాకు తెలిసి నేను ఆ తత్వాన్ని ఇద్దరిలోనే చూశాను. ఒకరు మా నాన్నగారు ప్రముఖ నాట్యవేత్త కీ.శే. భాగవతుల రామకోటయ్యగారు, మరొకరు నవయుగ కార్మికోద్యమ వైతాళికుడు కీ॥శే॥ కపర్దీ గారు. మా నాన్నగారు సనాతన హైందవ సాంప్రదాయానికి ప్రతినిధి. నిత్య శివ పూజా దురంధరుడు. అయినా ఆయన కమ్యూనిజంలోని మానవసేవా దృక్పథాన్ని ఎప్పుడూ ప్రశంసిస్తూ వుండేవారు. (ఆయన కొంతకాలం ప్రజానాట్యమండలిలో విజయవాడలో నృత్యదర్శకుడిగా పనిచేస్తూ, అప్పటి అగ్రశ్రేణి కమ్యూనిస్టు నాయకులతో సన్నిహితంగా ప్రజానాట్యమండలిలో పనిచేశారు.) అతి ధనికులు మాత్రమే భరించగలిగే 'కాస్ట్లీ హాబీ' గా వ్యవహరింపబడే కూచిపూడి నాట్యాన్ని అతి సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేటట్లు ఆయన కృషి చేశారు. నాట్యం నేర్చుకునే పిల్లలు ఫీజు చెల్లించలేకపోయినా వారు కనీసం అడిగే వారు కూడా కాదు. నాట్య ప్రదర్శనల ద్వారా వచ్చే పారితోషికాన్ని సహ కళాకారులందరికి విరివిగా పంచేవారు. చివరికి ఒక తంబూరా వాయించిన కళాకారుడికి తానిచ్చిన పారితోషికం కంటే నిర్వాహకుడైన తనకు తక్కువగా మిగిలిన సందర్భాలు లేకపోలేదు. ఆ విషయం ఎవరైనా అడిగితే 'అందరూ బ్రతకాలిగా' అనేవారు.

ఇక కపర్దీ గారు 'కమ్యూనిజం'కు సరైన ప్రతీక. అయినప్పటికీ ఆయన సనాతన భారతీయ సంస్కృతి, దానిలోని భాగాలయిన పురాణాలు, ఇతిహాసాలు మొదలైనవాటి సారాంశాన్ని గ్రహించి వాటిలోని మంచిని ఎప్రిషియేట్ చేసేవారు. ఇదెలా చెప్పగలనంటే మా అక్క ఇందిరా దేవిని కపర్దీ గారి పెద్దబ్బాయి రామచంద్రరావుకు వివాహానికి ప్రపోజ్ చేసినప్పుడు కూడా మా నాన్న గారు కొంత ముందు వెనకాలాడారు. రెండు కుటుంబాల మార్గాలు సిద్ధాంతాలు వేరుగదా అని. ఆ విషయాన్ని గమనించిన కపర్దీ గారు ఒకసారి మా నాన్న గారిని పిలిచి 'రామకోటయ్య గారూ మీరూ మేమూ వేరు కాదు. ఇద్దరమూ సమాజం కోసం పనిచేసే వాళ్ళమే. మార్గాలు వేరయినా అవి మనకేమీ అడ్డంకులు కావు' అంటూ పురాణాలలోని కొన్ని కథల్నీ సంఘటనల్నీ ప్రస్తావించి వాటి అంతరార్థం, వాటిలోని మంచినీ గుర్చి చెప్తూ 'అదే మంచిని మేము వేరే మార్గంలో సామాజిక దృక్పథంతో చేస్తాం' మా కుటుంబంలోని వచ్చే కోడళ్ళు గాని, అల్లుళ్ల గాని వాళ్ళకిష్టమైతే పూజలూ, పునస్కారాలూ చేసుకోవడానికి మాకేం అభ్యంతరం లేదు అన్నారు. ఈ విషయాన్ని మా నాన్న గారు స్వయంగా మా ఇంట్లో ప్రస్తావించారు.

కాబట్టి దేశ సంపదలో ఒక భాగమైన నాట్యాన్ని కుల, మత ధనిక పేద తారతమ్యం లేకుండా అందరికీ సమానంగా పంచడానికి కృషి చేసిన, సనాతన సంప్రదాయానికి ప్రతినిధి అయిన మా నాన్న గారిలో ఒక గొప్ప కమ్యూనిస్టు కనిపిస్తారు. 'సర్వేజనా సుఖినోభవన్తు', 'అందరిలోనూ దైవాన్ని చూడు' అనే భారతీయ సంస్కృతి అద్దం పడుతూ సమాజ సేవ చేసిన కపర్దీ గారిలో నాకు గొప్ప 'ఆస్తికుడు' కనిపిస్తారు.

కాబట్టే వారిద్దరికీ ఒకరిపై ఒకరికి అవ్యాజమైన ప్రేమ, గౌరవాలు, వియ్యంకులుగా కన్నా ఒకే గమ్యం వైపు పయనించే రెండు మార్గాలకు ప్రతినిధులుగానే వారిద్దరూ ఒకరినొకరు భావించేవారు. పరస్పరం ప్రశంసించుకునేవారు. మా నాన్న గారు పరమపదించినపుడు కపర్దీ గారు వచ్చి సానుభూతిని

ప్రకటించడంతోపాటు మా నాన్న గారి వివరాలన్నీ నా దగ్గర నుండి సేకరించి ఒక వారం రోజుల్లోగా విశాలాంధ్రలో మా నాన్న గారిపై ఒక సమగ్రమైన వ్యాసాన్ని ప్రచురించారు. సమాజం కోసం పాటుబడే వ్యక్తులు కేవలం కుటుంబానికి వ్యక్తిగత విషయాలకూ మాత్రమే పరిమితం కాదనీ వారి గురించిన విషయాలు సమాజానికి తెలియజెప్పాల్సిన అవసరం ఎంతైనా వుందన్న విశిష్ట భావనే ఆయన ఆ వ్యాసం ప్రచురించడానికి వెనుకగల అంతరార్థం.

కపర్దీ గారు ఒక ఆదర్శభావాల గని. మనకి శక్తుండి తవ్వాలే గానీ అందులోంచి ఎంతో అమూల్యమైన భావనా సంపద బయటపడుతుంది. ఇటీవలనే నేను తెలుసుకున్న ఒక సంఘటన నన్ను 'ఏదో ఆనందానికి' గురిచేసింది. ఒక ప్రభుత్వ రంగ సంస్థ ట్రేడ్ యూనియన్ ప్రతినిధిగా సమావేశానికి హాజరైనప్పుడు కార్మికులకు టైం-బాండ్ ప్రమోషన్లు వద్దని ఆయన ప్రతిపాదించారట. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. సాధారణంగా ట్రేడ్ యూనియన్ ప్రతినిధిగా వెళ్ళినపుడు అందరూ కార్మికులకు ప్రస్తుతం సంతోషం కలిగించే విధంగానే ప్రవర్తిస్తారు. కానీ ఆయనెందుకు అందుకు భిన్నంగా ప్రతిపాదించారు ? ఎందుకంటే కార్మికోద్యమం ఆయన వృత్తి ప్రవృత్తులు కావు, ఆయన ఊపిరి. కార్మికులకు టైం-బాండ్ ప్రమోషన్లు ఇస్తే, వారికి పనిచేసే ప్రేరణ ఉండకపోవచ్చు. ఉత్పాదకత తగ్గే అవకాశం ఉంది. దీర్ఘకాలంలో ఆ ప్రభావం సంస్థ మనుగడపై వుంటుంది. సంస్థ మూతపడొచ్చు. అప్పుడు కార్మికులే బజారునపడొచ్చు. ఇంత దూరదృష్టితో ఆలోచించారు కాబట్టే ఆయన ఆనాడు ఆ మాట న్నారు. నిజానికి అప్పటికి ఆయన ప్రతిపాదించిన విషయంలోని పర్యావసానాన్ని నేడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. పైస్థాయిలో విపరీతమైన లంచాలకూ, కిందిస్థాయిలో పనిచేయక పడిపోయిన ఉత్పాదకతకూ సాక్షీభూతాలుగా మారిన కామధేనువుల్లాంటి ప్రభుత్వరంగ సంస్థల్ని వచ్చి పోయేటట్లు చేసి కసాయివాళ్ల పాలు చేస్తున్నాంగా. రోజుకో బంగారు గుడ్డు పెట్టే బాతుని అత్యాశతో పొట్ట చీల్చి ఇప్పుడంతా శోకాలు పెడ్తున్నారుగా. దీనిని బట్టి చూస్తే సరైన విజన్ ఉన్న నాయకుల అవసరం ఈనాడు మనకెంతుందో తేటతెల్లమవుతుంది. కేవలం విజన్ ఉండటమే కాదు అలాంటి విషయాన్ని కపర్దీ గారిలా గట్టిగా ప్రతిపాదించాలంటే తన తోటి వారి విమర్శలనెదుర్కొనే కొండంత ధైర్యం కావాలి. అందువలన తన ఇమేజ్ తగ్గినా ఫరవాలేదనే త్యాగ బుద్ధి కావాలి. తాను నమ్మిన సత్యం కోసం ఎంతటి కష్టనష్టాలకైనా వెనకాడని కపర్దీ వంటి వారి మహోన్నత వ్యక్తిత్వం ఎంత చెప్పినా తక్కువే. పెద్ద కొండని చిన్న అద్దంలో చూపే ప్రయత్నమే. అలాంటి వారు చిరస్మరణీయులు-ఆదర్శప్రాయులు. భావితరాల వారికి మార్గదర్శకులు. హేట్సాఫ్. ❑



# అత్తిలి జ్ఞాపకాలు - విన్నవీ, కన్నవీను!

## కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు

- బి.ఎస్.ఏ. సత్యనారాయణ



నా పేరు సత్యనారాయణ. బంధువులంతా నన్ను అంజిబాబు అంటారు. నేను 1942లో పుట్టాను. మా అన్నయ్య బి.ఎస్. ఆర్.జి.శర్మ (అంతా సుందరరామయ్య అనేవారు) 1935లో పుట్టాడు. మా అక్క శేషమ్మ 1926లో పుట్టింది. అత్తిలికి పెమ్మరాజు కృష్ణారావు గారు పెద్ద కరణంగా చేస్తుంటే, మా బాబు గారు బొమ్మకంటి సూర్యనారాయణమూర్తి గారు అసిస్టెంట్ కరణంగా చేసేవారు. మా బాబు గారికంటే ముందు, మా పెద బాబుగారు బొమ్మకంటి సూర్యప్రకాశరావుగారు, అంతకుముందు మా తాతగారు బొమ్మకంటి సుందరరామయ్య గారు అత్తిలి కరణీకం చేసేవారు. మా తాతగారైతే, అత్తిలితోపాటు ఎన్నో ఊళ్లకి కరణంగా ఉండేవారని చెప్పేవారు. అలాగే, అన్నాదమ్ముల ఐక్యత గురించి చెప్పేటప్పుడు మా పెదబాబుగారు, బాబుగార్లనూ - తాడిమేటి రామచంద్రరావు, సూర్యనారాయణ మూర్తిగార్లనూ ఉదాహరణలుగా చెప్పుకునేవారు.

మా బాబు గారూ వాళ్లు ఇద్దరన్నదమ్ములని పైన చెప్పాను. వాళ్లకు నలుగురు ఆడపడుచులు. అందరూ మా బాబుగారి కన్నా పెద్దవాళ్లే. అందుకే, ఆయన వాళ్లను వరసగా పెద్దక్కయ్య (పోడూరి వెంకట నరసమ్మగారు), శేషక్కయ్య (మందలపర్తి శేషమ్మగారు), బుల్లెక్కయ్య (ఆచంట పూర్ణమ్మగారు), పాపక్కయ్య (పుసులూరి పాపమ్మగారు) అని పిలిచేవారు. వీళ్లలో మా పెద్దక్కయ్యకి పిల్లల్లేరు. మా రెండో మేనత్త శేషక్కయ్య' పెదనింద్ర కొలను కరణం మందలపర్తి రామచంద్రరావుగారిని పెళ్లి చేసుకుంది. ఆవిడకి ఇరవై మంది పిల్లలు పుట్టినా అందులో ఐదుగురు కొడుకులూ, ఐదుగురు కూతుళ్లూ మాత్రమే బతికారు. మా మూడో మేనత్త బుల్లెక్కకి ఇద్దరు కొడుకులు పుట్టాక ఆవిడ బలవంతపు చావు చనిపోయింది. రెండో ప్రపంచ యుద్ధం రోజుల్లో ధాన్యం బస్తా ధర రెండు రూపాయలకి పడిపోయినప్పుడు చాలా మందికి పిచ్చెక్కింది. వాళ్లలో మా బుల్లెక్క భర్త ఆచంట జగన్నాథం గారొకరు. ఆ పిచ్చిలో ఆయన రోకలిబండతో మా మేనత్త నెత్తిన కొట్టేసరికి ఆవిడ చనిపోయిందట. ఇక మా నాలుగో మేనత్త 'పాపక్కయ్య', రెండో పెళ్లివాడైన పుసులూరి సత్యం గారిని పెళ్లాడి ఇద్దరు కొడుకుల్నీ (సూరీడు, ఉమాపతులను), ముగ్గురు కూతుళ్లనూ (రెంటాల అన్నపూర్ణ, సంపర రమణమ్మ, అయ్యగారి సీతమ్మ గార్లను) కన్నది.

మా శేషక్కయ్య మూడో కొడుకే కపర్ది. అతనికే మా అక్క శేషమ్మనిచ్చి 1941లో పెళ్లి చేశారు. ఈ పెళ్లికి సంబంధించి మొత్తం ఖర్చు రూ.9,411 అయినట్లు మా బాబు గారు ఓ పుస్తకంలో రాసి పెట్టుకున్నారు. ఆ పుస్తకాన్ని నేను జేబులో పెట్టుకుని మా అక్కను ఏడిపిస్తుండే వాడిని. మా అక్కకి ఆరుగురు కొడుకులూ, ఇద్దరు కూతుళ్లూ పుట్టారు. మా అక్కకు ఓ సెంటిమెంటు ఉండేది. పురిటికి నేను తప్పకుండా హాజరవ్వాలన్నదే ఆ సెంటిమెంటు. అల్లా, మా చిట్టిపాప దగ్గర నుంచి అన్ని పురుళ్లకీ నేను హాజరయ్యాను. ఆ విధంగా వీళ్లందరి మీదా ఒక అనురాగంతో కూడిన పెత్తనం ఉండేది. వాళ్ల చదువులూ, మార్కులూ నా అజమాయిషీలో ఉండేవి.

మా పెత్తండ్రి సూర్య ప్రకాశరావుగారికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడైన బొమ్మకంటి సుందరగోపాలం గారిని గోపాలం అన్నయ్య అనీ, రెండోవాడైన బొమ్మకంటి శ్రీరామచంద్రమూర్తి గారిని రాముడన్నయ్య అనీ అనేవాళ్లం. మా గోపాలం అన్నయ్య పెద్దకూతురు కనకాన్ని మా అక్క మూడో కొడుకు చిట్టిపాప (మందలపర్తి నారాయణమూర్తి) చేసుకున్నాడు. గోపాలం అన్నయ్య చిన్న కొడుకు నాగరాజు మా చెల్లెలు సుబ్బులక్ష్మి (బుజ్జమ్మ) కూతురు పాపాయినిచ్చి మేమే పెళ్లి చేశాం. మా చెల్లి పుట్టిన మరుసటి సంవత్సరమే - 1952లో- మేం తణుకు వెళ్లిపోయాం. అక్కడే మా బాబుగారు 1954లో చనిపోయాకా, మేం మా అక్కఇంటికి వచ్చేశాం.

నేను చిన్నప్పుడు పెద్ద దైవభక్తుణ్ణి. తడి గోచీ పెట్టుకుని ఆంజనేయ దండకం, భారత సావిత్రి వగైరాలు చదివేవాణ్ణి. అప్పుడే అన్నం తినడం! తణుకు నుంచి తాడేపల్లిగూడెం రావడమే కమ్యూనిస్టు భావజాలంలోకి రావడం కూడా. ఆ తర్వాత, 1960 డిసెంబర్ నుంచి 64 జూలై వరకూ కో ఆపరేటివ్ సూపర్‌వైజర్ పనిచేశాను. 1964 నవంబర్ నుంచి 1993 ఫిబ్రవరి వరకూ ఆరెమ్మెస్ సార్టర్‌గా పనిచేశాను. 1993 మార్చి నుంచి నేటి వరకూ లాయర్‌గా సంసారం ఈదుస్తున్నాను. ఇప్పుడు ఇద్దరు ఆడపిల్లల తండ్రిని. 1996 నుంచే 'శ్రమ జీవి' అనే త్రైమాసిక నడుపుతున్నాను. నా గురించి, అత్తిలి గురించి, ఆ తర్వాత జీవితం గురించి గుర్తుపెట్టుకున్న విషయాలివి. మీతో పంచుకోగలిగినందుకు సంతోషిస్తున్నాను. ❑

# SRI ARYA VYSYA SANGHAM



**Regd. No: 8/1952**

# TADEPALLIGUDEM



స్వాతంత్ర్య సమరయోధులు,
కార్మికోద్యమ నిర్మాత, ఆదర్శ కమ్యూనిష్టు,
నాలుగు దశాబ్దాల పాటు తాడేపల్లిగూడెం
ప్రజా జీవితంలో తనదైన చెరగని
ముద్రవేసిన అమరజీవి ఎం.వి.ఎన్. కపర్ధీ
శతజయంతి ఉత్సవాల సందర్భముగా
వారికి నివాళులు



మండవల్లి చెన్నా నాగేంద్రరావు
అధ్యక్షులు



కార్మిక నేత
యం.వి.యస్. కపర్ధీ



మారం వెంకటేశ్వర రావు
గౌరవాధ్యక్షులు

| President: | Secratary: | Treasurer : |
|---|---|---|
| **MANDAVALLI NAGENDRA RAO** | **MANDA BRAHMANADA RAO** | **NUNNA BALA TRIPURA SUNDARA RAO** |
| Dr.No: 6-2-19, Kummari Veedhi, Maseed Raod, TADEPALLIGUDEM - 534101 | Dr.No: 301 Pooja Nivas, S.R.Pet, TADEPALLIGUDEM - 534101 | Dr.No: 6-1-5/1, K.N.Road, Near Old Railway Gate, TADEPALLIGUDEM - 534101 |
| Cell: 94403 16146 | Cell: 94401 06767 | Cell: 98481 88459 |

## SRI VASAVI KANYAKA PARAMESWARAI PANCHAYATANA KSHETHRAM

**Eluru Raod, TADEPALLIGUDEM - 534102**

**Ph: 08818 - 222087, 229313**

# CHAMBER OF COMMERCE & INDUSTRIES

(Regd No: 4/54)

## TADEPALLIGUDEM

స్వాతంత్ర్య సమరయోధులు, కార్మికోద్యమ నిర్మాత, ఆదర్శ కమ్యూనిష్టు, నాలుగు దశాబ్దాల పాటు
తాడేపల్లిగూడెం ప్రజా జీవితంలో తనదైన చెరగని ముద్రవేసిన అమరజీవి
ఎం.వి.ఎన్. కపర్ధి శతజయంతి ఉత్సవాల సందర్భముగా వారికి నివాళులు




**President:**
**ETHAKOTA BHIMASANKARA RAO (Tataji)**

**Secretary: RAVI AGARWAL**

## KOVVURU NARASA REDDY VANIJYA BHAVAN

**TADEPALLIGUDEM - 534102**

**Email: chamber.tpgudem@gmail.com**

**Phone : 08818 - 222981**


కార్మిక నేత
యం.వి.యన్. కపర్ది
శతజయంతి శుభాకాంక్షలు
శ్రీ వడ్డి రఘురామ్ నాయుడు గారు
వైస్ ఛైర్మన్
ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అధారిటీ (APSADA)
తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.

# SIR ARTHUR COTTON RICE MILLERS & TRADERS WELFARE ASSOCIATION

(Regd. No. 70497)

## TADEPALLIGUDEM




స్వాతంత్ర్య సమరయోధులు, కార్మికోద్యమ నిర్మాత, ఆదర్శ కమ్యూనిష్టు, నాలుగు దశాబ్దాల
పాటు తాడేపల్లిగూడెం ప్రజా జీవితంలో తనదైన చెరగని ముద్రవేసిన అమరజీవి
ఎం.వి.ఎన్. కపర్ధి శతజయంతి ఉత్సవాల సందర్భముగా వారికి నివాళులు



**శ్రీ మత్తే వెంకటరమణ**
అధ్యక్షులు
సర్ ఆర్థర్ కాటన్ రైస్ మిల్లర్స్
& ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

**శ్రీ బూరాడ శ్రీనివాసరావు**
కార్యదర్శి
సర్ ఆర్థర్ కాటన్ రైస్ మిల్లర్స్
& ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



**Honourery President** Sri. P.HARINADH

**Vice Presidents**

Sri. M.KANIKI REDDY, Sri. N.NAGESWARA RAO

**Joint Secretary**

Sri. G.SIVA RAJESH

**Tresurer**

Sri. M.MURALI MOHAN REDDY

**West Godavari District**
**Millers Association Building Premises**
Railway Station Road, TADEPALLIGUDEM - 534101

**Secretary Cell: 96663 58615**